సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 339

శనివారం 1-3-2025

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'గ్రామం ప్రగతిపథంలో ఉంటే ఎవ్వరూ మురా కక్షల జోలికి వెళ్లరు'



టెక్నాలజీతో ముందడుగు

'విజ్ఞాన్ వైభవ్-2025'లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఆకట్టుకుంటున్న 'రక్షణ' స్టాల్స్

2లో





సేవాభావాన్ని గుర్తించడం సామాన్యమైన విషయం కాదు

'సాక్షి ఎక్సలెన్స్ అవార్డ్స్ టెన్త్ ఎడిషన్'లో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ

కార్యక్రమంలో పాల్గొన్న హరియాణా గవర్నర్ దత్తాత్రేయ, వైఎస్ భారతిరెడ్డి. చిత్రంలో భారతి సిమెంట్స్ మార్కెటింగ్ డైరెక్టర్, ఐక్యాయ్ ప్రతినిధులు, 'సాక్షి' సీఈఓ, డైరెక్టర్లు

2లో

ఉత్తరాఖండ్‌లో భారీ హిమపాతం



బీఆర్ఓ క్యాంపుపై విరిగిపడిన మంచు చరియలు

32 మందిని రక్షించిన అధికారులు

మరో 25 మంది ఆచూకీ కోసం గాలింపు చర్యలు

IIIలో

హామీలు రద్దు.. మోసాల పద్దు

బడ్జెట్ సాక్షిగా బాబు మరోసారి దగా


- వివరాలు లోపలి పేజీల్లో..

రామోజీ లేరు.. విచారణా అక్కర్లేదు!

'మార్గదర్శి' కేసు సమయం వృథా వ్యవహారం

- డిపాజిట్ల వసూలుపై ఎవరూ ఫిర్యాదు చేయలేదు
- ఒకవేళ ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఆర్బీఐ చూసుకుంటుంది
- హైకోర్టుకు సూచించిన ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు
- మార్గదర్శి ఫైనాన్షియర్స్‌కు లబ్ధి చేకూర్చేలా ఎత్తుగడలు
- చట్ట విరుద్ధంగా రూ.వేల కోట్ల డిపాజిట్ల సేకరణ నేరమేనన్న ఆర్బీఐ
- క్రిమినల్ ప్రొసీడింగ్స్ ఎదుర్కోవాల్సిందే
- రామోజీ చేసిన నేరానికి మార్గదర్శి ఫైనాన్షియర్స్ హెచ్‌యూఎఫ్‌దే బాధ్యత
- ఆయన మరణించినా కూడా విచారణ తప్పదని స్పష్టీకరణ..
- నాడు అక్రమాలు జరగలేదని ఇప్పుడు మాట మారుస్తున్నారు : ఉండవల్లి
- మార్చి 7వ తేదీకి విచారణ వాయిదా

12లో



"మార్గదర్శి ఫైనాన్షియర్స్ కర్త రామోజీరావు మరణించిన నేపథ్యంలో, ఈ వ్యాజ్యాలపై విచారణే అవసరం లేదు. అనవసరమైన విచారణ జరిపి మీ సమయాన్ని వృథా చేసుకోవద్దు. మార్గదర్శి ఫైనాన్షియర్స్ చట్టవిరుద్ధంగా డిపాజిట్లు వసూలు చేయడంపై ఫిర్యాదులు ఏవీ లేవు. పత్రికా ప్రకటనలు ఇచ్చిన తరువాత కూడా ఎవరూ ముందుకు రాలేదు. అందువల్ల విచారణ జరిపి ప్రయోజనం లేదు. ఒకవేళ తర్వాత ఎవరైనా ఫిర్యాదు చేస్తే, వారి సంగతి రిజర్వ్ బ్యాంకు చూసుకుంటుంది. - ఇదీ తెలంగాణ హైకోర్టు ఎదుట చంద్రబాబు ప్రభుత్వ వాదన

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

ఈ నెల 20 వరకు నిర్వహణ.. ఉదయం 9 గంటలకే ప్రారంభం


ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదు

ఇంటర్ విద్యా మండలి స్పష్టీకరణ

12లో



ఎమ్మెల్యేల పనితీరుపై నివేదికలు తెప్పిస్తున్నా



- కేడర్‌కు, నాయకులకు మధ్య సమన్వయం లోపించింది.. త్వరలో నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తా
- టీడీపీ శాసనసభాపక్ష సమావేశంలో సీఎం చంద్రబాబు

- వివరాలు 2లో

సాక్షి బిజినెస్
శనివారం
1-3-2025

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	1,414	73,198
నిఫ్టీ ▽	420	22,125

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ			
నాస్‌డాక్	18,504	▽	43
డోజోన్స్	43,213	▽	27
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,810	△	54
డాక్స్	22,550	▽	1
షాంఘై	3,388	▽	67
నికాయ్	37,156	▽	1,101

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (24 క్యారట్)	85,056	▽	578
బంగారం (22 క్యారట్)	84,715	▽	576
వెండి (కిలో)	93,480	▽	1,568

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	86.95	87.97
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	108.70	111.53
€	యూరో	ఎస్‌బీఐ	89.55	92.21
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.75	59.22
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.26	55.47
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	62.59	67.27
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.35	23.91
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.93	24.71
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.15	12.97

ట్రేడ్ వార్ టెర్రర్



- సెన్సెక్స్ 1,414 పాయింట్ల పతనం; 74 వేల స్థాయి దిగువకు
- 22,500 స్థాయిని కోల్పోయిన నిఫ్టీ; 420 పాయింట్లు క్రాష్
- అన్ని రంగాల షేర్లలో వెల్లువెత్తిన విక్రయాలు
- ఒక్క రోజులో రూ. 9.08 లక్షల కోట్ల ఆవిరి

ముంబై: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనా దిగుమతులపై అదనంగా 10%, యూరోపియన్ యూనియన్ ఉత్పత్తులపై 25% తాజా సుంకాల ప్రకటనతో ఈక్విటీ మార్కెట్లలో మరోసారి అమ్మకాలు వెల్లువెత్తాయి. ఫలితంగా సెన్సెక్స్ 1,414 పాయింట్లు నష్టపోయి 74వేల స్థాయి దిగువన 73,198 వద్ద నిలిచింది. నిఫ్టీ 420 పాయింట్లు కోల్పోయి 22,125 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం నష్టాలతో మొదలయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 1,471 పాయింట్లు క్షీణించి 73,141 వద్ద, నిఫ్టీ 440 పాయింట్లు కుప్పకూలి 22,105 వద్ద ఇంట్రాడే కనిష్టాలను తాకాయి.

- అన్ని రంగాల షేర్లలో విక్రయాలు వెల్లువెత్తాయి. ఇండెక్సుల వారీగా.. ఐటీ సూచీ 4.20% పతనమైంది. టెలికమ్యూనికేషన్, ఆటో ఇండెక్సు 4%, కన్జూమర్ డిస్క్రెషనరీ 3%, ఆయిల్‌అండ్‌గ్యాస్ 2.50%, విద్యుత్ ఇండెక్స్ 2% నష్టపోయాయి. చిన్న, మధ్య తరహా షేర్లలోనూ అమ్మకాలు కొనసాగాయి. బీఎస్‌ఈ స్మాల్ క్యాప్ సూచీ 2.33%, మిడ్ క్యాప్ ఇండెక్సు 2.16 క్షీణించాయి.
- స్టాక్ మార్కెట్ 2% పతనంతో శుక్రవారం ఒక్కరోజే రూ.9.08 లక్షల కోట్లు హరించుకుపోయింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలోని కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.384.01 లక్షల కోట్లకు దిగివచ్చింది.
- సెన్సెక్స్ సూచీలో ఒక్క హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (2%) తప్ప మిగిలిన అన్ని షేర్లూ పతనమయ్యాయి. అత్యధికంగా టెక్ మహీంద్రా 6%, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 5.5%, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎయిర్‌టెల్ 5%, టైటాన్ 4.5% పడ్డాయి.
- గతేడాది సెప్టెంబర్ 27 నాటి సెన్సెక్స్ రికార్డు గరిష్టం(85,978) నుంచి 12,780 పాయింట్లు(15%), నిఫ్టీ జీవితకాల గరిష్టం(26,277) నుంచి 4,153 పాయింట్లు(16%) క్షీణించాయి. ఆర్థిక వృద్ధి మందగమనం ఆందోళనలు, ట్రంప్ వాణిజ్య విధానాలు, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు దీనికి కారణయ్యాయి.

పతనానికి కారణాలు

తారస్థాయికి వాణిజ్య యుద్ధ భయాలు: చైనా ఉత్పత్తులపై ఇప్పటికే 10% సుంకాలు విధించిన ట్రంప్.. అదనంగా మరో 10% విధిస్తున్నట్లు ప్రకటించారు. యూరోపియన్ యూనియన్ దిగుమతులపై 25% సుంకాల విధింపు ఉంటుందన్నారు. వీటికి తోడు భారత్‌తో సహా అన్ని దేశాలపై ప్రతీకార సుంకాలు ఏప్రిల్‌లో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే మెక్సికో, కెనడాల దిగుమతులపై ప్రతిపాదించిన 25% సుంకాలు మార్చి 4 నుంచి అమల్లోకి రానున్నాయి.

టెక్ షేర్లు క్రాష్: టెక్ దిగ్గజం ఎన్విడియా త్రైమాసిక ఆర్థిక ఫలితాలు ఆశించిన స్థాయిలో ఉండకపోవచ్చనే అంచనాలతో వాల్ స్ట్రీట్‌లో అధిక మార్కెట్ విలువ కలిగిన టెక్ కంపెనీల షేర్లు కుప్పకూలాయి. ఈ ప్రభావం దేశీయ ఐటీ రంగ షేర్లపైనా పడింది.

నెలరోజుల కనిష్టానికి ప్రపంచ మార్కెట్లు: వాణిజ్య యుద్ధ భయాలకు తోడు టెక్ రంగ షేర్ల పతనంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు నెలరోజుల కనిష్టానికి దిగివచ్చాయి. ఆసియాలో దక్షిణ కొరియా, ఇండోనేషియా, హాంగ్‌కాంగ్, జపాన్ సూచీలు 3.50% నుంచి 3% కుప్పకూలాయి. చైనా, సింగపూర్ తైవాన్ ఇండెక్సులు 2-1% నష్టపోయాయి. యూరప్‌లో ఫ్రాన్స్, జర్మనీ దేశాల సూచీలు అర శాతం నష్టపోయాయి.

బలపడుతున్న డాలర్ ఇండెక్స్: వాణిజ్య యుద్ధ భయాలతో అమెరికా కరెన్సీ డాలర్ ఇండెక్స్ 10 వారాల గరిష్టానికి (108) చేరుకుంది. దీంతో భారత్‌తో సహా అభివృద్ధి చెందుతున్న మార్కెట్లకు ప్రతికూలాంశంగా మారింది.

ఆగని ఎఫ్ఐఐల అమ్మకాలు: దేశీయ మార్కెట్ నుంచి విదేశీ పెట్టుబడులు తరలిపోతుండడం దలాల్ స్ట్రీట్ పతనానికి మరో ప్రధాన కారణం. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు రూ.1.13 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు వెనక్కి వెళ్లాయి. ఈ ఫిబ్రవరిలోనే రూ.58,988 కోట్ల ఈక్విటీలు అమ్మేశారు.

రూపాయి 19 పైసలు పతనం




డాలర్ మారకంలో రూపాయి విలువ 19 పైసలు క్షీణించి 87.37 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా డాలర్ ఇండెక్స్ రెండు నెలల గరిష్టానికి చేరుకోవడం, వాణిజ్య యుద్ధ భయాలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని ప్రతికూలతలు దేశీయ కరెన్సీపై ఒత్తిడి పెంచాయి. ఇంట్రాడేలో 35 పైసలు బలహీనపడి 87.53 వద్ద కనిష్టాన్ని తాకింది. కాగా, ఫిబ్రవరి 10న రూపాయి 87.94 వద్ద జీవితకాల కనిష్ట స్థాయిని తాకింది.

జీడీపీ.. ఫ్చ్!

క్యూ3లో వృద్ధి రేటు 6.2 శాతం

- వ్యవసాయం మెరుగైన పనితీరు
- పుంజుకున్న గ్రామీణ వినియోగం
- పెరిగిన మూలధన వ్యయాలు
- తయారీ, సేవలు ఫర్వాలేదు
- 2024-25కు 6.5 శాతం అంచనా
- ఇది నాలుగేళ్ల కనిష్ట స్థాయి
- గణాంకాలు విడుదల చేసిన ఎన్ఎస్ఓ



న్యూఢిల్లీ: దేశ ఆర్థిక వృద్ధి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) క్యూ3లోనూ (2024 అక్టోబర్-డిసెంబర్) బలహీన ధోరణి ప్రదర్శించింది. జీడీపీ వృద్ధి రేటు 6.2 శాతంగా నమోదైంది. జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో నమోదైన ఏడు త్రైమాసికాల కనిష్ట స్థాయి 5.6 శాతం (తాజా సవరణకు ముందు 5.4 శాతం) నుంచి, డిసెంబర్ క్వార్టర్‌లో 6.2 శాతానికి పుంజుకున్నప్పటికీ.. క్రితం ఆర్థిక సంవత్సరం (2023-24)క్యూ3లో నమోదైన 9.5 శాతం రేటుతో పోల్చితే గణనీయంగా తగ్గినట్టు స్పష్టమవుతోంది. అంతేకాదు, ఆర్‌బీఐ అంచనా 6.8 శాతం కంటే కూడా తక్కువగానే నమోదైంది. తయారీ, మైనింగ్ రంగాల పనితీరు బలహీనపడడం వృద్ధి రేటును తక్కువ స్థాయికి పరిమితం చేసింది. పట్టణ వినియోగం కూడా బలహీనంగానే కొనసాగింది. అదే సమయంలో వ్యవసాయ రంగం పటిష్ట పనితీరుకుతోడు ప్రభుత్వం మూలధన వ్యయాలను పెంచడం.. మెరుగైన వర్షాలకుతోడు పండుగల సీజన్‌లో గ్రామీణ వినియోగం పుంజుకోవడం ఆర్థిక వ్యవస్థకు మద్దతుగా నిలిచాయి. డిసెంబర్ త్రైమాసికం జీడీపీ గణాంకాలను జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ఎస్ఓ) శుక్రవారం విడుదల చేసింది.

నాలుగేళ్ల కనిష్టం..



2024-25 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ 6.5% వృద్ధిని (స్థిర కరెన్సీలో రూ.188 లక్షల కోట్లు) సాధిస్తుందని ఎన్ఎస్ఓ తన ద్వితీయ ముందస్తు అంచనాల్లో పేర్కొంది. ఈ ఏడాది జనవరిలో వేసిన తొలి ముందస్తు అంచనాల్లో ఇది 6.4 శాతంగా ఉండడం గమనార్హం. అయినప్పటికీ ఇది నాలుగేళ్ల కనిష్ట వృద్ధి కానుంది. క్రితం ఆర్థిక సంవత్సరం 9.2 శాతం కంటే కూడా తక్కువ. ఎన్ఎస్ఓ తాజా అంచనాల మేరకు జీడీపీ 6.5 శాతానికి పుంజుకోవాలంటే చివరి త్రైమాసికంలో ఆర్థిక వ్యవస్థ మరింత మెరుగైన పనితీరు చూపించాల్సి ఉంటుంది.

క్యూ4లో బలమైన పనితీరు



ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలోనూ ఆర్థిక వ్యవస్థ స్థిరమైన పనితీరు చూపించవచ్చు. ప్రభుత్వ, ప్రైవేటు మూలధన వ్యయాలు పుంజుకోవడంతోపాటు, ఎగుమతులు వృద్ధికి మద్దతుగా నిలుస్తాయి.

– అనంత నాగేశ్వరన్, కేంద్ర ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు

రంగాల వారీ పనితీరు..

- స్థూల విలువ జోడింపు (జీవీఏ/ఆర్థిక కార్యకలాపాల తీరు) డిసెంబర్ త్రైమాసికంలో 6.2 శాతంగా నమోదైంది. అంతకుముందు త్రైమాసికంలో ఇది 5.6 శాతంగా ఉంది.
- వ్యవసాయ రంగం ఆరు త్రైమాసికాల గరిష్ట స్థాయికి పుంజుకున్నది. డిసెంబర్ త్రైమాసికంలో ఐదు రెట్లు బలపడి 5.6 శాతం వృద్ధిని చూపించింది. అంతకుముందు త్రైమాసికంలో (జూలై-సెప్టెంబర్) ఇది 4.1 శాతంగా ఉంటే, క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌కు 1.5 శాతమే కావడం గమనించొచ్చు.
- తయారీ రంగంలో వృద్ధి సెప్టెంబర్ క్వార్టర్‌లో ఉన్న 2.1 శాతం నుంచి డిసెంబర్ త్రైమాసికంలో 3.5 శాతానికి చేరింది. అయినప్పటికీ క్రితం ఆర్థిక సంవత్సరం క్యూ3లో 14 శాతం వృద్ధి రేటుతో పోల్చి చూస్తే చాలా తక్కువే.
- మైనింగ్‌లో వృద్ధి 1.4%కి పడిపోయింది. క్రితం ఆర్థిక సంవత్సరం క్యూ3లో ఇది 4.7%.
- సేవల రంగం వృద్ధి రేటు క్యూ3లో 7.4 శాతానికి మెరుగుపడింది. క్రితం ఆర్థిక సంవత్సరం క్యూ3లో ఇది 8.3 శాతం కావడం గమనార్హం.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
రోజుకు రూ.99,835 కోట్లు యూపీఐ సరికొత్త రికార్డులు | పీఎఫ్ వడ్డీ రేటు యథాతథం

వాళ్లంతా కుమ్మక్కయ్యారు..

- విచారణ జరిపిస్తే నిజాలు బైటికొస్తాయి
- రుణదాతలు, ఐఆర్‌పీపై బైజూస్ రవీంద్రన్ ఆరోపణలు



న్యూఢిల్లీ: దేశ, విదేశాల్లో రుణదాతలతో న్యాయవివాదం ఎదుర్కొంటున్న ఎడ్‌టెక్ సంస్థ బైజూస్ వ్యవస్థాపకుడు బైజూస్ రవీంద్రన్ సంచలన ఆరోపణలు చేశారు. అమెరికాకు చెందిన రుణదాత గ్లాస్ ట్రస్ట్, ఈవై ఇండియా, తాత్కాలిక పరిష్కార నిపుణుడు (ఐఆర్‌పీ) పంకజ్ శ్రీవాస్తవ కుమ్మక్కయారని వ్యాఖ్యానించారు. దీనికి సంబంధించి తనతో పాటు పలువురు ఉద్యోగులకు స్పష్టమైన ఆధారాలున్న డాక్యుమెంట్ అందిందని ఆయన చెప్పారు. దీనిపై అధికారులు తక్షణం దృష్టి పెట్టాలని, లోతుగా విచారణ చేస్తే వాస్తవాలు బైటికొస్తాయని రవీంద్రన్ పేర్కొన్నారు. ఇకపై తానే స్వయంగా వివరాలను తెలియజేస్తానని సోషల్ మీడియా ప్లాట్‌ఫాం లింక్డ్‌ఇన్‌లో పోస్ట్ చేశారు. సంస్థను పునర్నిర్మించేందుకు ప్రణాళికలను వివరించారు. కంపెనీ దివాలా చర్యల బారిన పడకుండా అన్ని ప్రయత్నాలు చేసినట్లు రవీంద్రన్ చెప్పారు. కాగా, అమెరికన్ అనుబంధ సంస్థ బైజూస్ ఆల్ఫా నుంచి 533 మిలియన్ డాలర్లను మళ్లించడానికి థింక్ అండ్ లెర్న్ (మాతృసంస్థ), దాని డైరెక్టర్ రిజు రవీంద్రన్, క్యామ్‌షాఫ్ట్ క్యాపిటల్ మోసపూరిత స్కీముకు తెరతీసినట్లు అమెరికన్ దివాలా కోర్టు తేల్చింది.

సాక్షి స్పోర్ట్స్



ఫైనల్లో యూకీ జోడీ

దుబాయ్: భారత టెన్నిస్ డబుల్స్ స్టార్ యూకీ బాంబ్రీ ఈ ఏడాది తొలి టైటిల్ సాధించేందుకు విజయం దూరంలో నిలిచాడు. దుబాయ్ చాంపియన్‌షిప్ ఏటీపీ-500 టోర్నీలో అలెక్సీ పాపిరిన్ (ఆస్ట్రేలియా)తో కలిసి యూకీ బాంబ్రీ పురుషుల డబుల్స్‌లో ఫైనల్లోకి దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో యూకీ-పాపిరిన్ ద్వయం 6-2, 4-6, 10-7తో 'సూపర్ టైబ్రేక్'లో జేమీ ముర్రే (బ్రిటన్)-జాన్ పీర్స్ (ఆస్ట్రేలియా) జంటపై గెలిచింది. 82 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఇండో-ఆసీస్ జోడీ రెండు ఏస్‌లు సంధించి, ఒక డబుల్ ఫాల్ట్ చేసింది. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసింది. ఈ గెలుపుతో 32 ఏళ్ల యూకీ తన కెరీర్‌లో తొలిసారి ఏటీపీ-500 స్థాయి టోర్నీలో ఫైనల్‌కు చేరాడు. అసోసియేషన్ ఆఫ్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) టూర్‌లో యూకీ మూడు డబుల్స్ టైటిల్స్ సాధించి, మరో మూడు టోర్నీలలో రన్నరప్‌గా నిలిచాడు.

సెమీఫైనల్లో ఆస్ట్రేలియా

అఫ్గానిస్తాన్‌తో మ్యాచ్ రద్దు

- వర్షంతో అర్ధాంతరంగా ముగిసిన పోరు



ట్రవిస్ హెడ్





సాదిఖుల్లా

లాహోర్: చాంపియన్స్ ట్రోఫీలో మరో మ్యాచ్ వర్షార్పణమైంది. అయితే గత రెండు మ్యాచ్‌లతో పోలిస్తే ఈసారి కొంత ఆట జరిగినా... చివరకు రద్దు చేయక తప్పలేదు. గ్రూప్ 'బి'లో భాగంగా ఆస్ట్రేలియా, అఫ్గానిస్తాన్ మధ్య శుక్రవారం జరిగిన మ్యాచ్ అర్ధాంతరంగా రద్దయింది. అఫ్గాన్ ఇన్నింగ్స్ పూర్తిగా సాగగా... ఆసీస్ ఇన్నింగ్స్‌లో 12.5 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. ఫలితంగా ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయించారు. మొత్తం 4 పాయింట్లతో ఆసీస్ సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. ఈ గ్రూప్ నుంచి రెండో బెర్త్ ఇంకా అధికారికంగా ఖరారు కాలేదు. దక్షిణాఫ్రికా, అఫ్గానిస్తాన్‌లలో ఒక జట్టు ముందంజ వేస్తుంది.

గత మ్యాచ్‌లో ఇంగ్లండ్‌పై స్ఫూర్తిదాయక విజయం తర్వాత ఆత్మవిశ్వాసంతో ఆసీస్‌తో పోరులో బరిలోకి దిగిన అఫ్గానిస్తాన్ టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంది. ఆ జట్టు 50 ఓవర్లలో 273 పరుగులకు ఆలౌటైంది. సాదిఖుల్లా అటల్ (95 బంతుల్లో 85; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), అజ్మతుల్లా ఒమర్జాయ్ (63 బంతుల్లో 67; 1 ఫోర్, 5 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు చేశారు. ఆసీస్ బౌలర్లలో డ్వార్షుయిస్ 3 వికెట్లు తీయగా... ఆడమ్ జంపా, స్పెన్సర్ జాన్సన్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం ఛేదనలో 12.5 ఓవర్లు ముగిసేసరికి ఆసీస్ ఒక వికెట్ నష్టానికి 109 పరుగులు చేసి విజయం దిశగా వెళుతోంది. మాథ్యూ షార్ట్ (20) అవుట్ కాగా... ట్రవిస్ హెడ్ (40 బంతుల్లో 59 నాటౌట్; 9 ఫోర్లు, 1 సిక్స్), స్టీవ్ స్మిత్ (19 నాటౌట్) రెండో వికెట్‌కు అభేద్యంగా 65 పరుగులు జోడించారు. ఈ దశలో కురిసిన వాన ఆపై తెరిపినివ్వలేదు. నిబంధనల ప్రకారం వన్డే మ్యాచ్‌లో ఫలితం రావాలంటే ఛేజింగ్ చేస్తున్న జట్టు కనీసం 20 ఓవర్లు ఆడాల్సి ఉంటుంది.

దక్షిణాఫ్రికాకే అవకాశం!

నేడు జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో ఇంగ్లండ్‌తో దక్షిణాఫ్రికా తలపడుతుంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే 5 పాయింట్లతో గ్రూప్ టాపర్‌గా సఫారీ టీమ్ సెమీస్ చేరుతుంది. ఓడితే మాత్రం 3 పాయింట్లతో అఫ్గానిస్తాన్‌తో సమంగా నిలుస్తుంది. అప్పుడు రన్‌రేట్ పరిగణనలోకి వస్తుంది. ప్రస్తుతం దక్షిణాఫ్రికా (2.140)తో పోలిస్తే అఫ్గాన్ రన్‌రేట్ చాలా పేలవంగా (-0.990) ఉంది. చెత్త ఆటతో ఇప్పటికే నిష్క్రమించిన ఇంగ్లండ్ జట్టు దక్షిణాఫ్రికాను ఓడించడం అంత సులువు కాకపోగా... అఫ్గాన్ ముందుకెళ్లాలంటే ఇంగ్లండ్ ముందుగా బ్యాటింగ్ చేసి 300 పరుగులు చేస్తే దక్షిణాఫ్రికా కనీసం 207 పరుగుల తేడాతో ఓడాలి. ప్రస్తుత స్థితిలో ఇది దాదాపు అసాధ్యం కావచ్చు కాబట్టి సఫారీలు సెమీస్ చేరినట్లే!

చాంపియన్స్ ట్రోఫీలో నేడు

దక్షిణాఫ్రికా X ఇంగ్లండ్

వేదిక: కరాచీ, మధ్యాహ్నం గం. 2:30 నుంచి

స్టార్ స్పోర్ట్స్, జియోహాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఢిల్లీ 'టాప్' షో



మెగ్ లానింగ్

- ముంబై ఇండియన్స్‌పై ఘనవిజయం
- మెగ్ లానింగ్, షఫాలీ మెరుపులు
- రాణించిన జెస్ జొనాసెన్, మిన్ను మణి



జెస్ జొనాసెన్

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 టోర్నమెంట్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. బౌలర్ల సమష్టి కృషికి ఓపెనర్లు మెగ్ లానింగ్, షఫాలీ వర్మ మెరుపులు తోడవడంతో శుక్రవారం జరిగిన పోరులో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు 9 వికెట్ల తేడాతో ముంబై ఇండియన్స్‌ను ఓడించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని ముంబై జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 123 పరుగులు చేసింది. హర్మన్‌ప్రీత్ (16 బంతుల్లో 22; 2 ఫోర్లు, 1 సిక్స్), హేలీ మాథ్యూస్ (22; 4 ఫోర్లు), సివర్ బ్రంట్ (18), అమేలియా కెర్ (17), అమన్‌జ్యోత్ కౌర్ (17) తలా కొన్ని పరుగులు చేశారు. ఢిల్లీ బౌలర్లలో జెస్ జొనాసెన్, మిన్ను మణి చెరో 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ 14.3 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 124 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ మెగ్ లానింగ్ (49 బంతుల్లో 60 నాటౌట్; 9 ఫోర్లు), ఓపెనర్ షఫాలీ వర్మ (28 బంతుల్లో 43; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) చెలరేగారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 85 పరుగులు జోడించారు. షఫాలీ అవుటయ్యాక జెమీమా రోడ్రిగ్స్ (15 నాటౌట్; 2 ఫోర్లు)తో కలిసి మెగ్ లానింగ్ లాంఛనాన్ని పూర్తి చేసింది. ముంబై బౌలర్లలో అమన్‌జ్యోత్ కౌర్ ఏకైక వికెట్ పడగొట్టింది. జెస్ జొనాసెన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. లీగ్‌లో 6 మ్యాచ్‌లాడిన ఢిల్లీ క్యాపిటల్స్ 4 విజయాలు, 2 పరాజయాలతో 8 పాయింట్లు ఖాతాలో వేసుకొని అగ్రస్థానానికి దూసుకెళ్లింది. 5 మ్యాచ్‌ల్లో 3 విజయాలు, 2 పరాజయాలతో 6 పాయింట్లు సాధించిన ముంబై ఇండియన్స్ పట్టిక రెండో స్థానంలో ఉంది. **నేడు జరిగే మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌తో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) తలపడుతుంది.**

స్కోరు వివరాలు

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: యస్తిక భాటియా (సి) సారా (బి) శిఖ 11; హేలీ మాథ్యూస్ (సి) షఫాలీ వర్మ (బి) అనాబెల్ 22; సివర్ బ్రంట్ (సి అండ్ బి) జెస్ జొనాసెన్ 18; హర్మన్‌ప్రీత్ (ఎల్బీడబ్ల్యూ) (బి) జెస్ జొనాసెన్ 22; అమేలియా కెర్ (సి) అనాబెల్ (బి) మిన్ను 17; సజన (సి) లానింగ్ (బి) మిన్ను 5; అమన్‌జ్యోత్ (నాటౌట్) 17; కమలిని (బి) జెస్ జొనాసెన్ 1; సంస్కృతి గుప్తా (సి) జెమీమా (బి) మిన్ను 3; కలిత (రనౌట్) 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 123. వికెట్ల పతనం:** 1-35, 2-35, 3-73, 4-83, 5-100, 6-101, 7-104, 8-115, 9-123. **బౌలింగ్:** మరిజానె కాప్ 3-0-16-0; శిఖ పాండే 4-1-16-1; జెస్ జొనాసెన్ 4-0-25-3; అనాబెల్ సదర్లాండ్ 4-0-21-1; టిటాస్ సాధు 2-0-24-0; మిన్ను మణి 3-0-17-3.

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: మెగ్ లానింగ్ (నాటౌట్) 60; షఫాలీ వర్మ (సి) అమేలియా కెర్ (బి) అమన్‌జ్యోత్ 43; జెమీమా రోడ్రిగ్స్ (నాటౌట్) 15; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (14.3 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి) 124. వికెట్ల పతనం:** 1-85; **బౌలింగ్:** షబ్నిమ్ ఇస్మాయిల్ 4-0-26-0; సివర్ బ్రంట్ 2-0-27-0; హేలీ మాథ్యూస్ 2-0-16-0; అమేలియా కెర్ 2-0-20-0; అమన్‌జ్యోత్ కౌర్ 2-0-12-1; సంస్కృతి గుప్తా 1.3-0-14-0; కలిత 1-0-9-0.

ఇంగ్లండ్ కెప్టెన్సీకి బట్లర్ గుడ్‌బై



కరాచీ: ఇంగ్లండ్ క్రికెట్ జట్టు పరిమిత ఓవర్ల ఫార్మాట్ కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్లు జోస్ బట్లర్ ప్రకటించాడు. చాంపియన్స్ ట్రోఫీలో అఫ్గానిస్తాన్ చేతిలో ఓడిన ఇంగ్లండ్ జట్టు నాకౌట్ రేసుకు దూరమైన నేపథ్యంలో బట్లర్ ఈ నిర్ణయం తీసుకున్నాడు. శనివారం దక్షిణాఫ్రికాతో మ్యాచ్ అనంతరం నాయకత్వ బాధ్యతల నుంచి తప్పుకోనున్నట్లు బట్లర్ వెల్లడించాడు. అయితే ఆటగాడిగా జట్టులో కొనసాగుతానని వెల్లడించాడు. 'కెప్టెన్సీ నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నా. ఈ నిర్ణయం నాకు, జట్టుకు మేలు చేస్తుందనుకుంటున్నా. సారథ్య బాధ్యతలను ఇతరులకు అప్పగించేందుకు ఇదే సరైన సమయమని భావిస్తున్నా' అని బట్లర్ వెల్లడించాడు. 2023లో భారత్ వేదికగా జరిగిన వన్డే ప్రపంచకప్‌లో బట్లర్ సారథ్యంలో ఇంగ్లండ్ లీగ్ దశలోనే వెనుదిరిగింది. బట్లర్ సారథ్యంలో 44 వన్డేలు ఆడిన ఇంగ్లండ్ 18 విజయాలు, 25 పరాజయాలు నమోదు చేసుకుంది. ఒక మ్యాచ్‌లో ఫలితం తేలలేదు. 51 టి20ల్లో 26 విజయాలు, 22 పరాజయాలు చవిచూసింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో


'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 339

శనివారం 1-3-2025



సెమీస్‌లోకి ఆస్ట్రేలియా

అఫ్గానిస్తాన్‌తో మ్యాచ్ రద్దు.. వర్షంతో ముగిసిన పోరు - స్పోర్ట్స్‌లో



ట్రేడ్ వార్ టెర్రర్

సెన్సెక్స్ 1,414 పాయింట్లు పతనం.. రూ.9.08 లక్షల కోట్లు ఆవిరి - బిజినెస్‌లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

హామీలు రద్దు.. మోసాల పద్దు



బడ్జెట్ పుటల సాక్షిగా బాబు మరోసారి మోసాలు

యువత, పిల్లలు, రైతులకు మళ్లీ దగా

నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధికి.. సున్నా

మహిళల ఉచిత బస్సు.. తుస్సు

జాడలేని జాబ్ క్యాలెండర్..

ఇప్పటికే ఏడాది ఎగ్గొట్టి.. అరకొరగా అన్నదాతా సుఖీభవ

ఈ పథకానికి కావాల్సింది రూ.10,717 కోట్లైతే బడ్జెట్‌లో

ఇచ్చింది కేవలం రూ.6,300 కోట్లే.. 50 ఏళ్లకే పెన్షన్ దేవుడెరుగు..

అవ్వాతాతల పెన్షన్ల వ్యయంలో ఈ బడ్జెట్‌లో రూ.5 వేల కోట్లకుపైగా కోత..

రూ.3 వేల కోట్లకుపైగా కోతలతో 'తల్లికి వందనం'

మరోపక్క తొలిసారిగా రూ.లక్ష కోట్లకు పైగా అప్పులు.. ప్రజా రుణం రూ.1.03 లక్షల కోట్లు

పన్నేతర బాదుడుతో ప్రజల జేబులు ఖాళీ.. మద్యం ద్వారా రూ.27,097 కోట్లు..

పేదల గృహ నిర్మాణాల కేటాయింపుల్లో భారీ కోత.. అభివృద్ధి, సంక్షేమం.. తిరోగమనమే

మొత్తం బడ్జెట్ రూ.3.22 లక్షల కోట్లు

సాక్షి, అమరావతి: ''బాబు ష్యూరిటీ అంటే... చరిత్ర చూడని మోసాలు గ్యారెంటీ!'' అని బడ్జెట్ పుటల సాక్షిగా మరోసారి రుజువయ్యాయి! ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ దాదాపుగా ఎగ్గొడుతూ.. ఇస్తున్న ఒకటో రెండో పథకాలకు కూడా కోతలు, కత్తిరింపులు విధిస్తూ... లక్షల మంది లబ్ధిదారులను తగ్గిస్తూ.. పిల్లల నుంచి అవ్వల దాకా అన్ని వర్గాలను మోసం చేస్తూ.. సూపర్ సిక్స్‌కు ఎగనామం పెడుతూ సీఎం చంద్రబాబు సర్కారు శుక్రవారం అసెంబ్లీకి బడ్జెట్‌ను సమర్పించింది. సూపర్ సిక్స్ సహా హామీలన్నీ విస్మరించి పిల్లలు, మహిళలు, నిరుద్యోగులు, యువత, రైతన్నలు.. ఇలా అన్ని వర్గాలను దగా చేసింది. ప్రతి జనవరిలో జాబ్ క్యాలెండర్ అని హామీ ఇచ్చి ఆ ఊసే లేకుండా చేశారు. నిరుద్యోగ భృతి ఇవ్వకపోవడంతో ఏడాదిగా యువత నెలకు రూ.3 వేల చొప్పున నష్టపోతోంది. 1.60 కోట్ల మందికి ఆడబిడ్డ నిధి కింద ఏటా రూ.18 వేల ఆర్థిక సాయాన్ని మరోసారి ఎగ్గొట్టడంతో మహిళలు ఏడాదికి సుమారు రూ.28,800 కోట్లు కోల్పోతున్నారు! ఇక 'తల్లికి వందనం' అంటూనే బడ్జెట్‌లో రూ.3 వేల కోట్లకుపైగా కోత పెట్టారు! అన్నదాతా సుఖీభవ అమలుకు కావాల్సింది రూ.10,717 కోట్లైతే బడ్జెట్‌లో ఇచ్చింది కేవలం రూ.6,300 కోట్లే! ఈ లెక్కన 22 లక్షల మందికిపైగా రైతులు రూ.4,417 కోట్ల పెట్టుబడి సాయానికి దూరం కానున్నారు. గతేడాది మొండి చెయ్యి చూపడంతో రైతన్నలు ఇప్పటికే రూ.పది వేల కోట్లకుపైగా నష్టపోయారు. ఇక ఇప్పటికే దాదాపు రెండు లక్షల పెన్షన్లను తగ్గించగా తాజా బడ్జెట్ కేటాయింపుల్లో రూ.5 వేల కోట్లకుపైగా కోత విధించటాన్ని బట్టి మరిన్ని పింఛన్లను ఎగరగొట్టడం ఖాయంగా కనిపిస్తోంది. వెరసి..

మిగతా 6వ పేజీలో ▶

వందనమా.. వంచనా

భృతి.. భ్రాంతి

'ఫీజు'లో కోత.. విద్యార్థులకు వాత

'ఆసరా'కు మనసొప్పలేదు

నమ్మించి.. నయవంచన

ప్రాజెక్టుల నిర్మాణం.. 'సాగు'దీతే

కలర్ ఎక్కువ.. కంటెంట్ తక్కువ



సూపర్ సిక్స్ హామీల అమలుకు కేటాయింపులు లేవు

వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన

అప్పులు చేసేలా.. భారం మోపేలా

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

లెక్కలు ఫుల్.. ఖజానా నిల్

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

బడ్జెట్ డొల్ల.. రైతులు గుల్ల..

వ్యవసాయ శాఖ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- వివరాలు 5,6,7,8,9,10,11 పేజీల్లో..



ఆడబిడ్డ నిధి (రూ.కోట్లలో)	
ఏడాదికి అవసరం	28,800
కేటాయింపు	సున్నా
కోత	వంద శాతం
1.60 కోట్ల మందికి పైగా ఎగనామం	
రెండు బడ్జెట్లలో ఎగ్గొట్టింది	57,600



ఉచిత బస్సు (రూ.కోట్లలో)	
ఏడాదికి అవసరం	3,182
కేటాయింపు	సున్నా
కోత	వంద శాతం
రోజుకు 20 లక్షల మందికి ఎగనామం	
రెండు బడ్జెట్లలో ఎగ్గొట్టింది	6,364



నిరుద్యోగ భృతి (రూ.కోట్లలో)	
ఏడాదికి అవసరం	57,600
కేటాయింపు	సున్నా
కోత	వంద శాతం
1.60 కోట్ల కుటుంబాలకు ఎగనామం	
రెండు బడ్జెట్లలో ఎగ్గొట్టింది	1,15,200



దీపం పథకం (రూ.కోట్లలో)	
ఏడాదికి అవసరం	సుమారు 4,000
కేటాయింపు	2,601
కోత	1,399
58 లక్షల మందికి ఎగనామం	
రెండు బడ్జెట్లలో ఎగ్గొట్టింది	4,713



తల్లికి వందనం (రూ.కోట్లలో)	
ఏడాదికి అవసరం	13,113
కేటాయింపు	9,407
కోత	3,706
24.70 లక్షల మందికి ఎగనామం	
రెండు బడ్జెట్లలో ఎగ్గొట్టింది	16,819



అన్నదాత సుఖీభవ (రూ.కోట్లలో)	
ఏడాదికి అవసరం	10,717
కేటాయింపు	6,300
కోత	4,417
22.08 లక్షల మందికి ఎగనామం	
రెండు బడ్జెట్లలో ఎగ్గొట్టింది	14,864

ఇదండీ సంగతి



సర్! ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీ అమలు చేయకపోయినా... విజన్ 2047 అని చెప్పి ముందుకు పోతున్నారంటే చరిత్రలో మీకు మీరే సాటి!!

పోసానికి 14 రోజుల రిమాండ్

రాత్రి 9.30 నుంచి తెల్లవారుజాము వరకు వాదనలు

పోసాని తరఫున వాదనలు వినిపించిన మాజీ ఏఏజీ పొన్నవోలు

- డిఫెన్స్ వాదనలతో ఏకీభవించిన మెజిస్ట్రేట్.. ఎట్టకేలకు 111 బీఎన్ఎస్ సెక్షన్ తొలగింపు
- ఇతరత్రా 15కు పైగా అక్రమ కేసులు.. అందుకే రిమాండ్
- రాజంపేట సబ్ జైలుకు తరలింపు.. కోర్టు వద్ద ఉత్కంఠ
- కడుపు నొప్పి, విరేచనాలతో బాధ పడుతున్న పోసాని
- పోసాని న్యాయవాదులు బెయిల్ పిటిషన్.. పోలీసులు కస్టడీ పిటిషన్

12లో



పోసానిని కోర్టు నుంచి జైలుకు తీసుకెళ్తున్న పోలీసులు

తెలుగు తమ్ముళ్ల ఘరానా మోసం


- ఉద్యోగాల పేరిట 350 మందిని మోసం చేసిన టీడీపీ నేతలు
- రూ.6 కోట్లకు కుచ్చుటోపీ పెట్టిన శ్రీకాకుళానికి చెందిన ధర్మారావురెడ్డి
- మధ్యవర్తిగా వ్యవహరించిన మరో తెలుగు తమ్ముడు దిలీప్
- రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే మోసానికి బీజం
- 2 రాష్ట్రాల్లోనూ బాధితులు.. పలు స్టేషన్లలో ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు
- విశాఖపట్నం పోలీస్ కమిషనరేట్‌లోనూ అదే తీరు
- సీఎం కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ప్రయోజనం శూన్యం

2లో

ఈసారి ఎండలు.. మంటలే

నైరుతి వర్షాలపైనా తీవ్ర ప్రభావం

సాక్షి, విశాఖపట్నం: దక్షిణాది రాష్ట్రాలు ఈసారి ఎండలతో మండిపోతాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ డి.ఎస్.పాయ్ తెలిపారు. మార్చి నుంచి మే నెల వరకు సాధారణం కంటే అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వెబెక్స్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో చెప్పారు. మే నెలలో వడగాలుల తీవ్రత చిత్తూరు, నెల్లూరు జిల్లాలు మినహా అన్నిచోట్లా భారీగా ఉంటుందని తెలిపారు. మే నెలలో వడగాలులు వీచే రోజుల సంఖ్య కూడా పెరిగే సూచనలు కనిపిస్తున్నాయన్నారు. నైరుతి రుతుపవనాల రాక సమయంలో పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదయ్యే సూచనలున్నాయని, అందు వల్ల రుతుపవనాలు బలహీనపడతాయని చెప్పారు.



దీనివల్ల ఈ వర్షాకాలంలో వర్షాభావ పరిస్థితులుంటాయని, రుతుపవనాల ప్రభావం కొంత తగ్గేలా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయం, రవాణా తదితర రంగాలపై ఎండల తీవ్రత ప్రభావం చూపిస్తుందని డి.ఎస్.పాయ్ పేర్కొన్నారు.

టెక్నాలజీలో ముందడుగే ముఖ్యం

- క్లిష్టమైన సాంకేతిక సవాళ్లకు పరిష్కారాలు ఉంటేనే దేశం సురక్షితం
- 'విజ్ఞాన్ వైభవ్–2025' ప్రదర్శనలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

సాక్షి, హైదరాబాద్: ''యుద్ధం హార్డ్‌వేర్ నుంచి సాఫ్ట్‌వేర్ ఆధారితంగా మారుతోంది. కృత్రిమ మేధ, క్వాంటం కంప్యూటింగ్, మెషీన్ లెర్నింగ్, క్లీన్–టెక్ వంటి సాంకేతిక పరిజ్ఞానాల్లో మనం ముందంజ వేయాలి. క్లిష్టమైన సాంకేతిక సవాళ్లకు పరిష్కారాలు ఉంటే భారతదేశం ప్రతికూల పరిస్థితులలో బలంగా, సురక్షితంగా ఉంటుంది. యువత శాస్త్రీయ దృక్పథాన్ని, విమర్శనాత్మక ఆలోచనను అవలంబించాలి'' అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పిలుపునిచ్చారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా డీఆర్‌డీఓ, ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా, కలాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సలెన్స్ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో 'విజ్ఞాన్ వైభవ్–2025' ప్రదర్శన ఏర్పాటు చేశారు. రెండు రోజులపాటు జరిగే ఈ ప్రదర్శనను శుక్రవారం సీఎం రేవంత్‌తో కలసి రాజ్‌నాథ్‌సింగ్ ప్రారంభించారు. అంతకుముందు గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన సీవీ రామన్, అబ్దుల్ కలాం విగ్రహాలకు వారు పూలమాలలు వేశారు. స్టేడియంలో ఓపెన్‌టాప్ జీపులో తిరుగుతూ విజ్ఞాన్ వైభవ్‌కు హాజరైన విద్యార్థులకు అభివాదం చేశారు. అనంతరం రాజ్‌నాథ్ ప్రసంగించారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించేలా భారత యువత సామర్థ్యాన్ని ఉపయోగించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని చెప్పారు. దేశ భద్రత కోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలన్నదే ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వ నిబద్ధత అని పేర్కొన్నారు.

ఆకట్టుకుంటున్న 'రక్షణ' స్టాల్స్

విజ్ఞాన్ వైభవ్‌లో భాగంగా ఏర్పాటు చేసిన రక్షణ ఉత్పత్తుల స్టాల్స్ విద్యార్థులను ఆకట్టుకుంటున్నాయి. పెద్ద సంఖ్యలో వాటిని సందర్శించేందుకు విద్యార్థులు వస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, రక్షణ శాఖ కార్యదర్శి, డీఆర్‌డీఓ చైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్, ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ జి.సతీశ్‌రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, పలువురు శాస్త్రవేత్తలు, 20వేల మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు.

కలాం మిస్సైల్ కాంప్లెక్స్‌ను సందర్శించిన రాజ్‌నాథ్

'విజ్ఞాన్ వైభవ్' కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం డీఆర్‌డీఓకు చెందిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మిస్సైల్ కాంప్లెక్స్‌ను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సందర్శించారు. కలాం విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. రీసెర్చ్ సెంటర్ ఇమారత్ (ఆర్‌సీఐ) క్షిపణి సాంకేతికతల అభివృద్ధి, ఇతర అంశాలను శాస్త్రవేత్తలు రక్షణ మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా పలువురు శాస్త్రవేత్తలను రాజ్‌నాథ్ సన్మానించారు. దేశ రక్షణ రంగానికి వారు చేసిన సేవలను ప్రశంసించారు.

సీఆర్‌డీఏ టెండర్ కమిటీ పునర్వ్యవస్థీకరణ

సాక్షి, అమరావతి: రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ) పరిధిలో ఇంజినీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ), ఇతర పద్ధతుల్లో రూ.పది కోట్లు అంతకంటే ఎక్కువ అంచనా వ్యయంతో చేపట్టే పనుల టెండర్ కమిటీని ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. 'నిబంధనలు–విలువల నిర్ధారణ, టెండర్ల మదింపు–ఆమోదం, పనుల గడువు పొడిగింపు' ప్రాతిపదికన సీఆర్‌డీఏ కమిషనర్ అధ్యక్షతన, సీఈ కన్వీనర్‌గా మూడు కమిటీలను ఏర్పాటు చేస్తూ పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

FORM IV
(See Rule 8)


Statement about ownership and other particulars about newspaper ***SAKSHI***

1. Place of Publication : VIJAYAWADA
2. Periodicity of its publication : DAILY
3. Printer's Name : R. DHANANJAYA REDDY
   Nationality : INDIAN
   Address : Jagati Publications Limited, 6-3-249/1, Sakshi Towers, Road No.1, Banjara Hills, Hyderabad -500 034.
4. Publisher's Name : R. DHANANJAYA REDDY
   Nationality : INDIAN
   Address : Jagati Publications Limited, 6-3-249/1, Sakshi Towers, Road No.1, Banjara Hills, Hyderabad -500 034.
5. Editor's Name : R. DHANANJAYA REDDY
   Nationality : INDIAN
   Address : Flat No. 411, Ashoka Liviano Towers, Puppalaguda, Narsingi Service Road, Near My Home Avatar, Hyderabad - 500 089.
6. Name & Addresses of individuals who own the Newspaper and shareholders holding more than one percent of the total capital :
   1. M/s. Jagati Publications Limited, 6-3-249/1, Sakshi Towers, Road No.1, Banjara Hills, Hyderabad -500 034.
   2. M/s.Carmel Asia Holdings Pvt Ltd., No. 12/2, Commerce at mantri, Bannerghatta Main road, Opposite mantri home care office, Bangalore, Karnataka - 560 076.
   3. M/s.Gilchrist Investments Pvt Ltd., # 1-1-151 & 1-1-151/1, Ground Floor, Sairam Towers, Alexander Road, Secunderabad - 500 003.
   4. M/s. Alpha Avenues Pvt Ltd., # 1-1-151 & 1-1-151/1, Ground Floor, Sairam Towers, Alexander Road, Secunderabad - 500 003.
   5. M/s. Alpha Villas Pvt Ltd., # 1-1-151 & 1-1-151/1, Ground Floor, Sairam Towers, Alexander Road, Secunderabad - 500 003.
   6. M/s. India Cements Ltd., # 827, Annasalai, Dhun Building, IVth Floor, Chennai - 600 002
   7. M/s. P.R. Energy Holding Limited, Lakshmi Nivas, Plot. No. 705, Road. No 3, Banjara Hills, Hyderabad-500 034
   8. M/s. PVP Business Ventures Pvt. Ltd., # 46, Avenue 4, Street No. 1, Road No. 10, Banjara Hills, Hyderabad - 500 034
   9. M/s. PVP Business Towers Pvt Ltd., 8-2-609/K, Avenue 4, Street No. 1, Road No. 10, Banjara Hills, Hyderabad - 500 034.
   10. M/s.R.R. Global Enterprises Pvt. Ltd., 8-2-120/86/5, Third Floor, Sneha House, Road No. 3, Banjara Hills, Hyderabad - 500 034.
   11. M/s. Sentia Developers Ltd., 1A-Hamilton House, 1st Floor, Connaught Place, New Delhi - 110 001.
   12. M/s.Avant Garde Fashion Wear Pvt. Ltd., 54/3, Ejipura Main Road, Vivek Nagar, Bangalore - 560 047.
   13. M/s. Beta Avenues Pvt. Ltd., # 1-1-151 & 1-1-151/1, Ground Floor, Sairam Towers, Alexander Road, Secunderabad - 500 003.
   14. M/s. IA and IC Pvt. Ltd., Pada No.3, Balkum, Opp Casa Lodha Royal, Near Jalaram Mandir, Thane (West) - 400 608.

I, R. DHANANJAYA REDDY hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-
(R. DHANANJAYA REDDY)
Publisher

Date: 28-02-2025



సేవాభావాన్ని గుర్తించడం సామాన్యమైన విషయం కాదు

వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న వారిని గుర్తించి అవార్డులు ఇచ్చిన 'సాక్షి' కృషి అభినందనీయం

'సాక్షి ఎక్సలెన్స్ అవార్డ్స్ టెన్త్ ఎడిషన్'లో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ

సాక్షి, హైదరాబాద్: సమాజంలో సేవ చేస్తున్న వారిని గుర్తించడం సామాన్యమైన విషయం కాదని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు. ఎన్నో రంగాల్లో సేవ చేస్తున్నవారు నిజజీవితంలో తారసపడుతున్నప్పటికీ.. అందులో ఉత్తమమైన వారిని గుర్తించి అవార్డులు అందిస్తున్న 'సాక్షి'కృషి అద్భుతమని ప్రశంసించారు. వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న విశిష్ట వ్యక్తులకు 'సాక్షి'మీడియా గ్రూప్ ఎక్సలెన్సీ అవార్డులు అందజేస్తున్న విషయం తెలిసిందే. శుక్రవారం హైదరాబాద్‌లోని జీఆర్సీ కన్వెన్షన్ సెంటర్‌లో 'సాక్షి ఎక్సలెన్స్ అవార్డ్స్ టెన్త్ ఎడిషన్'కార్యక్రమం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన బండారు దత్తాత్రేయ.. వైఎస్ భారతిరెడ్డితో కలసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మాట్లాడారు.

ఈ కృషిని అభినందించాల్సిందే..

సమాజంలో ఎలాంటి ఫలాలను ఆశించకుండా సేవచేస్తున్నవారు ఎంతోమంది ఉన్నారని.. ఆ సేవలను గుర్తించి ప్రోత్సహిస్తే, వారిలో ఉత్సాహం రెట్టింపు అవుతుందని దత్తాత్రేయ చెప్పారు. వారి జీవితం సమాజంలోని ఎంతోమందికి ఆదర్శంగా, స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు. ఎక్సలెన్స్ అవార్డుల పంపిణీ కార్యక్రమాన్ని 'సాక్షి'మీడియా గ్రూప్ పదేళ్లుగా విజయవంతంగా నిర్వహిస్తోందని.. ఈ కృషిని అభినందించాల్సిందేనని చెప్పారు. ''ఎక్సలెన్స్ అవార్డుల ఎంపిక ప్రక్రియ ఆషామాషీ కాదు. సేవ చేసేవారిని గుర్తించడం, వారి సేవతో సమాజంలో వస్తున్న మార్పును విశ్లేషించడం ద్వారా విశిష్ట వ్యక్తులను గుర్తించి అవార్డులకు ఎంపిక చేయడం జ్యూరీ సభ్యులకు అతిపెద్ద సవాలు..''అని దత్తాత్రేయ పేర్కొన్నారు. ఈ అవార్డులకు ఎంపిక చేసిన విధానం అద్భుతంగా ఉందని జ్యూరీ సభ్యులను అభినందించారు. పదేళ్ల అవార్డుల ప్రదానోత్సవానికి తనను ముఖ్య అతిథిగా ఆహ్వానించినందుకు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ, వ్యవసాయం, విద్య, సామాజిక అభివృద్ధి, వ్యాపారం, పరిశ్రమలు, ఆరోగ్య పరిరక్షణ తదితర కేటగిరీలలో తొమ్మిది మందికి గవర్నర్ బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా 'సాక్షి'ఎక్సలెన్స్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో భారతి సిమెంట్స్ మార్కెటింగ్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, ఇక్ఫాయ్ యూనివర్సిటీ డైరెక్టర్లు కె.ఎల్.నారాయణ, కె.ఎస్.వేణుగోపాల్‌రావు, వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ పోతూరి, సాక్షి సీఈవో, డైరెక్టర్లు, ఎడిటర్ పాల్గొన్నారు.

తెలుగు తమ్ముళ్ల ఘరానా మోసం

ఉద్యోగాల పేరిట 350 మందిని మోసం చేసిన టీడీపీ నేతలు

- రూ.6 కోట్లకు కుచ్చుటోపీ పెట్టిన శ్రీకాకుళానికి చెందిన ధర్మారావురెడ్డి
- మధ్యవర్తిగా వ్యవహరించిన మరో తెలుగు తమ్ముడు దిలీప్
- రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే మోసానికి బీజం
- రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ బాధితులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు
- విశాఖపట్నం పోలీస్ కమిషనరేట్‌లోనూ అదే తీరు
- సీఎం కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ప్రయోజనం శూన్యం

సాక్షి, విశాఖపట్నం: శ్రీకాకుళం కేంద్రంగా మొదలై.. హైదరాబాద్ వరకు ఇద్దరు టీడీపీ నేతలు చేసిన ఘరానా మోసం వెలుగులోకి వచ్చింది. విదేశాల్లో ఉద్యోగాల పేరిట 350 మందికి టోకరా వేసి సుమారు రూ.6 కోట్లతో పరారైన వైనం బయటపడింది. ఇచ్ఛాపురానికి 70 కిలోమీటర్ల దూరంలోని ఒడిశా చీకటి బ్లాక్ పార్వతీపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కొచ్చెర్ల ధర్మారావురెడ్డి పోలెండ్‌లో వలస కూలీగా పనిచేస్తున్నాడు. కొన్నాళ్ల తర్వాత ఏజెంట్‌గా అవతారం ఎత్తి స్థానిక యువకులకు ఉద్యోగాల ఎర వేశాడు. దగ్గర బంధువుల్లో నిరుద్యోగులుగా ఉన్నవారినే లక్ష్యంగా చేసుకున్నాడు. ఇటలీలో అదిరిపోయే ఉద్యోగాలున్నాయని ఊరించాడు. ధర్మారావురెడ్డి తన బంధువులైన ఇచ్ఛాపురం టీడీపీ ఎమ్మెల్యే అనుచరులు కాయి దిలీప్(తేలుకుంచి), శ్రీను(బెజ్జిపద్ర)తో ప్రచారం ఊదరగొట్టించాడు. ఇటలీలో ఫ్రూట్స్ కటింగ్, ప్యాకింగ్, వైన్, బీర్ల కంపెనీలు, ప్యాకింగ్ మొదలైన సంస్థల్లో మంచి ఉద్యోగాలు, కష్టం లేని పని, రూ.లక్షల్లో జీతం అంటూ నమ్మించాడు. ఎంత వీలైతే అంతమందికి ఉద్యోగాలున్నాయని.. ఎక్కువ మందిని తీసుకొస్తే ఫీజులో కొంత తగ్గిస్తానంటూ ఆశ చూపించాడు. టీడీపీ నేతల మాటలు నమ్మిన నిరుద్యోగులు.. హైదరాబాద్, విజయవాడ, వైజాగ్, ప్రకాశం, గుంటూరు తదితర ప్రాంతాల్లో చిన్న చిన్న పనులు చేసుకుంటున్న బంధువులు, స్నేహితులను సంప్రదించారు. వారిని కూడా ఈ ఉచ్చులోకి తీసుకొచ్చారు.



సూత్రధారి ధర్మారావురెడ్డి

టీడీపీ అధికారంలోకి వచ్చాకే..

రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే ధర్మారావురెడ్డి, దిలీప్ కలిసి ప్లాన్ వేసినట్లు పక్కాగా స్పష్టమవుతోంది. ఇచ్ఛాపురం ఎమ్మెల్యేతో ఉన్న అనుబంధం.. ఏం జరిగినా పార్టీ కాపాడుతుందన్న తెగింపుతో.. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 350 మందిని ఎంపిక చేశారు. ఇచ్ఛాపురంలో లాడ్జిని తీసుకొని మొదటి విడతలో 2024 ఏడాది జూలై 26న 75 మందిని ఇంటర్వ్యూ చేసి రూ.20 వేలు అడ్వాన్స్, తర్వాత రూ.1.35 లక్షలు వసూలు చేశారు. ఆగస్టులో హైదరాబాద్‌లో మరో 175 మందిని ఇంటర్వ్యూ చేసి రూ.1.35 లక్షలు చొప్పున తీసుకున్నారు. జనవరిలో శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలో 120 మందికి ఇంటర్వ్యూ నిర్వహించి రూ.50 వేలు వంతున వసూలు చేశారు. అందరి దగ్గర విద్యార్హతల ధ్రువ పత్రాల జిరాక్స్‌లు, ఫొటోలు తీసుకున్నారు. ఫిబ్రవరి లేదా మార్చి మొదటి వారంలో ఇటలీ వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని సమాచారం ఇచ్చారు. మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కావాలని అడుగుతున్నారని చెప్పి ఇచ్ఛాపురంలోని ఓ ప్రైవేట్ మెడికల్ ల్యాబ్‌లో 350 మంది నిరుద్యోగులకూ వారి సొంత డబ్బు తోనే వైద్య పరీక్షలు నిర్వహించారు.



మధ్యవర్తిగా వ్యవహరించిన ఎమ్మెల్యే బెందాళం అనుచరుడు దిలీప్



విశాఖ కమిషనరేట్ దగ్గర నిరుద్యోగ బాధితులు

ఢిల్లీ వెళ్లాక బట్టబయలైన మోసం

ఇటలీ ప్రయాణానికి మొదటి విడతలో 30 మంది పాస్‌పోర్టు చెకింగ్, స్లాట్ బుకింగ్ చేసుకోవాలని ధర్మారావు, దిలీప్ రెండు వారాల క్రితం చెప్పడంతో.. ఢిల్లీ వెళ్లిన యువకులకు అసలు విషయం తెలిసింది. వాళ్లు చెప్పిన అడ్రస్‌లు, పాస్‌పోర్టు చెకింగ్‌లు అంతా మోసమని గ్రహించారు. 350 మందితో ఒక వాట్సప్ గ్రూప్ పెట్టిన టీడీపీ నేతలు.. ''మీతో పాటు మేము కూడా మోసపోయాం.. అందరూ క్షమించాలి'' అంటూ వాయిస్ మెసేజ్ పెట్టి ఫోన్ స్విచ్చాఫ్ చేసేశారు. బాధితులంతా లబోదిబోమంటూ రోడ్డున పడ్డారు.

పోలీసుల్ని ఆశ్రయించినా పట్టించుకోవడం లేదు.!

ధర్మారావురెడ్డి బాధితులు ఫిబ్రవరి 17న ఇచ్ఛాపురం రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. పరిశీలిస్తామని చెప్పారు తప్ప.. విచారణకు సాహసించలేదు. స్థానిక ఎమ్మెల్యే ఒత్తిడి తెచ్చి.. విచారణను ఆపుతున్నట్లు బాధితులు గ్రహించారు. చేసేదిలేక విశాఖపట్నం పోలీస్ కమిషనరేట్‌కు వచ్చినా పట్టించుకోలేదంటూ బాధిత నిరుద్యోగులు వాపోతున్నారు. రాజకీయ పలుకుబడితో.. కేసును తప్పుదారి పట్టిస్తున్నారంటూ ఆరోపిస్తున్నారు.

సీఎం కార్యాలయంలోనూ ఫిర్యాదు చేశాం

టీడీపీ నేతల బాధితులు

ధర్మారెడ్డి మంచివాడు అని నమ్మబలికిన దిలీప్ మధ్యవర్తిత్వంతో అందరం డబ్బు చెల్లించాం. మోసపోయామని చివరి నిమిషంలో తెలిసింది. దిలీప్‌ను నిలదీసినా స్పందించలేదు. ఇచ్ఛాపురం పోలీసులు పట్టించుకోలేదు. సీఎం ఆఫీస్‌కు వెళ్లాం. ఆయన ఎమ్మెల్సీ ఎన్నికలకు వెళ్లారని చెప్పడంతో.. సీఎం కార్యాలయంలోనూ, మంత్రి లోకేష్ కార్యాలయంలోనూ ఫిర్యాదు చేశాం. మా ఎంపీ, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడును కలిసి ఫిర్యాదు చేస్తే.. రెండు రోజుల్లో పరిష్కరిస్తానని చెప్పారు. వారం దాటినా ఎలాంటి స్పందన లేదు. చాలామంది ఉన్న ఉద్యోగం వదిలి డబ్బులు కట్టాం. రోడ్డున పడ్డాం. డబ్బు తిరిగి చెల్లించాలి.

మరోమారు బాబు మార్కు దుష్ప్రచారం

వైఎస్ జగన్‌పై హత్యాయత్నం ఘటనపై అవాస్తవ ఆరోపణలు

- ఆయనే దాడి చేయించుకున్నారంటూ మళ్లీ డైవర్షన్ రాజకీయం
- వైఎస్ వివేకా హత్యపైనా అవాకులు చవాకులు
- దస్తగిరి వాంగ్మూలం వల్లె వేస్తూ విషం కక్కుతున్న వైనం

18.1 On 25.10.2018 at about 12.45PM, accused Janipalli Srinivasa Rao @ Chanti (A-1) was present in the Lounge (adjacent to Fusion Foods restaurant) of Visakhapatnam International Airport and as per his premeditated plan, he attempted to stab Shri Y.S. Jagan Mohan Reddy on his neck with a sharp knife, with intention to kill him and in turn injured the top most part of his left arm. Thus he committed an offence under sec 307 IPC.

వైఎస్ జగన్‌ను హత్యచేయాలనే ఆయనపై జానుపల్లి శ్రీనివాసరావు పదునైన కత్తితో దాడిచేశాడని చార్జిషీట్‌లో పేర్కొన్న ఎన్‌ఐఏ

సాక్షి, అమరావతి : ముఖ్యమంత్రి చంద్రబాబు మరోసారి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై అక్కసు వెళ్లగక్కారు. తనకు అలవాటైన రీతిలో అవాస్తవ ఆరోపణలతో ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు టీడీఎల్పీ సమావేశం వేదికగా యత్నించారు. వైఎస్ జగన్‌పై 2018 అక్టోబర్ 25న విశాఖపట్నం విమానాశ్రయంలో జరిగిన హత్యాయత్నం ఘటనను వక్రీకరించేందుకు నిస్సిగ్గుగా యత్నించారు. వైఎస్ జగన్ తనపై తానే దాడి చేయించుకున్నారని విమర్శించడం విస్మయ పరిచింది. ఎందుకంటే ఈ కేసులో నిందితుడు జానుపల్లి శ్రీనివాసరావు అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని హత్య చేసేందుకే దాడికి పాల్పడ్డాడని కేంద్ర దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) నిర్ధారించింది. 2019 జనవరిలో న్యాయస్థానంలో దాఖలు చేసిన చార్జ్‌షీటులో ఈ విషయాన్ని విస్పష్టంగా పేర్కొంది కూడా. 'వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని హత్య చేయాలనే ఉద్దేశంతోనే పదునైన కత్తితో ఆయనపై దాడి చేశాడు' అని ఎన్‌ఐఏ తన నివేదికలో వెల్లడించింది. వైఎస్ జగన్‌పై హత్యాయత్నం జరిగినప్పుడు రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వమే అధికారంలో ఉండింది. నిందితుడు జానుపల్లి శ్రీనివాసరావు పని చేస్తున్న విశాఖపట్నం విమానాశ్రయంలోని రెస్టారెంట్ యజమాని టీడీపీ నేత హర్షవర్ధన్ చౌదరి టీడీపీ నేత. ఆయన 2014 ఎన్నికల్లో గాజువాక నియోజకవర్గం నుంచి టీడీపీ టికెట్ ఆశించారు కూడా. టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా ఉన్నప్పుడే విశాఖపట్నం విమానాశ్రయంలో రెస్టారెంట్ కాంట్రాక్టు ఆయనకు దక్కింది. నేర చరిత్ర ఉన్న జానుపల్లి శ్రీనివాసరావు పోలీసుల నుంచి నిరభ్యంతర సర్టిఫికెట్ (ఎన్‌వోసీ) పొంది ఆ రెస్టారెంట్‌లో ఉద్యోగిగా చేరడం వెనుక టీడీపీ పెద్దల ప్రమేయం ఉంది. తద్వారా వైఎస్ జగన్‌పై హత్యాయత్నం వెనుక టీడీపీ పెద్దల కుట్ర ఉందన్నది స్పష్టమవుతోంది. వాస్తవాలు ఇలా ఉంటే.. చంద్రబాబు మాత్రం వైఎస్ జగన్‌పై దుష్ప్రచారానికి తెగబడటం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం.

దస్తగిరిని అడ్డుపెట్టి దుష్ప్రచారం!

వైఎస్ వివేకానందరెడ్డి హత్య విషయంలో కూడా వాస్తవాలను మరుగున పరిచేలా ముఖ్యమంత్రి చంద్రబాబు పాత కుట్రకు సరికొత్తగా తెరతీశారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగానే 2019 ఎన్నికల ముందు వైఎస్ వివేకాను అత్యంత దారుణంగా హత్య చేయడం వెనుక సొంత కుటుంబ సభ్యులు, టీడీపీ పెద్దల పాత్ర ఉందన్నది సుస్పష్టం. కానీ వైఎస్ వివేకాను చంపానని ఒప్పుకున్న నిందితుడు దస్తగిరిని అప్రూవర్‌గా చేసి, అతనితో వైఎస్ కుటుంబంపై అవాస్తవ ఆరోపణలు చేయిస్తుండటం వెనుక పక్కా కుట్ర ఉందన్నది తేటతెల్లమవుతోంది. తన తండ్రి హంతకుడు దస్తగిరితో నర్రెడ్డి సునీత దంపతులు సన్నిహితంగా ఉండటం.. దస్తగిరిని టీడీపీ వెనకేసుకు వస్తుండటం ఇందుకు నిదర్శనం. దస్తగిరిని అప్రూవర్‌గా చేసి అతనితో ఇప్పించిన వాంగ్మూలం పూర్తిగా అబద్ధాల పుట్ట అన్నది బట్టబయలైంది. బెంగళూరులో భూ సెటిల్‌మెంట్ ద్వారా వచ్చే రూ.40 కోట్ల కోసమే వైఎస్ వివేకాను హత్య చేయాలని ఎర్ర గంగిరెడ్డి తనతో చెప్పినట్టు దస్తగిరి తన వాంగ్మూలంలో పేర్కొన్నాడు. హత్య చేస్తే తనకు రూ.5 కోట్లు ఇస్తానని ఆఫర్ చేసి అడ్వాన్స్‌గా రూ.కోటి ఇచ్చారని కూడా చెప్పారు. కానీ అవన్నీ అవాస్తవాలని సీబీఐ దర్యాప్తులోనే వెల్లడైంది. బెంగళూరు భూ సెటిల్‌మెంట్ అన్నది లేనే లేదని సీబీఐ నిర్ధారించింది. ఇక వైఎస్ వివేకా హత్యకు రెండు రోజుల ముందు కూడా దస్తగిరి డబ్బులకు తీవ్ర ఇబ్బందులు పడినట్టు వెల్లడైంది. కనీసం రూ.2 వేలు అప్పు ఇప్పించమని అతను తన స్నేహితుడు సునీల్ యాదవ్‌కు పంపిన వాట్సాప్ సందేశాలు బయటపడ్డాయి. కనీసం రూ.500 అయినా ఇవ్వాలని ప్రాథేయపడ్డాడు కూడా. దస్తగిరి రూ.కోటి అడ్వాన్స్‌గా తీసుకుని ఉంటే రూ.500 కోసం సునీల్ యాదవ్‌ను అంతగా ఎందుకు ప్రాథేయపడ్డాడన్నది కీలకాంశం. అంటే అతని వద్ద చిల్లిగవ్వ కూడా లేదని నిర్ధారణ అయ్యింది. అటువంటి దస్తగిరి అప్రూవర్‌గా మారగానే అతని జీవన శైలి ఒక్కసారిగా మారిపోయింది. ఖరీదైన కార్లు, జేసీబీలు కొనుగోలు చేశాడు. విలాసవంతమైన జీవితం గడుపుతున్నాడు. దర్జాగా సెటిల్‌మెంట్లు చేస్తున్నాడు. ఢిల్లీ నుంచి సిద్ధార్థ లూథ్రా వంటి అత్యంత ఖరీదైన న్యాయవాదులు అతని తరఫున న్యాయస్థానంలో వాదించేందుకు వస్తున్నారు. ఇవన్నీ ఎలా సాధ్యమయ్యాయంటే వైఎస్ అవినాశ్ రెడ్డి కుటుంబంపై దుష్ప్రచారం చేస్తూ అప్రూవర్‌గా అబద్ధపు వాంగ్మూలం ఇవ్వడం వల్లే. ఆ అబద్ధపు వాంగ్మూలాన్ని ఆధారంగా చేసుకుని చంద్రబాబు, ఆయన ముఠా వైఎస్ జగన్‌పై దుష్ప్రచారం చేస్తుండటం రాజకీయ కుట్రేనన్నది సుస్పష్టం.

ఎమ్మెల్యేల పనితీరుపై నివేదికలు తెప్పిస్తున్నా

కేడర్‌కు, నాయకులకు మధ్య సమన్వయం లోపించింది

టీడీపీ శాసనసభాపక్ష సమావేశంలో సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి :ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో ఏం చేస్తున్నారో ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నానని, అందుకు సంబంధించిన నివేదికలు తెప్పించుకుంటున్నానని సీఎం చంద్రబాబు చెప్పారు. వెలగపూడిలోని అసెంబ్లీ కమిటీ హాలులో శుక్రవారం జరిగిన టీడీపీ శాసనసభాపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరు ఎమ్మెల్యేలు పార్టీని పట్టించుకోవడంలేదని, అలా నిర్లక్ష్యం చేస్తున్న వారి జాబితా తన వద్ద ఉందన్నారు. ఎమ్మెల్యేలకు, కేడర్ మధ్య సమన్వయం లేకుండాపోయిందని తెలిపారు. త్వరలో నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తానని వారికి చెప్పారు. పార్టీ కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకుల గురించి ఆలోచించి వారికి మంచి చేయాలని.. అందరినీ కలుపుకుని వెళ్లకపోతే ఇబ్బందులు పడతారని తెలిపారు.

దెబ్బతిన్న రోడ్లను వెంటనే పూర్తిచేయాలి..

ఇక నియోజకవర్గాల్లో దెబ్బతిన్న రోడ్లను వెంటనే పూర్తిచేయాలని సీఎం చంద్రబాబు వారిని ఆదేశించారు. కొంతమంది ఎమ్మెల్యేలు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని, ఆ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వచ్చి ఇబ్బందిపడాల్సి వస్తోందన్నారు. ఏప్రిల్‌లోపు నామినేటెడ్ పదవులను భర్తీచేస్తామన్నారు. సమావేశంలో పలువురు ఎమ్మెల్యేలు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. అధికారులు తమ మాట వినడంలేదని, పోస్టింగ్‌ల విషయంలోనూ ఇబ్బందులున్నాయని చంద్రబాబు దృష్టికి తీసుకొచ్చారు. మరికొందరు నియోజకవర్గాల అభివృద్ధికి నిధులివ్వాలని, ఏ చిన్న పనిచేయడానికి అవకాశం లేకుండాపోయిందని చెప్పారు. అవకాశాన్ని బట్టి నిధుల గురించి ఆలోచిస్తానని చంద్రబాబు చెప్పారు.

గత ప్రభుత్వంలో రూ.1059.75 కోట్లు మిగిల్చిన డిస్కంలు

ట్రూ డౌన్‌కు అనుతించాల్సిందిగా ఏపీఈఆర్‌సీకి విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: 2019–20 నుంచి 2023–24 మధ్య నాలుగవ నియంత్రణ కాలానికి విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు రూ.1059.75 కోట్లు మిగిల్చాయి. ఇది ఏపీఈపీడీసీఎల్‌లో రూ.383.84 కోట్లు, ఏపీఎస్పీడీసీఎల్‌లో రూ.428.57 కోట్లు, ఏపీసీపీడీసీఎల్‌లో రూ.247.35 కోట్లుగా ఉంది. ఏపీ ట్రాన్స్‌కో నుంచి ఈ మొత్తాన్ని వెనక్కి తెచ్చుకునేందుకు అనుమతించాల్సిందిగా ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ)ని కోరాయి. డిస్కంల పిటిషన్‌పై ప్రజలు తమ అభ్యంతరాలు, అభిప్రాయాలను మార్చి 28లోగా మెయిల్ ద్వారా వెల్లడించాల్సిందిగా కమిషన్ శుక్రవారం తన వెబ్‌సైట్ ద్వారా తెలిపింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్యుత్ ప్రసార వ్యవస్థ వినియోగానికి ఏపీఈఆర్‌సీ అనుమతించిన టారిఫ్ కంటే తక్కువగా డిస్కంలు వినియోగించాయి. ఆ మేరకు ఆదా అయిన నగదులో కొంత డిస్కంలు రెవెన్యూ గ్యాప్‌లో సర్దుబాటు చేసుకుంటాయి. మిగిలింది వినియోగదారులకు విద్యుత్ బిల్లుల్లో తిరిగి చెల్లిస్తాయి.

'పీపీఏ'లపై బహిరంగ విచారణకు 'ఏపీఈఆర్‌సీ' సిద్ధం

సాక్షి, అమరావతి: 2024–25 నుంచి 2028–29 మధ్య సెయిల్ (ఎస్‌ఈఐఎల్) ఎనర్జీ ఇండియా లిమిటెడ్ నుంచి 660 మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు డిస్కంలు కుదుర్చుకున్న ఒప్పందంపై ప్రజలు తమ అభిప్రాయాలను చెప్పాలని ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) శుక్రవారం కోరింది. సెయిల్‌తో కుదుర్చుకున్న 12 ఏళ్ల దీర్ఘకాలిక పీపీఏకు సంబంధించి టారిఫ్ (యూనిట్ ధర)ను నిర్ణయించాల్సిందిగా డిస్కంలు కమిషన్‌ను ఈ ఏడాది జనవరి 7న కోరాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 21లోగా దీనిపై అభ్యంతరాలు,అభిప్రాయాలను ఈ మెయిల్ ద్వారా తెలియజేయాలని ఏపీఈఆర్‌సీ సూచించింది.

'ఏపీఎస్పీడీసీఎల్'లో 400 మెగావాట్ల పీపీఏ

ఏపీఎస్పీడీసీఎల్ 400 మెగావాట్ల విద్యుత్‌ను యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నుంచి కొనుగోలుకు కుదుర్చుకున్న ఒప్పందంపై గత నెల 18 వరకు అభ్యంతరాలు, అభిప్రాయాలు స్వీకరించింది. ఆ గడువులోగా కేవలం ఏడుగురు మాత్రమే తమ అభ్యంతరాలు వెల్లడించినట్లు కమిషన్ తెలిపింది. వారికి ఏపీఎస్పీడీసీఎల్‌తో పాటు యాక్సిస్ సంస్థ కూడా సమాధానాలు ఇచ్చిందని మండలి వివరించింది.

రేషనలైజేషన్ కోసం సచివాలయాల గ్రూపింగ్

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల రేషనలైజేషన్ ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. రేషనలైజేషన్‌లో భాగంగా ప్రస్తుతం సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగుల్లో టెక్నికల్ కేటగిరి ఉద్యోగులను.. ప్రతి రెండు సచివాలయాలకు ఒకరు చొప్పున కేటాయిస్తారు. వారిని ఏ రెండు సచివాలయాలకు ఒకరు వంతున నియమించాలన్న 'సచివాలయాల గ్రూపింగ్' ప్రక్రియ మొదలైంది. గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీవోలు, మున్సిపల్ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లు వారి పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయాల గ్రూపింగ్ వివరాలను ఏపీ సేవ పోర్టల్ లాగిన్స్‌లో నమోదు చేయాలని గ్రామ, వార్డు సచివాలయాలశాఖ ఆదేశించింది.

అరుదైన శంఖులిపి శాసనాలు

రాయలసీమలో తొలిసారి వెలుగులోకి..
అక్కదేవతల కొండపై 15 శాసనాలు
నిత్యపూజకోన నుంచి గోపాలస్వామికోన అటవీ మార్గంలో గుర్తింపు



దెబ్బతిన్న శంఖులిపిలో చెక్కినపేరు



శంఖులిపిలో బండపై చెక్కిన పేరు

బి.కొత్తకోట : వైఎస్సార్ జిల్లా సిద్దవటం అటవీ రేంజ్ పరిధిలోని శ్రీ లంకమల్లేశ్వర అభయారణ్యంలో భారతీయ పురావస్తుశాఖ బృందం రెండో రోజు శుక్రవారం జరిపిన పరిశీలనల్లో 15 లేబుల్ శాసనాలు (పేర్లతో చెక్కిన శాసనాలు) లభ్యమయ్యాయి. ఇవి అరుదైన శంఖులిపి శాసనాలుగా గుర్తించగా అందులో ఒకటి మాత్రం బ్రాహ్మిలిపిలో ఉంది. ఈ శంఖులిపి శాసనాలు రాయలసీమలో వెలుగులోకి రావడం ఇదే తొలిసారి కావడం పురావస్తుశాఖ బృందానికి ఆశ్చర్యం కలిగించింది. లభ్యమైన శాసనాలు చెక్కిన చోటును పరిశీలిస్తే రెండు ప్రముఖ శైవ క్షేత్రాల మధ్య అప్పటి తీర్థ యాత్రికుల ప్రాచీన యాత్రా మార్గంగా కనిపిస్తోందని నిర్ధారించారు.

అన్నీ శంఖులిపి శాసనాలే..

సిద్దవటం నుంచి నిత్యపూజకోన ఆలయానికి సమీపంలో అక్కదేవతల ఆలయం ఉంది. రెండు వాగుల ప్రవాహం కలిసే చోటు ఉన్న కొండ నిటారుగా ఉంది. పురావస్తుశాఖ బృందానికి చెందిన డైరెక్టర్ మునిరత్నంరెడ్డి, యేసుబాబు, రాఘవేంద్రవర్మ, ఎఫ్ఆర్ఓ కళావతితో పాటు అటవీ, పురావస్తుశాఖ సిబ్బంది అతికష్టం మీద కొండపైకి చేరుకున్నారు. కొండపైనుంచి గోపాలస్వామి కోన ఆలయానికి వెళ్లే మార్గంగా గుర్తించిన ఈ కొండపై దారి వెంబడి 15 శాసనాలను గుర్తించారు. బండలపై చెక్కిన వీటిలో వ్యక్తుల పేర్లు ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. నడుచుకుంటూ వెళ్లే మార్గంలో ఈ శాసనాలు చెక్కి ఉన్నాయి. నిత్యపూజకోన ఆలయం నుంచి గోపాలస్వామి కోన ఆలయానికి వెళ్లే ఈ మార్గం 9 కిలోమీటర్ల దూరం ఉంటుంది. లభ్యమైన శాసనాల్లో ఒక రాతి బండపై 4వ శతాబ్దానికి చెందిన బ్రాహ్మిలిపిలో చంద్రహాస అని ఒక పేరు, దాని పక్కనే ఆరో శతాబ్దానికి చెందిన శంఖులిపిలో మరో పేరు చెక్కి ఉంది. 6వ శతాబ్దం నుంచి సిద్దమాతృ లిపి పరిణామ క్రమంలో ఈ శంఖు లిపి మొదలైంది.

దెబ్బతిన్న అక్షరాలు

శంఖులిపితో లభ్యమైన 14 శాసనాల్లో కొన్నింటి విశ్లేషణ పురావస్తుశాఖ అధికారులకు కొంత క్లిష్టంగా మారింది. కళాత్మక రీతిలో చెక్కిన ఈ పేర్లకు సంబంధించి మధ్యలో ఒక్కో చోట ఒక్కో అక్షరం దెబ్బతింది. దీన్ని విశ్లేషించాలంటే అర్థాలు మారిపోయే అవకాశం ఉంది. దీనితో పూర్తిగా అధ్యయనం చేశాక విశ్లేషించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.

మార్గంలో ఎన్నో శాసనాలు

ఉత్తర భారతానికి చెందిన తీర్థ యాత్రికులు నిత్యపూజకోన-గోపాలస్వామి కోన మధ్య దట్టమైన రిజర్వు ఫారెస్టు అయిన శ్రీ లంకమల్లేశ్వర అభయారణ్యంలో రాకపోకలు సాగించినట్లు ఇప్పటికే నిర్ధారణ అయింది. అక్కదేవతల కొండపై లభించిన 15 శాసనాలతోపాటు అదే మార్గంలో ఊహించని విధంగా ఎన్నో శాసనాలు వెలుగుచూసే అవకాశం ఉందని భావిస్తున్నారు. 4-6వ శతాబ్దాలకు చెందిన రెండు శాసనాలు ఒకే బండపై చెక్కి ఉన్నాయి.

అతి కష్టంతో సేకరణ

పురావస్తుశాఖ, అటవీశాఖ సంయుక్తంగా శుక్రవారం చేపట్టిన శాసనాల సేకరణ అతికష్టంతో జరిగింది. అక్కదేవతల ఆలయానికి రెండు కిలోమీటర్ల దూరంలోని కొండపైకి 600 మీటర్లు ఎక్కాల్సి వచ్చింది. ఇది నిటారుగా ఉండటం, దారిలేకపోవడంతో ఎక్కే సమయంలో చిన్న పొరపాటు జరిగినా ప్రమాదం చోటుచేసుకునేది. అక్కడ సెల్‌ఫోన్ సిగ్నల్స్ కూడా లేవు. ఏదైనా ప్రమాదం జరిగి ఉంటే సమాచారం ఇచ్చేందుకు కూడా వీలు లేదు. ఎంతో సాహసంతో మొత్తంగా 12 కిలోమీటర్ల నడక, కొండ ఎక్కడం ద్వారా ఈ శాసనాలను సేకరించారు.

లోతైన అధ్యయనానికి ఆధారం

శ్రీ లంకమల్లేశ్వర అభయారణ్యంలో 4 నుంచి 16వ శతాబ్దం వరకు మానవ మనుగడ, లిపి పరిణామ క్రమానికి సంబంధించి లోతైన అధ్యయనానికి ఆధారాలు లభ్యమయ్యాయి. రెండు రోజుల పరిశోధనలో 27 లేబుల్ శాసనాలు వెలుగులోకి వచ్చాయి. వీటిని చెక్కిన మార్గం వెంబడి ఇంకా అన్వేషణ కొనసాగిస్తే చాలా శాసనాలు వెలుగులోకి వస్తాయని అంచనా.

అమరావతిపై విస్తృత ప్రచారం కల్పించండి

అంబుల వైష్ణవికి సీఎం సూచన

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబును రాజధాని అమరావతికి బ్రాండ్ అంబాసిడర్‌గా నియమితులైన వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవి కలిశారు. ఆమె నియామకంపై సీఆర్డీయే ఉత్తర్వులిచ్చిన నేపథ్యంలో సీఎంను సచివాలయంలో శుక్రవారం ఆమె కలిశారు. అతిచిన్న వయసులోనే అంబాసిడర్‌గా నియమితులైన వైష్ణవిని సీఎం అభినందించారు. రాష్ట్రాభివృద్ధిలో యువత పాలుపంచుకోవాలని, అలాంటి వారికి వైష్ణవి ఆదర్శంగా నిలుస్తుందని సీఎం అన్నారు. అమరావతి కోసం విరాళాలు సేకరించాలన్నది తన లక్ష్యమని వైష్ణవి సీఎంకు చెప్పారు. రాజధానిలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలను, సంబంధిత అంశాలను ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని సీఎం సూచించారు. కాగా, వైష్ణవి గతేడాది జూన్‌లో రాజధానికి రూ.25 లక్షలు, 2019కి ముందు పలుసార్లు కలిపి మొత్తం రూ.25 లక్షలను విరాళంగా అందించారు.

సీఎం కార్యక్రమానికి 'సాక్షి' రావొద్దట!

- మీడియా పాస్‌లు ఇవ్వని ప్రభుత్వం
- ఊరిలో ఉండొద్దంటూ 'సాక్షి' విలేకరికి ఏకంగా పోలీసుల హెచ్చరికలు

చిత్తూరు అర్బన్: ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు పాల్గొంటున్న ప్రభుత్వ కార్యక్రమానికి 'సాక్షి' మీడియాను రానివొద్దంటూ కూటమి ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో శనివారం జరగనున్న సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరుకాబోతున్నారు. ఈ కార్యక్రమం కోసం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు సమాచార పౌర సంబంధాల శాఖ అన్ని మీడియా సంస్థల ప్రతినిధులకు పాస్‌లు జారీ చేసింది. కానీ 'సాక్షి' మీడియా ప్రతినిధులకు మాత్రం పాస్‌లు ఇవ్వలేదు. దీనిపై ప్రశ్నించగా.. 'మిమ్మల్ని సీఎం ప్రోగ్రాంకు రానివొద్దన్నారు' అంటూ సమాచార శాఖ అధికారులు చెప్పారు. మరోవైపు పోలీసులు ఓ అడుగు ముందుకేసి.. గంగాధరనెల్లూరు మండల 'సాక్షి' విలేకరి ఇంటికి వెళ్లి నోటీసులిచ్చేందుకు ప్రయత్నించారు. సీఎం ప్రోగ్రాం జరిగే రోజు ఊరిలో ఉండొద్దంటూ హెచ్చరికలు జారీ చేశారు.

పురావస్తు శాఖ కమిషనర్‌గా ఆమ్రపాలి

సాక్షి, అమరావతి: పురావస్తు శాఖ కమిషనర్‌గా పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ఆమ్రపాలికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పురావస్తు శాఖ కమిషనర్ వాణి మోహన్ పదవీ విరమణ చేయడంతో ప్రభుత్వం ఆమెను బాధ్యతల నుంచి రిలీవ్ చేసింది.

కోర్కెల చేత ఆకర్షింపబడిన మనస్సు గలవారు అటువంటి సుఖములనే ఆశ్రయించుదురు. వారి మనస్సుకు ఆత్మజ్ఞాన విషయములు పట్టుబడవు.
– హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 1 మార్చి 2025

చట్టసభలకూ పరిమితులు!

నిబద్ధత, సచ్ఛీలత, నిబంధనలపట్ల సంపూర్ణ అవగాహన కలిగినవారి సారథ్యంలో చట్టసభలుంటే అలాంటిచోట ఆరోగ్యవంతమైన చర్చలు జరుగుతాయి. ప్రజాస్వామ్యానికి ఆ సభ తలమానికమవుతుంది. కానీ అధికార పక్షానికి వంతపాడేవారు, వారి ఇష్టారాజ్యానికి పక్కతాళం వేసేవారు అధ్యక్ష స్థానాల్లో కూర్చుంటున్నారు. తాము ఎవరికీ జవాబుదారీ కాదన్నట్టు ప్రవర్తిస్తున్నారు. అలాంటి బాపతు నేతలకు ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చెంపపెట్టు. తనను బిహార్ శాసనమండలి నుంచి బహిష్కరించటాన్ని సవాలుచేస్తూ ఆర్జేడీ సభ్యుడు సునీల్ కుమార్ సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌ను అంగీకరిస్తూ ఆయన్ను తక్షణం సభలోకి అనుమతించాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. సభ్యుల అనుచిత ప్రవర్తనకు తగిన శిక్ష ఉండాలితప్ప మితిమీరకూడదని తేల్చి చెప్పింది. నిరుడు మార్చిలో గవర్నర్ ప్రసంగిస్తున్న సమయంలోనూ, ఆ తర్వాత ఆ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంలోనూ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌పై సునీల్ కుమార్ సింగ్ అవమానకరమైన వ్యాఖ్యలు చేశారన్నది అభియోగం. పాము కుబుసం విడిచినట్టు తరచు రాజకీయ అభిప్రాయాలు మార్చుకోవటం నితీశ్‌కు అలవాటని, ఇప్పటికి తొమ్మిదిసార్లు ముఖ్యమంత్రి అయినా ఎమ్మెల్యేగా ప్రజలనుంచి ఎన్నిక కాలేదని సునీల్‌కుమార్ సింగ్ విమర్శించారు. అధికారమే పరమావధిగా ఒకసారి యూపీఏ, మరోసారి ఎన్డీయే కూటములతో చెలిమి చేయటాన్ని ఎద్దేవా చేస్తూ ఆయన్ను 'పాల్తూరామ్' అని హేళన చేశారు. దీంతో ఈ వ్యాఖ్యలను ఎథిక్స్ కమిటీకి నివేదించారు. సునీల్ తప్పు చేశారని ఎథిక్స్ కమిటీ నిర్ధారించి సభా బహిష్కారానికి సిఫార్సుచేసింది. శాసనమండలి దీన్ని ఆమోదించి ఆయన్ను బహిష్కరిస్తూ తీర్మానించింది.

మన రాజ్యాంగం కార్యనిర్వాహక వ్యవస్థ, శాసన వ్యవస్థ, న్యాయవ్యవస్థల మధ్య అధికారాల విభజన చేసింది. చట్టసభలకు ప్రత్యేక హక్కులుంటాయని, వాటి కార్యకలాపాల్లో లేదా నిర్ణయాల్లో న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోరాదని సభాధ్యక్షులు భావిస్తుంటారు. ముఖ్యంగా ఫిరాయింపులపై వచ్చే ఫిర్యాదుల్ని ఎటూ తేల్చకుండా వదిలేస్తూ తమను ప్రశ్నించరాదంటున్నారు. చిన్న చిన్న కారణాలకు కూడా విపక్ష ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయటం, బహిష్కరణ వేటు వేయటం వంటివి రివాజయ్యాయి. కేవలం పాలకపక్ష ప్రయోజనాలను నెరవేర్చటం కోసమే స్పీకర్లు ఇలా ఇష్టానుసారం ప్రవర్తిస్తున్నారు. నిజమే... రాజ్యాంగంలోని 212(1) అధికరణ ప్రకారం చట్టసభల కార్యకలాపాల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణతో ఆ కార్యకలాపాల చెల్లుబాటును న్యాయస్థానాల్లో సవాలు చేయటానికి వీల్లేదు. నిర్వహణ సంబంధమైన అంశాల్లో న్యాయస్థానాల జోక్యం నుంచి చట్టసభలకు ఇది రక్షణనిస్తుంది. అయితే ఆ కార్యకలాపాల్లో భాగంగా తీసుకునే నిర్ణయాల్లో రాజ్యాంగ విరుద్ధత కనబడినప్పుడు వాటిని సమీక్షించే అధికారం న్యాయస్థానాలకు ఉంటుందన్నది నిపుణుల వాదన. తాజా కేసులో జరిగింది ఇదే. సునీల్ కుమార్ సింగ్ పిటిషన్‌కు అసలు విచారణార్హత లేదని, 212(1) అధికరణ న్యాయవ్యవస్థ జోక్యాన్నుంచి తమకు రక్షణనిస్తున్నదని శాసన మండలి తరఫు న్యాయవాది వాదించారు. సర్వోన్నత న్యాయస్థానం దీన్ని అంగీకరించలేదు. చట్టసభల కార్యకలాపాలు వేరు, అందులో తీసుకునే నిర్ణయాలు వేరు అని స్పష్టం చేసింది. చట్టసభల నిర్ణయాలు వ్యక్తుల ప్రాథమిక హక్కుల్ని ప్రభావితం చేసినప్పుడు వాటిని సమీక్షించే అధికారం న్యాయస్థానాలకు ఉంటుందని తెలిపింది. అంతేకాదు... సునీల్‌కుమార్ సింగ్‌ను బహిష్కరిస్తూ తీసుకున్న ఎథిక్స్ కమిటీ నిర్ణయం పాలనాపరమైన చర్యే తప్ప శాసనవ్యవస్థ కార్యకలాపంగా పరిగణించలేమని తేల్చింది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులతో కూడిన చట్టసభ నియంత పోకడలు పోకూడదు. మెజారిటీ ఉందన్న సాకుతో విపక్ష సభ్యుల గొంతు నొక్కడానికీ, వారిపై కఠిన చర్యలకు ఉపక్రమించటానికీ ప్రయత్నించకూడదు. ఆ పరిస్థితులు తలెత్తితే న్యాయస్థానాలు మౌనంగా ఊరుకోబోవని తాజా తీర్పు తేటతెల్లం చేసింది.

చట్టసభ కార్యకలాపాలు సాఫీగా సాగటానికి అనువైన నిబంధనలు రూపొందించుకొనేందుకు రాజ్యాంగంలోని 208వ అధికరణ అధికారమిస్తోంది. సభ క్రమశిక్షణగా నడవటానికి ఎలాంటి నిబంధనలుండాలో, వాటిని ఉల్లంఘించినప్పుడు ఏయే చర్యలు తీసుకోవాలో ఈ నిబంధనలు నిర్దేశిస్తాయి. అయితే నిబంధనల అమలు పర్యవేక్షణకు ఏర్పడిన కమిటీలు తీసుకునే నిర్ణయాలు పాలనాసంబంధ పరిధిలోకి వస్తాయని గుర్తించటం తప్పనిసరని తాజా తీర్పు చెబుతోంది. ఆ నిర్ణయాలకు మెజారిటీ ఆమోదం ఉందా లేదా అనే అంశంతో దీనికి సంబంధం లేదు. ఒక చర్యకు ప్రతిగా తీసుకునే ఏ నిర్ణయమైనా హేతుబద్ధతకూ, తార్కికతకూ లోబడివుండటం అవసరం. పిచ్చుకపై బ్రహ్మాస్త్రం తరహాలో అధికారం ఉంది కదా అని ఏమైనా చేస్తామంటే ప్రజాస్వామ్యంలో చెల్లదు.

చట్టసభలు ఇష్టానుసారం వ్యవహరించే రోజులు పోయాయి. సభానిర్వహణ సవ్యంగా జరగటం, క్రమశిక్షణ కట్టుతప్పకుండా చూడటం అవసరమే. కానీ అందుకోసం అమలుచేసే చర్యలు అతిగా ఉండకూడదు. సభ్యులు పరిధి మీరారని భావించినప్పుడు అభిశంసించడం, మందలించడం, నిర్దిష్ట కాలానికి సభనుంచి సస్పెండ్ చేయడంవంటి అవకాశాలున్నాయి. కానీ విచక్షణ మరిచి నేరుగా బహిష్కరణ వేటు వేయటం అతిగా వ్యవహరించటమే అవుతుంది. ఎథిక్స్ కమిటీల నిర్ణయాలు పాలనానిర్వహణ కిందికే వస్తాయని, వాటిపై న్యాయసమీక్ష తప్పదని సుప్రీంకోర్టు నిర్ణయించటం హర్షించదగ్గది. నియంతృత్వ పోకడలు పోయే పాలకపక్షాలకు ఈ తీర్పు చెంపపెట్టు.

అస్తిత్వాల పోరులో రాజ్యాంగ స్ఫూర్తి

అభిప్రాయం



డా॥ కత్తి పద్మారావు

భారతదేశంలో త్రిభాషా సూత్రంపై మరొకసారి విస్తృతమైన చర్చ జరుగుతోంది. దక్షిణ భారత రాష్ట్రాలు భాషా అస్తిత్వాల పరంగా తమ ఉనికిని చాటుకోవటానికి ఎప్పటి నుండో పోరాటం చేస్తున్నాయి. ప్రపంచంలోనే దక్షిణ భారత భాషలకు ఒక ప్రత్యేక అస్తిత్వం ఉంది. తెలుగు, తమిళ, కన్నడం, మలయాళ భాషలకు మూలం ద్రావిడ భాషే. అయితే అవి 21 భాషలుగా అభివృద్ధి చెందాయి: బ్రాహుయీ, మాల్తో, కూడుఖ్, గోండి, కొండ, కూయి, మండ, పర్జి, గదబ, కోలామీ, పెంగో, నాయకీ, కువి, తెలుగు, తుళు, కన్నడం, కొడగు, టోడా, కోత, మలయాళం, తమిళం. మధ్య ద్రావిడ భాషల్లో తెలుగు ఉంది. దక్షిణ ద్రావిడ భాషల్లో తమిళం ఉంది. వాఙ్మయ దృష్టితో కాకుండా భాషా చారిత్రక దృష్టితో చూస్తే మధ్య ద్రావిడ భాషల్లో గోండి, కొండ, కూయి; దక్షిణ ద్రావిడ భాషల్లో తుళు, టోడా ప్రాచీనమైనవి. క్రీస్తు పూర్వం మూడు వేల సంవత్సరాల నాడు మూల ద్రావిడ భాష నుంచి ఈ భాషలు ఒకటొకటి స్వతంత్రతను సంతరించుకున్నాయని భాషా చరిత్రకారులు చెబుతుంటారు. ఒకటొకటి స్వతంత్ర భాషగా రూపొందడానికి వెయ్యేండ్లు పట్టింది. ఈ భాషల మూలాలు దక్షిణాది జీవన వ్యవస్థల నుండి ఆవిర్భవించాయి. అంబేడ్కర్ తన 'రాష్ట్రాలు – అల్పసంఖ్యాక వర్గాలు' పుస్తకంలో వీటి అస్తిత్వాన్ని ప్రత్యేకంగా పేర్కొన్నారు.

ఏ మూడు భాషలు?

దేశ పాఠశాలల్లో బాలలకు మూడు భాషలు బోధించాలన్న విధానం అధికారికంగా త్రిభాషా సూత్రంగా ప్రసిద్ధమయింది. 1968లో ఈ సూత్రానికి సర్వజనామోదం లభించింది. ఈ ప్రకారం పాఠశాల బాలలకు, హిందీ భాషా రాష్ట్రాలలో హిందీ, ఇంగ్లిష్, ఆధునిక భారతీయ భాష (ఏదైనా ఒక దక్షిణాది భాష)ను బోధించాలి. హిందీయేతర రాష్ట్రాలలో హిందీ, ఇంగ్లిష్, ప్రాంతీయ భాషను బోధించాలి. దక్షిణ భారతావనిలో హిందీ వ్యతిరేక నిరసనలు వెల్లువెత్తిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ముఖ్యమంత్రుల సమావేశంలో ఈ త్రిభాషా సూత్రం ఆమోదం పొందింది. తొలుత రాధాకృష్ణన్ కమిషన్ (1948) ప్రతిపాదించిన ఈ త్రిభాషా సూత్రాన్ని విద్యావేత్త కొఠారి నేతృత్వంలోని తొలి విద్యా కమిషన్ అంగీకరించింది. దరిమిలా 1960లో, 1980ల్లో కేంద్రం రూపొందించిన ప్రథమ, ద్వితీయ జాతీయ విద్యా విధానాలలో ఈ సూత్రం భాగమైంది. అయితే నేర్చవలసిన త్రిభాషలు ఏవి అనేది ఆయా భాషా రాష్ట్రాల పాలకులు నిర్ణయించుకోవాల్సి వుంది.

అందుకే హిందీని రెండవ భాషగానో, మూడవ భాషగానో అంగీకరించకపోతే 'సర్వ శిక్షా అభియాన్' కింద పంపే నిధులు పంపమని కేంద్ర ఆర్థిక మంత్రి చెప్పడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం. కేంద్ర పాలకులు భాషా అస్తిత్వాలను దెబ్బతీయాలని ప్రయత్నం చేస్తున్నారు. రాజ్యాంగంలో రాష్ట్రాల అస్తిత్వం గురించి ఇలా చెప్పారు: భారత రాష్ట్రాలు కలిసి శాసన, కార్యనిర్వాహక, పరిపాలనా అవసరాల కోసం భారత సంయుక్త రాష్ట్రాలు అనే పేరు మీద ఒక రాజకీయ రూపాన్ని తీసుకోవటానికి ఆదేశించుకుంటున్నాయి.

ఈ స్ఫూర్తితో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తమిళనాడుపై హిందీని బలవంతంగా రుద్దకపోతే డీఎంకే దానిని వ్యతిరేకించదన్నారు. 'డీఎంకే ఇప్పటికీ హిందీని ఎందుకు వ్యతిరేకిస్తుందని అడిగే వారికి, మీలో ఒకరిగా నా వినయపూర్వక సమాధానం ఏమిటంటే... మీరు రుద్దకపోతే మేము వ్యతిరేకించం. తమిళనాడులో హిందీ పదాలను నలుపు రంగులోకి మార్చం. ఆత్మగౌరవం అనేది తమిళుల ప్రత్యేక లక్షణం. ఎవరైనా దానితో ఆడుకోవడానికి మేము అనుమతించం' అన్నారు. రాష్ట్రంలో భాషా వివాదం చెలరేగుతున్న నేపథ్యంలో ఈ మేరకు ఆయన డీఎంకే శ్రేణులకు లేఖ రాశారు.



- పాఠశాలల్లో బాలలకు మూడు భాషలు బోధించాలన్న విధానం అధికారికంగా త్రిభాషా సూత్రంగా ప్రసిద్ధం. 1968లో దీనికి ఆమోదం లభించింది.
- హిందీని బలవంతంగా రుద్దకపోతే దానిని వ్యతిరేకించం అని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ అన్నారు.
- త్రిభాషా సూత్రం ప్రకారం, హిందీ భాషా రాష్ట్రాలలో హిందీ, ఇంగ్లిష్‌తో పాటు ఒక ఆధునిక భారతీయ భాష (ఏదైనా దక్షిణాది భాష)ను బోధించాలి. కానీ ఇది విస్మరణకు గురైంది.

భాషల కోసం పోరాటం

స్టాలిన్ వాదనలో ఒక సత్యం ఉంది. మాతృభాష ప్రతి రాష్ట్రంలోని విద్యార్థికి అత్యవసరం. దక్షిణాదిలో ఉన్న భాషా మూలాలను బట్టి వారికి రెండవ భాషగా దక్షిణాది భాష త్వరగా వస్తుంది. ప్రపంచీకరణలో భాగంగా ఇంగ్లిష్ అన్ని రాష్ట్రాల విద్యార్థులు నేర్చుకోవడం వల్ల ఏ దేశంలోనైనా ఉపాధిని సంపాదించుకోవచ్చు. తమిళనాడులో పెరియార్ రామస్వామి నాయకర్ కాలంలోనే తమిళ భాషా అస్తిత్వం కోసం పోరాడిన చరిత్ర ఉంది. అలాగే తెలుగువారు కూడా తమ భాషా అస్తిత్వాల కోసం ఎన్నో పోరాటాలు చేశారు. నిజానికి ఆంధ్రులు అనేక భాషల వారితో బాధింపబడినా తమ అస్తిత్వ పోరాటాల్ని బలంగా చేశారు. శాతవాహనుల కాలం నుండి సంస్కృత భాషలో, ప్రాకృత భాషలో పాలకులు ఉన్నప్పుడు, తెలంగాణలో ఉర్దూ భాష పాలకులు ఉన్నప్పుడు కూడా తెలుగువారు తమ లిఖిత భాషా సంప్రదాయాన్ని కొనసాగించారు. తమిళనాడును ఎంతో కాలం పాలించిన కరుణానిధి ప్రెస్‌మీట్‌లో కూడా తమిళంలోనే మాట్లాడి దాన్ని అర్థం చేసుకోవాల్సిన బాధ్యత విలేఖరులకు ఉందని చెప్పడం ఒక ఆత్మాభిమాన ప్రకటన!

క్రీ.శ.1901లో శ్రీ కృష్ణదేవరాయల ఆంధ్ర భాషా నిలయం కొమర్రాజు లక్ష్మణరావు పంతులు ప్రోత్సాహంతో స్థాపించబడిన తరువాత తెలుగులో భాషోద్యమంతో పాటు, గ్రంథాలయాల ప్రాధాన్యత పెరిగింది. 1906వ సంవత్సరంలో విజ్ఞాన చంద్రికా మండలి ప్రారంభంతో సాహిత్య ప్రచురణకు కూడా ఉత్సాహం వచ్చింది. తెలుగు భాషాభివృద్ధికి అన్ని ప్రాంతాల మేధావులు కృషి చేశారు. ఏ భాషోద్యమమైనా ఆ భాషా ప్రజల చరిత్రకు, పరిణామాలకు మూలశక్తి అవుతుంది. భాషను విస్మరించిన రాష్ట్రాలు తమ ఉనికిని కోల్పోతాయి. తెలుగు భాష గ్రంథస్థం కాకపోవడానికి వీరికి రాజ భాషగా సంస్కృత, ప్రాకృతాలు 900 యేండ్లు వ్యవహరించడం. అయినా తట్టుకొని నిలబడటమే గొప్ప అంటారు బి.ఎన్.శాస్త్రి. ''ఆంధ్ర దేశమున రాజభాషగా ప్రాకృతము క్రీ.పూ. 300 నుండి క్రీ.శ. 300 వరకు వర్ధిల్లినది. అటు పిమ్మట క్రీ.శ. 300–600 వరకు సంస్కృతము రాజ భాషయైనది.... గాథాసప్తశతి, బృహత్కథ, లీలావతి వంటి ప్రాకృత గ్రంథములందు అనేక తెలుగు పదములున్నవి. ప్రాకృత, సంస్కృత భాషల కన్న భిన్నమైన దేశభాష అనగా తెలుగు వాడుకలోనున్నట్లు శర్వవర్మ–గుణాఢ్యుల సంవాద గాథ తెలుపుచున్నది.''

ఉత్తరాదివారూ నేర్చుకోవాలి!

వాస్తవానికి మోదీ సర్కార్ జాతీయ విద్యా విధానంలో హిందీని ప్రస్తావించకపోవడం ద్వారా త్రిభాషా సూత్రాన్ని అస్పష్టపరిచింది. ఈ ప్రకారం ఒక రాష్ట్ర ప్రభుత్వం తాను ఎంపిక చేసిన ఏ మూడు భాషలనైనా బోధించవచ్చు. అయితే ఆ మూడు భాషలలో రెండు తప్పనిసరిగా దేశీయ భాషలు అయివుండాలి. ఈ దృష్ట్యా తమిళనాడు ప్రభుత్వం కోరుకుంటే, తమిళంతో పాటు మలయాళం, తెలుగు, కన్నడ భాషలలో ఒకదాన్ని, ఆంగ్ల భాషను బోధించవచ్చు.

నిజానికి ఉత్తరాదికి దక్షిణాదివారు, దక్షిణాదికి ఉత్తరాదివారు ప్రయాణం చేస్తున్న కాలం ఇది. దక్షిణాది భాషలు ఉత్తరాదిలో ఎగతాళికి గురవుతున్న సందర్భాలు ఉన్నాయి. ఇంగ్లిష్‌ను ఎటూ ప్రపంచ భాషగా చదువుతున్నారు. ఉత్తరాది వారికి దక్షిణాది చరిత్ర, దక్షిణాది వారికి ఉత్తరాది చరిత్ర తెలియాలి. ఒకరి భాషా ఒకరికి, ఒకరి వస్తువుల పేర్లు మరొకరికి, ఒకరి తినుబండారాల పేర్లు మరొకరికి అర్థం కావాలంటే ఉత్తరాది వారు కూడా దక్షిణాది భాషల్లో ఒక భాషను నేర్చుకోవాలి. దీన్ని కేంద్ర ప్రభుత్వం విస్మరిస్తోంది. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నీ భారతీయ భాషలే, అన్నింటికీ సమ ప్రాధాన్యత ఉండాలని నొక్కి చెప్పారు. ఫెడరల్ సూత్రాలను ఎలా విస్మరిస్తారని ప్రశ్నించారు. ఉత్తరాది సంప్రదాయశీలమైంది, దక్షిణాది పురోగమన శీలమైంది. ప్రతి రాష్ట్రానికి ఇచ్చిన హక్కుల్ని కాపాడటం కేంద్ర ప్రభుత్వ విధి.

వ్యాసకర్త దళితోద్యమ నాయకులు । 98497 41695

సోషల్ మీడియా

న్యాయం ఎక్కడ?



గోధ్రా రైలు దహనం, అనంతర దారుణ గుజరాత్ అల్లర్లు జరిగి 23 ఏళ్లు (ఫిబ్రవరి 27, 2002). ఎవరూ, ఎవరూ కూడా తమ మత గుర్తింపు కారణంగా దాడులకు గురి కాకూడదు. 1984 ఢిల్లీ, 1992–93 ముంబయి, 2002 గుజరాతుల్లో విషాదకరంగా వందలాదిమంది చనిపోయినప్పటికీ న్యాయం, జవాబుదారీతనం లేవు.

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

భిన్న స్థితులు



జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిగితే 'బిమారు' రాష్ట్రాలకు ఎంపీలు పెరుగుతారు. దీనికి కారణం వారి వెనుకబాటుతనం, అసమర్థ నాయకత్వం. అదే మెరుగైన పాలన కారణంగా దక్షిణ భారతానికి ఎంపీలు తగ్గి రాజకీయంగా బలహీనమవుతుంది. కానీ ఇండియాను ఒక దేశంగా చూసినప్పుడు ఇది పరిహాసం, అదే సమయంలో న్యాయం.

– చేతన్ కుమార్ అహింస, నటుడు

కాషాయ బలం



కేరళ, ఇంకా దక్షిణ భారతంలోని ఇతర ప్రాంతాల్లో నిశ్శబ్దంగా కాషాయం వేళ్లూనుకుంటోంది. అది ఎన్నికల ఫలితాలను ఇవ్వకపోవచ్చు, కానీ బీజేపీ ఓటు శాతం పెరిగింది. కొన్ని ప్రాంతాల్లో అగ్రవర్ణ హిందువులు బీజేపీ వెనుక గట్టిగా నిలబడ్డారు.

– జియా ఉస్ సలామ్, జర్నలిస్ట్

అర్థమవుతోందా?



సెన్సెక్స్ 1,300 పాయింట్లు, నిఫ్టీ 400 పాయింట్లు పడిపోయాయి. మన మార్కెట్లు వాస్తవంలోకి మేలుకుంటున్నాయా?

– సుమంత్ రామన్, టీవీ హోస్ట్

ఎవరినీ వదలట్లేదు!




నటుడు విజయ్ బీజేపీ బి టీమ్ అని డీఎంకే మద్దతుదారులు అంటారు. బీజేపీ మద్దతుదారులేమో ఆయన్ని డీఎంకే బి టీమ్ అంటారు. కానీ ఆయనేమో 'అది చాలా తప్పు బ్రో' అంటున్నారు.

– కార్తీక్ బాలచంద్రన్, వైద్యుడు

ఇన్ బాక్స్

ఆదర్శమూర్తి ఈ న్యాయమూర్తి

న్యాయ ద్రోణాచార్యుడు, న్యాయ వ్యవస్థలో నిలువెత్తు దీపస్తంభం జస్టిస్ కొండా మాధవ రెడ్డి. భారత న్యాయ వ్యవస్థలో ఆయన చూపిన మార్గం యువతకు ఆదర్శం. ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్, బొంబాయి హైకోర్ట్‌ల ప్రధాన న్యాయమూర్తిగా ఆయన సేవలు అపూర్వమైనవి. కేవలం న్యాయమూర్తిగానే కాక, విద్య, సంస్కృతి, సమాజ సేవల్లోనూ ఎనలేని కృషి చేశారు.



జస్టిస్ కొండా మాధవ రెడ్డి

1923 అక్టోబర్ 21న నల్లగొండ జిల్లా సర్వాజ్ పేటలో జన్మించిన మాధవ రెడ్డి తొలి నుంచి ప్రజా సేవ పట్ల అంకిత భావం కలిగిన వారు. స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబంలో పుట్టినందువల్లనేమో దేశభక్తి, న్యాయం పట్ల అంకిత భావం ఆయనకు వారసత్వంగా వచ్చాయి. ఆయన తండ్రి కొండా వెంకట రంగారెడ్డి 1957 నుండి 1962 వరకు రెవెన్యూ మంత్రి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా పని చేశారు.

1944లో ఏపీ హైకోర్టులో న్యాయవాదిగా తన ప్రస్థానం ప్రారంభించి, 1983 నాటికి ఏపీ హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి అయ్యారు. తరువాత బొంబాయి హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తిగా, మహారాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఆపై కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్ చైర్మన్‌గా, సుప్రీం కోర్టు సీనియర్ అడ్వకేట్‌గానూ పని చేశారు.

విద్య, క్రీడలు, సాంస్కృతిక రంగాల్లోనూ ఆయన సేవలు అభినందనీయమైనవి. కాకతీయ, ఉస్మానియా, నాగార్జున విశ్వవిద్యాలయాల సిండికేట్ సభ్యునిగా, 'ఆంధ్ర విద్యాలయ సమాజం', 'కూచిపూడి ఆర్ట్ అకాడమీ' వంటి అనేక సంస్థలకు అధిపతిగా పనిచేశారు. 1997 సెప్టెంబర్ 25న ఆయన తుదిశ్వాస విడిచిన తర్వాత 'జస్టిస్ కొండ మాధవరెడ్డి ఫౌండేషన్' ఏర్పాటు చేసి వివిధ అంశాలపై జాతీయ స్థాయిలో ప్రముఖులతో స్మారక ఉపన్యాసాలు ఇప్పిస్తున్నారు వారి కుటుంబ సభ్యులు. హెచ్.ఆర్. ఖన్నా, బీపీ జీవన్ రెడ్డి, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు, డా॥ సి. రంగరాజన్ వంటి ప్రముఖులు ఈ ఉపన్యాసాలు చేసిన వారిలో ఉన్నారు. జస్టిస్ మాధవ రెడ్డి తన చేతల ద్వారా యువ న్యాయవాదులకూ, విద్యావేత్తలు, సాంస్కృతిక కార్యకర్తలకు ఆదర్శప్రాయంగా నిలిచారు. చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర రెడ్డి ఈయన కుమారుడే.

– కాగితాల రాజశేఖర్ (నేడు హైదరాబాద్ ఎ.వి. కాలేజీలో డా॥ నరేంద్ర జాదవ్ 'కొండా మాధవరెడ్డి స్మారక ఉపన్యాసం' చేస్తున్నారు.)

ప్రజల దశాబ్దాల ఆకాంక్ష ఎస్ఎల్‌బీసీ

అభిప్రాయం



జూలకంటి రంగారెడ్డి

ఉమ్మడి నల్లగొండ జిల్లాకు తాగు – సాగునీరు అందించే లక్ష్యంతో నిర్మిస్తున్న 'శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్' (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ పనుల్లో జరిగిన ప్రమాదం అందరికీ బాధ కలిగిస్తోంది. సొరంగంలో చిక్కుకున్న ఎనిమిది మంది కార్మికుల ప్రాణాలపై ఆశలు సన్నగిల్లాయి. నల్లగొండ జిల్లా కరువు పీడిత ప్రాంతాలలో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు, 516 ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు తాగునీరు అందించాల్సి ఉంది. ఈ ప్రాజెక్టు కోసం రోజుకు అరటీఎంసీ చొప్పున 60 రోజుల పాటు 30 టీఎంసీలు శ్రీశైలం రిజర్వాయర్ నుంచి 43.93 కిలోమీటర్ల సొరంగం తవ్వి గ్రావిటీ ద్వారా అందించాల్సి ఉంది. ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం పూర్తి చేసే లోపు, నాగార్జునసాగర్ రిజర్వాయర్ నుంచి పుట్టంగండి, అక్కంపెల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లతో నీళ్లు అందించేందుకు 'ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్ట్' ప్రారంభించారు. కరెంట్ మోటార్లతో నీళ్లు ఎత్తిపోయడం వల్ల ఇది జిల్లా ప్రజల అవసరాలను పూర్తిగా తీర్చలేదు. విద్యుత్ వినియోగం వల్ల అధిక వ్యయం అవుతుంది.

అందువల్ల జిల్లా ప్రజల తాగు–సాగునీటి అవసరాలు తీర్చేందుకు ఎస్ఎల్‌బీసీ పూర్తి చేయడమే సరైన పరిష్కారం. ఈ ప్రాజెక్టును శ్రీశైలం టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ మీదుగా అర కిలోమీటర్ లోతున సొరంగ తవ్వకం జరుగుతోంది. ఇది పూర్తి అయితేనే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల్లో తాగునీరు; సూర్యాపేట భువనగిరి ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు అవకాశం ఉంటుంది. దీని కోసం గత రెండున్నర దశాబ్దాల నుంచి వామపక్ష పార్టీలు, ఇతర ప్రజా సంఘాలు ఉద్యమాలు చేశాయి. వామపక్ష పార్టీలు శాసనసభ లోపల, వెలుపల ఈ ప్రాజెక్టు నిర్మాణం గురించి ఆందోళనలు చేశాయి. ఈ నేపథ్యంలోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు అంకురార్పణ జరిగింది.

ఈ క్రమంలో నాటి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో 2005 ఆగస్టు 11న పరిపాలనా అనుమతులు పొంది, అదే నెల 28న 'జేపీ అసోసియేట్స్' సంస్థతో ఎస్ఎల్‌బీసీ ఒప్పందం చేసుకుంది. మొదటి అంచనా మేరకు రూ. 2,813 కోట్ల ఖర్చు. అయితే 2017 నాటికి 3,152 కోట్ల రూపాయలకు పెంచారు. ఇప్పుడు అది 4,636.75 కోట్ల రూపాయలకు పెరిగింది. ఈ ప్రాజెక్టు శ్రీశైలం రిజర్వాయర్ బ్యాక్ వాటర్స్ నుంచి 'దోమల పెంట' వద్ద ఇన్‌లెట్‌తో మొదలై... నాగర్ కర్నూలు జిల్లా 'మన్నెవారి పల్లె' వద్ద అవుట్‌లెట్‌తో... మొత్తం 49.93 కిలోమీటర్ల ప్రధాన సొరంగం ముగుస్తుంది. ఇప్పటి వరకు 34.71 కిలోమీటర్ల సొరంగం తవ్వకం పూర్తయింది. 7.13 కిలోమీటర్ల పొడవైన రెండవ సొరంగం తవ్వకం బ్లాస్టింగ్ పద్ధతిలో మొత్తం పూర్తి చేశారు. అయితే ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం ఈ ప్రాజెక్టు పనులు 2010 నాటికి పూర్తి కావాల్సి ఉంది. కానీ గత పాలకులు ముఖ్యంగా పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఈ ప్రాజెక్టుకు ఇప్పటివరకు జరిగిన పనుల విలువ రూ. 2,689.47 కోట్లు. రెండు దశాబ్దాల్లో 34.37 కిలోమీటర్ల సొరంగం తవ్వారు. 9.56 కిలోమీటర్ల సొరంగం తవ్వకం పనులు ఆగిపోయాయి.




ఎస్ఎల్‌బీసీ సొరంగంలో సహాయక చర్యలు

నాలుగైదు సంవత్సరాలలో పూర్తి చేయాల్సిన ప్రాజెక్టు 20 ఏళ్లుగా కొనసాగడం వల్ల వ్యయ భారానికీ, తాజా పరిణామాలకూ పాలకుల అలసత్వమే కారణం. ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక దాన్ని పూర్తి చేయడానికి కొంత బడ్జెట్ కేటాయించి తిరిగి పనులకు శ్రీకారం చుట్టారు. సొరంగం లోపల పైకప్పు నుంచి నీరు, మట్టి పడుతున్నదనీ, పనులు చేయడంలో ఇబ్బంది కలుగుతున్నదనీ కార్మికులు సంబంధిత కాంట్రాక్ట్ కంపెనీకి చెప్పినా, ఏమీ కాదని పని చేయాలని ఒత్తిడి చేయడంతో ఈ ప్రమాదం సంభవించింది. భద్రతా ప్రమాణాలు, ప్రభుత్వ అజమాయిషీ సరిగా లేక సాగునీటి ప్రాజెక్టుల్లో, పరిశ్రమల్లో తరచుగా ఇలాంటి ప్రమాదాలతో నష్టం జరుగుతోంది. ఆయా సంఘటనలకు ప్రభుత్వాలే బాధ్యత వహించాల్సి ఉంది.

టన్నెల్‌లో చిక్కుకుపోయిన 8 మంది కార్మికులను రక్షించడానికి, టన్నెల్‌లో బురద నీరు, వ్యర్థాలను తొలగించడానికి వివిధ విభాగాల ప్రభుత్వ సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొంటున్నప్పటికీ ఎలాంటి పురోగతీ కనిపించలేదు. ఈ ప్రమాదంపై 'నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథార్టీ (ఎన్డీఎస్ఏ) వారి నుంచి స్పందన రాలేదు. ఈ ప్రమాదం జరిగిన దోమల పెంట ప్రాంతాన్ని సీపీఎం బృందం ఫిబ్రవరి 23న సందర్శించింది. అక్కడ సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్న రాష్ట్ర మంత్రులు నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావులతో సహాయక చర్యల విషయం చర్చించింది. భద్రతాపరంగా తగిన సాంకేతిక చర్యలు తీసుకొని ఇప్పటికైనా పనుల్లో అలసత్వం లేకుండా త్వరిత గతిని పూర్తి చేయాలి. ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చాలి.

వ్యాసకర్త రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ

దైవ తపన



దేశంలో సర్వమత సమన్వయానికి పాటుపడిన గొప్ప యోగి శ్రీరామకృష్ణ పరమహంస. బెంగాల్‌లో కామార్పుకూర్ గ్రామంలో సంప్రదాయ కుటుంబంలో జన్మించిన ఆయన అసలు పేరు గదాధర ఛటర్జీ. చిన్నప్పటినుండి కాళికాదేవి భక్తుడైన ఆయన కలకత్తాలోని ఆమె ఆలయంలోనే పూజారిగా చేరారు. నిజమైన దైవ భక్తునికి ఎటువంటి కుల భేదాలూ లేవని తన ఆచరణ ద్వారా ఆయన నిరూపించారు. భగవంతుడి భక్తులకు కుల భేదాలు ఉండవు. భగవంతుని ప్రేమ పొందినప్పుడు ఎక్కువ కులం, తక్కువ కులం అన్న భేద భావం తొలగిపోయి, అందరినీ సమానమైన గౌరవంతో చూడగలుగుతాం అని బోధించేవారు.




'దైవం పరమ సత్యం. దేశకాలాలకు అతీతమైనది. సమస్త ప్రపంచంలో చరాచర జీవ రాసులు అన్నింటిలోనూ దైవం నెలకొని ఉంది. నీటిలో మునిగిపోయే మనిషి శ్వాస తీసుకోవడం కోసం ఎలా గిలగిలా కొటుకుంటాడో... భగవంతుని కోసం హృదయంలో అటువంటి పరితాపాన్ని పొందినప్పుడే భగవంతుడు మనకు దర్శనమిస్తాడు' అన్నారు పరమహంస. ఈ పరితాపంతోనే ఆయన దేవీ ఆరాధన చేశారు. ఆయన పలవరింతలను చూసి పిచ్చెక్కిందని కొందరు భావించారు. కుటుంబసభ్యులు సైతం ఆ పిచ్చిని కుదర్చడానికని శారదాదేవితో వివాహం చేశారు. ఆమెలోనూ రామకృష్ణుడు కాళీమాతనే చూశారు. 'స్త్రీలందూ ఆ దివ్య జగన్మాత అంశలే. కాబట్టి వారినందరినీ మాతృమూర్తులుగా చూడాలి' అని ప్రపంచాన్ని కోరారు. ఆయన బోధనలు విని ఎందరో జీవితాలను మార్చుకున్నారు. నరేంద్రనాథ్ 'వివేకానందు'నిగా, రాఖాల్... బ్రహ్మానందస్వామిగా మారి భారతీయ సంస్కృతికీ, మానవతకూ ఎనలేని సేవలు ఒనర్చారు. ఉపనిషత్తులలో పేర్కొనబడిన 'ఏకం సత్ విప్రా బహుదా వదంతి' (ఒకే సత్యాన్ని మహర్షులు అనేక విధాలుగా అభివర్ణించారు) అనే పరమ సత్యాన్ని గ్రహించి పాటించారు. 'మతాలెన్నో మార్గాలన్ని' అనే దివ్యసూత్రాన్ని ప్రచారం చేసి సర్వమత సమన్వయానికి పాటుపడి ప్రాతఃస్మరణీయులయ్యారు.

– వేదుల జనార్దనరావు
(నేడు రామకృష్ణ పరమహంస జయంతి)

గ్రహం అనుగ్రహం: శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** శు.విదియ రా.3.16 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** పూర్వాభాద్ర ప.1.49 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర, **వర్జ్యం:** రా.10.50 నుండి 12.18 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.28 నుండి 7.57 వరకు, **అమృతఘడియలు:** ఉ.6.24 నుండి 7.56 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 6.24, **సూర్యాస్తమయం:** 6.01.





మహిళలను మోసం చేసిన ప్రభుత్వం



కూటమి ప్రభుత్వం సామాన్యులు, రైతులు, మహిళలు, నిరుద్యోగులను నిట్టనిలువునా మోసం చేసింది. ఇది పేదల వ్యతిరేక బడ్జెట్. మహిళలకు సూపర్ సిక్స్‌లో పెద్ద పీట వేస్తున్నామని హామీలిచ్చారు. బడ్జెట్‌లో వాటికి కేటాయింపులు కనిపించడంలేదు. మేనిఫేస్టోలో పెట్టిన ఏ అంశాన్నీ అమలు చేసే పరిస్థితి లేదు. మహాశక్తి పథకంపై గొప్పగా చెప్పుకున్నారు. గత బడ్జెట్‌లో మహాశక్తి పథకానికి నిధులు కేటాయించేశామంటూ హోం మంత్రి ఆర్భాటంగా సభలో మాట్లాడారు. గత బడ్జెట్‌లో, నేటి బడ్జెట్‌లోనూ ఈ పథకానికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు.

–వరుదు కళ్యాణి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ

అమ్మ ఒడి అద్భుతంగా అందించిన వైఎస్ జగన్

అమ్మ ఒడి పథకాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అద్భుతంగా అమలు చేసి చూపారు. 2019, 2020లో బడ్జెట్‌లోనే అమ్మ ఒడి కోసం రూ.19,618 కోట్లు కేటాయించిన వైఎస్ జగన్ ఆదర్శంగా నిలిచారు. ఎన్నికల ముందు ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుకుంటే అంత మందికి రూ.15 వేల చొప్పున తల్లికి వందనం అందిస్తామన్న చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక పంగనామం పెట్టారు. ఇప్పుడు తల్లికి వందనం కోసం రూ.20 **వేల** కోట్లు అవసరమైతే కూటమి ప్రభుత్వం రూ.9,407కోట్లు కేటాయించి దగా చేస్తోంది.



– ఏపీ గిరిజన సహకార సంస్థ మాజీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి

ఉపాధ్యాయులను నిరాశపరిచింది

ఎన్నికల వేళ 12వ పీఆర్సీ ఇస్తామని, సకాలంలో డీఏలు చెల్లిస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక విస్మరించారు. కనీసం పీఆర్సీ కమిషనర్‌ను కూడా నియమించలేదు. మూడు డీఏల్లో ఒక్కటి కూడా ఇవ్వలేదు. వాటి గురించి ఈ బడ్జెట్‌లో ప్రస్తావనే లేకపోవడం ఉపాధ్యాయులను నిరాశపరిచింది.

– ఎస్ఎం షరీఫ్, రాష్ట్ర, జాతీయ ఉపాధ్యాయ పరిషత్ ప్రధాన కార్యదర్శి

పీఆర్సీ, ఐఆర్ ఊసే లేని బడ్జెట్..

తాజా బడ్జెట్‌లో 12వ పీఆర్సీ, మధ్యంతర భృతి ఊసే లేకపోవడం శోచనీయం. ఉద్యోగులకు రావాల్సిన దాదాపు రూ.25 వేల కోట్ల ఆర్థిక బకాయిల చెల్లింపుపైనా ప్రకటన చేయలేదు. విద్యారంగానికి పెద్దగా కేటాయింపులు లేవు. గత ప్రభుత్వం ప్రారంభించిన నాడు–నేడు పెండింగ్ పనులకు నిధులు కేటాయించకపోవడం దారుణం.

– ఎస్.బాలాజీ, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

30% నిధులు కేటాయించాలి

బడ్జెట్‌లో 30 శాతం మేర నిధులు కేటాయిస్తే విద్యారంగానికి మేలు జరుగుతుంది. అభివృద్ధి సాధ్యమవుతుంది. కానీ రాష్ట్ర బడ్జెట్‌లో పాఠశాల, ఉన్నత విద్యకు కలిపి కేవలం 10.7 శాతం మాత్రమే కేటాయింపులు చేయడం నిరాశపరిచింది. పాఠశాల విద్యను సమాజాభివృద్ధికి తలమానికంగా భావించి మరింత శాతం బడ్జెట్ పెంచి ఉంటే బాగుండేది. ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలు చెల్లింపునకు బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవడం అన్యాయం.

– సీవీ ప్రసాద్, ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు

ఉద్యోగులను మోసం చేసిన కూటమి ప్రభుత్వం



2019లో వైఎస్ జగన్ ఉద్యోగులకు 29 శాతం ఐఆర్ ప్రకటించారు. 23 శాతం పీఆర్సీ ఇచ్చారు. కూటమి నేతలు మంచి ఐఆర్ ఇస్తామని, పీఆర్సీ అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ బడ్జెట్‌లో ఐఆర్, పీఆర్సీ కోసం అందరూ ఎదురుచూశారు. ఎక్కడా ప్రస్తావనే లేదు. నిరుద్యోగులకు మెగా డీఎస్సీ అని ప్రకటించి, ఇప్పటివరకు నోటిఫికేషన్ ఇవ్వలేదు. కొత్త ఉద్యోగాల గురించి స్పష్టత లేదు. నిరుద్యోగులకు ఇస్తామన్న భృతికి కేటాయింపులు లేవు. విద్యార్థులకు ఆరు క్వార్టర్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో పెట్టారు. బకాయిలు ఉన్నాయంటూ విద్యా సంస్థలు సర్టిఫికేట్లు ఇవ్వడం లేదు. రాష్ట్రం అప్పుల పాలయ్యిందని గత ప్రభుత్వంపై నిందలు వేశారు. ఈరోజు బడ్జెట్‌లో వైఎస్ జగన్ ప్రభుత్వం 2023–24 లో కేవలం రూ.79 వేల కోట్లు అప్పులు తెచ్చారని రాశారు. అన్ని పథకాలు అమలు చేసిన తరువాత కూడా చేసిన అప్పులు ఇవి. కానీ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు ఒక్కటీ అమలు చేయకుండానే ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.1.04 లక్షల కోట్లు అప్పులు చేస్తామని, గత ఏడాది రూ.98,576 కోట్లు అప్పులు చేశామని బడ్జెట్‌లో ప్రకటించారు. ఈ డబ్బంతా ఎటు పోయింది?

3వ తేదీన ఆధారాలు బయటపెడతాం

రాష్ట్రంలో వీసీల రాజీనామాలపై మంత్రి నారా లోకేశ్‌కు ఆధారాలు ఇస్తామని చెప్పాం. 17 మంది వీసీలను బెదిరించి రాజీనామాలు చేయించారు. మూడో తేదీన అన్ని ఆధారాలను సమర్పించబోతున్నాం. వీసీలు ఇచ్చిన రాజీనామా లేఖల్లో ఏపీ ప్రభుత్వం నుంచి సూచనలు, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆదేశాల మేరకు రాజీనామా చేస్తున్నట్లు రాశారు. దీనినిబట్టి బలవంతంగా చేయించారని అర్థమవుతోంది. టీడీపీ గూండాలు వీసీల వద్దకు వెళ్లి బూతులతో బెదిరించి రాజీనామాలు చేయించారు. ఈ ఘటనలపై మీడియాలో వచ్చిన కథనాలు, వీడియోలను అందజేస్తాం. రెండు రోజుల్లో రాజీనామా చేయాలంటూ ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశించారు. వీసీలపై దాడులకు తెగబడిన వారికి నామినేటెడ్ పదవులు కూడా ఇచ్చారు. దీనిపై జ్యుడీషియల్ ఎంక్వయిరీ వేయాలి.

– పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ

వందనమా.. వంచనా!

ప్రతి విద్యార్థి తల్లికి ఇస్తామని కొత్త పల్లవి అందుకున్న సర్కారు

ఏటా రూ.**13,113** కోట్లు అవసరం

రూ.**9,407** కోట్లే కేటాయింపు

బడ్జెట్‌లో చెప్పిన నిధులు మొత్తం ఖర్చు చేసినా **24.70** లక్షల మందికి కోత



‘ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15 వేలు ఇస్తాం. నీకు పదిహేను వేలు... నీకు పదిహేను వేలు.. నీకు కూడా పదిహేను వేలు ఇస్తాం.’ అని టీడీపీ నేతలు ఎన్నికల ప్రచారంలో ఇంటింటికీ వెళ్లి చెప్పారు. ఈ లెక్కన రాష్ట్రంలో ఉన్న 87.42 లక్షల మంది పిల్లలకు రూ.15వేలు ఇచ్చేందుకు ఒక ఏడాదికి రూ.13,113 కోట్లు కావాలి.

‘తల్లికి వందనం కింద ఒకటి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న పిల్లలు అందరికీ రూ.15వేలు చొప్పున ఇస్తాం.’ అని బాబు గ్యారెంటీ పేరిట మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు. ఈ లెక్కన చూసినా యూడైస్‌లో నమోదైన విద్యార్థులు 87.42 లక్షల మందికి రూ.15వేలు చొప్పున ఇవ్వాలంటే రూ.13,113 కోట్లు కావాలి.

‘తల్లికి వందనం పథకాన్ని 2025–26 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభిస్తున్నాం. చదువుకునే ప్రతి విద్యార్థి తల్లికి ఈ పథకాన్ని అందించడానికి రూ.9,407 కోట్లు కేటాయిస్తున్నాం.’ అని 2025–26 బడ్జెట్ ప్రసంగంలో ఆర్థికమంత్రి చెప్పారు. అంటే.. ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15వేలు ఇస్తామన్న హామీ నుంచి ‘ప్రతి విద్యార్థి తల్లికి’ ఈ పథకం వర్తిస్తుంది అనే వరకు తీసుకొచ్చారు. గత పరిణామాలు, ప్రస్తుతం ఆర్థిక మంత్రి మాటలు చూస్తే ‘తల్లికి వందనం’ అమలుపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సాక్షి, అమరావతి: ‘తల్లికి వందనం’ పథకంపై కూటమి ప్రభుత్వం మరోసారి అంకెల గారడీ చేసింది. ఈ పథకం కింద ఎంతమందికి సాయం అందిస్తారనేది చెప్పకుండా బడ్జెట్‌లో రూ.9,407 కోట్లు కేటాయిస్తున్నట్టు ప్రకటించి కనికట్టు చేసేందుకు ప్రయత్నించింది. కొత్తగా ‘ప్రతి విద్యార్థి తల్లికి’ సాయం అంటూ చంద్రబాబు మార్క్ మోసానికి తెరతీసింది. ఎన్నికల సమయంలో ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంతమందికీ రూ.15 వేలు చొప్పున ఇస్తామని చెప్పారు. ‘సూపర్ సిక్స్’ హామీలకు వచ్చేసరికి ప్రభుత్వ, ప్రయివేటు విద్యా సంస్థల్లో ఒకటి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులందరికీ రూ.15వేలు ఇస్తామని పేర్కొన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి బడ్జెట్ 2024–25లో తల్లికి వందనం పథకానికి రూ.5,387 కోట్లు కేటాయించాలని ప్రతిపాదించారు. కానీ, పైసా ఇవ్వలేదు. ఒక్క విద్యార్థికి సాయం అందించలేదు. శుక్రవారం ప్రవేశపెట్టిన 2025–26 బడ్జెట్‌లో ఈ పథకానికి రూ.9,407 కోట్లు కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. ‘ప్రతి విద్యార్థి తల్లికి’ ఈ పథకం వర్తిస్తుందని కొత్త ప్రకటన చేశారు. కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రం అందించిన యూడైస్ ప్లస్ నివేదిక ప్రకారం రాష్ట్రంలో 87.42 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. ప్రతి విద్యార్థికి రూ.15 వేలు చొప్పున ఇవ్వాలంటే రూ.13,113 కోట్లు అవసరం. కేటాయించింది రూ.9,407 కోట్లే. అంటే మొత్తం విద్యార్థుల్లో 24.70 లక్షల మందికి కోత పెట్టక తప్పదు. అందుకే ‘ప్రతి విద్యార్థి తల్లికి’ ఈ పథకం వర్తిస్తుందని కొత్త పల్లవి అందుకున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

విద్యాశాఖకు తగ్గిన కేటాయింపులు

రూ.3.22 లక్షల కోట్ల బడ్జెట్‌లో పాఠశాల విద్యకు రూ.31,805 కోట్లు (9.86 శాతం) కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. అదే 2024–25 రాష్ట్ర వార్షిక బడ్జెట్ రూ.2.94 లక్షల కోట్లతో ప్రతిపాదనలు చేయగా, ఇందులో పాఠశాల విద్యకు రూ.29,909.31 (10.15శాతం) కోట్లు కేటాయించారు. అయితే, చేసిన ఖర్చు మాత్రం రూ.28,560.64 కోట్లే. ఈ మొత్తం వేతనాలు, అలవెన్సులకే సరిపోయింది. ప్రస్తుత బడ్జెట్‌లో రూ.31,805 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించినా, ఆ మొత్తం ఉపాధ్యాయులు, ఉద్యోగుల వేతనాలు, అలవెన్సులకే సరిపోతాయి. అలాగే, 2024–25 బడ్జెట్‌లో ప్రకటించిన 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రకటనకే పరిమితమైంది. తాజా బడ్జెట్ ప్రసంగంలోనూ ఈ అంశాన్ని కూటమి సర్కారు రెండోసారి ఎంతో గొప్పగా చెప్పుకోవడం గమనార్హం.

‘నాడు-నేడు’ ప్రశ్నార్థకం

గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ‘మన బడి నాడు–నేడు’ పథకం రెండో విడతలో రూ.8వేల కోట్ల బడ్జెట్‌తో 23 వేల ప్రభుత్వ స్కూళ్ల, జూనియర్ కాలేజీల్లో సమగ్ర మార్పులకు శ్రీకారం చుట్టారు. గత ప్రభుత్వ హయాంలోనే రూ.4 వేల కోట్ల విలువైన పనులు పూర్తిచేశారు. మిగిలిన పనులు పూర్తికావాలంటే మరో రూ.4 వేల కోట్లు అవసరం. కూటమి ప్రభుత్వం ఈ పథకానికి ‘మన బడి–మన భవిష్యత్తు’గా పేరు మార్చి 2024–25 బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించినా పైసా ఖర్చు చేయలేదు. అలాగే, 2025–26 బడ్జెట్‌లోనూ రూ.1,000 కోట్లు కేటాయింపునకు ప్రతిపాదించారు. దీంతో మన బడి–మన భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.

‘తల్లికి వందనం’పై నాలుక మడతపెట్టారు... ‘మహిళలకు ఉచిత బస్’కు రెడ్‌సిగ్నల్ వేశారు... ‘మహాలక్ష్మి’ ఆశలపై నీళ్లు చల్లారు... గ్యాస్ సిలిండర్ల రాయితీకి కోత పెట్టారు... ఇలా మహిళలను అన్ని విషయాల్లోనూ కూటమి సర్కారు నిలువునా మోసం చేసింది. ఇది మంచి ప్రభుత్వం అంటూనే దారుణంగా వంచించింది. మందుబాబులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న చంద్రబాబు.. వీధికో బెల్ట్ షాపు వచ్చేలా చేశారు. కానీ ఆడబిడ్డలకు ఇచ్చిన హామీల అమలుకు మాత్రం మనసురావడం లేదు.

‘ఆడబిడ్డ’ ఆశలపై నీళ్లు

బడ్జెట్‌లో ఆడబిడ్డ నిధి ప్రస్తావనే లేదు

అంటే మరో ఏడాది పాటు పథకం లేనట్టే..

ఎన్నికలకు ముందు చంద్రబాబు, కూటమి నేతలు ఆర్భాటంగా ప్రచారం

18 నుంచి 59 ఏళ్ల మహిళలకు నెలకు రూ. **1500** చొప్పున ఇస్తామంటూ కరపత్రాలు

2024 ఏప్రిల్ 30న చంద్రబాబు – పవన్‌కళ్యాణ్‌లు కలిసి ఉమ్మడిగా ప్రకటించిన మేనిఫెస్టోలో మాత్రం ‘ప్రతి మహిళకు నెలకు రూ.1,500 (18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల వరకు) అని పేర్కొన్నారు. ఎన్నికలకు ఏడాది.. ఏడాదిన్నర ముందు మేనిఫెస్టోలో బ్రాకెట్‌గా పేర్కొన్న ‘19 నుంచి 59 ఏళ్ల వరకు’ అన్నది లేకుండా ‘ఆడబిడ్డ నిధి’ నుంచి 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500’ అంటూ ప్రత్యేక కరపత్రాలను ఇంటింటికీ పంచారు.

సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వ పెద్దలు ఎన్నికలకు ముందు చెప్పినట్టు ప్రతి నెలా రూ.1500 చొప్పున ఇచ్చే ‘ఆడబిడ్డ నిధి(మహాలక్ష్మి) పథకం’ ఎప్పుడు ప్రారంభమవుతుందా.. అని రాష్ట్రంలోని ప్రతి మహిళా కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. అయితే ప్రభుత్వం నుంచి ఆ ఊసే లేదు. ఇప్పటికే తొమ్మిది నెలలు పూర్తయ్యాయి. ఇంకో ఏడాది పాటు కూడా ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేయదని శుక్రవారం అసెంబ్లీలో ప్రభుత్వం ప్రతిపాదించిన 2025–26 వార్షిక బడ్జెట్ గణాంకాలు చెబుతున్నాయి. బడ్జెట్ ప్రతిపాదనల్లో ఈ పథకం అమలు ఊసేలేదు.

బాబు సూపర్ 6
5
ప్రతి మహిళకి నెలకు రూ.1,500

ఏటా మహిళలకు ఇవ్వాల్సింది రూ.**28,800** కోట్లు

బడ్జెట్‌లో కేటాయించింది **0**



ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల నాటికి రాష్ట్రంలో 2,10,58,615 మంది మహిళా ఓటర్లున్నారు. 18 ఏళ్ల దాటిన ప్రతి మహిళా ఓటరుగా నమోదయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో టీడీపీ నేతలు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం పెన్షనర్లను మినహాయిస్తే 1.60 కోట్ల మంది మహిళలకు ప్రభుత్వం ప్రతి నెలా రూ.1500 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. బడ్జెట్ ప్రతిపాదించకుండా ఏడాదిలో ఏదో ఒక సమయంలో అదనపు నిధుల ద్వారా పథకాన్ని అమలు చేయాలన్నా.. అది కష్టసాధ్యమని అధికారులు చెబుతున్నారు. పథకం అమలుకు ఏడాదికి సుమారు రూ.28,800 కోట్లు అవసరమవుతాయని వారు చెబుతున్నారు.


ఉచిత బస్‌కు రెడ్ సిగ్నల్

బడ్జెట్‌లో మహిళలకు ‘ఉచిత బస్’ ఊసే లేదు

మా ఆడబిడ్డలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం

నేనే మా ఆడబిడ్డలను.. వంట ఇంటికి పరిమితం అయితే డ్వాక్రా సంఘాల్లో సభ్యులుగా చేసి ఆఫీసులకు పంపించా. అవన్నీ గుర్తుపెట్టుకుని మళ్లీ ఆలోచిస్తున్నా. మా ఆడబిడ్డలు ఎక్కడికి ప్రయాణం చేయాలన్నా ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేయవచ్చు. టీవీల్లో చూసే మా ఆడబిడ్డలూ.. మీరు కూడా చప్పట్లు కొట్టండి. అభినందించండి. ఆశీర్వదించండి. ఇదీ తెలుగుదేశం పార్టీ ఆడబిడ్డలకు ఇచ్చే వరం.

–2023 మే 28న మహానాడులో చంద్రబాబు



సాక్షి, అమరావతి: తాను బురిడీ బాబునని సీఎం చంద్రబాబు మరోసారి నిరూపించుకున్నారు. ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజల్ని బురిడీ కొట్టించడంలో తన ట్రేడ్ మార్క్ మోసాన్ని 20025–26 వార్షిక బడ్జెట్ సాక్షిగా మళ్లీ ప్రదర్శించారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకానికి రెడ్ సిగ్నల్ చూపించారు. ఈ పథకం గురించి బడ్జెట్‌లో కనీస ప్రస్తావన లేకపోవడం గమనార్హం. ప్రజా రవాణా విభాగం(ఆర్టీసీ)కి అరకొర కేటాయింపులతో సరిపెట్టి... ఈ ఏడాది కూడా మహిళలకు ఉచిత బస్ పథకాన్ని అమలు చేసేది లేదని తేల్చేశారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత ప్రయాణం పథకాన్ని అమలు చేస్తామని చంద్రబాబు ఎన్నికల ముందు డబ్బా కొట్టారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ విషయాన్ని విస్మరించారు. కర్ణాటక, తెలంగాణలలో ఉచిత బస్ పథకం అమలు తీరుపై అధ్యయనం అంటూ ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేశారు. గత ఏడాది ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్ పథకాన్ని అమలు చేస్తామన్నారు. అనంతరం దసరాకు వాయిదా వేశారు. ఆ తర్వాత 2025 జనవరి 1 నుంచి అన్నారు... కాదు కాదు... ఈ ఏడాది ఉగాది నుంచి మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం ఖాయమన్నారు. తీరా బడ్జెట్‌లో అసలు ఆ పథకం ప్రస్తావనే లేదు. 2025–26 వార్షిక బడ్జెట్‌లో ఆర్టీసీకి కేవలం రూ.4,309.85 కోట్లు కేటాయించారు. ఆర్టీసీ ఉద్యోగుల జీతభత్యాలకే ఏడాదికి రూ.3,600కోట్లు వెచ్చించాలి. మిగిలిన రూ.700 కోట్లు ఆర్టీసీ సాధారణ నిర్వహణ వ్యయానికే సరిపోవు. ఇక మహిళలకు ఉచిత బస్ ప్రయాణం పథకం అమలు లేనట్టే. చంద్రబాబు హామీ ఇచ్చినట్టుగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకాన్ని అమలు చేయాలంటే ఏడాదికి రూ.3,182 కోట్లు ప్రభుత్వం ప్రత్యేకంగా కేటాయించాలని ఆర్టీసీ ఉన్నతాధికారులు నివేదించారు. ఈ పథకాన్ని అమలు చేయాలంటే కొత్తగా 2,045 బస్సులు కొనుగోలు చేయడంతోపాటు 11,479మంది అదనపు ఉద్యోగులను నియమించాలని స్పష్టంచేశారు. చంద్రబాబు ప్రభుత్వం బడ్జెట్‌లో ఈ పథకం కోసం రూపాయి కేటాయించలేదు. ఇక కొత్త బస్సుల కొనుగోలు గురించి పట్టించుకోలేదు.

తీవ్రంగా నష్టపోతున్న మహిళలు

- ఉచిత బస్ ప్రయాణం పథకాన్ని ప్రభుత్వం అమలు చేయకపోవడం వల్ల మహిళలు తీవ్రంగా నష్టపోతున్నారు.
- రాష్ట్రంలో రోజుకు 40 లక్షల మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. వారిలో మహిళలు 50 శాతం... అంటే 20 లక్షల మంది ఉంటారని అంచనా.మహిళల టికెట్ల ద్వారా నెలకు రూ.265కోట్లు రాబడి వస్తోంది.
- ఉచిత బస్ పథకాన్ని అమలు చేయకపోవడంతో రాష్ట్రంలో మహిళా ప్రయాణికులు నెలకు రూ.265కోట్లు చొప్పున నష్టపోతున్నారు. ఈ విధంగా ఇప్పటివరకు టీడీపీ కూటమి వల్ల గత 9 నెలల్లో మహిళలు రూ.2,385 కోట్లు నష్టపోయారు.
- 2025–26 ఆర్థిక సంవత్సరంలో కూడా ఈ పథకాన్ని అమలు చేసే ఉద్దేశం లేదని బడ్జెట్ కేటాయింపుల ద్వారా ప్రభుత్వం స్పష్టం చేసింది. రాష్ట్ర మహిళలు వచ్చే 2025–26 ఆర్థిక సంవత్సరంలో మరో రూ.3,182 కోట్లు నష్టపోవడం ఖాయమని తేటతెల్లమైంది. చంద్రబాబు మార్కు మోసం అంటే ఇదీ.

58 లక్షల మందికి గ్యాస్ కోత!

అర్హులందరికీ ఉచిత సిలిండర్లు ఉత్తిమాటే

బడ్జెట్‌లో కేవలం 90.1 లక్షల మందికి మాత్రమే నిధుల కేటాయింపు

వాస్తవానికి రాష్ట్రంలో 1,48,43,671 మంది రేషన్ కార్డుదారులు

సుమారు 58 లక్షల మంది లబ్ధిదారులకు మొండిచెయ్యి

సాక్షి, అమరావతి: పేదింటి మహిళలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేస్తామన్న టీడీపీ కూటమి పార్టీల ఎన్నికల హామీ క్రమంగా మసకబారుతోంది. ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలుచేసే విషయంలో చంద్రబాబు ప్రభుత్వం బడ్జెట్ సాక్షిగా చేతులెత్తేసింది. ఫలితంగా.. దశాబ్దాల తరబడి రేషన్ కార్డు, గ్యాస్ కనెక్షన్ ఉండి కూడా అర్హులైన కుటుంబాలకు పథకం వర్తింపు మిథ్యగానే మిగిలిపోతోంది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి శుక్రవారం శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఈ పథకానికి నామమాత్రపు నిధులను కేటాయించడమే ఇందుకు కారణం. కేవలం 90.1 లక్షల కుటుంబాలకు మాత్రమే ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించేందుకు దీపం 2.0 పథకానికి రూ.2,601 కోట్లు మాత్రమే కేటాయించింది.

లబ్ధిదారుల సంఖ్యలో భారీ కోత..

తెల్లరేషన్ కార్డున్న వారికి మాత్రమే పథకం వర్తిస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. ఈ లెక్కన ఏపీలోని 1,48,43,671 కార్డుదారులకు గ్యాస్ రాయితీ అందాల్సి ఉంది. ఇందుకోసం రూ.4వేల కోట్లు కావాలి. కానీ, బడ్జెట్‌లో మాత్రం 90.1 లక్షల మందికి మాత్రమే రాయితీ ఇస్తామని చెప్పి లబ్ధిదారుల సంఖ్యలో భారీ కోత పెట్టింది. ఇలా దాదాపు 58 లక్షల మందికి పైగా అర్హులను నిలువునా బాబు సర్కారు మోసంచేసింది. 2024లో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి ఏడాది ఒక్క సిలిండర్ మాత్రమే ఇచ్చేందుకు వీలుగా గత బడ్జెట్‌లో రూ.895 కోట్లు కేటాయించింది. ఈ లెక్కన కోటి మంది లబ్ధిదారులకు గ్యాస్ రాయితీ దక్కాలి. కానీ, 93 లక్షల మందికి మాత్రమే రాయితీ వర్తించినట్లు.. వీరికి రూ.686 కోట్ల నిధులు విడుదల చేసినట్లు సాక్షాత్తూ సీఎం చంద్రబాబే అసెంబ్లీలో ప్రకటించారు. ప్రస్తుత గ్యాస్ ధరల ప్రకారం ఒక్కో సిలిండర్‌కు రూ.850 చొప్పున రాయితీ విడుదల చేస్తే సుమారు రూ.790 కోట్లు ఖర్చవుతుంది. కానీ, చంద్రబాబు చెప్పినదానిని బట్టి చూస్తే రూ.100 కోట్లకు పైగా చెల్లింపులు నిలిచిపోయినట్లు తెలుస్తోంది. పైగా.. వాస్తవ కేటాయింపులు రూ.895 కోట్లు అయితే చెల్లించింది మాత్రం రూ.686 కోట్లే కావడంతో ఉచిత సిలిండర్లకు భారీ కోత విధించినట్లు స్పష్టమవుతోంది.

బాబు సూపర్ 6

ప్రతి ఇంటికి ఉచితంగా ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు

ఏటా ఇవ్వాల్సింది రూ.**4,000** కోట్లు

బడ్జెట్‌లో కేటాయించింది రూ.**2,601** కోట్లు

తేదీ: మే 28, 2023
వేదిక: రాజమహేంద్రవరంలో టీడీపీ మహానాడు సభ


‘‘ఏవమ్మా, దీపం ఇచ్చాను నేను. నా ఆడబిడ్డల కష్టాలను చూసి ఆలోచించా.. సంవత్సరానికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇవ్వాలని నిర్ణయించా. మీ ఖర్చులు పెరిగాయి. అందుకే మళ్లీ దీపం వెలిగిస్తా. ఉచితంగా మూడు సిలిండర్లు ఇస్తామని మీ అందరికీ హామీ ఇస్తున్నాను’

- చంద్రబాబు

దగా బాబు... మెగా మోసం...

బడ్జెట్ 2025-26





ఉత్పాదక రంగానికి కేటాయింపులు లేవు



అంకెలే తప్ప అభివృద్ధి కనిపించని బడ్జెట్ ఇది. ఏ రంగంలోనూ స్పష్టత లేకుండా కేవలం రూ.3.22 లక్షల కోట్లు అంటూ అంకెలు ప్రకటించారు. రైతులు, నిరుద్యోగులు, మహిళలు, వెనుకబడిన వర్గాలకు కేటాయింపులు సక్రమంగా లేవు. మూలధన వ్యయం గురించి చాలా అస్పష్టంగా ఉంది. ఉత్పాదక రంగంపై కేటాయింపులు జరిగితే అభివృద్ధి సాధ్యమవుతుంది. ఈ బడ్జెట్‌లో ఉత్పాదక రంగాన్ని పూర్తిగా విస్మరించారు. కేటాయింపులు లేకుండా సంపద ఎలా సృష్టిస్తారు? ప్రజలను మోసం చేసే బడ్జెట్ ఇది. రైతాంగాన్ని, నిరుద్యోగులను విస్మరించారు. సామాన్య ప్రజానీకానికి ఈ బడ్జెట్ వల్ల ఒరిగేది లేదు. ఏ వర్గానికీ ఎటువంటి ప్రయోజనం లేదు.

– కుంభా రవిబాబు, ఎమ్మెల్సీ

కూటమి చిత్తశుద్ధికి నిదర్శనం



సూపర్ సిక్స్ హామీల అమలుకు బడ్జెట్లో తగిన కేటాయింపులు జరపడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. ఇప్పటికే అందిస్తున్న పింఛన్ల పెంపుదల, దీపం–2 పథకాలకు నిధుల కేటాయింపుతో పాటు మిగిలిన సూపర్ సిక్స్ పథకాలను తప్పకుండా నెరవేరుస్తామని బడ్జెట్ కేటాయింపుల ద్వారా నిరూపించుకున్నట్టయింది. మూలధన వ్యయాన్ని రూ.40,636 కోట్లకు పెంచడం ద్వారా రాష్ట్రంలో మౌలిక వసతులు పెరుగుతాయి. గ్రామీణాభివృద్ధికి రూ.18,890 కోట్ల కేటాయింపుల ద్వారా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు ఊపందుకుంటాయి.

– పవన్‌కళ్యాణ్, ఉప ముఖ్యమంత్రి

పెట్టుబడిదారుల బడ్జెట్ ఇది



ఈ బడ్జెట్ ఏపీలో రియల్ ఎస్టేట్ రంగంలో భారీ పెట్టుబడులు పెట్టిన వారికి ప్రయోజనం చేకూర్చే విధంగా ఉంది. ఎన్నికల హామీల అమల్లో ప్రభుత్వం విఫలమైంది. మొదటి సంవత్సరంలో పెన్షన్లు మాత్రమే రూ.1,000 పెంచి, మిగతా హామీలను పట్టించుకోలేదు. ఈ బడ్జెట్‌లో నిరుద్యోగ భృతి హామీ కనిపించలేదు. 19–59 ఏళ్ల మధ్య వయసు ఉన్న మహిళలకు ఇస్తామన్న రూ.1,500 సాయం విస్మరించారు. ఉద్యోగాలిస్తామని వాగ్దానాలిచ్చి యువతను మోసం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 51,387 మంది ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేశారు. కోవిడ్‌లోనూ ఉద్యోగాల కల్పన జరిగింది. ఈ బడ్జెట్‌లో ఉచిత బస్సు ప్రస్తావనే లేదు. మత్స్యకారులకు సాయాన్ని ఎగ్గొట్టారు. 4 జెట్టీల నిర్మాణాన్ని విస్మరించారు. నిర్మాణ రంగ కార్మికులకు సహాయం ప్రస్తావన లేదు.

– మాధవరావు, ఎమ్మెల్సీ

సంక్షేమానికి కేటాయింపులు ఏవీ?



ప్రజల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఏ మేరకు కేటాయింపులు చేసిందో ఈ బడ్జెట్‌లో స్పష్టత లేదు. గత ప్రభుత్వం అప్పులతో ముంచేసిందంటూ ఆరోపణలు చేస్తున్నారు. కూటమి వచ్చాక ఇప్పటికే రూ.లక్ష కోట్లకు పైగా అప్పులు చేశారు. వీటిని ఏ పథకానికి వినియోగించారు? చేనేత కార్మికులకు కేటాయింపులు లేవు. పేదల ఇళ్ళ స్థలాలు, పక్కా గృహాలకూ కేటాయింపులు కనిపించలేదు. ఈ పాలనను ప్రశ్నిస్తుంటే రెడ్ బుక్ రాజ్యాంగం ప్రకారం కేసులు పెడుతున్నారు.

– బి. ఇజ్రాయేల్, ఎమ్మెల్సీ

ప్రగతిశీల బడ్జెట్



బడ్జెట్ ఆచరణాత్మక, ప్రగతిశీలమైనది. రాష్ట్ర ఆదాయాన్ని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అమరావతి రాజధాని నగరం, పారిశ్రామిక కారిడార్లు, ఓడరేవులు, విమానాశ్రయాల అభివృద్ధితో పాటు.. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడమన్నది రాష్ట్ర ఆర్థిక ప్రగతికి దోహదపడుతుంది.

– పొట్లూరి భాస్కరరావు, ప్రెసిడెంట్, ఏపీ చాంబర్స్

పారిశ్రామిక ప్రగతిపై దృష్టి



పారిశ్రామికాభివృద్ధికి అనువైన వాతావరణాన్ని కల్పించడంపై ప్రభుత్వం దృష్టిసారించింది. పెట్టుబడిదారులను, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేలా నూతన పాలసీలు తేవడంతో పాటు 2025–2026 ఆర్థిక సంవత్సరానికి పరిశ్రమలు, వాణిజ్య శాఖకు రూ.3,127 కోట్లు కేటాయించడం హర్షణీయం.

– మలినేని రాజయ్య, చైర్మన్, ఆంధ్ర చాంబర్ ఆఫ్ కామర్స్

పర్యాటక రంగానికి ప్రోత్సాహం



కొత్తగా ఏర్పాటు చేసే హోటల్స్‌కు రాయితీలు ఇవ్వడంతో పాటు జీఎస్టీ, విద్యుత్, రిజిస్ట్రేషన్ రుసుముల్లో రాయితీలు ఇచ్చేలా పర్యాటకరంగాన్ని ప్రోత్సహిస్తోంది. పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పించడంతో పాటు బడ్జెట్‌లో యువజన, పర్యాటక, సాంస్కృతిక శాఖకు రూ.469 కోట్లు కేటాయింపులు, దానిలో సగానికి పైగా నిధులు ఒక్క పర్యాటక రంగానికే కేటాయించడాన్ని స్వాగతిస్తున్నాం.

– ఆర్‌వీ స్వామి, అధ్యక్షుడు, ఏపీ హోటల్స్ అసోసియేషన్స్

పన్ను పోటు!

- ప్రజారుణంతో ఏకంగా రూ.1.03 లక్షల కోట్ల అప్పులు
- భారీగా మార్కెట్ అప్పులు, కేంద్ర రుణాలు, పన్నులు, పన్నేతర వాతలు
- జనం జేబులను గుల్ల చేయడమే లక్ష్యంగా బడ్జెట్ అంచనాలు
- రెవెన్యూ వ్యయం రూ.2.51 లక్షల కోట్లు
- మూలధన వ్యయం రూ.40,635 కోట్లు
- రెవెన్యూ లోటు 33,185 కోట్లు
- ద్రవ్య లోటు రూ.79,926 కోట్లు




సాక్షి, అమరావతి: భారీగా మార్కెట్ అప్పులు, కేంద్రం నుంచి రుణాలతో ప్రజలపై పెనుభారం మోపడమే లక్ష్యంగా 2025–26 వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శుక్రవారం శాసనసభకు సమర్పించారు. సంక్షేమం, అభివృద్ధి, సంపద సృష్టి అనేది బడ్జెట్‌లో ఎక్కడా ప్రతిబింబించకపోగా భారీగా అప్పులు, పన్నులు, పన్నేతర వాతలు మాత్రం ప్రస్ఫుటంగా కనిపించాయి. ప్రజారుణం కింద ఏకంగా రూ.1.03 లక్షల కోట్లు అప్పులు చేయనున్నట్లు బడ్జెట్‌లో స్పష్టం చేశారు. పన్నుల ఆదాయం రూపంలో వచ్చే ఆర్థిక ఏడాది అదనంగా రూ.15 వేల కోట్లు వస్తాయని, పన్నేతర ఆదాయం ద్వారా అదనంగా రూ.12 వేల కోట్లు ఆదాయం వస్తుందని బడ్జెట్‌లో పేర్కొన్నారు. 2024–25 రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం రూ.94,966 కోట్లుగా సవరించిన అంచనాల్లో పేర్కొనగా 2025–26లో సొంత పన్నుల ఆదాయం రూ.1,09,006 కోట్లుగా అంచనా వేశారు. పన్నేతర ఆదాయం 2024–25లో రూ.7,018 కోట్లుగా సవరించిన అంచనాల్లో పేర్కొనగా 2025–26లో ఏకంగా రూ.19,119 కోట్లు వస్తుందని అంచనా వేశారు. అంటే పన్నులు, పన్నేతర రూపంలో ప్రజల జేబులను ఖాళీ చేయడమే లక్ష్యంగా బడ్జెట్ అంచనాలున్నట్లు వెల్లడవుతోంది.


- రాష్ట్ర ప్రభుత్వ అంతర్గత రుణం కింద రూ.81,956.50 కోట్ల అప్పులు, కేంద్రం నుంచి రూ.21,700 కోట్ల అప్పు చేయనున్నట్లు బడ్జెట్‌లో స్పష్టం చేశారు. అంటే మొత్తం ప్రజా రుణం కింద 2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ.1,03,656.50 కోట్లు అప్పు చేయనున్నట్లు పేర్కొన్నారు. సంపద సృష్టించడం ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానంటూ ఎన్నికల ముందు నమ్మబలికిన సీఎం చంద్రబాబు బడ్జెట్‌లో ఆ ఊసే లేకుండా చేశారు.



- ప్రభుత్వ రంగంలో పోర్టులు, వైద్య కళాశాలల నిర్మాణం గురించి అసలు ప్రస్తావనే చేయలేదు. పైగా భారీ ప్రాజెక్టులను పీపీపీ విధానంలో చేపట్టేందుకు బడా సంస్థలకు వయబులిటీ గ్యాప్ ఫండింగ్ కోసం బడ్జెట్‌లో ఏకంగా రూ.2000 కోట్లు కేటాయించడం గమనార్హం. మొత్తం మీద పన్నుల రూపంలో ఇటు భారీ ఆదాయం, అటు భారీ అప్పులతో 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.3.22 లక్షల కోట్ల వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టారు. ఇందులో రెవెన్యూ వ్యయం రూ.2.51 లక్షల కోట్లు, మూల ధన వ్యయం రూ.40,635 కోట్లుగా ఉంటుందని పేర్కొన్నారు. రెవెన్యూ లోటు రూ.33,185 కోట్లుగా ఉంటుందని, ఇది జీఎస్‌డీపీలో 1.82 శాతమని వెల్లడించారు. ద్రవ్యలోటు రూ.79,926 కోట్లుగా ఉంటుందని, ఇది జీఎస్‌డీపీలో 4.38 శాతమని చెప్పారు.

మద్యం ద్వారా 2025-26లో రూ.27,097 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేశారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.13,150 కోట్లు ఆదాయం రానుందని అంచనా వేశారు.





హామీలు రద్దు.. మోసాల పద్దు!

▶ మొదటి పేజీ తరువాయి

ప్రణాళిక – ఆలోచనల సమ్మిళితంగా ఉండాల్సిన రాష్ట్ర బడ్జెట్.. అంతులేని మోసాలు.. గాడి తప్పిన అంకెల సమాహారంగా మిగిలిపోయింది. అసెంబ్లీలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, శాసన మండలిలో మంత్రి కొల్లు రవీంద్ర బడ్జెట్ ప్రతిపాదనలను ప్రవేశపెట్టగా వ్యవసాయ బడ్జెట్‌ను శాసనసభలో మంత్రులు అచ్చెన్నాయుడు, మండలిలో మంత్రి పి.నారాయణ ప్రవేశపెట్టారు.

అంకెల్లో ఆడంబరంగా..

అప్పులతో ముంచెత్తుతూ.. అంకెల్లో అత్యంత భారీతనంతో ఆడంబరంగా కనిపించిన ఈ బడ్జెట్ పరిమాణం రూ.3.22 లక్షల కోట్లు! కానీ ఇంత భారీ బడ్జెట్‌లోనూ హామీలకు కేటాయింపులు చేయకుండా సీఎం చంద్రబాబు తన నైజాన్ని చాటుకున్నారు. గత ప్రభుత్వం డీబీటీ (రూ.2.73 లక్షల కోట్లు), నాన్ డీబీటీ (1.84 లక్షల కోట్లు) ద్వారా ఏకంగా రూ.4.57 లక్షల కోట్ల మేర ప్రజలకు ప్రయోజనం చేకూరిస్తే, ఇప్పుడు చంద్రబాబు ఏడాదిలోనే రూ.లక్ష కోట్లకుపైగా అప్పులతో ముంచెత్తి చరిత్ర సృష్టించారు. ఆకారం పెంచినా.. నేల విడిచి సాము చేసినా.. ఈ బడ్జెట్ చంద్రబాబు సర్కారు మోసాలను మాత్రం దాచిపెట్టలేకపోయింది! ఎన్నికల హామీల సంగతి అటుంచితే.. సీఎం చంద్రబాబు రోజూ జబ్బలు చరుచుకునే 'సంపద సృష్టి' ఆనవాళ్లు బూతద్దంతో గాలించినా బడ్జెట్‌లో కానరాలేదు. వైఎస్సార్‌సీపీ హయాంలో విలువైన సంపద సృష్టిస్తూ ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపట్టిన పోర్టులు, కొత్త మెడికల్ కాలేజీల గురించి ఈ బడ్జెట్‌లో కనీసం ప్రస్తావించలేదు. ఇచ్ఛాపురం నుంచి హిందూపురం దాకా గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేస్తూ ఇంటి ముంగిటికే గత ప్రభుత్వం తెచ్చిన విప్లవాత్మక వ్యవస్థలు, సంక్షేమ పథకాలను కూటమి సర్కారు నిర్వీర్యం చేయడంతో పల్లెలు కళ తప్పాయి. వలంటీర్ల వేతనాలు రూ.ఐదు వేలు కాదు.. ఏకంగా రూ.పది వేలకు పెంచుతామంటూ నమ్మబలికి ఏకంగా వ్యవస్థకే మంగళం పాడేశారు!

హామీలు గాలికి..

సూపర్ సిక్స్‌లో తొలి హామీగా పేర్కొన్న నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేల భృతి గురించి బడ్జెట్‌లో అసలు ప్రస్తావనే లేకుండా చేశారు. ఆడబిడ్డ నిధికి పైసా కూడా కేటాయించలేదు. ఇక మహిళల ఉచిత బస్సు ఊసే లేదు. అన్నదాతా సుఖీభవ, తల్లికి వందనం పథకాలకు కోతలు విధించి అరకొర కేటాయింపులను చూపించినా ఎప్పటి నుంచి అమలు చేస్తారో నిర్దిష్టంగా చెప్పలేదు. కాగితాల్లో కేటాయింపులు చేయడం.. అమలు చేయకపోవడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యే! గత బడ్జెట్‌లోనూ అన్నదాతా సుఖీభవకు రూ.వెయ్యి కోట్లు కేటాయింపులు చేసినట్లు చూపించి చివరకు ఒక్క పైసా కూడా ఇవ్వకుండా ఎగ్గొట్టడం తెలిసిందే. స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థి తల్లికి ఏడాదికి రూ.15 వేల చొప్పున తల్లికి వందనం కింద ఇచ్చేందుకు రూ.9,407 కోట్లు కేటాయించినట్లు బడ్జెట్‌లో పేర్కొన్నప్పటికీ ఎప్పటి నుంచి అమలు చేస్తారో చెప్పకుండా తప్పించుకునే యత్నం చేశారు.

పేదల ఇళ్లకు పాతర..

పేదల ఇళ్ల నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం పాతరేసింది. వైఎస్సార్‌సీపీ హయాంలో 2023–24లో ఏకంగా రూ.6,866 కోట్లు కేటాయించి వ్యయం చేయగా.. కూటమి సర్కారు 2024–25లో రూ.4,012 కోట్లు కేటాయించి కేవలం రూ.1,611 కోట్లే వ్యయం చేసినట్లు సవరించిన అంచనాల్లో పేర్కొంది. ఇక 2025–26లో పేదల ఇళ్ల నిర్మాణాలకు రూ.6,317 కోట్లు ప్రతిపాదించింది.

పయ్యావుల పొగడ్తల బడ్జెట్!

- ఆర్థిక మంత్రి ప్రసంగంలో చంద్రబాబు, లోకేశ్, పవన్ జపం
- రూ.3,22,359 కోట్లతో 2025–26 బడ్జెట్ ప్రతిపాదనలు
- ప్రైవేట్ ప్రాజెక్టుల కోసం రూ.2,000 కోట్లతో వయబులిటీ గ్యాప్ ఫండింగ్ నిధి



సాక్షి, అమరావతి: అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నా ఏం చేశారో చెప్పుకునే సత్తా లేక బడ్జెట్ ప్రసంగంలో పరనింద, ఆత్మస్తుతికే కూటమి సర్కారు పరిమితమైంది. సుమారు గంటసేపు మాట్లాడిన ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ 44 పేజీల బడ్జెట్ ప్రసంగంలో 26 సార్లు గత ప్రభుత్వంపై విమర్శలకే పరిమితమయ్యారు. గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసంతో అప్పు కూడా పుట్టని పరిస్థితుల్లో బడ్జెట్ ప్రతిపాదనలను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. స్వర్ణాంధ్ర–2047 లక్ష్య సాధనలో భాగంగా 2025–26కి రూ.3,22,359 కోట్లతో బడ్జెట్ ప్రతిపాదనలను ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. ఉదయం పది గంటలకు శాసనసభలో బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభించిన ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ–మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్‌ను పొగడ్తలతో ముంచెత్తారు. కూటమి సర్కారు చర్యలతో ఆర్థిక వ్యవస్థ గాడిలో పడుతోందని, 2024–25 ముందస్తు అంచనాల ప్రకారం రాష్ట్ర స్థూల ఉత్పత్తి 12.94 శాతానికి చేరిందని చెప్పారు. గత ప్రభుత్వం బకాయి పెట్టిన రూ.23,556 కోట్లను చెల్లించడంతో పాటు ఆగిపోయిన 93 కేంద్ర ప్రాయోజిత పథకాల్లో 74 పథకాలను తిరిగి పునరుద్ధరించినట్లు తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను రూ.నాలుగు వేలకు పెంచడంతో పాటు అన్న క్యాంటీన్లను ప్రారంభించామని, దీపం పథకం–2 కింద ఏడాదికి మూడు ఉచిత సిలెండర్లు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది నుంచి ప్రతి రైతుకు అన్నదాతా సుఖీభవ కింద రూ.20,000, తల్లికి వందనం కింద ఒకటి నుంచి 12 వరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థుల తల్లులకు రూ.15,000 చొప్పున ఇవ్వనున్నట్లు చెప్పారు. వేట నిషేధ కాలంలో మత్స్యకారులకు రూ.20,000 చొప్పున ఆర్థిక సాయం అందిస్తామన్నారు.

కలర్ ఎక్కువ.. కంటెంట్ తక్కువ

- సూపర్ సిక్స్ హామీల అమలుకు కేటాయింపులు లేవు: బుగ్గన
- అప్పులపైనా కూటమి పార్టీల అబద్ధాల కుట్ర బట్టబయలైంది
- డబుల్ ఇంజన్ సర్కార్ అని చెప్పుకొంటున్నారు కదా..?
- మరి సృష్టిస్తున్న సంపదను ఎన్నికల హామీల అమలుకు ఎందుకు కేటాయించడం లేదు?



సాక్షి, అమరావతి: రాష్ట్ర బడ్జెట్ బుక్ చూస్తే కలర్ ఎక్కువ... కంటెంట్ తక్కువగా కనిపిస్తోందని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ వ్యాఖ్యానించారు. శుక్రవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు అంటూ ఇన్నాళ్లా సీఎం చంద్రబాబు చేసిన దుష్ప్రచారం బడ్జెట్ లెక్కల సాక్షిగా బయటపడిందన్నారు. బుగ్గన ఇంకా ఏమన్నారంటే..

- బడ్జెట్ అంచనా వ్యయం రూ.3,22,359 కోట్లు, రెవెన్యూ రాబడి రూ.2,17,976 కోట్లు, అప్పు రూ.1,04,382 కోట్లుగా చూపించారు. ఇది కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెండో బడ్జెట్. బడ్జెట్ ప్రసంగంలో గత ప్రభుత్వం గురించి 25 సార్లు, విధ్వంసం అంటూ మరో పది సార్లు ప్రస్తావించారు. ప్రభుత్వం ఏర్పాటై పది నెలలు అవుతోంది. ఇకనైనా ప్రజలకు ఎన్నికల హామీల అమలు గురించి చెప్పాల్సిన అవసరం లేదా?
- సూపర్ సిక్స్ హామీలపై ప్రతి ఇంటికి తిరిగి పదేపదే చెప్పి ప్రజలను నమ్మించారు. 2019–24 వరకు నాటి సీఎం వైఎస్ జగన్ క్యాలెండర్ ప్రకారం మేనిఫెస్టోలో చెప్పినది ప్రతీదీ అమలు చేశారు. అలాగే కూటమి ప్రభుత్వం కూడా ఇదే తరహాలో హామీలను అమలు చేస్తుందని ఆశతోనే ప్రజలు కూటమికి పట్టం కట్టారు. గతంలో అనేకసార్లు చంద్రబాబు వల్ల మోసపోయినా కూడా తిరిగి వారు చెప్పిన ఆకర్షణీయమైన హామీలతో మోసపోయి కూటమికి అధికారం అప్పగించారు.

సూపర్ సిక్స్ హామీల అమలేదీ?

సూపర్ సిక్స్ హామీల అమలును చూస్తే తొలి ఏడాది బడ్జెట్ లో ఎలా మొండిచేయి చూపించారో అలాగే ఈ బడ్జెట్ లో కూడా చేశారు. దీపం పథకం కింద అర్ధదీపం, పావుదీపం అమలు చేశారు. మరోవైపు కూటమి ప్రభుత్వం చేసినంత అప్పు చరిత్రలో ఏ ప్రభుత్వం చేయలేదు. ఒక్క ఏడాదిలోపే రూ.1.19 లక్షల కోట్లు అప్పులు చేశారు. 1995 నాటి పరిస్థితిని ఉదహరిస్తూ, జీతాలు కూడా ఇవ్వలేకపోతున్నామని ఆర్థిక మంత్రి వాపోయారు. కానీ ఉమ్మడి రాష్ట్రంలో 1995లో మిగులు బడ్జెట్ ఉంది. డబుల్ ఇంజన్ సర్కార్ అని చెప్పుకుంటున్నారు. మరి ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలుకు ఈ సృష్టిస్తున్న సంపదను ఎందుకు కేటాయించడం లేదు? 2014–19 లో స్థూల ఉత్పత్తి 13.5 పెరిగితే, 2019–24 లో 10.3 పెరిగిందని పోలిక చెబుతున్నారు. వైఎస్సార్‌సీపీ హాయంలో కోవిడ్ తో మొత్తం ఎకానమీ దెబ్బతిన్న సమయాన్ని కూడా పోలుస్తారా?

అప్పులపై తప్పుడు లెక్కలు

- అప్పుల గురించి మాట్లాడుతూ 2024, మార్చి 31 నాటికి అప్పు రూ.3,75,295 కోట్లు ఉంది. ప్రభుత్వ అప్పు రూ. 4,38,278 కోట్లు, పబ్లిక్ అకౌంట్స్ లైబిలిటీస్ రూ. 80,914 కోట్లు, కార్పొరేషన్ అప్పులు రూ.2,48,677 కోట్లు, సివిల్ సప్లయిస్ రూ.36,000 కోట్లు, విద్యుత్ సంస్థలు రూ.34,267 కోట్లు, రూ.1,13,000 కోట్లు కాంట్రాక్టర్‌లకు, ఎంప్లాయిస్ కు రూ.21,000 కోట్లు, మొత్తం కలిపి రూ.9,74,556 కోట్లు అప్పులు ఉన్నాయని ముఖ్యమంత్రి తన ప్రజెంటేషన్‌లో వెల్లడించారు. అంతకు ముందు వైఎస్సార్‌సీపీ రూ.14 లక్షల కోట్లు అప్పులు చేసిందని ఎలా మాపై విషప్రచారం చేశారు?
- కార్పొరేషన్ అప్పులు రూ.2,48,677 కోట్లు అన్ని చంద్రబాబు చెప్పారు. కానీ కాగ్ చెప్పిన దాని ప్రకారం రూ.1,54,797 కోట్లు అని స్పష్టంగా ఉంది. అంటే కాగ్ చెప్పినది సరైనదా? లేక మీరు చెబుతున్న లెక్కలు సరైనవా? వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆర్థిక అంశాలపై ఏది చెప్పినా ప్రతి దానికీ ఆధారాన్ని చూపించేవారు, కానీ కూటమి మాత్రం తమ లెక్కలకు ఎక్కడా ఆధారాలను చూపించడం లేదు. సివిల్ సప్లయిస్ కు ప్రభుత్వం ఇవ్వాల్సిన సబ్సిడీ ఇవ్వలేకపోవడం వల్ల, పేమెంట్ చేయడానికి సివిల్ సప్లయిస్ అప్పులు చేసింది. అంటే ఈ రూ.36,000 కోట్లు కూడా కాగ్ చెప్పిన రూ. 1,54,797 కోట్ల అప్పుల్లో కలిసే ఉంది. కానీ దానిని కూటమి ప్రభుత్వం విడిగా చూపి ఎక్కువ అప్పులు ఉన్నట్లుగా చిత్రీకరించింది. డిస్కం అప్పుల గురించి రూ.34,267 కోట్లు ఉన్నట్లు చూపించారు. సబ్సిడీ కింద రైతులకు, ఎస్సీ, ఎస్టీ లకు గృహ వినియోగ సబ్సిడీని ప్రభుత్వం డిస్కంలకు కట్టకపోవడం వల్ల డిస్కంలు అప్పులు చేశాయి. ఇవి కూడా కాగ్ చెప్పిన మొత్తంలో కలిసే ఉన్నాయి. దానిని కూడా విడిగా చూపి ఎక్కువ అప్పులు చేశామని ప్రచారం చేశారు.
- అలాగే కాంట్రాక్టర్ లకు చెల్లించాల్సిన వాటిల్లో అప్ లోడ్ అయినవి 86,000 కోట్లు వీటిని మాత్రమే పరిగణలోకి తీసుకోవాలి. మొత్తం అప్పులు చూస్తే 7,83,773 కోట్లుగా లెక్క తేలుతున్నాయి. వీటిల్లో 3,90,250 కోట్లు తెలుగుదేశం ప్రభుత్వం దిగిపోయి, వైయస్ఆర్ సీపీ పాలనలోకి వచ్చినప్పుడు ఉన్న అప్పు. మా హయాంలో జరిగిన అప్పు రూ.3,33,513 కోట్లు మాత్రమే. కానీ కూటమి పార్టీలు మాపై తప్పుడు ప్రచారం చేశాయి. శ్రీలంక, కాంబోడియా అంటూ దుష్ప్రచారం చేశాయి.

సంపద సృష్టించడమంటే వృద్ధి రేటు తగ్గడమా?

- సంపద సృష్టి అంటూ చంద్రబాబు ప్రచారం చేసుకుంటున్నారు. పదినెలల్లో మైనస్ 0.01 శాతం వృద్ధిలో ఉన్నారు. వైఎస్సార్‌సీపీకి పాలన చేతకాదు అంటూ విమర్శలు చేశారు. మరి ఈ పదినెల్లో మీరు చేసింది ఏమిటీ? స్థూల ఉత్పత్తి బాగుంటే, రెవెన్యూ రాబడిలో వృద్ధి కనిపిస్తుంది. 2024లో అంటే ఏప్రిల్ నుంచి 2025 జనవరి వరకు పదినెలలు లెక్కేస్తే రెవెన్యూ రాబడి మైనస్ లోకి వచ్చింది? 2023 ఏప్రిల్ నుంచి 2024 జనవరి వరకు వైఎస్సార్‌సీపీ పాలనలో సాధించిన రెవెన్యూ రూ. 72,872 కోట్లు. కూటమి పాలనలో పది నెలల్లో రూ.72,864 కోట్లు వచ్చింది. అంటే మా కన్నా ఎనిమిది కోట్లు తక్కువగా రెవెన్యూ వచ్చింది. ఇదేనా మీ సంపద సృష్టి?
- నీతి అయోగ్ ప్రకారం 2015–19 వరకు 12.9 శాతం రెవెన్యూ రాబడిలో సీఏజీఆర్ ఉంది. 2020–23 వరకు 14.1 శాతం పెరిగింది. దీనిని బట్టి ఎవరు సంపదను సృష్టిస్తున్నారో ప్రజలు అర్థం చేసుకోవాలి. ఇంటిపన్నులు పెంచి రెవెన్యూ పెంచుకోవాలని చూస్తున్నారు. పన్నులు పెంచడం వల్ల రాబడి పెరగకపోగా ఒకదశలో నిలిచిపోతుంది. ఫిబ్రవరి 1, 2025 నాటికి 16,997 గ్రామాలు, 9వేల వార్డుల్లో మార్కెట్ విలువను పెంచాలని ప్రతిపాదించారు. కూటమి పాలనలో స్టాంప్స్ అండ్ రెవెన్యూ ఆదాయం పడిపోవడంతో దానిని పెంచుకోవడానికి భూముల రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచాలని నిర్ణయించారు.

వ్యవసాయాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు

తాజా బడ్జెట్ లో వ్యవసాయాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ధాన్యంకు గత ఏడాది రూ. 1740 క్వింటా రేటు ఉంటే, ఈ ఏడాది రూ.1,470 నుంచి 1,500 ఉంది. ఎంఎస్పీ రూ. 2,300 ఉంది. ప్రొక్యూర్ మెంట్ ఎక్కడ జరుగుందో తెలియడం లేదు. వ్యవసాయదారులు దళారీలకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉంది. మిర్చి క్వింటా గత ఏడాది 21 నుంచి 23 వేలకు అమ్మితే ఈ ఏడాది రూ.8 నుంచి 11 వేలకు అమ్ముతున్నారు. పత్తి క్వింటా గత ఏడాది మా హయాంలో రూ.10 వేలు ఉంటే, ఇప్పుడు రూ.5000కి అమ్మతున్నారు. మినుములు గత ఏడాది రూ.10 వేలు ఉంటే, ఈ ఏడాది రూ.6 వేలు, కంది క్వింటాలు గత ఏడాది రూ.9–10వేలు అమ్మితే ఈ ఏడాది రూ.5500 లకు అమ్ముకుంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో అన్నదాత సుఖీభవ కింద ఎక్కడా రైతులను ఆదుకోవడం లేదు. రూ.6300 కోట్లు అన్నదాతా సుఖీభవ కోసం బడ్జెట్ లో రాశారు. కేంద్రం ఇచ్చే ఆరు వేలను కూడా కలుపుకునే అని మాట మార్చారు. దీని ప్రకారం చూసినా 45 లక్షల మంది రైతులకే అందుతుంది. మొత్తం 55 లక్షల మంది రైతులు ఉన్నారు. ఇరవై వేలు రాష్ట్రప్రభుత్వమే ఇస్తే కనీసం 30 లక్షల మందికి కూడా ఈ కేటాయింపులు సరిపోవు. గత ఏడాదికే 55 లక్షల మంది రైతులు రైతుభరోసాను అందుకున్నారు. అన్నదాత సుఖీభవకు బడ్జెట్ లో కేటాయింపులు రూ.6300 కోట్లు అని చూపిస్తే, అగ్రికల్చర్ బడ్జెట్ లో వ్యవసాయ మంత్రి అన్నదాత సుఖీభవకు రూ.9400 కోట్లు చూపించారు. ఇందులో ఏది సరైనదో, ఎందుకు వ్యత్యాసం చూపించారో తెలియదు.

పథకాల కేటాయింపుల్లోనూ చిత్తశుద్ధి లేదు

- సూపర్ సిక్స్ పథకాల అమలుకు బడ్జెట్ లో చేసిన కేటాయింపులు చూస్తే ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని అర్థమవుతుంది. యువతకు ఇరవై లక్షల ఉద్యోగాలు, నెలకు రూ.3 వేల భృతి అన్నారు, స్కూల్ కు వెళ్లే విద్యార్థికి రూ.15వేలు, ప్రతి రైతుకు రూ.20 వేలు ఆర్థిక సాయం, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇలా ఏ హామీకీ సరైన కేటాయింపులు లేవు. 2025–26లో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అన్నదాతా సుఖీభవ కింద ప్రతి రైతుకు రూ.20 వేలు కేటాయిస్తున్నామని చెప్పారే తప్ప ఎంత దీనికి కేటాయిస్తున్నారో ప్రకటించలేదు. తల్లికి వందనం పైన కూడా అలాగే చెప్పారు. నిజంగా వీటిని అమలు చేసే ఉద్దేశం ఉంటే దానిపైన ఎందుకు స్పష్టత ఇవ్వలేదు?
- తల్లికి వందనంకు బడ్జెట్ బ్రీఫ్‌లో రూ.9,407 కోట్లు చూపించారు. కానీ వాస్తవంగా లెక్కలను బట్టి దాదాపు రూ.12,450 కోట్లు అవసరం. కానీ కేటాయించింది రూ.8,278 కోట్లు మాత్రమే. దీనిప్రకారం కేవలం 55 లక్షల పిల్లలకే తల్లికి వందనం అందుతుందని అర్థమవుతోంది. అంటే వారికి ఎగ్గొట్టేస్తున్నారు. అప్పు చూస్తే జనవరి నెలాఖరు నాటికి రూ.82,738 కోట్లు అని చూపించారు. కానీ బడ్జెట్ బుక్ లో మాత్రం అప్పు కేవలం రూ. 73,362 కోట్లు అని రాశారు. మూలధన వ్యయం రూ.24,072 కోట్లు అని గత బడ్జెట్‌లో చెప్పి, ఖర్చు పెట్టింది ఎంతా అని చూస్తే రూ.10,850 కోట్లు మాత్రమే. అంటే ఈ రెండు నెల్లో రూ.13000 కోట్లు ఖర్చు పెట్టబోతున్నారా?

దగా బాబు... మెగా మోసం...

బడ్జెట్ 2025-26



రూ.32 వేల కోట్లు
ఏటా పింఛన్లకు అవసరమైన నిధులు

రూ. 5,000 కోట్లు
బడ్జెట్‌లో కోత

1.90 లక్షలు
కూటమి సర్కారు 8 నెలల్లో తొలగించిన పింఛన్లు

10 లక్షలు
బడ్జెట్‌లో కేటాయించిన నిధుల ప్రకారం మరో 10లక్షల పింఛన్లు తొలగించే అవకాశం



విద్యార్థులు, నిరుద్యోగులకు దగా



బడ్జెట్‌లో విద్యార్థులు, నిరుద్యోగులను కూటమి ప్రభుత్వం తీవ్రంగా దగా చేసింది. తల్లికి వందనం పథకానికి కేవలం రూ.9,407 కోట్లతో ప్రతిపాదనలు చేసి కూటమి ప్రభుత్వం తల్లులను మోసం చేసింది. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ రూ.15 వేలు చొప్పున ఇస్తామని చంద్రబాబు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఇప్పుడు బడ్జెట్‌లో కోత విధించి **84 లక్షల** మంది తల్లులను మోసం చేశారు. గత విద్యా సంవత్సరంలో ఇవ్వాల్సిన తల్లికి వందనంపై కనీస ప్రస్తావన లేదు. ప్రతి నెలా రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తామన్న హామీపైనా మొండిచేయి చూపారు.

- రవిచంద్ర, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

తేదీ: మే 28, 2023
వేదిక: రాజమహేంద్రవరంలో టీడీపీ మహానాడు

బాబు చెప్పిన మాట: యువగళం.. యువశక్తి.. దేశానికి, ప్రపంచానికి సేవలందించాలంటే అది యువతతోనే సాధ్యం. రాజకీయాల్లో 40 శాతం యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని టీడీపీ నిర్ణయించింది. ముందుకొచ్చి దూసుకెళ్లండి. మిమ్మల్ని ఆదరించే బాధ్యత నాది. ఇప్పుడు హామీ ఇస్తున్నా.. ఏపీలో ఉండే యువతను ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు అనుసంధానం చేస్తాను. ఇక్కడ పరిశ్రమలు తెస్తాం. ఉద్యోగాలు ఇస్తాం. రాబోయే ఐదేళ్లలో 20 లక్షల మంది యువతకు ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత తెలుగుదేశం పార్టీది. అంతేకాదు.. మీకు (యువతకు)ఉద్యోగం వచ్చే వరకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తా.

ఇప్పుడు చెప్పండి యువతను నిర్వీర్యం చేసిన పార్టీ ఏది? మిమ్మల్ని ఆదుకునే పార్టీ ఏది? మీకు కులాలు కావాల్నా? మతాలు కావాల్నా? ప్రాంతాలు కావాల్నా? నీ భవిష్యత్తు కావాల్నా? మీ ప్రయోజనాలు కోరే పార్టీ తెలుగుదేశం. ఉద్యోగాలు సృష్టించడం తెలిసిన పార్టీ. ప్రపంచానికి తెలుగు యువతను అందించిన పార్టీ.

తేదీ: మార్చి 31, 2014
వేదిక: హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్

బాబు చెప్పిన మాట: యువత ఉద్యోగ, ఉపాధికి ప్రాధాన్యం ఇస్తాం. ఇంటికో ఉద్యోగం లేకుంటే ప్రతి నెలా రూ.1,000 -రూ.2,000 నిరుద్యోగ భృతి కల్పిస్తాం. నిరుద్యోగులకు రూ.50 లక్షల వరకు రుణ సౌకర్యం ఇస్తాం. ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేస్తాం.

బాబు చేసింది ఇది: 2014-19 మధ్య లక్షల్లో ఉద్యోగాలు ఉన్నా భర్తీ చేయలేదు. 2019 ఎన్నికలకు ముందు నిరుద్యోగ భృతిని తెరపైకి తెచ్చి, దాన్లో కోతలు పెట్టారు. తొలుత రూ.1000, తర్వాత రూ.2 వేలుగా ప్రకటించినా అతి కొద్ది మందికి మాత్రమే ఇచ్చారు. నిరుద్యోగులకు మచ్చుకైనా రుణం ఇవ్వలేదు.

తేదీ: జూలై 11, 2023
వేదిక: యువగళం పాదయాత్ర 150వ రోజు సభ, కావలి

నారా లోకేశ్ చెప్పిన మాట: టీడీపీ అధికారంలోకి రాగానే ఉద్యోగాలు లేని యువతకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి అందిస్తాం. ప్రతి ఏడాదీ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేస్తాం. పెండింగ్ పోస్టులన్నీ భర్తీ చేస్తాం. సక్సెస్‌కి షార్ట్ కట్ లేదు. యువత కష్టపడితేనే జీవితంలో విజయం సాధిస్తారు.

భృతి.. భ్రాంతి



బాబు సూపర్ 6
యువతకు 20 లక్షల ఉపాధి అవకాశాలు లేదా నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి

ఏటా నిరుద్యోగులకు ఇవ్వాల్సింది రూ.57,600 కోట్లు
బడ్జెట్‌లో కేటాయించింది 0

ఉద్యోగాలు ఇవ్వకపోగా నిరుద్యోగ భృతిపై ఆశలు చిదిమేశారు
వరుసగా రెండో ఏడాది బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా విదల్చని వైనం
ఉద్యోగం వచ్చే వరకు నెలకు రూ.3 వేల భృతి అంటూ ఎన్నికల్లో ప్రచారం
తీరా పీఠం ఎక్కాక ఆ విషయమే గుర్తు లేనట్లు నాటకాలు
ప్రతి నెలా రూ.5,100 కోట్లు నష్టపోతున్న నిరుద్యోగులు

నిరుద్యోగ యువతను వంచించడంలో చంద్రబాబు రికార్డులు సృష్టిస్తున్నారు. హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రతిసారి వారిని దగా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. 1999 నుంచి 2024 వరకు ఎన్నికల వేళ అధికారం కోసం ఉద్యోగాల సృష్టి.. నిరుద్యోగ భృతి.. అంటూ ఊదరగొట్టే చంద్రబాబు.. పీఠం ఎక్కిన తర్వాత హామీల తెప్ప తగలేస్తున్నారు. వాస్తవానికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే భృతి అమలు చేస్తారని నిరుద్యోగులు ఆశలు పెట్టుకున్నారు. కానీ, చంద్రబాబు అండ్ కో సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా 2024-25 బడ్జెట్‌ను ప్రవేశపెట్టడంలో తీవ్ర జాప్యం చేశారు. తాజా బడ్జెట్‌లోనూ నిరుద్యోగుల ఊసే విస్మరించారు. ఎన్నికల ముందు ఇంటికో ఉద్యోగం, లేకుంటే ఉద్యోగం వచ్చే వరకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామన్న హామీని తుంగలో తొక్కారు. కూటమి పాలనలో రెండేళ్లలో నిరుద్యోగులు రూ.1,15,200కోట్లు భృతిని నష్టపోతున్నారు. - సాక్షి, అమరావతి

ఒక్క నోటిఫికేషన్ లేదు..

రాష్ట్రంలో నిరుద్యోగులు చంద్రబాబు ఉచ్చులో పడి విలవిల్లాడుతున్నారు. ఒకవైపు ప్రభుత్వ నోటిఫికేషన్లు లేవు. గత ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చి గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహిస్తే కూటమి సర్కారు వచ్చిన తర్వాత మెయిన్స్ నిర్వహించడంలో తీవ్ర జాప్యం చేస్తోంది. 2024 జూన్‌లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు గ్రూప్-1 మెయిన్స్‌ను ఈ ఏడాది మేకి వాయిదా వేసుకుంటూ వచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ నోటిఫికేషన్‌కు మరిన్ని పోస్టులు కలిపి ఇస్తామని చెప్పి రద్దు చేశారు. మళ్లీ ఇప్పటి వరకు డీఎస్సీ నోటిఫికేషన్‌కు దిక్కులేదు. ఈ తొమ్మిది నెలల్లో ఒక్క నోటిఫికేషన్‌ను సరిగ్గా చేపట్టలేక చేతులెత్తేసిన ప్రభుత్వం నిరుద్యోగులకు కనీసం ఆర్థిక సాయం కింద నెలకు రూ.3 వేలు ఇవ్వకుండా మోసం చేసింది. ప్రభుత్వంపై ఆర్థిక భారం తగ్గించుకునేందుకు అవుట్ సోర్సింగ్, డైలీ వేజెస్ వర్కర్ల ఉద్యోగాలను తొలగిస్తోంది.

ఇది చంద్రబాబుకు కొత్తేమీ కాదు..

చంద్రబాబుకు నిరుద్యోగులను మోసం చేయడం కొత్తేమీ కాదు. 2014-19 మధ్య రూ.2 వేలు నిరుద్యోగ భృతి హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి, నాలుగున్నరేళ్లకు పైగా ఆ ఊసే ఎత్తలేదు. 2017-18లో రూ.500 కోట్లు కేటాయించినా, పైసా కూడా ఇవ్వలేదు. అప్పటి ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్ తీవ్ర ఒత్తిడి తీసుకురావడంతో ఎన్నికలకు ముందు యువ నేస్తం పేరుతో తూతూ మంత్రంగా డ్రామా నడిపించారు. విధివిధానాల రూపకల్పనకు మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసి సవాలక్ష ఆంక్షలు విధించి నిరుద్యోగ భృతి ఇచ్చే వారి సంఖ్యను భారీగా కుదించారు. తొలుత 12 లక్షలకు పైగా నిరుద్యోగ భృతికి అర్హులుగా తేల్చగా.. ఆ తర్వాత పది లక్షలకు కుదించారు. మళ్లీ అందులో 2.10 లక్షల మందే అర్హులంటూ చెప్పారు. తీరా 1.62 లక్షల మందికే ఇస్తామని, దీనికి ఈ-కెవైసీ లింక్ పెట్టారు. తుదకు అందులోనూ కొంత మందికే నిరుద్యోగ భృతి ఇచ్చి.. అందరికీ ఇచ్చినట్లు కలరింగ్ ఇచ్చుకున్నారు.

'ఫీజు'లో కోత.. విద్యార్థులకు వాత!



బాబు సూపర్ 6

పేదల ఉన్నత విద్యకు సర్కారు మోకాలడ్డు
ఏటా ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు రూ.2,800 కోట్లు అవసరం
తాజా బడ్జెట్‌లో రూ.1,960 కోట్లు మాత్రమే కేటాయింపు
హాస్టల్ మెయింటెనెన్స్‌కు ఏటా రూ.1,100 కోట్లు అవసరమైతే.. రూ.684 కోట్లు మాత్రమే ప్రతిపాదన

ఏటా విద్యార్థులకు ఇవ్వాల్సింది రూ.2,800 కోట్లు
బడ్జెట్‌లో కేటాయించింది రూ.1,960 కోట్లు

సాక్షి, అమరావతి: ఉన్నత విద్యా రంగంపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని మరోసారి రుజువైంది. నూతన విద్యా విధానాన్ని బలోపేతం చేస్తూ చేపట్టాల్సిన చర్యలు బడ్జెట్‌లో ఏమాత్రం కనిపించ లేదు. కేవలం వర్సిటీల్లో, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో, సాంకేతిక విద్యా సంస్థల్లో పని చేసే ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు, కార్యాలయాల నిర్వహణ ఖర్చుల కోసం రూ.2,506 కోట్లు కేటాయించారు. ఐటీఐ, సంప్రదాయ, సాంకేతిక ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు అందించే పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్ (ఆర్టీఎఫ్-ఎంటీఎఫ్)ల కేటాయింపుల్లోనూ అలసత్వం ప్రదర్శించినట్టు బడ్జెట్ ద్వారా స్పష్టమైంది. ఏటా రూ.2,800 కోట్లు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ (పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్-ఆర్టీఎఫ్) కోసం ఖర్చు చేయాల్సి ఉండగా, బడ్జెట్‌లో రూ.1,960 కోట్లు మాత్రమే కనిపిస్తోంది. ఇక హాస్టల్ వసతి ఖర్చులు (పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్- ఎంటీఎఫ్)కు ఏడాదికి రూ.1,100 వ్యయం అవుతుండగా రూ.684 కోట్లు మాత్రమే కేటాయింపులు ఉన్నాయి. చాలా వరకు వివిధ కార్పొరేషన్ల కేటాయింపుల్లో విద్యార్థులకు ఇచ్చే స్కాలర్‌షిప్‌ల కేటాయింపులను చూపిస్తుండటం గమనార్హం. మొత్తంగా విద్యార్థులకు ఇవ్వాల్సిన స్కాలర్ షిప్‌లలో సుమారు రూ.1200 కోట్ల మేర కోత విధించినట్టు తెలుస్తోంది.

గత విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ ఏడాది జూన్ తర్వాత చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్ మెయింటెనెన్స్ చార్జీలను ప్రభుత్వం నిలిపి వేసింది. మేలో ఎన్నికలు జరిగిన నేపథ్యంలో ఎన్నికల కోడ్‌తో విద్యార్థులకు, పేదలకు సంక్షేమ పథకాలు నిలిచిపోయాయి. అనంతరం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ క్రమంలో విద్యార్థులకు రెండు విడతల ఫీజు రీయింబర్స్‌మెంట్ సుమారు రూ.1,400 కోట్లు, హాస్టల్ మెయింటెనెన్స్ ఖర్చుల కింద రూ.1,100 కోట్ల చెల్లింపులు చేయాలి. కూటమి ప్రభుత్వం వీటిని ఆపేసింది. దీంతో లక్షలాది మంది విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం పిడుగులా పడింది. ప్రభుత్వం పట్టించుకోకపోవడం, కళాశాలల యాజమాన్యాల నుంచి తీవ్ర ఒత్తిడి పెరిగిపోవడంతో విద్యార్థుల తల్లులు దిక్కుతోచక పుస్తెలు అమ్మి, తాకట్టుపెట్టి, అధిక వడ్డీలకు అప్పులు చేసి ఫీజులు చెల్లిస్తున్న దుస్థితి నెలకొంది. ఎన్నికల సమయంలో కూటమి నేతలు ప్రైవేటు కాలేజీల్లో పీజీ చేరే వారికి కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తామన్నారు. ఇప్పుడు ఆ ఊసే మరిచారు. ఇప్పటికి రెండు బడ్జెట్లు ప్రవేశపెట్టిన కూటమి ప్రభుత్వం ప్రైవేటు కాలేజీల్లో పీజీ చదివే విద్యార్థులను విస్మరించింది. విద్యకు సంబంధించి కేంద్రం నుంచే సింహ భాగం నిధులు వస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం ఇలా మోసం చేయడం తగదని విద్యార్థి వర్గాల నుంచి నిరసన వ్యక్తమవుతోంది.

పెండింగ్ బకాయిల ఊసే లేదు

ఇదో అంకెల గారడీ

ఈ బడ్జెట్ అంకెల గారడీలాగా ఉంది. విద్యా రంగంపై రూ.34వేల కోట్లు కేటాయించడం సిగ్గుచేటు. బడ్జెట్‌లో 11% కేటాయింపులు చేస్తే విద్యా రంగం ఎలా అభివృద్ధి చెందుతుంది? విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీల పెంపుదల విషయాన్ని బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. వర్సిటీలకూ స్వల్పంగానే నిధులు విదిల్చింది. ఓ పక్క విద్యాశాఖ మంత్రి లోకేశ్..ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తామని ప్రకటిస్తున్నారే తప్ప..బడ్జెట్ కేటాయింపుల్లో మాత్రం చిత్తశుద్ధి ప్రదర్శించడంలేదు.



- బందెల నాసర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

నిరుద్యోగ భృతిపై ప్రస్తావనేది?

ఉన్నత విద్యను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం ..బడ్జెట్ ద్వారా తన నిర్లక్ష్య వైఖరిని చాటుకుంది. 2025-26 బడ్జెట్‌లో అరకొర నిధుల ప్రతిపాదనలతో విశ్వవిద్యాలయాలను గాలికి వదిలేసింది. ఉన్నత విద్యకు కేటాయించిన రూ.2,506 కోట్లు కేవలం జీతాలకే సరిపోతుంది. బడ్జెట్‌లో నిరుద్యోగ భృతికి పైసా కూడా కేటాయించకపోవడం దారుణం . జాబ్ క్యాలెండర్ ప్రస్తావన ఎక్కడా లేదు. యూనివర్సిటీల్లో 76 శాతం ఖాళీగా ఉన్న ఆచార్యుల పోస్టుల భర్తీ ఊసేలేదు.

- మల్లవరపు పవన్ కుమార్, ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి

పీఆర్సీ అమలుకు కేటాయింపులేవి?

పీఆర్సీ, ఐఆర్ అమలు కోసం బడ్జెట్‌లో నిధుల కేటాయింపులపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. సీపీఎస్, జీపీఎస్ కన్నా మెరుగైన పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామన్న హామీపైనా ఎలాంటి ప్రకటనా చేయలేదు. పాఠశాల విద్యకు గతేడాది 10.15 శాతం నిధులు కేటాయిస్తే, ప్రస్తుతం 9.86 శాతమే కేటాయించారు. విద్యారంగంలో రాష్ట్రాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతామంటూనే నిధులు ఇవ్వడం లేదు.

- ఎల్.సాయి శ్రీనివాస్, మల్లు రఘునాథరెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

పదిలక్షల పింఛన్ల కోత!



అందుకు తగ్గట్లుగానే రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు
కొత్తవి దేవుడెరుగు.. ఉన్నవాటికి సరిపడా నిధులివ్వలే
ఎన్నికల హామీ 50 ఏళ్లకే పింఛను పెరుమాళ్లకే ఎరుక
ప్రస్తుతం పింఛన్ల వ్యయం ఏడాదికి రూ.32 వేల కోట్లు
బడ్జెట్‌లో కేటాయించింది మాత్రం రూ.27,518 కోట్లే
కూటమి సర్కారు 8 నెలల పాలనలో 1.90 లక్షల పింఛన్లు కట్
తాజా కేటాయింపుల ప్రకారం చూస్తే రూ.5 వేల కోట్లకు
సరిపడా కోతలు పెట్టాల్సిందేనంటున్న నిపుణులు

పేదవాడి పింఛనుపై కూటమి సర్కారు కత్తికట్టింది. ఇప్పటికే కోత కత్తెర పట్టుకుని తిరుగుతున్న ప్రభుత్వం.. బడ్జెట్‌లో దానికి మరింత పదును పెట్టింది..! చంద్రబాబు సర్కారు కేటాయింపుల ప్రకారం చూస్తే.. ఇది స్పష్టంగా తేలిపోతోంది. లక్ష రెండు లక్షలు కాదు.. ప్రతిపాదిత గణాంకాల ప్రకారం ఏకంగా పది లక్షల పింఛన్లకు కటింగ్ పెట్టే ప్రమాదం నెలకుంది. ఫిబ్రవరి 1న ప్రభుత్వం పింఛన్లు విడుదల చేసిన లబ్ధిదారుల సంఖ్య 63.59 లక్షలు. వీరికి వచ్చే (2025-26) ఆర్థిక సంవత్సరంలో నెలకు రూ.2,719.50 కోట్ల చొప్పున పంపిణీ చేయాలి. అంటే ఏడాదికి రూ.32,634 కోట్లు. కానీ, బడ్జెట్‌లో పింఛన్లకు రూ.27,518 కోట్లు మాత్రమే కేటాయించారు. ఇది కావాల్సిన నిధుల కన్నా ఏకంగా రూ.5,116 కోట్లు తక్కువ కావడం గమనార్హం. - సాక్షి, అమరావతి

ఇప్పటికే కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్

8 నెలల క్రితం వరకు.. ఐదేళ్లు హాయిగా గుండెల మీద చేయి వేసుకొని మరీ ప్రతి నెల ఠంఛనుగా ఇంటి వద్దనే పింఛన్లు తీసుకున్న లక్షల మంది లబ్ధిదారులు కూటమి ప్రభుత్వం వచ్చాక ఎప్పుడు? ఎలా? తమ పింఛనుకు ఎసరు పెడతారోనని బిక్కుబిక్కుమంటున్నారు. నిరుడు జూన్‌లో కూటమి సర్కారు కొలువుదీరాక పింఛన్ల కోతకు సిద్ధపడింది. ఇందుకుతగ్గట్లు లబ్ధిదారుల్లో అనర్హులు ఎక్కువగా ఉన్నారంటూ ప్రచారం సాగిస్తోంది. ఏళ్ల నుంచి పింఛన్లు పొందుతున్నవారు కూడా అర్హత నిరూపించుకోవాలంటూ సర్వే, స్పెషల్ డ్రైవ్ పేరుతో రకరకాల కార్యక్రమాలకు శ్రీకారం చుడుతూ వస్తోంది. 8,18,900 మంది దివ్యాంగ, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల పింఛన్ అర్హత, అనర్హతలను మరో విడత ప్రభుత్వ వైద్యుల ద్వారా పరిశీలింపజేస్తోంది.

50 ఏళ్లకే పింఛన్ అంటూ నమ్మించి..

ప్రస్తుతం కనీసం 60 ఏళ్లన్న దాటినవారికే పింఛన్ పొందేందుకు అర్హత ఉంది. కూటమి ప్రభుత్వ పెద్దలు ఎన్నికల ముందు.. బీసీలతో పాటు ఎస్సీ, ఎస్టీలకు 50 ఏళ్లకే రూ.4 వేల చొప్పున పింఛను ఇస్తామంటూ ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చాక ఆ హామీ అమలు చేయలేదు. ఇంకోవైపు.. ఈ ప్రభుత్వంలో ప్రతి నెల ఇస్తున్న పింఛన్లే ఫిబ్రవరి 1 నాటికి ఏకంగా 1,89,957 తగ్గాయి. గత ఏడాది మే నెలలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 65,49,864 మందికి పింఛను విడుదల చేయగా, కూటమి సర్కారులో ఫిబ్రవరి 1న 63,53,907 మందికే ఇచ్చింది. మరోవైపు, కూటమి ప్రభుత్వం ఏర్పాటు రోజు నుంచే రాష్ట్రంలో పింఛన్ల కోసం కొత్తగా ఎవరైనా దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా లేకుండా చేసింది. ఈ మేరకు ఆన్‌లైన్ సేవలు నిలిచిపోయాయి.

మరోసారి వంచన

బొత్స సత్యనారాయణ, శాసన మండలిలో ప్రతిపక్ష నేత

అరకొరగానే కేటాయింపులు




సాక్షి, అమరావతి: గత ప్రభుత్వాన్ని దూషిస్తూ.. సీఎం, ఆయన తనయుడిని ప్రశంసలతో ముంచెత్తుతూ కూటమి ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం చూస్తే ఆశ్చర్యం కలుగుతోంది. చట్ట సభల్లో సభ్యుడిగా సుదీర్ఘ అనుభవం ఉన్న నేను ఎప్పుడూ ఇలా పొగడ్తలతో బడ్జెట్‌ను ముంచేయడం చూడలేదు. బడ్జెట్ ప్రసంగంలో ఎందుకు ఇన్నిసార్లు చంద్రబాబు, లోకేశ్‌ను పొగిడారో అర్థం కాలేదు. సూపర్ సిక్స్ అంటూ గొప్పగా ప్రజలను నమ్మించి, ఇప్పుడు వాటికి కేటాయింపులు చేయకుండా చంద్రబాబు ప్రభుత్వం ప్రజలను మరోసారి వంచించింది. తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికి రూ.15 వేలు, నిరుద్యోగులకు రూ.3 వేల భృతి, రైతులకు రూ.20 వేల భరోసా అన్నారు. వాటికి కేటాయింపులు అరకొరగానే ఉన్నాయి. రాష్ట్రంలో 84 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. వారికి తల్లికి వందనం ఇవ్వాలంటే దాదాపు రూ.12 వేల కోట్లకు పైగా అవసరం. కేటాయించింది రూ.9,400 కోట్లు మాత్రమే. మా ప్రభుత్వంలో రాష్ట్రంలో 53.58 లక్షల మందికి రైతు భరోసా ఇచ్చాం. ఈరోజు అంత మందికి రూ. 20వేల చొప్పున సుమారు రూ.12 వేల కోట్లు అవసరం. బడ్జెట్‌లో కేటాయించింది నామమాత్రమే. మహిళలకు అట్టహాసంగా ఉగాది నుంచి ఉచిత బస్సు అన్నారు. దీనిపై ఎక్కడా ప్రస్తావనే లేదు. మూలధన వ్యయం లెక్కలు పొంతన లేకుండా చూపించారు. గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో గత ప్రభుత్వంలో రూ.3 వేల కోట్లు మార్కెట్ ఇంటర్వెన్షన్ కింద నిధిని ఏర్పాటు చేసి, అన్నదాతలను ఆదుకున్నాం. ఈ కూటమి ప్రభుత్వంలో రూ.300 కోట్లు మాత్రమే కేటాయించారు. ఇదేనా రైతుల పట్ల ప్రభుత్వానికి ప్రేమ? మిర్చి యార్డులో రైతుల కష్టాలను తెలుసుకునేందుకు వెళ్ళిన వైఎస్ జగన్ పైన కేసులు పెట్టారు. ప్రభుత్వ మోసాలు, వైఫల్యాలను బడ్జెట్ సమావేశాల్లో వైఎస్సార్‌సీపీ ఎండగడుతుంది.

దగా బాబు... మెగా మోసం...
బడ్జెట్ 2025-26







దళితులను మోసం చేసిన ప్రభుత్వం



టీడీపీ కూటమి ప్రభుత్వం దళితులను పూర్తిగా మోసం చేసింది. జనాభా ప్రాతిపదికన ఎస్సీల సంక్షేమానికి రూ.35 వేల కోట్లు కేటాయించాలి గానీ.. రూ.22 వేల కోట్లు మాత్రమే కేటాయించింది. ఇది ఎస్సీలను దగా చేయడమే. 29 సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తామని కూటమి నేతలు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. ఇప్పుడు వాటిని పూర్తిగా విస్మరించింది. ఈ బడ్జెట్‌లో సబ్‌ప్లాన్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్స్, భూమి కొనుగోలు పథకం, కులాంతర వివాహ ప్రోత్సాహం, విదేశీవిద్య లాంటి పథకాల ఊసేలేదు.

– కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి

'ఆరోగ్యానికి' అదనపు కేటాయింపులు హర్షణీయం

రాష్ట్ర బడ్జెట్ 'విజన్ 2047'కు పునాది వేసేదిగా ఉంది. ఆరోగ్యం, వైద్య సేవలకు గత సంవత్సరంతో పోలిస్తే అదనంగా రూ.430 కోట్ల కేటాయింపు హర్షణీయం. నీటి పారుదల ప్రాజెక్టులను పూర్తి చేయడంపై ఈ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ప్రభుత్వం తొలిసారిగా అన్ని ప్రభుత్వ ఉత్తర్వులు (జీవోలు) తెలుగు భాషలో జారీ చేయాలని నిర్ణయించింది.



– రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

దామాషా పద్ధతిలో నిధులు కేటాయించాలి

బీసీ సంక్షేమ శాఖకు రూ.47,456 కోట్లు కేటాయించినప్పటికీ, వారి జనాభా దామాషాతో పోల్చితే చాలా తక్కువ కేటాయించినట్లు. ఈసారి రూ.60 వేల కోట్లన్నా ప్రతిపాదిస్తారని ఆశించాం. దామాషా ప్రకారం బీసీ జనాభాకు తగినట్లుగా బడ్జెట్ కేటాయింపులు జరపాలి. వృత్తిదారులకు ఆధునిక పనిముట్లు అందించే ఆదరణ పథకానికి ప్రకటించిన రూ.వెయ్యి కోట్లకు అదనంగా రూ.వెయ్యి కోట్లు కేటాయించాలి.



– ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

సబ్సిడీ బకాయిలకే కేటాయింపులు సరిపోవు

బడ్జెట్ పరిశ్రమల శాఖకి కేటాయించిన నిధులు సబ్సిడీ బకాయిలకే సరిపోవు.. ఇక కొత్త పరిశ్రమలు ఎలా వస్తాయి. ఇండస్ట్రియల్ కారిడార్‌కు, పోర్టులకు నిధులు కేటాయించలేదు. తోళ్ల పరిశ్రమ అభివృద్ధి సంస్థకు రూపాయి కూడా కేటాయించలేదు. మూడు లక్షల ఇరవై వేల కోట్లు అంటూ బడ్జెట్ కేటాయించినా అంత డబ్బు ఎలా వస్తుందో చెప్పలేదు. అప్పులు, కేంద్రం గ్రాంటుల మీద ఆధారపడి పెద్ద అంకెలు చూపెట్టారు. మొత్తానికి బడ్జెట్‌లో కేటాయింపులకు.. ఆచరణకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉంది.



– మామిడి సుదర్శన్, దళితుల అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు

అప్పులు చేసేలా.. భారం మోపేలా

ఈ బడ్జెట్ రాష్ట్రాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి తోడ్పడేదిగా లేదు. పైగా రూ.లక్షల కోట్లు అదనంగా అప్పు తేబోతున్నారు. మరో రూ.80 వేల కోట్లు ద్రవ్యలోటు ఉంది. దాన్ని పూడ్చుకోడానికి ప్రజలపై అదనపు భారాలు వేసేదిగా ప్రస్తుత బడ్జెట్ ఉంది. విద్యుత్ ట్రూఅప్ చార్జీల విధింపు గురించి ప్రస్తావించిన మంత్రివర్యులు.. రాష్ట్రాన్ని పాతికేళ్ల పాటు దోచుకుతినే సెకీ ఒప్పందాన్ని రద్దు చేయడం గురించి పల్లెత్తు మాట అనకపోవడం దారుణం.



– సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

లెక్కలు ఫుల్.. ఖజానా నిల్

బడ్జెట్‌లో లెక్కలు ఫుల్.. ఖజానా నిల్. ప్రజలను మభ్యపెట్టడానికి చేసిన ఓ పెద్ద ప్రయత్నం ఇది. రెవెన్యూలోటు రూ.33,185 కోట్లు, ద్రవ్యలోటు రూ.79,926 కోట్లు పూడ్చుకునేందుకు అప్పులు చేస్తారా? ఆస్తులు అమ్ముతారా? ప్రజలపై భారాలు మోపుతారా? అనేది ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. ఆనాడు వైఎస్ జగన్ హయాంలో రూ.4,21,201 కోట్ల అప్పు చేశారని చెప్పారు. మరిప్పుడు రూ.7 లక్షల కోట్లకు పైగా అప్పులు చేస్తున్నారు. ఎన్నికల వాగ్దానాలను పూర్తిగా విస్మరించినట్లేనా?



– సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

బీసీల ఇంటి నిర్మాణానికి అదనంగా రూ.లక్ష

మంత్రి పార్థసారథి వెల్లడి



సాక్షి, అమరావతి: బీసీల ఇంటి నిర్మాణానికి రూ.లక్ష అదనంగా ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం కేబినెట్ సమావేశం జరగ్గా ఆ వివరాలను మంత్రి మీడియాకు వెల్లడించారు. ప్రస్తుతం ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షలు చెల్లిస్తుండగా దీనికి అదనంగా బీసీలకు రూ.లక్ష, ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు చొప్పున అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలకు సంబంధించి ఇంకా రాష్ట్రంలో 5.5 లక్షల ఇళ్ల నిర్మాణాలు మొదలుకావాల్సి ఉందన్నారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా రూ.2,010 కోట్ల విలువైన 7,797 పనులను చేపట్టేందుకు కేబినెట్ ఆమోదం తెలిపిందని కూడా మంత్రి సారథి తెలిపారు. ఈ పనులన్నింటినీ తొమ్మిది నెలల్లో పూర్తిచేయాలన్నది లక్ష్యమన్నారు.


'ఆసరా'కు మనసొప్పలేదు

ఆరోగ్య ఆసరా పథకానికి ఉద్వాసన పలికిన చంద్రబాబు ప్రభుత్వం

2025-26 బడ్జెట్‌లో కేవలం రూ.లక్షే కేటాయింపు

బీమా రూపంలో ఆరోగ్యశ్రీ అమలుకు ఆసరాను చిదిమేసిన ప్రభుత్వం

పేదలకు చికిత్స అనంతరం చేదోడునిస్తూ గత ప్రభుత్వంలో ఆసరా అమలు



సాక్షి, అమరావతి: పేదరికాన్ని తరిమికొట్టి మీ జీవితాలను మార్చేస్తానంటూ తియ్యని మాటలతో బడుగులను నమ్మబలికిన చంద్రబాబు గద్దెనెక్కాక తన నిజస్వారూపాన్ని బయటపెట్టారు. గత ప్రభుత్వంలో అమలు చేసిన విద్య, వైద్యం, ఇతర సంక్షేమ కార్యక్రమాలకు కోత పెడుతూ పేదలపై ఆయనకున్నది కక్షేనని బహిర్గతం చేసుకున్నారు. ఇదే పరంపరలో ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొందిన రోగులకు కోలుకునే సమయంలో చేదోడుగా నిలిచే 'ఆరోగ్య ఆసరా' పథకాన్నీ చిదిమేశారు. ఆరోగ్యశ్రీ స్థానంలో బీమాను ప్రవేశపెట్టే క్రమంలో ఆసరాకు ఉద్వాసన పలకాలని గద్దెనెక్కిన రోజే చంద్రబాబు నిశ్చయించుకున్నారు. గతేడాది ఆగస్టు నెల నుంచే చికిత్స పొందిన రోగులకు ఆసరా చెల్లింపులు నిలిపివేశారు. ఈ బడ్జెట్‌లో ఆసరాకు కేవలం రూ.లక్ష కేటాయించి పేదల వ్యతిరేకినని మరోమారు రుజువు చేసుకున్నారు. ఈ పథకానికి గడిచిన రెండు ఆర్థిక సంవత్సరాల్లో 2023-24లో రూ.446 కోట్లు, 2024-25లో రూ.333 కోట్లు కేటాయించగా, ఈ బడ్జెట్‌లో పథకానికే గండి కొట్టేయడంపట్ల పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి.

ఐదేళ్లలో రూ.1,465 కోట్లు

పేద, మధ్య తరగతి వారు శస్త్ర చికిత్సల అనంతరం ఇంటి పట్టునే ఉండి విశ్రాంతి తీసుకోవాలంటే.. ఆ సమయంలో పనికి వెళ్లలేరు. తద్వారా ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయి. ఇబ్బందులు తట్టుకోలేక పూర్తిగా కోలుకోకుండానే పనులకు వెళ్లిపోతారు. దీంతో మళ్లీ జబ్బులు తిరగబెట్టే అవకాశం ఉంటుంది. ఇలాంటి ఆరోగ్య, ఆర్థిక సమస్యల నుంచి పేద, మధ్య తరగతి రోగులను ఆదుకోవాలనే సదుద్దేశంతో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 2019లో వైఎస్సార్ ఆరోగ్య ఆసరాను ప్రవేశపెట్టారు. ఈ పథకం కింద నెట్‌వర్క్ ఆస్పత్రిలో చికిత్స అనంతరం డిశ్చార్జి అయిన రోజే వైద్యులు సూచించిన విశ్రాంతి సమయానికి రోజుకు రూ.225 లేదా గరిష్ఠంగా నెలకు రూ.5 వేలు చొప్పున ప్రభుత్వం చెల్లించేది. రోగి/బంధువు ఖాతాల్లో డిశ్చార్జి అయిన 24 గంటల్లో ఆసరా సాయాన్ని జమ చేసే వారు. ఇలా ఐదేళ్లలో 24,59,090 మందికి రూ.1,465.67 కోట్ల మేర ఆర్థిక సాయం అందించారు.

ఆరోగ్యశ్రీకి ఖర్చు చేసింది కొంతే

కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఆరోగ్యశ్రీ పథకంపై నీలి నీడలు కమ్ముకున్నాయి. 2024-25 సంవత్సరానికి రూ.4 వేల కోట్లు ఆరోగ్య శ్రీ పథకానికి కేటాయించినట్లు బాబు ప్రభుత్వం గొప్పలు చెప్పింది. కానీ, ఖర్చు చేసింది రూ. 2700 కోట్లేనని బడ్జెట్‌లో ప్రకటించారు. ఇదే వైఎస్ జగన్ ప్రభుత్వంలో 2023-24లో రూ. 2,732 కోట్లు ఈ పథకం కోసం వెచ్చించారు. ఏటా పథకం ఖర్చులు పెరగాల్సింది పోయి తగ్గిపోవడం బాబు సర్కారులోనే సాధ్యమని పలువురు విమర్శిస్తున్నారు.

బాబు ప్రభుత్వ నిర్వాకం.. 2,450 ఎంబీబీఎస్ సీట్లు లాస్

పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్య అందించేందుకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 17 కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. వీటిలో ఐదు కళాశాలల్ని 2023-24 విద్యా సంవత్సరంలోనే ప్రారంభించి 750 ఎంబీబీఎస్ సీట్లను వైఎస్ జగన్ ప్రభుత్వం సమకూర్చింది. రెండో దశలో ఈ విద్యా సంవత్సరంలో ఐదు కొత్త కళాశాలలు, మూడో దశలో మరో ఏడు ప్రారంభం కావాల్సి ఉంది. కానీ, చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక కొత్త కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేట్‌కు కట్టబెట్టాలని నిర్ణయించింది. రెండు, మూడో దశలోని కాలేజీలను ప్రారంభించడంలేదని చెప్పింది. ఈ నేపథ్యంలో ఈ కళాశాలలకు బడ్జెట్‌లో కేటాయింపులు కూడా చేయలేదు.

ముందస్తు ప్రణాళిక ప్రకారం రెండో దశ కింద ఈ విద్యా సంవత్సరంలో పులివెందుల, మదనపల్లె, మార్కాపురం, ఆదోని, పాడేరు కళాశాలలు ప్రారంభమై, 750 సీట్లు అందుబాటులోకి రావాల్సి ఉంది. మూడో దశ కింద 2025-26 విద్యా సంవత్సరంలో పిడుగురాళ్ల, బాపట్ల, పార్వతీపురం, నర్సీపట్నం, పెనుకొండ, పాలకొల్లు, అమలాపురం కళాశాలలు ప్రారంభమై మరో 1050 సీట్లు సమకూరాల్సి ఉంది. ముందస్తు వ్యూహం ప్రకారం చంద్రబాబు ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం ప్రారంభం కావాల్సిన ఐదు కాలేజీలకు మోకాలడ్డింది. పులివెందుల కళాశాలను 50 సీట్లతో ప్రారంభించడానికి నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) అనుమతులు ఇచ్చినా, వాటిని రద్దు చేయాలని ప్రభుత్వమే లేఖ రాసింది. కేవలం పాడేరు కళాశాలకు మాత్రం 50 సీట్లు లభించాయి. 2025-26 విద్యా సంవత్సరానికి కొత్త వైద్య కళాశాలలకు అనుమతుల కోసం నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) దరఖాస్తుల స్వీకరణ కూడా ముగిసింది. అయినా ఒక్క వైద్య కళాశాలకు కూడా అనుమతుల కోసం ప్రభుత్వం దరఖాస్తు చేయలేదు. చంద్రబాబు ప్రభుత్వ నిర్వాకం కారణంగా 2024-25లో 700 సీట్లు, 2025-26లో 1,750 సీట్ల చొప్పున మొత్తంగా రెండేళ్లలో 2,450 సీట్లను మన విద్యార్థులు కోల్పోతున్నారు.

కేంద్రం సుముఖంగా ఉన్నా రాష్ట్రం వ్యతిరేకం



దేశంలో మెడికల్ పీజీ, ఎంబీబీఎస్ సీట్లను పెంచడానికి కేంద్ర ప్రభుత్వం సుముఖంగా ఉంది. ఇందు కోసం ఆర్థిక భారాన్ని పంచుకోవడానికి కూడా సిద్ధమని కేంద్రం పలుమార్లు ప్రకటించింది. ప్రభుత్వ రంగంలో మెడిసిన్ సీట్ల పెంపునకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వ్యతిరేకంగా ఉంది. కేంద్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వమే రాష్ట్రంలోనూ అధికారంలో ఉన్న పరిస్థితుల్లో కొత్త వైద్య కళాశాలలు ఏర్పాటై సీట్లు పెరుగుతాయని విద్యార్థులు ఎంతో ఆశలు పెట్టుకున్నారు. ఈ ఆశలను మరోమారు ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. బడ్జెట్‌లో కొత్త వైద్య కళాశాలలు, సీట్ల పెంపు ప్రస్తావనే లేకపోవడం దురదృష్టకరం.

– డాక్టర్ అంబటి నాగరాధ కృష్ణ యాదవ్, వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు

అప్పులతో దాగుడు మూతలు

నిజాలు దాచేసిన చంద్రబాబు కూటమి ప్రభుత్వం

మొత్తం అప్పుల వివరాలు చెప్పకుండా తొలిసారి బడ్జెట్ ఇన్ బ్రీఫ్

- వైఎస్ జగన్ హయాంలో కూటమి చెప్పిన అబద్ధాలను కప్పిపుచ్చుకునే యత్నం
- గ్రాఫిక్స్‌తో సరిపుచ్చుతూ తప్పుడు లెక్కలతో బడ్జెట్
- జనవరి నాటికే మార్కెట్ రుణాలు రూ.83 వేల కోట్లని స్పష్టం చేసిన కాగ్
- ఆర్థిక మంత్రి బడ్జెట్ లెక్కల్లో మాత్రం రూ.78,608 వేల కోట్లుగా సవరణ అంచనాలు
- గ్రాఫిక్స్‌లోనూ దాగని అప్పులు.. ఇప్పుడే భారీగా పెరిగినట్లు స్పష్టీకరణ
- మరోవైపు ప్రస్తుత బడ్జెట్‌లో అన్నీ కోతలే.. ఏకంగా రూ.20 వేల కోట్లు కోత
- మూల ధన వ్యయంపై తప్పుడు గణాంకాలతో సవరణ అంచనాలు
- బడ్జెట్‌లో కేటాయింపులు రూ.32,712 కోట్లు.. సవరించిన అంచనా రూ.24,072 కోట్లు
- కాగ్ గణాంకాల మేరకు జనవరి నాటికి వాస్తవ మూల ధన వ్యయం రూ.10,853 కోట్లే

కూటమి సర్కారు పేర్కొన్న జీఎస్‌డీపీలో అప్పుల శాతం

ఆర్థిక ఏడాది	అప్పులు	జీఎస్‌డీపీలో అప్పు శాతం
2021-22	3.78 లక్షల కోట్లు	31
2022-23	4.29 లక్షల కోట్లు	33
2023-24	4.91 లక్షల కోట్లు	35
2024-25	5.60 లక్షల కోట్లు	35
2025-26	6.40 లక్షల కోట్లు	35

సాక్షి, అమరావతి: అప్పుల వాస్తవాలను కూటమి సర్కారు దాచేసింది. వైఎస్ జగన్ హయాంలో అప్పులపై చంద్రబాబు అండ్ కో చెప్పిన అబద్ధాలను కప్పిపుచ్చుకోవడానికి మొత్తం అప్పుల వివరాలు బడ్జెట్ ఇన్ బ్రీఫ్‌లో చూపకుండా బడ్జెట్ చరిత్రలో తొలిసారి కూటమి సర్కారు ఎగ్గొట్టింది. ఇదే సర్కారు ప్రవేశపెట్టిన గత బడ్జెట్‌లో జగన్ హయాంలో అప్పులు ఎంతో తెలిసిపోయి, కూటమి నేతలు చెప్పినవన్నీ అవాస్తవాలని తేలిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇప్పుడు పూర్తి అప్పుల వివరాలు వెల్లడిస్తే గత ప్రభుత్వ అప్పులతో పాటు ఇప్పటి వరకు చంద్రబాబు సర్కారు చేసిన అప్పుల బాగోతం బయట పడుతుందని ఆ వివరాల జోలికే వెళ్లలేదు. బడ్జెట్ ఇన్ బ్రీఫ్‌లో ప్రజా రుణం పేరుతో గత ఐదేళ్లలో ఎక్కడి నుంచి ఎంత అప్పు చేసిందనే వివరాలు ఉంటాయి. ఆ వివరాలు తెలియకుండా ఉండాలని ప్రజా రుణం జీఎస్‌డీపీలో శాతం పేరుతో గ్రాఫిక్‌తో సరిపుచ్చింది. అయినా కూటమి సర్కార్ గ్రాఫిక్ ప్రకారం చూసినా 2023-24 నాటికి అప్పులు 4.91 లక్షల కోట్లు ఉండగా, 2025-26 నాటికి ఆ మొత్తం రూ.6.40 లక్షల కోట్లకు చేరుతున్నట్లు వెల్లడైంది. అంటే కూటమి సర్కారు రెండేళ్లలోనే రూ.1.49 లక్షల కోట్లు అప్పులు చేస్తున్నట్లు స్పష్టం అవుతోంది.

బడ్జెట్ అంచనాల్లో కోత

మరో పక్క ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సవరించిన అంచనాల్లో అప్పుల లెక్కలను కూడా



పొంతన లేకుండా పేర్కొంది. జనవరి నాటికే మార్కెట్ అప్పులు రూ.83,102 కోట్లు చేసినట్లు కాగ్ నెలవారీ గణాంకాలు స్పష్టం చేయగా, ఆర్థిక మంత్రి ప్రస్తుత ఆర్థిక ఏడాదికి సవరించిన అంచనా మార్కెట్ రుణాల అప్పు రూ.78,608 కోట్లుగా చెప్పడం గమనార్హం. వాస్తవంగా జనవరి వరకు కాగ్ చెప్పిన లెక్కలతో పాటు ఫిబ్రవరిలో చేసిన మార్కెట్ రుణాలతో ఇప్పటికే బడ్జెట్ అప్పులే రూ.89,940 కోట్లకు చేరాయి. వాస్తవాలు ఇలా ఉంటే సవరించిన అంచనాల్లో పొంతన లేని గణాంకాలను ఆర్థిక మంత్రి చూపెట్టారు. ప్రస్తుత ఆర్థిక ఏడాది సవరించిన బడ్జెట్ అంచనాల్లో రూ.20 వేల కోట్లు కోత పెట్టారు. రూ.2.94 లక్షల కోట్ల బడ్జెట్‌ను సవరించిన అంచనాల్లో రూ.2.74 లక్షల కోట్లకు తగ్గించేశారు.

మంగళవారం మరో రూ.3,600 కోట్ల అప్పు

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వచ్చే మంగళవారం మరో రూ.3,600 కోట్లు అప్పు చేయనుంది. 9 ఏళ్ల కాలవ్యవధితో రూ.1,000 కోట్ల అప్పు, పదేళ్ల కాలవ్యవధితో 1,000 కోట్లు, 11ఏళ్ల కాలవ్యవధితో రూ.1,600 కోట్ల అప్పు కోసం మార్చి 4న సెక్యూరిటీల వేలం వేయనున్నట్లు ఆర్‌బీఐ శుక్రవారం తెలిపింది. కూటమి ప్రభుత్వం ఫిబ్రవరి 4న రూ.5,820 కోట్లు, 25న రూ.1,000 కోట్ల అప్పు చేసింది.

మూల ధన వ్యయంలోనూ కోత

బడ్జెట్‌లో రూ.32,712 కోట్లు మూల ధన వ్యయం చేస్తామని చెప్పారు. ఇప్పుడు సవరించిన అంచనాల్లో దానిని రూ.24,072 కోట్లకు తగ్గించేశారు. జనవరి వరకు కాగ్ నెల వారీ గణాంకాల్లో మూల ధన వ్యయం రూ.10,853 కోట్లుగా పేర్కొన్నారు. 2 నెలల్లోనే రూ.14 వేల కోట్లు వ్యయం చేస్తామని సవరించిన అంచనాల్లో పేర్కొనడం నమ్మశక్యంగా లేదని ఆర్థిక వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. 2023-24లో వ్యవసాయ రంగానికి రూ.10,214 కోట్లు వ్యయం చేస్తే, కూటమి ప్రభుత్వం 2024-25లో రూ.12,534 కోట్లు కేటాయింపులు చేసి, ఇప్పుడు సవరించిన అంచనాల్లో సగం మేర రూ.6,150 కోట్లు కోత విధించింది. గ్రామీణాభివృద్ధికి 2023-24లో రూ.15,463 కోట్లు వ్యయం చేశారు. కూటమి ప్రభుత్వం 2024-25లో ఈ రంగానికి బడ్జెట్‌లో రూ.17,438 కోట్లు కేటాయించి సవరించిన అంచనాల్లో రూ.12,896 కోట్లకు తగ్గించేసింది.

ఐదేళ్లలో జీఎస్‌డీపీలో రెవెన్యూ లోటు, ద్రవ్యలోటు శాతం

వివరం	2021-22	2022-23	2023-24	2024-25	2025-26
జీఎస్‌డీపీ (రూ.కోట్లలో)	11,31,629	13,09,464	14,22,094	16,06,109	18,25,000
రెవెన్యూ లోటు శాతం	0.76	3.32	2.72	3.01	1.82
ద్రవ్య లోటు శాతం	2.21	4.01	4.41	4.57	4.38


ఇంటి స్థలం లేదు.. ఇల్లూ లేదు...

బడ్జెట్‌లో.. చంద్రబాబు ఇచ్చిన హామీ ఊసే లేదు

పట్టణాల్లో 2, గ్రామాల్లో 3 సెంట్ల స్థలం ఇస్తామంటూ ఊదరగొట్టిన కూటమి నేతలు



సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రభుత్వానికి రాష్ట్రంలోని నిరుపేదల గూడు గోడు పట్టడం లేదు. తాము అధికారంలోకొస్తే 'పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల స్థలాలు పంపిణీ చేస్తాం. ఇప్పటికే పట్టాలు పొందిన వారికి పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తాం' అంటూ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన చంద్రబాబు.. గద్దెనెక్కాక పేదలకు మొండి చేయి చూపారు. సొంతింటి కలను సాకారం చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ఎదురుచూసిన నిరుపేదలకు నిరాశే మిగిలింది. గతేడాది ప్రవేశపెట్టిన 2024-25 బడ్జెట్ తరహాలోనే శుక్రవారం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌లోనూ పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ ప్రస్తావనే లేకుండా పోయింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా పేదలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద కేంద్రం నుంచి అందే సాయం ఆధారంగా 2024-25లో పేదల ఇంటి నిర్మాణానికి రూ.4,012 కోట్లు కేటాయించారు. ఈ నిధులను పూర్తి స్థాయిలో పేదల ఇంటి నిర్మాణానికి ఖర్చు పెట్టడంలో ప్రభుత్వం తీవ్రంగా విఫలమైంది. కేటాయించిన నిధుల్లో కేవలం 40 శాతం రూ.1,611 కోట్లను మాత్రమే ఖర్చు పెట్టింది.



గత ప్రభుత్వ ఘనత కూడా కూటమి ప్రభుత్వ ఖాతాలోకి..

కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో పేదలకు కొత్తగా ఇళ్లను మంజూరు చేసిన దాఖలాల్లేవు. అలాంటిది గతేడాది జూన్‌లో అధికారం చేపట్టిన నాటి నుంచి ఏడు నెలల్లో 1.15 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసినట్టు బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రకటించింది. పేదలకు ఇంటి స్థలాలు పంపిణీ చేయలేదు.. కొత్తగా ఇళ్లు కూడా మంజూరు చేయలేదు. ఇలా ఏమీ చేయకుండానే చంద్రబాబు ప్రభుత్వంలో గాలిలో ఇళ్లను కట్టేసిందా అని పేదలు చర్చించుకుంటున్నారు. ఈ క్రమంలో వాస్తవాలను ఓ సారి గమనిస్తే.. గత వైఎస్ జగన్ ప్రభుత్వంలో మంజూరు చేసి, దాదాపు నిర్మాణం పూర్తయిన ఇళ్లను కూటమి ఖాతాలో వేసుకుందని చిన్న పిల్లాడికి సైతం అర్థమవుతోంది. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకం కింద గత ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా 31 లక్షల మందికి పైగా పేదలకు ఉచితంగా ఇళ్ల స్థలాలు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. తద్వారా 17 వేలకు పైగా వైఎస్సార్, జగనన్న కాలనీల రూపంలో కొత్తగా ఊళ్లనే నెలకొల్పారు. జగనన్న కాలనీల్లో 19 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణానికి అనుమతులిచ్చారు. వీటికి టిడ్కో ఇళ్లు 2.62 లక్షలు అదనం. కాగా, ఎన్నికలు ముగిసే నాటికి 9 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి ప్రభుత్వం లబ్ధిదారులకు అందజేసింది. ఇక సాధారణ ఇళ్లలో 8 లక్షలకు పైగా వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. వీటిలో 1.28 లక్షలు స్లాబ్ పూర్తయిన, 99 వేల ఇళ్లు స్లాబ్ దశలో.. అంటే తుది దశ నిర్మాణంలో ఉన్నాయి. వీటిలో చాలా వరకూ తుది దశ నిర్మాణాలు కూడా పూర్తయినప్పటికీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో స్టేజ్ అప్‌డేట్ చేయని పరిస్థితి. వీటిని స్టేజ్ కన్వర్షన్‌లు చేసి తామే నిర్మించేశామని ప్రభుత్వ పెద్దలు చెప్పుకోవడాన్ని చూసి జనం నవ్వుకుంటున్నారు.

సాక్షి | శనివారం | 1 | మార్చి | 2025
విజయవాడ | www.sakshi.com

దగా బాబు... మెగా మోసం...

బడ్జెట్ 2025-26



అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారులు	రూ.20 వేల చొప్పున కేటాయించాల్సిన మొత్తం	దీంతో లబ్ధి కలిగే వారి సంఖ్య
53.58 లక్షలు	రూ. 10,717 కోట్లు	31.50 లక్షలు
	కేటాయించిన మొత్తం	**ఇంకా మిగిలిపోయే లబ్ధిదారుల సంఖ్య**
	రూ. 6,300 కోట్లు	22.08 లక్షలు

అమరావతి గ్రాఫిక్స్ లాంటి బడ్జెట్



బడ్జెట్ అనేది జనానికి పనికొచ్చేదిగా ఉండాలే తప్ప కోట్లు పోసి తెచ్చుకున్న కన్సల్టెంట్స్‌తో కలర్ ఫుల్ గ్రాఫిక్స్‌తో నింపేసి పీపీటీల మాదిరిగా ఉండకూడదు. సూపర్ 6 హామీల అమలు కోసం ప్రజలంతా ఆశగా ఎదురు చూస్తే.. వాటి ఊసే లేకుండా తుస్సుమనిపించారు. పోనీ వీరు చెప్పినట్టు ఇండస్ట్రీస్‌ని అయినా అభివృద్ధి చేసి ఉద్యోగాలన్నా ఇస్తారా అంటే అది అబద్ధం అని తేలిపోయింది. ఏపీ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ పాలసీ 4.0 ఆవిష్కరించినప్పుడు ఐదేళ్లలో 30 లక్షల కోట్ల పెట్టుబడులు, మరో 10 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ప్రకటించారు. అంటే ఏడాదికి 6 లక్షల కోట్లు సాధించాలి. కానీ ఎంఎస్ఎంఈ, ఇండస్ట్రీ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు ప్రోత్సాహకాల కోసం బడ్జెట్‌లో కేటాయించింది కేవలం రూ.1400 కోట్లు. అంటే 0.25 శాతమే.

- తలకోల రాహుల్ రెడ్డి, ఆర్థిక రంగ కన్సల్టెంట్

నమ్మించి నయ వంచన!



ప్రతి రైతుకూ రూ.20 వేలు ఇస్తామంటూ సూపర్ సిక్స్ హామీ

రైతు సంక్షేమాన్ని విస్మరించిన కూటమి ప్రభుత్వం

- అన్నదాత సుఖీభవకు కావాల్సింది రూ.10,717 కోట్లు
- బడ్జెట్‌లో కేటాయించింది కేవలం రూ.6,300 కోట్లే
- ఈ లెక్కన 22.08 లక్షల మందికి పెట్టుబడి సాయం ఇవ్వలేమని స్పష్టీకరణ
- ప్రకృతి వైపరీత్యాల సహాయ నిధికి కేటాయింపులు నిల్..
- వైఎస్ జగన్ ప్రభుత్వంలో అమలైన పథకాలనే వల్లె వేసిన మంత్రి
- ఫిషింగ్ హార్బర్లు, ఫిష్ ల్యాండింగ్ జెట్టీలకు కేటాయింపులు శూన్యం
- ధరల స్థిరీకరణ నిధికి అత్తెసరు కేటాయింపు.. ఉచిత పంటల బీమాకు మంగళం
- స్వచ్ఛంద బీమా నమోదు పథకానికి అరకొర కేటాయింపులు
- సున్నా వడ్డీ రాయితీ పథకానికి అడ్డగోలుగా కోతలు

సాక్షి, అమరావతి : ఆచరణ సాధ్యం కాని హామీలతో అందలమెక్కిన టీడీపీ కూటమి ప్రభుత్వం అనుకున్నట్టుగానే అన్నదాతలకు మొండి చేయి చూపింది. 'ఎవరికో పుట్టిన బిడ్డను నా బిడ్డ అని చెప్పుకుంటున్నారు. రైతులకు జగన్ కేవలం రూ.7,500 చొప్పునే ఇస్తున్నారు. మిగతా ఆరు వేలు కేంద్రమే ఇస్తోంది. అదే మాకు అధికారం ఇస్తే తొలి ఏడాది నుంచే ప్రతి రైతుకు మేమే రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తాం' అంటూ ప్రజాగళంలో చంద్రబాబు గొప్పగా ప్రకటించారు. తీరా ఆచరణకు వచ్చేసరికి అన్నదాతలకు పంగనామాలు పెడుతున్నారు. రైతు సంక్షేమ ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటూ.. వార్షిక బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి కేటాయించింది కేవలం నాలుగు శాతం మాత్రమే కావడం గమనార్హం. రూ.3.22 లక్షల కోట్ల వార్షిక బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి కేవలం రూ.12,401 కోట్లు కేటాయించడం పట్ల రైతుల నుంచి ఆందోళన వ్యక్తమవుతోంది. గతేడాది నవంబర్‌లో ప్రవేశపెట్టిన తొలి ఏడాది బడ్జెట్‌లో అన్నదాత సుఖీభవ పథకానికి మొక్కుబడిగా రూ.1,000 కోట్లు కేటాయించారు. ఓ వైపు వైపరీత్యాలు, మరోవైపు మార్కెట్‌లో ధరలు లేక తీవ్రంగా నష్టపోయిన తమకు ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడి సాయం ఎంతో కొంత ఊరటనిస్తుందని రైతులు ఆశగా ఎదురు చూశారు. కానీ పగ్గాలు చేపట్టి తొమ్మిది నెలలు గడిచినా తొలి ఏడాదికి సంబంధించి పైసా పెట్టుబడి సాయం విదిల్చ లేదు. వాస్తవానికి రాష్ట్రంలో రైతు భరోసా లబ్ధిదారులు 53,58,368 మంది ఉన్నారు. ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున జమ చేయాలంటే బడ్జెట్‌లో రూ.10,717 కోట్లు కేటాయించాలి. కానీ కేటాయించింది కేవలం రూ.6,300 కోట్లే. ఈ మొత్తం రూ 20 వేల చొప్పున అర్హులైన రైతులకు చెల్లిస్తే కేవలం 31.50 లక్షల మందికి మాత్రమే సరిపోతుంది. అంటే వాస్తవ లబ్ధిదారుల్లో 22.08 లక్షల మందికి పెట్టుబడి సాయం అందదు. మరో పక్క కౌలు రైతులకు తామే పూర్తిగా పెట్టుబడి సాయం అందిస్తామని గొప్పలు చెబుతున్న ప్రభుత్వం.. పెట్టుబడి సాయంలో ఇలా రూ.4,417 కోట్ల మేర కోత పెట్టడం పట్ల రైతాంగం నుంచి నిరసన వ్యక్తం అవుతోంది.

ఆర్‌ఎస్‌కేలు, అగ్రి ల్యాబ్‌ల నిర్వహణకు కేటాయింపులు నిల్

ఆర్బీకే, ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌ల నిర్వహణకు బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు చేయలేదు. ఆర్బీకేలను కుదించాలని ఇప్పటికే నిర్ణయానికి వచ్చిన ప్రభుత్వం అగ్రి ల్యాబ్‌లను పీ–4 పద్ధతిలో ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తున్నామని ఇటీవలే ప్రకటించింది. అందువల్లే వీటి నిర్వహణకు కేటాయింపులు జరపలేదనే వాదన విన్పిస్తోంది. ధరల స్థిరీకరణ నిధికి వైఎస్ జగన్ హయాంలో రూ.3 వేల కోట్లు కేటాయిస్తే, చంద్రబాబు ప్రభుత్వం రూ.300 కోట్లు విదిల్చింది. విపత్తుల బారిన పడి పంటలు నష్టపోయిన రైతులకు అండగా నిలిచేందుకు ప్రకృతి వైపరీత్యాల సహాయ నిధి కింద గత జగన్ ప్రభుత్వం రూ.2 వేల కోట్లు కేటాయిస్తే, చంద్రబాబు ప్రభుత్వం బడ్జెట్‌లో పైసా కూడా కేటాయించ లేదు. విత్తన రాయితీ పథకానికి గతేడాది రూ.268 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది పెంచకపోగా రూ.240 కోట్లకు కుదించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పాడి రైతులకు పశువుల మేత కోసం బంజరు భూముల కేటాయింపు కోసం నిధులు, గోపాల మిత్రల పునర్నియామకం ఊసే లేదు. రాయితీపై సోలార్ పంపు సెట్ల ఏర్పాటుకు కూడా నిధులు కేటాయించలేదు. రైతు కూలీలకు కార్పొరేషన్ స్థాపించి రాయితీలు, సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్న హామీ ప్రస్తావన లేదు. పట్టు పరిశ్రమకు 2023–24 బడ్జెట్‌తో పోల్చితే భారీగా కోత పెట్టింది. ఉచిత పంటల బీమా పథకాన్ని రద్దు చేసి, స్వచ్ఛంద బీమా నమోదు పథకం తీసుకొచ్చారు. ఈ పథకానికి రూ.1,023 కోట్లు మాత్రమే కేటాయించారు. గత ప్రభుత్వంలో ఉచిత పంటల బీమా కోసం ఏటా రూ.1,700 కోట్లు కేటాయించారు. అలాగే వడ్డీ లేని పంట రుణాల కోసం వైఎస్ జగన్ సర్కారు హయాంలో ఏటా రూ.500 కోట్లు కేటాయించగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ మొత్తాన్ని సగానికి సగం తగ్గించింది. కేవలం రూ.250 కోట్లు మాత్రమే కేటాయించింది. ఉచిత పంటల బీమా పథకాన్ని కొనసాగించడం వల్ల ఖరీఫ్ 2024–25 లో 69.51 లక్షల ఎకరాలకు బీమా కవరేజ్ పొందగా, స్వచ్ఛంద బీమా నమోదు పథకాన్ని అమలు చేయడంతో రబీ 2024–25 సీజన్లో కేవలం 7.65 లక్షల మంది రైతులు 9.93 లక్షల ఎకరాలకు మాత్రమే కవరేజ్ పొందగలిగారు. గడిచిన రబీ సీజన్‌తో పోల్చుకుంటే మూడో వంతు రైతులకు కూడా రక్షణ లేకుండా పోయింది.

పాత లబ్ధిదారులకే వేట నిషేధ భృతి

గద్దెనెక్కగానే వేటకు వెళ్లే ప్రతి మత్స్యకారునికి రూ.20 వేల చొప్పున వేట నిషేధ భృతి ఇస్తామని హామీ ఇచ్చారు. 2024–25 సీజన్‌కు 1,30,128 మంది అర్హత పొందగా, వారికి రూ.260.26 కోట్లు జమ చేయాల్సి ఉంది. కాని ఏడాది గడిచినా పైసా విదల్చలేదు. అనర్హులున్నారంటూ రీ సర్వే పేరిట అర్హులను తొలగించి, తమ పార్టీ సానుభూతిపరులను చేర్చి 1,22,968 మంది అర్హత పొందినట్టుగా లెక్క తేల్చారు. వారికి రూ.245.94 కోట్లు జమ చేయాలని ప్రతిపాదనలు పంపారు. అదే విషయాన్ని బడ్జెట్‌లో ప్రస్తావించారు. కానీ 2025–26 సీజన్‌లో వేటకు వెళ్లే మత్స్యకారులకు నిషేధ భృతి కోసం కేటాయింపులు జరపక పోవడం విస్మయానికి గురిచేస్తోంది. ఆక్వా, నాన్ ఆక్వాజోన్‌తో సంబంధం లేకుండా ఆక్వా రైతులందరికీ యూనిట్ విద్యుత్ రూ.1.50కే సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. అర్హత కలిగిన 68,134 ఆక్వా కనెక్షన్లకు విద్యుత్ సబ్సిడీ విస్తరిస్తున్నట్టు ప్రకటించినప్పటికీ ఆ మేరకు కేటాయింపులు జరపలేదు. ఎప్పటిలోగా అమలు చేస్తామన్న స్పష్టతా ఇవ్వలేదు. మరో వైపు ఆక్వా రైతులకు సబ్సిడీపై ఏరియేటర్స్, సబ్సిడీపై ట్రాన్స్ ఫార్మర్స్ ఏర్పాటు, కోల్డ్ స్టోరేజీల నిర్మాణం వంటి హామీలపై పైసా కేటాయింపు జరపక పోవడంపై ఆక్వా రైతులు మండిపడుతున్నారు.

మత్స్య యూనివర్సిటీకి మొండి చేయి

ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయంతో పాటు వైఎస్సార్ ఉద్యాన, శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయాలకు అరకొరగానే కేటాయింపులు జరిపారు. ఆంధ్రప్రదేశ్ మత్స్య యూనివర్సిటీకి కేవలం రూ.38 కోట్లు మాత్రమే కేటాయించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఈ యూనివర్సిటీకి పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం సమీపంలో 400 ఎకరాల్లో రూ.332 కోట్ల అంచనాతో భవన నిర్మాణాలకు ప్రతిపాదించారు. రూ.100 కోట్లతో పరిపాలన భవనం, అకడమిక్ బ్లాక్, బాలుర, బాలికల హాస్టల్స్, రైతు శిక్షణా కేంద్రం, వైస్ చాన్సలర్ బంగ్లా నిర్మాణ పనులు చేపట్టారు. ఈ వర్సిటీకి గతేడాది పైసా ఖర్చు చేయలేదు. ఈ ఏడాది పైసా కేటాయింపులు జరపలేదు. మరోవైపు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫిషింగ్ హార్బర్లు, ఫిష్ ల్యాండింగ్ జెట్టీల నిర్మాణానికి సైతం పైసా కేటాయించలేదు. దీంతో వీటి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది.

మాటలకు, కేటాయింపులకు పొంతన లేదు..

వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం.. వార్షిక బడ్జెట్‌లో ఈ రంగానికి కేటాయించిన నిధులు కేవలం నాలుగు శాతం మాత్రమే. రాయితీ విత్తనం కోసం గతేడాది రూ.268 కోట్లు కేటాయిస్తే.. ఈ ఏడాది రూ.240 కోట్లు కేటాయించారు. వడ్డీలేని రుణాలకు రూ.250 కోట్లు కేటాయించడం విచిత్రం. ఓ వైపు పంటలకు ధరల్లేక రైతులు నష్టపోతుంటే బడ్జెట్‌లో మాత్రం ధరల స్థిరీకరణ నిధికి కేవలం రూ.300 కోట్లు కేటాయించడం దారుణం.



- కె.ప్రభాకరరెడ్డి, కార్యదర్శి.. ఏపీ రైతు సంఘం

కౌలు రైతులకు మొండిచేయి..

వ్యవసాయ బడ్జెట్‌లో కౌలు రైతులకు మొండి చేయి చూపారు. కౌలు రైతుల సంక్షేమం కోసం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. అధికారంలో కొచ్చి 9 నెలలవుతున్నా కౌలు చట్టం తీసుకురానే లేదు. పంటలను అమ్ముకునే వెసులుబాటు లేక కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా పరిహారం వంటి సంక్షేమ ఫలాలు కూడా వారికి అందడం లేదు.



- జమలయ్య, ప్రధాన కార్యదర్శి.. ఏపీ కౌలు రైతు సంఘం

ఉపాధి హామీకి తూట్లు పొడవడమే

గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయడం దుర్మార్గం. వ్యవసాయ కార్మికులకు పనిలేని సమయంలో 100 రోజుల ఉపాధి కల్పించడమే ఈ పథకం లక్ష్యం. అలాంటి పథకాన్ని వ్యవసాయంతో అనుసంధానించడమంటే ఈ పథకానికి తూట్లు పొడవమే. బడ్జెట్ కేటాయింపుల్లో వ్యవసాయ కార్మికులను నిర్లక్ష్యం చేయడాన్ని నిరసిస్తూ మార్చి 12న రాష్ట్రవ్యాప్తంగా మహాధర్నా చేస్తాం.



- వి.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి.. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం

మత్స్య వర్సిటీకి నిధులేవి?

ఆక్వా రంగానికి ఆయువుపట్టుగా ఉన్న ఆంధ్రప్రదేశ్ మత్స్య యూనివర్సిటీకి బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం అన్యాయం. యూనివర్సిటీ భవన నిర్మాణాలు పూర్తి చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. యూనివర్సిటీ పూర్తి స్థాయిలో ఏర్పాటైతే విస్తృత స్థాయిలో పరిశోధనలు జరిపేందుకు అవకాశం ఉంటుంది.



- షేక్ అలీహుస్సేన్, డైరెక్టర్, అకాడమి ఫర్ సస్టెయినబుల్ ఇంటిగ్రేటెడ్ లివింగ్ సంస్థ

గిరిజన సంక్షేమంపై నిర్లక్ష్యం

రాష్ట్ర బడ్జెట్ కేటాయింపుల్లో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరిగింది. వారి సంక్షేమంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని ఈ బడ్జెట్ కేటాయింపుల ద్వారా మరోసారి రుజువైంది. సబ్‌ప్లాన్, గిరిజన విద్య, వైద్య రంగాలకు తగిన కేటాయింపులు చేయలేదు. గత బడ్జెట్ కన్నా ఎక్కువ కేంద్ర ప్రభుత్వ నిధులను కలిపి చూపించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నించింది. గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడం దారుణం. ట్రైబల్ సబ్‌ప్లాన్ నిధుల కేటాయింపులోనూ మొండి చేయిచూపడమంటే గిరిజనులను దారుణంగా మోసం చేయడమే.



- గుండా సురేంద్ర, ఏపీ ట్రైకార్ మాజీ చైర్మన్

వేతన జీవులను విస్మరించారు..

బడ్జెట్‌లో వేతన జీవులను పూర్తిగా విస్మరించారు. ఎలాంటి జీవో ఇవ్వకుండానే అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ అమలు చేసిన ఘనత తమదేనని చెప్పుకోవడాన్ని చూస్తే గడ్డి చూపించి గుర్రాన్ని పరిగెత్తించడంలా ఉంది. ఆశా వర్కర్ల జీతాల పెంపుపై ఎలాంటి ప్రస్తావన చేయలేదు. రాష్ట్రంలోని లక్షలాది మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు తమకు మినిమం టైమ్‌స్కేల్, ఉద్యోగాలు పర్మినెంట్ అవుతాయని పెట్టుకున్న ఆశలపై కూటమి ప్రభుత్వం నీళ్లు జల్లింది. రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు పీఆర్సీ, ఐఆర్ ఊసేలేదు.

- ఏవీ నాగేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు, సీఐటీయూ

తెలుగు భాషాభివృద్ధికి నిధుల కేటాయింపు సంతోషకరం

ఎంపీ అప్పలనాయుడు

సాక్షి, అమరావతి: బడ్జెట్‌లో తెలుగు భాషాభివృద్ధికి రూ.10 కోట్లు కేటాయించడం సంతోషకరమైన విషయమని విజయనగరం ఎంపీ అప్పలనాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఫార్మర్ అండ్ అగ్రిటెక్‌కు ప్రాధాన్యం

వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన మంత్రి అచ్చెన్నాయుడు



సాక్షి, అమరావతి: 'వ్యవసాయ అనుబంధ రంగాలే రాష్ట్రానికి గ్రోత్ ఇంజన్లు.. వీటిలో ఏటా 15 శాతం వృద్ధి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. 11 వ్యవసాయ, ఉద్యాన పంటలను గుర్తించి వాటి దిగుబడులతో పాటు ప్రకృతి సాగు విస్తీర్ణం పెంచడం లక్ష్యంగా కార్యాచరణ రూపొందించాం. ఫార్మర్ అండ్ అగ్రిటెక్ అనే సూత్రంతో స్వర్ణాంధ్ర–2047 సాధన దిశగా ముందుకెళ్తున్నాం' అని వ్యవసాయ శాఖమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.48,341.14 కోట్లతో ప్రతిపాదించిన బడ్జెట్‌ను శుక్రవారం అసెంబ్లీలో ఆయన ప్రవేశపెట్టారు.

22.86 శాతం వృద్ధిరేటు సాధించాం

2024–25లో ఏపీ జీఎస్‌డీపీ మొదటి ముందస్తు అంచనాల ప్రకారం వ్యవసాయ జీవీఏ రూ.57,187 కోట్లు (22.86 శాతం)గా నమోదైందని మంత్రి చెప్పారు. 2024–25లో సాయిల్ హెల్త్ అండ్ ఫెర్టిలిటీ పథకం కింద రూ.13.09 కోట్ల ఖర్చుతో 4.30 లక్షల భూసార పరీక్ష పత్రాలను రైతులకు అందించామన్నారు. 2025–26లో 6 లక్షల పత్రాలను ఇస్తామన్నారు. ''వెట్ కెమిస్ట్రీ స్థానంలో డ్రై కెమిస్ట్రీ పద్ధతి అమలులోకి తెస్తున్నాం. 2025–26లో 5.98 లక్షల హెక్టార్లలో రైతులకు రాయితీపై సూక్ష్మ పోషకాల పంపిణీ చేస్తాం. రాష్ట్రానికి అవసరమైన 41.38 లక్షల టన్నుల ఎరువులు సరఫరా చేస్తున్నాం. 2 లక్షల టన్నుల బఫర్ స్టాక్ ఏర్పాటు చేస్తున్నాం. గ్యాప్ ఇండియా ఆర్గానిక్ సర్టిఫికేషన్ ద్వారా 4.76 లక్షల హెక్టార్లలో 10.38 లక్షల మంది రైతులకు ధ్రువీకరణ చేస్తున్నాం. నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ పథకం కింద 3 వేల కొత్త పంచాయతీల్లో 2570 క్లస్టర్ల పరిధిలో ప్రకృతి సాగును విస్తరిస్తున్నాం. ఈ పథకం కింద 15 లక్షల రైతు కుటుంబాలతో రూ.6.5 లక్షల హెక్టార్లలో ప్రకృతి సాగు విస్తరిస్తాం.ఈ ఏడాది 50 శాతం రాయితీపై చిన్న, సన్నకారు రైతులకు వ్యవసాయ పరికరాలతో పాటు 80 శాతం రాయితీపై 875 కిసాన్ డ్రోన్స్ ఏర్పాటు చేస్తున్నాం. 2025–26లో మరో వెయ్యి డ్రోన్లు అందిస్తాం' అని మంత్రి చెప్పారు.

బడ్జెట్ డొల్ల.. రైతులు గుల్ల..

వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేలా కేటాయింపులు

- బడ్జెట్‌లో ఆర్బీకేల ఊసేలేదు.. ఉచిత విద్యుత్ కనెక్షన్లు లేనట్లే
- 'అన్నదాత సుఖీభవ'లోనూ మోసమే
- ధరల స్థిరీకరణ నిధికి కేవలం రూ.300 కోట్లే..
- రైతులు మద్దతు ధర మీద ఆశలు వదులుకోవాల్సిందే
- అదే వైఎస్సార్‌సీపీ హయాంలో ధరల స్థిరీకరణ నిధికి రూ.3వేల కోట్లు
- మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



సాక్షి, అమరావతి : టీడీపీ కూటమి ప్రభుత్వం శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతులు కాడి వదిలేసే పరిస్థితి వస్తుందని, ఇందుకు కేటాయింపులూ అలాగే ఉన్నాయని మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. అన్నదాత సుఖీభవకు కేటాయింపులు చూస్తే లబ్ధిదారులను తగ్గించే కుట్ర కనిపిస్తోందని చెప్పారు. పంటలకు మద్దతు ధరలేక ఒకవైపు రైతులు అల్లాడిపోతుంటే వారి గురించి పట్టించుకోకుండా ధరల స్థిరీకరణ నిధికి కేవలం రూ.300 కోట్లు కేటాయించడాన్ని ఆయన ఆక్షేపించారు. ఇకపై రైతులు మద్దతు ధర కోరుకోవడం ఎండమావే అవుతుందన్నారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తన పదవిని కాపాడుకోవడానికి లోకేశ్‌ను కీర్తించే స్థాయికి దిగజారిపోయారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గతం మోసం .. వర్తమానం మోసం.. భవిష్యత్తు నాలుగేళ్లు కూడా మోసమే అన్నట్లుగా ఈ బడ్జెట్ ఉందన్నారు. కాకాణి ఇంకా ఏమన్నారంటే..

అన్నదాత సుఖీభవ పేరుతో దగా..

విత్తనం నుంచి అమ్మకం వరకు గత వైఎస్సార్‌సీపీ పాలనలో రైతులకు అండగా నిలబడితే నేడు కూటమి పాలనలో వారికి కష్టాలు తప్పడంలేదు. రాష్ట్రంలో వ్యవసాయ రంగంపై 62 శాతం మంది ఆధారపడ్డా.. చంద్రబాబు వ్యవసాయాన్ని మళ్లీ దండగ చేస్తున్నారనే మాటను నిజం చేసేలా ఈ బడ్జెట్ కేటాయింపులున్నాయి. 'అన్నదాత సుఖీభవ'కు కేటాయింపులు చూస్తే ఎంతమంది రైతులను మోసం చేయడానికి సిద్ధంగా ఉన్నారో అర్థమవుతుంది. ఈ పథకానికి రూ.10,700 కోట్లకు పైగా అవసరం కాగా, కేవలం రూ.6,300 కోట్లే కేటాయించి మిగతాది కేంద్రం ఇచ్చే దాంట్లో సర్దుబాటు చేస్తామంటున్నారు. ఇంతకన్నా మోసం ఇంకోటి ఉంటుందా? (నాడు రైతుభరోసాపై చంద్రబాబు విమర్శల వీడియో ప్రదర్శించారు). ధరల స్థిరీకరణ నిధి కింద నాడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.3 వేల కోట్లు కేటాయించింది. ఇప్పుడు అందులో పదో వంతు మాత్రమే ప్రతిపాదించారు. దీని వల్ల రైతులకు ఎలాంటి ఉపయోగం ఉండదు.

ఆర్బీకేలను నిర్వీర్యం చేసే కుట్ర..

ఇక ఆధునిక వ్యవసాయ పద్ధతులను గత ప్రభుత్వంలో రైతులకు పరిచయం చేసి విత్తనం నుంచి అమ్మకం వరకు వారికి అండగా నిలిచిన రైతుభరోసా కేంద్రాల (ఆర్బీకే) ఊసే బడ్జెట్‌లో కనిపించలేదు. వీటిని నిర్వీర్యంచేసే కుట్రలో భాగమే ఇదంతా. అలాగే, ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ రుణాల పథకాలకూ చంద్రబాబు పూర్తిగా మంగళం పాడేశారు. కేవలం 6,667 బోర్లు వేస్తామని చెప్పడం చూస్తే వైఎస్ జగన్ తీసుకొచ్చిన ఉచిత బోర్ల పథకాన్ని సైతం నిర్వీర్యం చేసినట్లే కనిపిస్తోంది. అలాగే, ఉచిత విద్యుత్ స్థానంలో సోలార్ విద్యుత్ ఇస్తామని చెబుతున్నారు. భవిష్యత్తులో ఉచిత విద్యుత్ పథకాన్ని నీరుగార్చేందుకే ఇదంతా చేస్తున్నారు.

హెరిటేజ్‌కు లబ్ధి చేకూర్చాలన్నదే లక్ష్యం

ఇక గత వైఎస్సార్‌సీపీ పాలనలో పాడి రైతులకు ఎంతో మేలుచేసిన అమూల్ సంస్థ పేరే బడ్జెట్‌లో ఎత్తకపోవడం చూస్తుంటే హెరిటేజ్‌కి లబ్ధిచేకూర్చాలన్న లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. మొత్తం మీద బడ్జెట్ డొల్ల.. రైతులు గుల్ల.. అనేలా ఈ వ్యవసాయ బడ్జెట్ ఉంది. అంతేకాదు.. ప్రచారం మోత.. పథకాలకు కోత.. ప్రజలకు వాత.. ఇది మన తలరాత.. అని బాధపడాల్సిన బడ్జెట్ ఇది. అందుకే ఈ బడ్జెట్‌ను వైఎస్సార్‌సీపీ వ్యతిరేకిస్తోంది.

పర్యాటకంలో దోచుకో.. పంచుకో!

- ఏపీ టూరిజం అథారిటీకీ రూ.171 కోట్లు కేటాయింపు
- ఇందులో ఈవెంట్లు, ఫంక్షన్ల కోసమే రూ.150 కోట్లు
- పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల శాఖకు రూ.460 కోట్లు
- ఏపీటీడీసీ బడ్జెట్‌లో భారీగా కోత
- కేవలం రూ.64 లక్షలు మాత్రమే ప్రతిపాదన



సాక్షి, అమరావతి : దేశ పర్యాటక రంగంలో ఏపీని అగ్రస్థానంలో నిలపుతానన్న సీఎం చంద్రబాబు మాటలు ఒట్టి కోతలని తేలిపోయింది. 2025–26 బడ్జెట్‌లో ఏపీ పర్యాటక అభివృద్ధి కంటే తాత్కాలిక ఈవెంట్ల నిర్వహణకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు స్పష్టమైంది. పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల శాఖకు మొత్తంగా రూ.460 కోట్లు కేటాయించారు. ఇందులో పర్యాటక శాఖలో తమ అనుయాయుల కంపెనీలకు ఈవెంట్, ఫంక్షన్ కాంట్రాక్టులు దక్కేలా చేసి, వారికి లబ్ధి చేకూర్చేలా ఏపీ టూరిజం అథారిటీకి రూ.171 కోట్లు కేటాయించగా.. అందులో రూ.150 కోట్లు ఒక్క ఈవెంట్ల నిర్వహణకే ఇవ్వడం గమనార్హం. ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ)ను నిర్లక్ష్యం చేసింది. సంస్థ స్వయం సమృద్ధి సాధించడం ద్వారా సింహ భాగం ఉద్యోగుల జీతాలు, ఇతర ఖర్చులను ఏపీటీడీసీ ఆదాయం నుంచే భరించేది. ప్రభుత్వం నుంచి ఏటా సుమారు రూ.2.50 కోట్ల వరకు కేటాయింపులుండేవి. కానీ, ఈ బడ్జెట్‌లో వాటిని రూ.64 లక్షలకు కుదించేసింది. తద్వారా ఏపీటీడీసీపై తీవ్ర ఆర్థిక భారం పడనుంది. ఏపీటీడీసీలో అన్ని స్థాయిల్లో ఉద్యోగులకు జీతాల కింద నెలకు రూ.4 కోట్ల వరకు ఖర్చవుతుంది. రెగ్యులర్ ఉద్యోగులకు రూ.50–60 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వం కేటాయించే మొత్తం సుమారు ఐదారు నెలల వరకు రెగ్యులర్ ఉద్యోగులకు జీతాలు చెల్లించేందుకు వీలుగా ఉండేది. ఇప్పుడు నిధులు తగ్గడంతో ఏపీటీడీసీపై ఆర్థిక భారం పెరగనుంది. ఇక 40 కొత్త పర్యాటక ప్రాజెక్టుల కోసమని రూ.50 కోట్లు కేటాయించారు. అంటే ఒక్కో ప్రాజెక్ట్ ఆధునికీకరణకు రూ.కోటికి మించి కేటాయించలేని దుస్థితి. ఇలా పర్యాటక శాఖ, భవానీ ఐలాండ్ టూరిజం కార్పొరేషన్, శిల్పారామం సొసైటీకి కలిపి రూ.230 కోట్లు కేటాయింపులు చేసింది. క్రీడలు, యువజన సర్వీసులు, పురావస్తు శాఖ, కల్చరల్ కమిషన్‌కు కలిపి మరో రూ.230 కోట్ల వరకు కేటాయింపులు ప్రతిపాదించింది.

దగా బాబు... మెగా మోసం...

బడ్జెట్ 2025-26





అబద్ధాల్లో ప్రభుత్వం పీహెచ్‌డీ



మైనార్టీ సంక్షేమ శాఖపై కూటమి ప్రభుత్వ తీరు చూస్తే అబద్ధాలను చెప్పి ప్రజలను నమ్మించడంలో పీహెచ్‌డీ చేసినట్టుంది. ఇమామ్, మౌజన్లకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏడాది పాటు గౌరవ వేతనం చెల్లించలేదని కూటమి ప్రభుత్వం చెప్పడం సరికాదు. ఎన్నికల ముందు వరకు వైఎస్ జగన్ ప్రభుత్వం **ఇమామ్, మౌజన్లకు** గౌరవ వేతనం పెంచి అందించింది. ఎన్నికలతో పది నెలలుగా బకాయిలు ఉంటే ఆరు నెలలకు విడుదల చేసిన కూటమి ప్రభుత్వం మొత్తం చెల్లించినట్టు పచ్చి అబద్ధాలు చెబుతోంది. మసీదు నిర్వహణకు రూ.5 వేలు ఇస్తామని, ఇమామ్, మౌజన్లకు వేతనం పెంచి ఇస్తామన్న కూటమి హామీ నిలబెట్టుకోవాలి.

-ముస్లిం మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా

ప్రజలను మభ్యపెట్టే బడ్జెట్



తిరుపతి సిటీ: అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌పై తిరుపతి వైఎస్సార్‌సీపీ ఎంపీ మద్దిల గురుమూర్తి శుక్రవారం మండిపడ్డారు. ఈ బడ్జెట్‌తో ప్రజలకు ఎటువంటి ఉపయోగం లేదన్నారు. ఇది ప్రజలను మభ్యపెట్టే బడ్జెట్ అని విమర్శించారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలకు నిధుల కేటాయింపులను చూసినట్లయితే లబ్ధిదారుల సంఖ్యలో భారీగా కోత పడుతుందనే వాస్తవాలని చెప్పకనే చెబుతున్నారు. ప్రజలు, ప్రతిపక్ష పార్టీ నుంచి వస్తోన్న ఒత్తిళ్లను తట్టుకోలేక రెండు పథకాలకు నిధులు కేటాయించినట్టు కనిపిస్తున్నారు. సూపర్ సిక్స్ హామీల్లో మిగిలిన పథకాలకు మోక్షమెప్పుడో చెప్పలేదని మండిపడ్డారు.

- వైఎస్సార్‌సీపీ ఎంపీ గురుమూర్తి

ఆప్కాస్ ఉద్యోగులకు మొండిచేయి

పొరుగుసేవల సిబ్బందికి ఎంతో కొంత ఊరటగా ఉన్న 'ఆప్కాస్' వ్యవస్థను రద్దుచేస్తున్నట్లు ఫిబ్రవరి 6న జరిగిన మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. లక్ష మందికి పైగా ఉన్న ఆప్కాస్ కార్మికులు, తమకు టైంస్కేల్ జీతాలు చెల్లించి, ఉద్యోగాలు పర్మినెంట్ చేస్తుందని ఈ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆశించారు. కానీ టీడీపీ కూటమి ప్రభుత్వం వారి ఆశలను అడియాసలుగా మిగిల్చింది. బడ్జెట్‌లో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల జీతాలపెంపు, సంక్షేమ పథకాలు అమలు ప్రస్తావనలేదు.

- ఏపీ పౌర సరఫరాల సమస్త హమాలీల రాష్ట్ర యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర నేతలు కె.ఉమామహేశ్వరరావు, ఆర్.కృష్ణ, ఎస్.ఉదయం భాస్కరరావు

పల్లెను చిదిమేశారు!

నాడు ఊరికో సచివాలయం, ఆర్బీకే, డిజిటల్ లైబ్రరీ

ఆధునిక సౌకర్యాలతో విలేజ్ క్లినిక్, పాఠశాలలూ కళకళ

బడ్జెట్‌లో వీటి ఊసెత్తని ప్రభుత్వం.. గ్రామీణుల ఆగ్రహం



సాక్షి, అమరావతి : పల్లెలు కళ తప్పుతున్నాయి. టీడీపీ కూటమి ప్రభుత్వంలో కళావిహీనంగా తయారవుతున్నాయి. బడ్జెట్‌లో పల్లెల ప్రగతి కోసం పైసా కూడా కేటాయించకపోవడం పట్ల గ్రామీణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో పల్లె ప్రగతికి బాటలు పడ్డాయి. 2 వేల జనాభా కలిగిన ప్రతి గ్రామంలో ఓ సచివాలయం, ఆ పక్కనే రైతుల కోసం ప్రత్యేకంగా రైతు భరోసా కేంద్రం, పల్లెవాసుల ఆరోగ్య పరిరక్షణ కోసం విలేజ్ క్లినిక్, పిల్లల చదువుల కోసం డిజిటల్ లైబ్రరీ.. నాడు-నేడు ద్వారా ఆధునిక సౌకర్యాలతో రంగు రంగుల స్కూళ్లు.. ఇలా గ్రామ స్వరూపాన్నే మార్చేశారు. ప్రతి గ్రామంలో కోట్ల రూపాయల ఆస్తులు ఏర్పాటు చేశారు. ఈ విధంగా రూ.4,750 కోట్లతో 10,893 సచివాలయ భవనాలు మంజూరు చేయగా, 9,585 సచివాలయాల భవన నిర్మాణాలు చేపట్టి, 6,879 సచివాలయాలు పూర్తి చేసి అప్పగించారు. రూ.575 కోట్లతో 3,589 డిజిటల్ లైబ్రరీల నిర్మాణం చేపట్టారు. నాడు-నేడు పథకం కింద గ్రామాల్లో ఉండే పాఠశాలల రూపురేఖలు మార్చేందుకు శ్రీకారం చుట్టి.. తొలి విడతలో రూ.3,669 కోట్లతో 15,715 స్కూళ్ల్‌ను అభివృద్ధి చేశారు. రెండో విడతలో రూ.8 వేల కోట్లతో 22,344 పాఠశాలలు, 447 జూనియర్ కళాశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. రూ.1,726 కోట్లతో 8,299 విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం చేపట్టి, 3,104 భవనాల నిర్మాణం పూర్తి చేశారు. రూ.2,446 కోట్లతో 10,216 ఆర్బీకేల నిర్మాణం చేపట్టగా, దాదాపు రూ.1,300 కోట్లు ఖర్చు చేసి 5,333 ఆర్బీకే భవనాలు పూర్తి చేసి అప్పగించారు. రూ.281 కోట్లతో 1,589 బల్క్ చిల్లింగ్ సెంటర్లు నిర్మించారు. నిర్మాణంలో ఉన్న మిగిలిన భవనాలన్నీ దాదాపు 70-80 శాతం పూర్తయ్యాయి. కొద్దిపాటి నిధులు కేటాయిస్తే వీటి నిర్మాణం పూర్తవుతుంది. అలాంటిది బడ్జెట్‌లో వీటి ప్రస్తావన మాట మాత్రంగా కూడా లేకపోవడం విచారకరం. గతేడాది బడ్జెట్‌లో పైసా కేటాయించలేదు. కనీసం ఈ ఏడాదైనా నిధుల కేటాయింపులుంటాయని భావించారు. వీటిని పూర్తి చేస్తే వైఎస్ జగన్‌కు మంచి పేరొస్తుందనే దురాలోచనతోనే ఇలా నిర్లక్ష్యం చేశారని ప్రజలు మండి పడుతున్నారు.

10 నుంచి అమరావతి నిర్మాణ పనులు ప్రారంభం

పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ వెల్లడి



సాక్షి, అమరావతి: రాజధాని అమరావతి నిర్మాణ పనులను ఈనెల 10 నుంచి ప్రారంభిస్తామని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. పురపాలక శాఖకు బడ్జెట్‌లో పెద్దపీట వేస్తూ రూ.13,862 కోట్లు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. అందులో రూ.6వేల కోట్లు సీఆర్డీఏకు కేటాయించారని తెలిపారు. శుక్రవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఏప్రిల్ 1 నుంచి ఏ మున్సిపాల్టీలో ప్రజలు చెల్లించే పన్నులు ఆ మున్సిపాల్టీనే ఖర్చు చేసుకునే అవకాశం కల్పిస్తామన్నారు. గత ప్రభుత్వం అమృత్ పథకం కింద కేంద్రం ఇచ్చిన రూ. 8,500 కోట్లు వినియోగించుకోలేకపోయిందని, మ్యాచింగ్ ఫండ్ ఇవ్వకపోవడమే దానికి కారణమన్నారు. రాజధాని అమరావతి నిర్మాణ పనుల అంచనాలు, టెండర్లు నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నామన్నారు. మూడేళ్లలో రాజధాని నిర్మాణం పూర్తిచేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని తెలిపారు. అమరావతి సీడ్ కేపిటల్ నుంచి 16వ నంబర్ జాతీయ రహదారికి కలిపే రోడ్ల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తామని వివరించారు.

ఇదేనా స్పీడ్?



చెల్లించాల్సిన పారిశ్రామిక ప్రోత్సాహకాలు రూ.11,000 కోట్లు

- బడ్జెట్‌లో ఊసేలేని ప్రోత్సాహకాల కార్పస్ ఫండ్
- కానీ, కేటాయింపులు రూ.1,000 కోట్లు మాత్రమే
- కడప స్టీల్‌ప్లాంట్‌కు ఈ ఏడాదీ ఒక్క రూపాయీ విదల్చని సర్కారు
- వచ్చే ఏడాదికి నామమాత్రంగా రూ.25 కోట్లు కేటాయింపు
- ఫిషింగ్ హార్బర్లు, ఫిష్‌ల్యాండ్ సెంటర్లకు రూ.4 వేలే..
- పోర్టుల వద్ద అదనపు భూసేకరణకు నిధుల కేటాయింపులో ప్రాధాన్యం

సాక్షి, అమరావతి: 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కాదు.. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై దృష్టిసారించాం.. ఇక నుంచి ఏ ఏడాది పారిశ్రామిక రాయితీలు ఆ ఏడాదే విడుదల చేస్తాం. పారిశ్రామికవేత్తలకు నమ్మకం కలిగించడం కోసం ఒక ఎస్క్రో ఖాతా తెరిచి అందులో ప్రోత్సాహక నిధులు వేస్తాం'.. అని సీఎం చంద్రబాబునాయుడు పారిశ్రామిక పాలసీల విడుదల సందర్భంగా ఘనంగా ప్రకటించుకున్నారు. కానీ, ఈ మాటలు ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ విన్నట్లు, చూసినట్లు లేరు. ఎందుకంటే.. సీఎం చెప్పిన మాటలకు, బడ్జెట్‌లో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు చేసిన కేటాయింపులకు ఎక్కడా పొంతనలేదు. 2025-26 బడ్జెట్‌లో స్పీడ్ ఆఫ్ బిజినెస్‌లో భాగంగా ప్రోత్సాహకాల కోసం ఎటువంటి కార్పస్ ఫండ్‌ను ఏర్పాటుచేయలేదు. పైగా.. చెల్లించాల్సిన పారిశ్రామిక ప్రోత్సాహకాలు రూ.11,000 కోట్లు ఉన్నాయని స్వయంగా బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్న ఆర్థికమంత్రి దానికి అనుగుణంగా కేటాయింపులు చేయకపోవడం గమనార్హం. పారిశ్రామిక ప్రోత్సాహకాల కింద మొక్కుబడిగా రూ.1,000 కోట్లు మాత్రమే కేటాయించడంపై పారిశ్రామికవేత్తలు రగిలిపోతున్నారు.

గత బడ్జెట్ కేటాయింపుల్లో భారీగా కోత..

ఇక 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో పరిశ్రమల రంగానికి బడ్జెట్‌లో రూ.2,270.78 కోట్లు కేటాయిస్తే సవరించిన అంచనాల్లో ఈ మొత్తాన్ని రూ.822.81 కోట్లకు తగ్గించేశారంటే పారిశ్రామిక రంగంపై కూటమి సర్కారుకున్న ప్రాధాన్యత స్పష్టమైంది. అలాగే, వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.2,418.57 కోట్లు కేటాయించారు. పారిశ్రామిక ప్రోత్సాహకాలకు రూ.1,000.24 కోట్లు, ఎంఎస్ఎంఈల ప్రోత్సాహకానికి రూ.200 కోట్లు, ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక ప్రోత్సాహకాలకు రూ.200 కోట్లు, ఫుడ్ ప్రాసెసింగ్‌కు రూ.75 కోట్లు, ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగంలో రూ.3,000 కోట్లు కేటాయించారు. కడప స్టీల్ ప్లాంట్‌కు గత బడ్జెట్‌లో రూ.25 కోట్లు కేటాయించగా ఒక్క రూపాయి కూడా ఖర్చుచేయలేదు. మళ్లీ ఇప్పుడు వచ్చే సంవత్సరానికి రూ.25 కోట్లు కేటాయించారు.

ఫిషింగ్ హార్బర్లు, ఫిష్‌ల్యాండ్ సెంటర్లకు రూ.4వేలే..

ఇదిలా ఉంటే.. రాష్ట్రంలో తొమ్మిది ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్‌ల్యాండ్ సెంటర్ల నిర్మాణానికి మరీ హీనంగా రూ.4,000 మాత్రమే బడ్జెట్‌లో టీడీపీ కూటమి ప్రభుత్వం కేటాయించింది. దీనినిబట్టి మత్స్యకారులపై ఈ సర్కారుకున్న చిత్తశుద్ధి ఏంటో స్పష్టమైంది.?

పోర్టులు, ఎయిర్‌పోర్టుల వద్ద స్థల సేకరణపై దృష్టి..

ఇదిలా ఉంటే.. మచిలీపట్నం పోర్టు వద్ద 10,070 ఎకరాల సేకరణకు రూ.150 కోట్లు, భావనపాడు (మూలపేట) పోర్టు వద్ద 6,410 ఎకరాలు సేకరించడానికి రూ.100 కోట్లు, రామాయపట్నం పోర్టు వద్ద 506 ఎకరాల సేకరణకు రూ.100 కోట్లు కేటాయిస్తూ బడ్జెట్‌లో ప్రతిపాదించారు. అలాగే..

- భోగాపురం ఎయిర్‌పోర్టు వద్ద 40 ఎకరాల భూసేకరణతో పాటు రహదారులు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడానికి రూ.190 కోట్లు కేటాయించారు.
- అదే విధంగా కుప్పం ఎయిర్‌పోర్టు నిర్మాణానికి 444 ఎకరాలు, దగదర్తి ఎయిర్‌పోర్టు వద్ద 418 ఎకరాల సేకరణకు రూ.30 కోట్లు కేటాయించారు.
- విజయవాడ ఎయిర్‌పోర్టుకు రూ.29.88 కోట్లు, కర్నూలు ఎయిర్‌పోర్టు నిర్వహణకు రూ.15.29 కోట్లు, వీజీఎఫ్ కింద విమాన సర్వీసులు నిర్వహించడానికి రూ.30 కోట్లు కేటాయించారు.
- ఇక విశాఖ-చెన్నై కారిడార్‌లో భాగంగా ఏడీబీ నిధులతో చేపడుతున్న వివిధ ప్రాజెక్టులకు నామమాత్రపు కేటాయింపులు చేశారు.
- ఐటీ రంగానికి రూ.533.72 కోట్లు, నైపుణ్య శిక్షణకు రూ.462.68 కోట్లు కేటాయించారు.

'టోల్' బాదుడు !

- పీపీపీ విధానంలో రోడ్ల నిర్మాణం
- రహదారులకు అరకొర కేటాయింపులు



సాక్షి, అమరావతి: రాష్ట్ర, జిల్లా రహదారులపైనా టోల్ ఫీజుల బాదుడుకు రంగం సిద్ధమైంది. ఇక రోడ్డు ఎక్కితే వాహనదారులకు 'టోల్' బాధ తప్పదు. ఇప్పటికే పలు రాష్ట్ర, జిల్లా ప్రధాన రహదారులను పీపీపీ విధానంలో నిర్మించేందుకు టెండర్ల ప్రక్రియ చేపట్టిన ప్రభుత్వం.. బడ్జెట్‌లో కేటాయింపుల ద్వారా మరోసారి ఈ విషయాన్ని స్పష్టం చేసింది. టీడీపీ ప్రభుత్వం 2024-25 బడ్జెట్‌లో ఆర్ అండ్ బీ శాఖకు రూ.9,554 కోట్లు కేటాయించగా.. 2025-26 వార్షిక బడ్జెట్‌లో మాత్రం రూ.8,785 కోట్లే కేటాయించింది. అందులో రోడ్ల నిర్మాణానికి నిధుల కేటాయింపులను పరిశీలిస్తే కూటమి ప్రభుత్వ కనికట్టు బట్టబయలైంది. కీలకమైన గ్రామీణ రహదారులు, గోదావరిపై వంతెన నిర్మాణం, కడప యాన్యూటీ పనులకు గత ప్రభుత్వం కేటాయించిన నిధుల కంటే బాబు సర్కార్ అతి తక్కువ నిధులు కేటాయించింది.

- రైల్వే పనులకు సంబంధించిన రోడ్లు, వంతెనల నిర్మాణం, రాష్ట్ర, జిల్లా ప్రధాన రహదారులు, ఇతర రహదారులు, రహదారి భద్రత పనులు, తుంగభద్ర పుష్కర పనులు తదితరాలకు కలిపి ప్రభుత్వం కేవలం రూ.1,183 కోట్లే కేటాయించింది.
- ఆర్ఐఏడీ కింద మారుమూల ప్రాంతాలకు రోడ్ల నిర్మాణం, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి నిధులు, ఎన్‌డీబీ బ్యాంకు రుణ సహాయం, ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన, గ్రామీణ రోడ్లు, ఎన్ఆర్ఈజీపీ నిధులతో రోడ్ల నిర్మాణం కోసం రూ.820.96 కోట్లే కేటాయించింది. వీటికి గత ప్రభుత్వం 2023-24లో రూ.1,481.59 కోట్లు కేటాయించడం గమనార్హం.
- గోదావరిపై వంతెన నిర్మాణం, కడప యాన్యుటీ పనులు, రాష్ట్ర ప్రధాన రహదారుల నిర్మాణ పనులకు రూ.1,040 కోట్లే కేటాయించింది.

కార్మికులకు మొండిచేయి

ఎన్నికలకు ముందు కార్మికులకు అనేక హామీలిచ్చిన బాబు

- వాటి ప్రస్తావనే లేకుండా 2025-26 బడ్జెట్
- 2024-25లో చంద్రన్న బీమాకు రూ.280 కోట్ల కేటాయింపు.. ఖర్చు చేసింది సున్నా

సాక్షి, అమరావతి: 'ఏరు దాటాక' చందంగా పీఠమెక్కాక కార్మికులను చంద్రబాబు పూర్తిగా విస్మరించారు. అధికారంలోకి వచ్చి, ఇప్పటికి రెండు బడ్జెట్‌లు ప్రవేశపెట్టిన చంద్రబాబు.. హామీలను పట్టించుకోలేదు. శుక్రవారం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌లోనూ వీటి ప్రస్తావన లేదు. పేదల కోసం చంద్రన్న బీమా పథకం ప్రవేశపెడతామని, దీని కింద సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాదవశాత్తు మరణించిన కుటుంబాలకు రూ.10 లక్షలు బీమా అందిస్తామని కూటమి మేనిఫెస్టోలో చెప్పింది. 2024-25 బడ్జెట్‌లో చంద్రన్న బీమా పథకానికి రూ. 280 కోట్లు కేటాయించిన ప్రభుత్వం నయా పైసా కూడా ఖర్చు పెట్టలేదు. దీంతో ప్రమాదాల్లో క్షతగాత్రులైన వారు, కుటుంబ యజమానిని కోల్పోయిన కుటుంబాలు ప్రభుత్వ సాయం అందక ఆర్థికంగా అవస్థలు పడుతున్నాయి. చంద్రబాబు ప్రభుత్వం వచ్చి 9 నెలలవుతున్నా ఇంకా విధివిధానాలను నిర్ణయించే పనుల్లో ఉన్నామంటూ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల ప్రకటించడంపైనా పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి.

'నేను సీఎం అయితే కార్మిక వర్గానికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తాం
డ్రైవర్ల కోసం 'డ్రైవర్ సాధికార సంస్థ' ఏర్పాటు చేస్తాం
అన్ని వర్గాల డ్రైవర్లకు ప్రమాద బీమా, హెల్త్ ఇన్సూరెన్స్ ఇస్తాం.. రుణాలిస్తాం
భవన నిర్మాణ బోర్డ్ పునరుద్ధరిస్తాం
ముఠా కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డ్ ఏర్పాటు చేస్తాం'
.. ఎన్నికల్లో ఓట్ల కోసం చంద్రబాబు ఇచ్చిన హామీలివి.

కొట్టొచ్చినట్టు కనిపిస్తున్న నిర్లక్ష్యం

రాష్ట్రంలో అసంఘటిత రంగ కార్మికులు 1.8 కోట్ల మంది ఉన్నట్టు ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయి. ఈ-శ్రమ్ పోర్టల్‌లో 81 లక్షల మందికిపైగా నమోదయ్యారు. వీరిలో 56 శాతం మహిళలు, 44 శాతం పురుషులు ఉన్నారు. కార్మిక శాఖ గుర్తించని వారు లక్షల్లోనే ఉంటారు. ఈ పేదల సంక్షేమం విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం బడ్జెట్ లెక్కల్లో కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. 2024-25కి కార్మిక శాఖకు రూ.700 కోట్ల మేర కేటాయించిన ప్రభుత్వం.. అందులో 40 శాతం అంటే రూ.280 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది.

వలంటీర్ల వ్యవస్థకు మంగళం!

వరుసగా రెండో బడ్జెట్‌లోనూ కేటాయింపుల్లేవు

- దీంతో 2.66 లక్షల మంది కుటుంబాలు వీధిపాలు
- టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే వీరికి వేతనాలు బంద్
- తొమ్మిది నెలలుగా ఆందోళన చేస్తున్నా స్పందించని సర్కారు



సాక్షి, అమరావతి : రాష్ట్రంలో పైరవీలు, పక్షపాతానికి తావులేకుండా ఐదేళ్ల పాటు లబ్ధిదారుల ఇళ్ల వద్దనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించి దేశవ్యాప్తంగా ప్రశంసలందుకున్న వలంటీర్ల వ్యవస్థను కూటమి ప్రభుత్వం అటకెక్కించేసింది. గత ఏడాది ఎన్నికల ముందు.. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తాం, వారి గౌరవ వేతనం రెట్టింపు చేస్తామని ఊరూవాడా హోరెత్తించిన కూటమి పెద్దలు అధికారంలోకి వచ్చాక ఆ వ్యవస్థను చిదిమేశారు. తాజాగా.. ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపాదనల్లోనూ నిధులు కేటాయించకపోవడంతో 2.66 లక్షల మంది వలంటీర్ల కుటుంబాలు రోడ్డునపడినట్లయింది.

నిరుద్యోగ యువతకు పెద్దఎత్తున ఉపాధి..

టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు వరకు విజయవంతంగా కొనసాగిన వలంటీర్ల వ్యవస్థ ద్వారా పేద నిరుద్యోగ యువత పెద్దఎత్తున ఉపాధి పొందారు. అప్పట్లో 20-25 ఏళ్ల మధ్య వయస్సు వారు 27 శాతం మంది, 26-30 ఏళ్ల మధ్య వారు 36 శాతం, 31-35 ఏళ్ల మధ్య వారు 28 శాతం కలిపి మొత్తం 91 శాతం మంది 35 ఏళ్లలోపు వారే 'వలంటీర్'గా ఉపాధి పొందారు. మరోవైపు.. వలంటీర్లుగా అప్పటి ప్రభుత్వం నియమించిన వారిలో 49 శాతం మంది బీసీలు, 27 శాతం మంది ఎస్సీలు, ఏడు శాతం మంది ఎస్టీలున్నారు. అలాగే, మొత్తం మీద 1,25,781 మంది మహిళలు ఉపాధి పొందారు.

తొమ్మిది నెలలుగా ఆందోళన చేస్తున్నా..

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వలంటీర్ వ్యవస్థపై తీవ్ర విమర్శలు చేసిన చంద్రబాబు గత ఏడాది ఎన్నికల ముందు ఉగాది పండుగ రోజున.. తాము అధికారంలోకి వస్తే వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని హామీ ఇవ్వడంతో పాటు ప్రస్తుతం వారి గౌరవ వేతనాన్ని రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతామని ఊదరగొట్టారు. అయితే, జూన్‌లో అధికారంలోకి వచ్చాక ఆ నెల నుంచి వలంటీర్ల వేతనాలను ప్రభుత్వం నిలిపివేసింది. అంతేకాక.. అప్పటివరకూ అన్ని రకాల విధులు నిర్వహించిన వీరిని ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టేసింది. దీంతో వలంటీర్లు చంద్రబాబు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తునే ఉన్నారు. అయినా, ఈ సర్కారుకు చీమ కుట్టినట్లు కూడా లేదు.

వలంటీర్ల వ్యవస్థ కొనసాగిస్తాం

తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిగా మీకు (వలంటీర్లకు) హామీ ఇస్తున్నాం. మీ ఉద్యోగాలు తీసేయం. వలంటీర్ల వ్యవస్థ కొనసాగిస్తామని మరొక్కసారి మీ అందరికీ హామీ ఇస్తున్నా. ఉగాది పండుగరోజున తీపి కబురు మీ అందరికీ ఇస్తాం. రూ.ఐదువేలు కాదు.. రాబోయే రోజుల్లో పదివేల రూపాయల పారితోషికం ఇచ్చే బాధ్యత మాది. అది బిగినింగ్.

2024 ఉగాది పండుగ రోజున పార్టీ నిర్వహించిన ఉగాది వేడుకల్లో చంద్రబాబు

ప్రజల భద్రతపైనా చిన్నచూపు

- పోలీస్ శాఖ ఆధునికీకరణపై శ్రద్ధలేని బాబు సర్కారు
- బడ్జెట్‌లో అరకొరగా నిధుల కేటాయింపు

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో శాంతి-భద్రతల పరిరక్షణపై సీఎం చంద్రబాబు మాటలు కోటలు దాటుతున్నా.. అడుగులు గడప దాటడం లేదని 2025-26 వార్షిక బడ్జెట్ మరోసారి వెల్లడించింది. హోమ్ మంత్రిత్వ శాఖకు ప్రభుత్వం కేవలం రూ.8,570 కోట్లు మాత్రమే కేటాయించింది. కానీ అందులో అత్యధికంగా పోలీస్ శాఖ జీతభత్యాలకే సరిపోతుంది. పోలీస్ శాఖ ఆధునికీకరణ, మౌలిక వసతుల కల్పన తదితర వాటికి అరకొర కేటాయింపులతో సరిపెట్టారు. ఆ కేటాయింపుల్లో ప్రధానమైనవి ఇలా ఉన్నాయి..

మహిళా భద్రతకు కేవలం	రూ.13.64 కోట్లు...
పోలీస్‌స్టేషన్ల ఆధునికీకరణకు కేవలం	రూ.కోటి
క్రైమ్-క్రిమినల్ ట్రాకింగ్ సిస్టం కోసం	రూ.12 కోట్లు
ఫోరెన్సిక్ ల్యాబొరేటరీలకు	రూ.47.97 కోట్లు
పోలీస్ భవనాల నిర్మాణానికి	రూ.60 కోట్లు
జైళ్ల నిర్మాణానికి	రూ.40 లక్షలు
పోలీసు బలగాల ఆధునికీకరణకు కేవలం	రూ.10.44 కోట్లు
అగ్నిమాపక శాఖ భవనాలు, ఆధునికీకరణకు	రూ.64 కోట్లు
(ఇందుకోసం కేంద్రం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తుంది)	
ఏపీ పోలీస్ అకాడమీకి	రూ.11.20 కోట్లు

దగా బాబు... మెగా మోసం...

బడ్జెట్ 2025-26



2024-25 బడ్జెట్‌లో ప్రాజెక్టులకు
రూ.16,705.32 కోట్లు

సవరించిన బడ్జెట్‌లో కేటాయింపులు
రూ.10,798.56 కోట్లు

సవరించిన బడ్జెట్‌లో కోత
రూ.5,906.76 కోట్లు

మొత్తంగా కేటాయింపుల్లో కోత
35.36%

దీనిని బట్టి ప్రాజెక్ట్‌లకు ఈ బడ్జెట్‌లో కేటాయించిన నిధులు ఖర్చు చేస్తారన్న నమ్మకం లేనట్టే..

కార్మికులకు ఒనగూరిందేమీ లేదు



చంద్రబాబు ప్రభుత్వ బడ్జెట్‌లో కార్మికులకు ఒనగూరిందేమీ లేదు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల ప్రస్తావనే ఈ బడ్జెట్‌లో లేదు. కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి. కార్మికుల పట్ల ప్రభుత్వ వైఖరికి నిరసనగా బడ్జెట్ సమావేశాలు ముగిసేలోగా విజయవాడలో పెద్ద ధర్నా చేపడతాం.

– ఆర్‌వీ నరసింహారావు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి

ఇరిగేషన్‌కు ప్రాధాన్యత

బడ్జెట్‌లో ఇరిగేషన్ రంగానికి ప్రాధాన్యత ఇచ్చారు. 2027 డిసెంబర్ నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసేలా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయి. రాయలసీమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసే హంద్రీ–నీవా సుజల స్రవంతి ప్రాజెక్టుకు పెద్ద పీట వేశాం. వెలిగొండ పూర్తి చేయడం ద్వారా అత్యంత వెనుకబడిన, ఫ్లోరైడ్ బాధితులున్న ప్రకాశం జిల్లా వాసుల చిరకాల కోరిక నెరవేరుతుంది.



చింతలపూడి ఎత్తిపోతల పథకంలో గత ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్ది, బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇస్తున్నాం. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులు ప్రారంభించేలా బడ్జెట్ కేటాయించాం.

– మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు

వాస్తవానికి దూరం

ఈ బడ్జెట్ వాస్తవానికి దూరంగా ఉంది. ధరల స్థిరీకరణ గురించి చెప్పలేదు. కౌలు రైతులకు రుణాలెలా ఇస్తారో చెప్పలేదు. మిర్చి మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద రూ.11,780 కంటే ధర తగ్గితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరి సగం ఇస్తామంటున్నారు. కానీ అసలు ధర రూ.13 వేలకు పైగానే ఉంది.



5 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటి సంగతేంటి? అన్నదాత సుఖీభవకు సగం డబ్బులే కేటాయించారు. తల్లికి వందనం ఎంతమంది పిల్లలకు ఇస్తారో స్పష్టత ఇవ్వలేదు.

– ఐ. వెంకటేశ్వరరావు, పీడీఎఫ్ ఎమ్మెల్సీ

అంకెలు చూసి మోసపోవద్దు

అంకెలు చూసి బడ్జెట్ బాగుందని మోసపోవద్దు. కేటాయింపులకు అనుగుణంగా ఖర్చు చేయడం లేదు. ఈ బడ్జెట్ అమలు అనుమానమే. కొన్ని పథకాలు కొన్నేళ్ల మాత్రమే అమలు చేస్తున్నారు. ఎంత మందికి ఎలా ఇస్తున్నారు, ఏ పథకాలకు ఎంతెంత ఖర్చు చేస్తున్నారనే వివరాలు లేవు. జాబ్ క్యాలెండర్ లేదు. నిరుద్యోగ భృతి లేదు. పీఆర్సీ, ఐఆర్, ఫిట్‌మెంట్ ఊసెత్తలేదు.



– కేఎస్ లక్ష్మణరావు, పీడీఎఫ్ ఎమ్మెల్సీ

నిరాశకు గురిచేసింది

ఉపాధ్యాయులు, ఉద్యోగులను ఈ బడ్జెట్ తీవ్ర నిరాశకు గురిచేసింది. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి నిరాశే ఎదురైంది. రాజధానికి ప్రపంచ బ్యాంకు నిధులు గ్రాంటా లేక రుణమా అనేది స్పష్టం చేయలేదు. పోలవరం పూర్తి చేస్తారన్న నమ్మకాన్ని బడ్జెట్ కల్పించలేదు.



– బొర్రా గోపి మూర్తి, పీడీఎఫ్ ఎమ్మెల్సీ

బడ్జెట్‌లో బుకాయింపులు

- చేనేతకు ఉచిత కరెంటు ఇవ్వకపోయినా ఇచ్చేస్తున్నట్లు అసత్యాలు
- ఇమామ్, మౌజన్లకు వేతనాలు పెంచకుండానే పెంచినట్లు బిల్డప్

సాక్షి, అమరావతి: హామీలు అమలుచేయకుండా చేసేసినట్లు.. గత ప్రభుత్వం అమలుచేసిన వాటిని తామే అమలులోకి తెచ్చినట్లు టీడీపీ కూటమి సర్కారు శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అడ్డగోలుగా బుకాయించేసింది. ఉదా.. రాష్ట్రంలో ప్రతి ఇమామ్, మౌజన్లకు వేతనం పెంచి అందిస్తామని.. ప్రతీ మసీదు నిర్వహణకు రూ.5 వేలు చొప్పున అందిస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదు. కానీ, వారికి గౌరవ వేతనం పెంచి అందిస్తున్నట్లు బడ్జెట్‌లో పేర్కొనడంతో ముస్లిం సమాజం ఆశ్చర్యం వ్యక్తంచేస్తోంది. వాస్తవానికి.. నెలకు రూ.5 వేలున్న ఇమామ్‌ల గౌరవ వేతనాన్ని రూ.10 వేలకు, మౌజన్లకు రూ.3వేల నుంచి రూ.5 వేలకు పెంచి అందించిన ఘనత వైఎస్ జగన్‌దే. గతేడాది మార్చి వరకు వారికి గౌరవ వేతనం అందించారు. ఎన్నికల నాటి నుంచి ఇప్పటివరకు వారికి పదినెలల బకాయిలుంటే ఏడాది బకాయిలున్నాయని నోటికొచ్చినట్లు అబద్ధాలాడి ఆరు నెలలకు మాత్రమే కూటమి సర్కారు నిధులు విడుదల చేసింది. అంగన్‌వాడీలకు గ్రాట్యూటీ చెల్లింపు పరిశీలన దశలో ఉండగానే చెల్లించినట్లు డబ్బా కొట్టుకుంటోంది. అంతేకాక.. గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలుచేయగా.. అది తామే అందిస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటోంది. దీనికితోడు.. చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, పవర్ లూమ్స్‌కు 500 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తామన్న హామీని అమలుచేసేస్తున్నట్లు అబద్ధాలు చెప్పడంతో చేనేత వర్గాలూ విస్తుపోతున్నాయి.

బీసీలకు పెన్షన్ జాడేది?: 50 ఏళ్లు నిండిన బీసీలకు పెన్షన్ అందిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన టీడీపీ కూటమి ఇప్పుడా ఊసే ఎత్తలేదు. పైగా.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమానికి బడ్జెట్‌లో కోతలు పెట్టింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తూ అమలుచేసిన పథకాలను నిలిపివేసి.. అరకొరగా సబ్సిడీ రుణాలకు సంబంధించిన పథకాలతో సరిపెట్టి వివక్ష చూపింది.



ప్రాజెక్టుల నిర్మాణం ‘సాగు’దీతే

- కేటాయింపులు ఇలాగే ఉంటే మరి పూర్తయ్యేదెన్నడు?
- ప్రాధాన్యతగా చేపట్టినవాటి పూర్తికి సరిపడా నిధులివ్వని సర్కార్
- చింతలపూడి ఎత్తిపోతలకు రూ.2,043 కోట్లకు రూ.30 కోట్లే
- వెలిగొండకు రూ.3,638 కోట్లకు గాను రూ.309.13 కోట్లు
- గోదావరి–పెన్నా తొలి దశకు రూ.5,372 కోట్లకు రూ.200 కోట్లే
- హంద్రీ–నీవా ఆయకట్టుకు నీళ్లందించేందుకు నిధులు
- తొలి దశ ప్రధాన కాల్వ వెడల్పు.. రెండో దశ ప్రధాన కాల్వ పుంగనూరు, కుప్పం బ్రాంచ్ కాల్వ లైనింగ్‌పై కరుణ
- బడ్జెట్‌లో జలవనరుల శాఖకు రూ.18,019.66 కోట్లు కేటాయింపు
- భారీ నీటిపారుదలకు రూ.17,142.06 కోట్లు, చిన్ననీటిపారుదలకు రూ.877.60 కోట్లు
- రూ.15,576 కోట్లు ప్రాజెక్టుల పనుల కోసం ఖర్చు చేస్తామని వెల్లడి
- పోలవరానికి కేంద్ర బడ్జెట్‌లో కేటాయించిన నిధులు రూ.5,756.82 కోట్లు కేటాయింపు
- గత బడ్జెట్‌లో సాగునీటి ప్రాజెక్టులకు రూ.16,705.32 కోట్లు కేటాయించి.. 5,906.76 కోట్లు కోత వేసిన వైనం

సాక్షి, అమరావతి: వ్యవసాయాన్ని పండుగ చేసే.. సాగు నీటి ప్రాజెక్టులను పూర్తి చేయడంపై కూటమి ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని బడ్జెట్ సాక్షిగా మరోసారి బట్టబయలైంది. ప్రాజెక్టులను ప్రాధాన్య క్రమంలో చేపడతామని చెప్పిన సీఎం చంద్రబాబు.. కనీసం వాటినైనా గడువులోగా పూర్తి చేయడానికి సరిపడా నిధులను బడ్జెట్‌లో ఇవ్వకపోవడం గమనార్హం. 2025–26 బడ్జెట్‌లో జలవనరుల శాఖకు రూ.18,019.66 కోట్లు (భారీ నీటి పారుదలకు రూ.17,142.06 కోట్లు, చిన్న నీటి పారుదలకు రూ.877.60 కోట్లు) కేటాయించారు. ఇందులో రూ.15,576 కోట్లను సాగునీటి ప్రాజెక్టుల పనులకు (కేపిటల్ వ్యయం) ఖర్చు చేస్తామని పేర్కొన్నారు. పోలవరానికి కేటాయించిన రూ.5,756.82 కోట్లను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయనుంది. కాగా, 2024–25 బడ్జెట్‌లో ప్రాజెక్టులకు రూ.16,705.32 కోట్లు (భారీ నీటి పారుదలకు రూ.15,483.35 కోట్లు, చిన్న నీటి పారుదలకు రూ.1,221.97 కోట్లు) కేటాయించారు. అయితే, సవరించిన బడ్జెట్‌లో రూ.5,906.76 కోట్లు కోత పెట్టి రూ.10,798.56 కోట్లు కేటాయించినట్లు ప్రస్తుత బడ్జెట్‌లో స్పష్టం చేశారు. అంటే.. గత బడ్జెట్ నిధుల్లో 35.36 శాతం కోత విధించినట్లు స్పష్టమవుతోంది. దీన్నిబట్టి చూస్తే.. ప్రస్తుతం కేటాయించిన నిధులను కూడా ప్రాజెక్టులకు పూర్తి స్థాయిలో విడుదల చేయడం అనుమానమేననే అభిప్రాయం బలంగా వ్యక్తమవుతోంది.

ప్రణాళికా రాహిత్యానికి పరాకాష్ట..

- ప్రాజెక్టులను ప్రాధాన్య క్రమంలో పూర్తి చేస్తామన్న ప్రభుత్వం.. తొలి దశలో పోలవరం, హంద్రీ–నీవా, వెలిగొండ, చింతలపూడి, వంశధార స్టేజ్–2 ఫేజ్–2, వంశధార–నాగావళి అనుసంధానం, గోదావరి–పెన్నా తొలి దశను చేపడతామంది. చింతలపూడి ఎత్తిపోతల, గోదావరి–పెన్నా తొలి దశను 2026, జూన్ నాటికి, పోలవరం ప్రాజెక్టును 2027 జూన్‌కు పూర్తి చేస్తామని సీఎం చంద్రబాబు చెప్పారు. ఇందులో గత ప్రభుత్వమే పోలవరాన్ని కొలిక్కితెచ్చింది. వెలిగొండ తొలి దశ, హంద్రీ–నీవా, వంశధార స్టేజ్–2 ఫేజ్–2, వంశధార–నాగావళి అనుసంధానం దాదాపుగా పూర్తి చేసింది.
- రూ.1,400 కోట్లు ఖర్చు చేసి నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తే.. వెలిగొండలో అంతర్భాగమైన నల్లమల సాగర్‌కు శ్రీశైలం ప్రాజెక్టు నుంచి ఒకటో టన్నెల్ ద్వారా కృష్ణా జలాలను గత సెప్టెంబరు–అక్టోబరు నాటికే తరలించే అవకాశం ఉండేది. ఈ ప్రాజెక్టు పనులకు గత బడ్జెట్‌లో 393.49 కోట్లను కేటాయించిన సర్కార్.. అందులో కోత వేసి రూ.300.52 కోట్లతో సరిపెట్టింది. కనీసం ఆ నిధులను కూడా ఖర్చు చేయలేదు. తాజాగా 309.13 కోట్లు కేటాయించింది. తొలి దశ పూర్తి కావాలంటే రూ.1,458 కోట్లు, రెండో దశకు రూ.2,180 కోట్లు అవసరం. దీన్నిబట్టి చూస్తే ఆ ప్రాజెక్టు ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పూర్తయ్యే అవకాశం లేదు.
- ఒడిశాతో వివాదం పరిష్కారం కాని నేపథ్యంలో నేరడి బ్యారేజీ నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. గొట్టా బ్యారేజీ జల విస్తరణ ప్రాంతం నుంచి వంశధార స్టేజ్–2లో అంతర్భాగమైన హిర మండలం రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోసేలా వంశధార ఎత్తిపోతలను గత ప్రభుత్వం చేపట్టింది. ఇది పూర్తయితే వంశధార ఆయకట్టు రైతులకు పూర్తి ఫలాలను అందించవచ్చు. వంశధార–నాగావళి అనుసంధానం పనులను దాదాపు పూర్తి చేసింది. ప్రస్తుత బడ్జెట్‌లో కేటాయించిన నిధులను సకాలంలో విడుదల చేసి ఖర్చు చేస్తే.. జూన్ నాటికి ప్రాజెక్టును పూర్తి చేసే అవకాశం ఉంది.
- చింతలపూడి ఎత్తిపోతల పూర్తికి రూ.2043.38 కోట్లు అవసరం. 2026 జూన్ నాటికి నీళ్లందిస్తామని ప్రభుత్వం పేర్కొంది. గత బడ్జెట్‌లో ఈ ఎత్తిపోతలకు రూ.150 కోట్లు చూపినా చివరకు రూ.3.08 కోట్లతో సరిపెట్టారు. ఇప్పుడు కేవలం రూ.30 కోట్లు కేటాయించింది. ఆ ఎత్తిపోతల ఎలా పూర్తవుతుందన్నది సర్కారుకే తెలియాలి.
- 2026 జూన్ టార్గెట్‌గా పెట్టుకున్న గోదావరి–పెన్నా అనుసంధానం తొలి దశ పూర్తి కావాలంటే రూ.5,372.31 కోట్లు అవసరం. గత బడ్జెట్‌లో పైసా కూడా ఇవ్వలేదు. ప్రస్తుతం రూ.200 కోట్లు కేటాయించింది. వీటితో ఎలా పూర్తవుతుందన్నది ప్రభుత్వమే చెప్పాలి.
- హంద్రీ–నీవా సుజల స్రవంతిలో డిస్ట్రిబ్యూటరీలను పూర్తి చేసి 2026 జూన్‌కు నీళ్లందిస్తామని గొప్పలు చెప్పింది. కానీ.. హంద్రీ–నీవా తొలి దశ ప్రధాన కాలువ ప్రవాహ సామర్థ్యాన్ని 6,300 క్యూసెక్కులకు పెంచుతూ గత ప్రభుత్వం చేపట్టిన పనులను.. 3,850 క్యూసెక్కులకు కుదించింది. రెండో దశ ప్రధాన కాలువ, పుంగనూర్ బ్రాంచ్ కెనాల్, కుప్పం బ్రాంచ్ కెనాల్ లైనింగ్ పనులను రైతులు వ్యతిరేకిస్తున్నా వెనక్కుతగ్గకుండా పూర్తి చేసేందుకే మొగ్గుచూపింది. డిస్ట్రిబ్యూటరీల పనులకు నిధులు కేటాయించని నేపథ్యంలో ఆయకట్టుకు నీళ్లందించడం అసాధ్యమే.
- ప్రభుత్వం ప్రాధాన్యతగా చేపట్టిన ప్రాజెక్టులకే నిధుల కేటాయింపు ఇలా ఉంటే.. మిగతావాటికి కేటాయింపు, విడుదల ఏ స్థాయిలో ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.
- కృష్ణా డెల్టా, గోదావరి డెల్టా ఆయకట్టుకు సక్రమంగా నీళ్లందించడానికి వీలుగా కాలువల మరమ్మతులు, డ్రెయిన్లలో పూడికతీత పనులకు అవసరమైన మేరకు నిధులు ఇవ్వకపోవడం గమనార్హం.
- పోలవరం ప్రాజెక్టులో 45.72 మీటర్లలో 194.6 టీఎంసీలను నిల్వ చేసేలా కాకుండా.. 41.15 మీటర్ల ఎత్తు వరకే 119.40 టీఎంసీలు నిల్వ చేసేలా 2026 జూన్ నాటికి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు రూ.12,157 కోట్లు ఇస్తామని కేంద్రం పెట్టిన షరతుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. ఆ మేరకు కేంద్రం గత, ప్రస్తుత బడ్జెట్‌లలో నిధులిచ్చింది. కానీ.. 41.15 మీటర్ల ఎత్తు వరకే నీటిని నిల్వ చేసేలా ప్రాజెక్టును పూర్తి చేస్తే పూర్తి ఆయకట్టు 7.20 లక్షల ఎకరాలకు నీళ్లందించడం అసాధ్యం కేవలం 1.98 లక్షల ఎకరాలకే నీళ్లందించే అవకాశం ఉంటుంది.

మౌలిక సదుపాయాలు ‘కల్పనే’



- పురపాలక పట్టణాభివృద్ధి శాఖకు రూ.13,862.29 కోట్లు
- విదేశీ రుణంలో అమరావతి అభివృద్ధికి రూ.6 వేల కోట్లు
- సెల్ఫ్ ఫైనాన్స్ సిటీ అమరావతి అన్నది ఒట్టిమాటే
- సీఆర్‌డీఏ, నెల్లూరు కార్పొరేషన్ టిడ్కో రుణాల చెల్లింపునకు రూ.1945 కోట్లు
- భూసమీకరణ కింద రాజధానికి భూములిచ్చిన రైతులకు కౌలు చెల్లింపునకు రూ.297.87 కోట్లు
- అమృత్ 2.0 పథకం కింద పనులకు రూ.751.72 కోట్లు
- స్వచ్ఛ భారత్, స్మార్ట్ సిటీ తదితర కేంద్ర పథకాల ద్వారా రూ.1031.25 కోట్ల గ్రాంట్
- కేంద్ర ఆర్థిక సంఘం ద్వారా రూ.450.44 కోట్లు వస్తాయని అంచనా
- విజయవాడకు రూ.115.11 కోట్లు.. విశాఖపట్నం అభివృద్ధిపై శీతకన్ను

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల పరిధిలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంపై చంద్రబాబు కూటమి ప్రభుత్వ డొల్లతనం 2025–26 బడ్జెట్ సాక్షిగా నిరూపితమైంది. కేంద్ర ప్రాయోజిత పథకాలు అమృత్ 2.0, స్వచ్ఛ భారత్.. కేంద్ర ఆర్థిక సంఘం నిధులను మాత్రమే మౌలిక వసతుల కల్పనకు కేటాయించింది. సెల్ఫ్ ఫైనాన్స్ సిటీ అమరావతి అంటూ సీఎం చంద్రబాబు నుంచి పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ వరకు చెబుతున్న మాటల్లో ఏమాత్రం వాస్తవం లేదన్నది మరోసారి బహిర్గతమైంది. రూ.6 వేల కోట్ల విదేశీ రుణంతో అమరావతిని అభివృద్ధి చేస్తామని బడ్జెట్‌లో పేర్కొనడమే అందుకు నిదర్శనం.భూసమీకరణ కింద రాజధానికి భూములిచ్చిన రైతులకు కౌలు చెల్లించేందుకు రూ.297.87 కోట్లు కేటాయించింది.

- విశాఖపట్నం అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించలేదు. విజయవాడకు కేవలం రూ.115.11 కోట్లు కేటాయించింది.
- నెల్లూరు కార్పొరేషన్, సీఆర్‌డీఏ (రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ), ఏపీ టిడ్కో (ఆంధ్రప్రదేశ్ టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్) రుణాలు చెల్లించేందుకు రూ.1,945 కోట్లు కేటాయించడం గమనార్హం.
- పురపాలక పట్టణాభివృద్ధి శాఖకు ప్రస్తుత బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.13,862.29 కోట్లు కేటాయించింది. ఇందులో అమరావతి అభివృద్ధికి తెచ్చే విదేశీ రుణం రూ.6 వేల కోట్లు.. కేంద్ర ప్రాయోజిత పథకాలు, కేంద్ర ఆర్థిక సంఘం నిధులు రూ.2,233.41 కోట్లు. వీటిని పరిగణనలోకి తీసుకుంటే.. రాష్ట్ర బడ్జెట్ నుంచి ఇచ్చింది రూ.5,628.88 కోట్లే అన్నది స్పష్టమవుతోంది. ఇందులో అధిక శాతం ఉద్యోగుల జీతభత్యాలు, కార్యాలయాల నిర్వహణకే వ్యయం చేయాల్సి ఉంటుంది. అమరావతి సహా పట్టణాలు, నగరాల్లో మౌలిక సదుపాయాల కల్పన (కేపిటల్ వ్యయం) కోసం రూ.7049.54 కోట్లు ఖర్చు చేస్తుండడం గమనార్హం.

రుణాలతోనే రాజధాని నిర్మాణం

అమరావతి నిర్మాణానికి కావాల్సిన నిధులను తానే సమకూర్చుకుంటుందని.. అందుకే అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ కేపిటల్ అని సీఎం చంద్రబాబు పదే పదే చెబుతున్నారు. అందులో ఏమాత్రం వాస్తవం లేదు. ఎందుకంటే.. ఇప్పటికే అమరావతి నిర్మాణానికి తెచ్చిన రుణాల చెల్లింపునకు ఈ బడ్జెట్‌లో రూ.836 కోట్లు, రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు కౌలు కింద ఇచ్చేందుకు రూ.297.82 కోట్లు కేటాయించారు. అమరావతి అభివృద్ధికి రూ.6 వేల కోట్ల విదేశీ రుణాన్ని కేటాయించారు. వీటిని పరిగణనలోకి తీసుకుంటే రాజధానికే రూ.7,133.82 కోట్లు కేటాయించినట్లు స్పష్టమవుతోంది.

కేంద్ర ప్రాయోజిత పథకాలే దిక్కు..

- మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లు, నగర పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులే దిక్కయ్యాయి. అమృత్ 2.0 కింద కేంద్రం ఇచ్చే నిధులకు రాష్ట్ర వాటా జత చేసి రూ.751.72 కోట్లతో మురుగు నీటి వ్యవస్థ మెరుగుదల, వరద కాలువలు వంటి మౌలిక సదుపాయాల కల్పన పనులు చేపట్టనున్నారు. స్వచ్ఛభారత్ కింద వచ్చే 1031.25 కోట్లతో నగరాలు, పట్టణాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని బడ్జెట్‌లో పేర్కొంది. కేంద్ర ఆర్థిక సంఘం నుంచి రూ.450.44 కోట్లు వస్తాయని అంచనా వేసిన ప్రభుత్వం.. వాటిని మౌలిక సదుపాయాల కల్పనకు కేటాయించింది.
- నెల్లూరులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సహా వివిధ అభివృద్ధి పనులు చేపట్టినందుకు తెచ్చిన రుణాన్ని చెల్లించేందుకు రూ.150.87 కోట్లు, ఏపీ టిడ్కో రుణాలు చెల్లింపునకు రూ.1109 కోట్లు కేటాయించింది.

వెలిగొండ ప్రాజెక్టుకు కేవలం రూ.359 కోట్లా?

- వెంటనే ప్రాజెక్టుకు తగిన నిధులు కేటాయించాలి
- పునరావాస పనులకే రూ.1000 కోట్లు కావాలి
- కానీ కేవలం రూ.116 కోట్ల కేటాయింపు దారుణం
- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



సాక్షి, అమరావతి: ఈ ఏడాది బడ్జెట్‌లో వెలిగొండ ప్రాజెక్టుకు చాలా తక్కువగా రూ.359 కోట్లే కేటాయించి, అన్యాయం చేస్తున్నారని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆక్షేపించారు. ఈ నిధులు ప్రాజెక్టు పనులకు ఏమాత్రం సరిపోవని, వెంటనే తగినన్ని నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రీహాబిలిటేషన్ అండ్ రీసెటిల్‌మెంట్ (ఆర్ అండ్ ఆర్)కు రూ.1000 కోట్లు కావాల్సి ఉండగా, కేవలం రూ.116 కోట్లు కేటాయించడం దుర్మార్గమని దుయ్య బట్టారు. ఆయన శుక్రవారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాల యంలో మీడియాతో మాట్లాడుతూ.. దాదాపు 4.5 లక్షల ఎకరాలకు సాగునీరు, 25 లక్షల మందికి తాగునీరు అందించే మహత్తరమైన వెలిగొండ ప్రాజెక్టుపై చంద్రబాబు ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపుతోందని ధ్వజమెత్తారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టులో ముఖ్యమైన రెండు టన్నెల్స్ పనులు దాదాపు పూర్తయ్యాయని, మిగతా కొద్దిపాటి పనులను కూడా చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పశ్చిమ ప్రకాశం జిల్లాలో వైఎస్సార్‌సీపీ బలంగా ఉన్నందువల్లే ఆ ప్రాంతానికి జీవనాడిగా ఉన్న వెలిగొండ ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబు వక్రబుద్ధి ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. కూటమి నేతలు ఇకనైనా మొద్దు నిద్ర వీడి, ప్రాజెక్టు పనుల పూర్తికి తగిన నిధుల కేటాయించేలా సీఎంపై ఒత్తిడి తేవాలని అన్నారు. సీఎం చంద్రబాబు స్పందించక పోతే ఈ ప్రాంత ప్రజలను, రైతులను ఏకం చేసి ప్రాజెక్ట్ వరకు పాదయాత్ర చేస్తామని హెచ్చరించారు.

విద్యుత్ వెలుగులు లేవు!

- ప్రజలపై భారం తగ్గించేందుకు కేటాయింపులు శూన్యం
- డిస్కం అప్పులకు ఒక్క రూపాయి కూడా విదల్చని కూటమి
- ఎన్నికల ముందు చెప్పిన సౌర పంపు సెట్ల ప్రస్తావనే లేదు
- ఇంధన సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఒట్టిమాటే
- కేంద్ర పథకాలైన పీఎం సూర్యఘర్, కుసుమ్‌లే దిక్కు



సాక్షి, అమరావతి: విద్యుత్ రంగానికి ఒక్క రూపాయి కూడా అదనంగా కేటాయించకుండా చంద్రబాబు ప్రభుత్వం మరోసారి చేతులెత్తేసింది. ఓటాన్ బడ్జెట్‌లోనే ఇంధన శాఖకు అరకొరగా కేటాయింపులు చేసి చేతులు దులుపుకున్న చంద్రబాబు ప్రభుత్వం.. వార్షిక బడ్జెట్‌లోనూ మొండి చేయి చూపించింది. రాష్ట్ర ప్రజలపై రూ.15,485 కోట్ల విద్యుత్ చార్జీల భారం వేసి బిల్లులు వసూలు చేస్తున్న ప్రభుత్వం.. ఇంధన రంగానికి, రాయితీలు, సబ్సిడీల కోసం బడ్జెట్‌లో కేవలం రూ.13,600 కోట్లే కేటాయించింది. కనీసం చార్జీల రూపంలో ప్రజల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నంత కూడా ఇవ్వలేకపోయింది. విద్యుత్ రంగం రూ.1.29 లక్షల కోట్లకు పైగా నష్టాల్లో ఉందన్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్.. ఆ అప్పులను తీర్చేందుకు ఒక్క రూపాయి కూడా సాయంగా ప్రకటించలేదు. పైగా అధిక ధరలకు విద్యుత్ కొనుగోలు చేయాల్సి వచ్చిందని.. అందుకే ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై పెనుభారం మోపామని సమర్థించుకునే ప్రయత్నం చేశారు. నిజానికి గత టీడీపీ హయాంలో జరిగిన అనవసర అధిక ధరల విద్యుత్ కొనుగోళ్ల వల్లే.. రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు అప్పుల ఊబిలోకి కూరుకుపోయాయనే వాస్తవాన్ని మంత్రి ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టారు. నూతన సమగ్ర ఆంధ్రప్రదేశ్ సమీకృత క్లీన్ ఎనర్జీ విధానం –2024 ద్వారా పునరుత్పాదక ఇంధన తయారీ జోన్‌లను ఏర్పాటు చేసి, పెట్టుబడులను ఆకర్షించి 7.5 లక్షల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు కల్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయని మంత్రి వెల్లడించారు. అయితే ఇప్పటివరకూ ఎన్ని ప్రాజెక్టులు తెచ్చారో, ఈ రంగంలో ఎన్ని ఉద్యోగాలిచ్చారో మంత్రి చెప్పలేకపోయారు. కూటమి పార్టీలు ఎన్నికలకు ముందు ఇంధన రంగానికి సంబంధించి ఇచ్చిన హామీలకు బడ్జెట్‌లో అస్సలు స్థానమే లభించలేదు. రైతులకు సబ్సిడీపై పంపు సెట్లు మంజూరు చేస్తామనే హామీ అమలు గురించి ఎక్కడా కనిపించలేదు. భవిష్యత్‌లో పెరగనున్న విద్యుత్ డిమాండ్‌ను అందుకోవడం కోసం ఒక్కటంటే ఒక్కటి కూడా కొత్త విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టును ప్రకటించలేదు. ఇక ఇంధన పొదుపు, సంరక్షణ కోసం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. కేవలం కేంద్ర పథకాలైన పీఎం సూర్యఘర్, కుసుమ్ పథకాలకు వచ్చే సబ్సిడీలతోనే సోలార్ రూఫ్ టాప్, సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేస్తామని చెబుతోంది.

క్లుప్తంగా...

బ్యారక్ మార్చాలని వంశీ పిటిషన్

విజయవాడలీగల్: జిల్లా జైలులో ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ తన బ్యారక్‌ను మార్చాలని పిటిషన్ దాఖలు చేశారు. బ్యారక్ మార్చడం కుదరకపోతే కొంతమంది ఖైదీలను వంశీ గదిలో ఉంచాలని ఎస్సీ, ఎస్టీ కోర్టులో వంశీ తరఫు న్యాయవాదులు కోరారు. ఇప్పుడున్న బ్యారక్ గదిలో మంచం కూడా పట్టడం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. వంశీకి ఆస్తమా, ఆరోగ్య సమస్యలున్నందున బ్యారక్‌లో ఆయనకు తోడుగా మరొకరిని ఉంచాలని న్యాయమూర్తిని కోరిన సంగతి విదితమే.

మలసాని, పొనకాకు హైకోర్టులో ఊరట

కఠిన చర్యలేవీ తీసుకోవద్దని పోలీసులకు ఆదేశం

సాక్షి, అమరావతి: సోషల్ మీడియా పోస్టుల వ్యవహారంలో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు మలసాని మనోహర్‌రెడ్డి, న్యాయవాది పొనకా జనార్దన్‌రెడ్డికి హైకోర్టు ఊరటనిచ్చింది. వీరిపై ఎలాంటి కఠిన చర్యలేవీ వద్దని పోలీసులను ఆదేశించింది. పూర్తి వివరాలను తమ ముందుంచాలని పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను మార్చి రెండో వారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీఎం చంద్రబాబుపై అనుచిత పోస్టులు పెట్టారంటూ సోషల్ మీడియా యాక్టివిస్ట్ అవుతు శ్రీధర్‌రెడ్డిని విజయవాడ పోలీసులు అరెస్ట్ చేసి ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆ ఫోన్‌లో మనోహర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి మధ్య సాగిన సంభాషణలు అవమానకరంగా ఉన్నాయంటూ పోలీసులు భావించారు. దీంతో మనోహర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డిని కూడా నిందితులుగా పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వారు ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై అత్యవసర విచారణ జరపాలని పిటిషనర్ల తరఫు న్యాయవాది శెట్టిపల్లి దుష్యంత్‌రెడ్డి హైకోర్టును కోరారు. ఇందుకు అంగీకరించిన న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి విచారణ జరిపారు. మనోహర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డిపై ఎలాంటి కఠిన చర్యలేవీ తీసుకోవద్దని పోలీసులను ఆదేశించారు.

కోనేరు సత్యనారాయణకు ముందస్తు బెయిల్ మంజూరు

సాక్షి, అమరావతి: కేఎల్ విశ్వవిద్యాలయానికి ఏ++ గుర్తింపు కోసం నేషనల్ అక్రెడిటేషన్ కౌన్సిల్ (నాక్) బృందానికి ముడుపులు ముట్టజెప్పారనే ఆరోపణలపై సీబీఐ నమోదు చేసిన కేసులో కేఎల్‌ఈఎఫ్ ప్రెసిడెంట్ కోనేరు సత్యనారాయణకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ సందర్భంగా హైకోర్టు పలు షరతులు విధించింది. రూ.50వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలని, దర్యాప్తునకు సహకరించాలని స్పష్టం చేసింది. ఈ కేసుతో ముడిపడి ఉన్న సాక్షులను బెదిరించడం గానీ, ప్రలోభపెట్టడంగానీ చేయకూడదని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

గన్నవరంలో విమానం అత్యవసర ల్యాండింగ్

విమానాశ్రయం (గన్నవరం): ప్రయాణికులతో శుక్రవారం విశాఖపట్నం బయలుదేరిన ఇండిగో విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో తిరిగి గన్నవరం విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ అయ్యింది. ఇండిగోకు చెందిన ఏటీఆర్–72 విమానం చెన్నై నుంచి ఉదయం 7.10 గంటలకు గన్నవరం చేరుకుని 20 నిమిషాల విరామం తర్వాత 54 మంది ప్రయాణికులతో విశాఖపట్నం బయలుదేరింది. విమానం గాల్లోకి లేచిన కొద్దిసేపటికే ఇంజన్‌లో సాంకేతిక సమస్య తలెత్తినట్టు పైలట్లు గుర్తించారు. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సూచన మేరకు విమానాన్ని తిరిగి గన్నవరం విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ చేశారు.

నేటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

సాక్షి, అమరావతి: జాతీయ పశు వ్యాధి నియంత్రణా పథకం కింద 4 నెలలు వయసుపైబడిన ఆవులు, గేదెలకు మార్చి 1 నుంచి 30 వరకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్టు పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ టి. దామోదరనాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 4–8 నెలల వయసున్న పెయ్య దూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు వేస్తామన్నారు. ఈ టీకాలు రాష్ట్రంలోని అన్ని పశువైద్యశాలల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ మేరకు రూ.33.96 కోట్ల కేంద్ర నిధులతో 96.58 లక్షల పశువులకు ఉచితంగా టీకాలు వేస్తున్నట్టు తెలిపారు.

ఏఈఓలతో త్వరలో రౌండ్ టేబుల్ సమావేశం

వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

సాక్షి, అమరావతి: వ్యవసాయ విస్తరణ అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలపై త్వరలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తానని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. శుక్రవారం మంత్రి క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ విస్తరణ అధికారుల ప్రతినిధులు మంత్రిని కలిసి ఏఈవోల సమస్యలను వివరించారు. రాష్ట్ర సంఘం అధ్యక్షుడు డీవీ వేణుమాధవ్, ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు రెడ్డి, సహాధ్యక్షుడు టీ శ్రీనివాసరావు, కోశాధికారి సుభానీ ఉన్నారు.

రామోజీ లేరు.. విచారణా అక్కర్లేదు..!

దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కేసు.. యావద్భారతం ఒక కేస్ స్టడీగా గమనిస్తున్న వ్యవహారం.. ఆర్‌బీఐ యాక్ట్ సెక్షన్ 45 (ఎస్) ఉల్లంఘన జరిగిందా? లేదా? అన్నది ఆరు నెలల్లో తేల్చాలంటూ స్వయంగా దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆదేశించిన నేరం... సెక్షన్ 45 (ఎస్)ను ఉల్లంఘిస్తూ, అక్రమ డిపాజిట్ల సేకరణ జరిగిందంటూ స్వయంగా ఆర్‌బీఐ అఫిడవిట్ దాఖలు చేసిన పరిస్థితి... నిబంధనలకు విరుద్ధంగా లక్షలాది మంది డిపాజిటర్లపై తీవ్ర ప్రభావం చూపే ఆర్థిక లావాదేవీ.. ప్రజల ప్రయోజనాల పరిరక్షణే ధ్యేయంగా చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వాలు... ఇందుకు భిన్నంగా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరు చూసి విశ్లేషకులు, నిపుణులు నివ్వెరపోతున్న పరిస్థితి.. డిపాజిటర్ల వైపు నిలబడాల్సిన రాష్ట్ర ప్రభుత్వాలు రామోజీ వైపు నిలబడుతున్న వైనం.. ఆర్‌బీఐ మాటలూ బేఖాతర్.. మరోవైపు చనిపోయిన రామోజీపై నేరం నెట్టేసి.. చేతులు దులుపేసుకునే మార్గదర్శి ఫైనాన్షియర్స్ ప్రయత్నం.. ఇప్పుడు ఈ అంశంపైనే సర్వత్రా ఆసక్తి...

- ‘మార్గదర్శి’ కేసు.. సమయం వృథా వ్యవహారం
- హైకోర్టుకు సూచించిన ఏపీ ప్రభుత్వం
- వంత పాడిన తెలంగాణ సర్కార్
- ఇరు ప్రభుత్వాల ముక్తసరి వాదనలు
- మార్గదర్శి అక్రమాల ఊసే ఎత్తని వైనం
- రామోజీ నేర చర్యలకు వారసులు బాధ్యులు కాదన్న మార్గదర్శి
- విచారణను ఎదుర్కోవాల్సిందేనన్న ఆర్‌బీఐ
- ఇదే విషయాన్ని స్పష్టం చేసిన ఉండవల్లి

సాక్షి, అమరావతి: మార్గదర్శి ఫైనాన్షియర్స్, దాని కర్త రామోజీరావు వేల కోట్ల రూపాయల ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారని రిజర్వ్ బ్యాంక్ ఇండియా (ఆర్‌బీఐ) ఆధారాలతో సహా ఒకవైపు నిరూపిస్తుంటే, మరోవైపు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు ఆ ఊసే ఎత్తడం లేదు. పైపెచ్చు మార్గదర్శి ఫైనాన్షియర్స్, దాని ప్రస్తుత కర్త కిరణ్‌ను చట్ట ఉల్లంఘనల నుంచి కాపాడేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నాయి. అందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తన వాదనను చాలా సూటిగా తెలంగాణ హైకోర్టుకు నివేదించింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్ కర్త రామోజీరావు మరణించిన నేపథ్యంలో, ఈ వ్యాజ్యాలపై విచారణే అవసరం లేదని చంద్రబాబు నేతృత్వంలోని ఏపీ ప్రభుత్వం తెలంగాణ హైకోర్టుకు తేల్చి చెప్పింది. అనవసరమైన విచారణ జరిపి సమయాన్ని వృథా చేసుకోవద్దని ఏకంగా హైకోర్టుకే సూచించింది.

ఎవరైనా ఫిర్యాదు చేస్తే, ఆర్‌బీఐ చూసుకుంటుంది.!

మార్గదర్శి ఫైనాన్షియర్స్ చట్టవిరుద్ధంగా డిపాజిట్లు వసూలు చేయడంపై ఫిర్యాదులు ఏవీ లేవని, పత్రికా ప్రకటనలు ఇచ్చిన తరువాత కూడా ఎవరూ ముందుకు రాలేదని, అందువల్ల విచారణ జరిపి ప్రయోజనం లేదని ఏపీ ప్రభుత్వం వివరించింది. ఒకవేళ తర్వాత ఎవరైనా ఫిర్యాదు చేస్తే, వారి సంగతి రిజర్వు బ్యాంక్ చూసుకుంటుందని ప్రభుత్వం తరఫున ఆ రాష్ట్ర అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇదే రీతిన వాదనలు వినిపించింది. అయితే కోర్టు తీర్పు మేరకు చర్యలు చేపడతామంటూ సన్నాయి నొక్కులు నొక్కింది. ఏ వాదన వినిపిస్తే మార్గదర్శి ఫైనాన్షియర్స్‌కు లబ్ధి చేకూరుతుందో రెండు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అలాంటి వాదనలే వినిపించాయి. ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు తమ వాదనల్లో ఎక్కడా మార్గదర్శి ఫైనాన్షియర్స్, రామోజీరావుల అక్రమాల గురించి ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం విశేషం. మార్గదర్శి అక్రమాలకు ఆధారాలున్నా, కనీస స్థాయిలో కూడా వాటి గురించి ప్రస్తావించలేదు.

డిపాజిట్ల సేకరణ చట్ట విరుద్ధమే: ఆర్‌బీఐ

మరోవైపు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తన వైఖరిని పునరుద్ఘాటించింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్, దాని కర్త రామోజీరావు ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 45 (ఎస్)కి విరుద్ధంగా ప్రజల నుంచి వేల కోట్ల రూపాయల మేర డిపాజిట్లు వసూలు చేశారని మరోసారి తేల్చి చెప్పింది. ఇలా చేయడం సెక్షన్ 58బీ(5ఏ) ప్రకారం అత్యంత శిక్షార్హమైన నేరమని స్పష్టం చేసింది. రామోజీ లేరు కాబట్టి, పిటిషన్‌ను మూసివేయాలంటూ మార్గదర్శి దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌ను కొట్టేయాలని హైకోర్టును అభ్యర్థించింది. రిజర్వ్ బ్యాంక్ తరఫున సీనియర్ న్యాయవాది ఎల్.రవిచందర్ వాదనలు వినిపిస్తూ, రామోజీ చేసిన నేరానికి మార్గదర్శి ఫైనాన్షియర్స్ హెచ్‌యూఎఫ్ బాధ్యత వహించాల్సిందేనని తేల్చి చెప్పారు. చట్టవిరుద్ధంగా డిపాజిట్లు వసూలు చేసినందుకు క్రిమినల్ ప్రొసీడింగ్స్ ఎదుర్కోవాల్సిందేనని స్పష్టం చేశారు. కేసును మూసేయాలంటూ మార్గదర్శి ఫైనాన్షియర్స్ చేసిన అభ్యర్థన సమర్థనీయం కాదన్నారు. చట్టవిరుద్ధంగా మార్గదర్శి డిపాజిట్లు సేకరించిందని, ఆర్‌బీఐ చట్టం సెక్షన్ 45(ఎస్)ను ఉల్లంఘించిందని ఆయన మరోసారి ధర్మాసనానికి గుర్తు చేశారు. హెచ్‌యూఎఫ్ కర్త రామోజీరావు మరణించినా కూడా విచారణ ఎదుర్కోవాల్సిందేనని స్పష్టం చేశారు.

అప్పుడు అలా చెప్పి.. ఇప్పుడు ఇలా..: ఉండవల్లి

మరోవైపు ఈ కేసులో కోర్టు సహాయకారిగా వ్యవహరిస్తున్న మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ వాదనలు వినిపిస్తూ, గతంలో అసలు ఎలాంటి అక్రమాలు జరగలేదని మార్గదర్శి ఫైనాన్షియర్స్ బల్లగుద్ది మరీ చెప్పిందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఒకవేళ అక్రమాలు ఏవైనా జరిగి ఉంటే అందుకు రామోజీరావే బాధ్యత వహించాల్సి ఉందని ఇప్పుడు చెబుతోందన్నారు. మనిషి మరణించినా కూడా ప్రాసిక్యూషన్ ఆగదన్నారు.

కుటుంబ సభ్యులు బాధ్యులు కారు: మార్గదర్శి

కోర్టు సమయం ముగియడంతో తదుపరి విచారణను మార్చి 7కి వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ శ్యామ్ కోషి, జస్టిస్ కె.సుజనలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది. ఆ రోజున ఉండవల్లి వాదనలు పూర్తిస్థాయిలో వింటామంది. అంతక్రితం మార్గదర్శి తరఫున సీనియర్ న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ, రామోజీ మృతి చెందినందున ఆయన నేర చర్యలకు కుటుంబ సభ్యులు బాధ్యులు కారని తెలిపారు. సివిల్ చర్యల విషయంలో వాదనలు వినిపిస్తామన్నారు. రామోజీరావు ఓ కంపెనీ యజమాని అని, ఆ కంపెనీ చర్యలకు యజమానే వహించాల్సి ఉంటుందన్నారు. యజమాని చనిపోయారు కాబట్టి మిగిలిన కుటుంబ సభ్యులు బాధ్యత వహించాల్సిన అవసరం లేదన్నారు.

నేపథ్యం ఇదీ..

చట్ట నిబంధనలను ఉల్లంఘించి ప్రజల నుంచి వేల కోట్ల రూపాయల మేర డిపాజిట్లు వసూలు చేసినందుకు మార్గదర్శి ఫైనాన్షియర్స్, దాని కర్త రామోజీరావుపై డిపాజిటర్ల పరిరక్షణ చట్టం కింద చర్యలు తీసుకోవాలని కోరుతూ అధీకృత అధికారి నాంపల్లి కోర్టులో ఫిర్యాదు దాఖలు చేశారు. ఈ ఫిర్యాదును కొట్టేయాలంటూ మార్గదర్శి, రామోజీరావు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రజనీ, నాంపల్లి కోర్టులో అధికారి దాఖలు చేసిన ఫిర్యాదును కొట్టేస్తూ 2018, డిసెంబర్ 31న తీర్పునిచ్చారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో వేర్వేరుగా అప్పీళ్లు దాఖలు చేశాయి. అలాగే హైకోర్టు తీర్పులో కొంత భాగంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ మార్గదర్శి, రామోజీరావు కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అన్నీ వ్యాజ్యాలపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు, అధీకృత అధికారి ఫిర్యాదును కొట్టేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును తప్పుపట్టింది. ఆ తీర్పును రద్దు చేసింది. డిపాజిట్ల సేకరణకు సంబంధించిన వాస్తవాలను నిగ్గు తేల్చాల్సిందేనని తెలంగాణ హైకోర్టును ఆదేశించింది. ఉండవల్లి, ఏపీ సర్కార్ సహా అందరి వాదనలు వినాలని చెప్పింది. దీంతో తెలంగాణ హైకోర్టు 2024, జూన్ నుంచి తన విచారణను ప్రారంభించింది.

అంతా ఆయనే చేశారు..: మార్గదర్శి ఫైనాన్షియర్స్

విచారణ కొనసాగుతుండగానే మార్గదర్శి ఫైనాన్షియర్స్ తన బాధ్యతలను తప్పించుకుని, వివాదాన్ని మరణించిన రామోజీ మీదకు తోసేసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేసింది. ఈ మేరకు హైకోర్టులో ఓ అనుబంధ పిటిషన్ దాఖలు చేసింది. హిందూ అవిభాజ్య కుటుంబం (హెచ్‌యూఎఫ్) కింద మార్గదర్శి ఫైనాన్షియర్స్ కార్యకలాపాలు చేపట్టినందున దాని కర్త రామోజీరావు మాత్రమే బాధ్యుడవుతారని, ఇతర కుటుంబ సభ్యులకు ఎలాంటి సంబంధం లేదని ఆ పిటిషన్‌లో పేర్కొంది. దీంతో న్యాయస్థానం తొలుత ఈ అనుబంధ పిటిషన్లపై వాదనలు వినేందుకు సిద్ధమైంది. కౌంటర్లు దాఖలు చేయాలని ఇరు రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు రిజర్వ్ బ్యాంక్‌ను సైతం ఆదేశించింది. ఈ ఆదేశాల మేరకు వారు కూడా కౌంటర్లు దాఖలు చేశారు. తాజాగా శుక్రవారం ఈ వ్యాజ్యాలపై జస్టిస్ శ్యామ్ కోషి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది.

పోసానికి 14 రోజుల రిమాండ్

రాత్రి 9.30 నుంచి తెల్లవారుజాము వరకు వాదనలు

సాక్షి, రాయచోటి/రైల్వేకోడూరు అర్బన్/రాజంపేట రూరల్ : సినీ నటుడు, రచయిత పోసాని కృష్ణ మురళికి అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మెజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్ విధించారు. గురువారం రాత్రి 9 గంటలకు పోలీసులు కృష్ణ మురళిని మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారు. పదేళ్ల క్రితం నంది అవార్డును తిరస్కరిస్తూ పోసాని చేసిన వ్యాఖ్యలపై స్థానిక జనసేన నేత ఫిర్యాదు మేరకు ఆయనపై అక్రమ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో పోసాని తరఫున మాజీ ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. పోలీసులు నమోదు చేసిన సెక్షన్లను ప్రస్తావిస్తూ, ఈ సెక్షన్లు ఆయనకు వర్తించవని వివరించారు. సంబంధం లేని సెక్షన్లతో పాటు అనవసర సెక్షన్లు పెట్టారని వాదించారు. ప్రభుత్వ న్యాయవాదులు కూడా ఈ కేసుకు సంబంధించి తమ వాదనలు వినిపించారు. దాదాపు 9.30 గంటలకు ప్రారంభమైన వాదనలు తెల్లవారుజాము వరకు కొనసాగాయి. ఈ పరిణామాలపై కోర్టు బయట పోసాని అభిమానులతోపాటు వైఎస్సార్‌సీపీ నేతల్లోనూ ఉత్కంఠ నెలకొంది. ఇరుపక్షాల వాదనలు ఆలకించిన మెజిస్ట్రేట్ సాయితేజ్.. తెల్లవారుజామున పోసానికి 14 రోజుల రిమాండును విధించారు. అనంతరం పోసానిని రైల్వేకోడూరు సీఐ పి.వెంకటేశ్వర్లు, ఓబులవారిపల్లి ఎస్‌ఐ పి.మహేష్‌నాయుడులు తమ సిబ్బందితో ఉదయం 7.52 గంటలకు నేరుగా రాజంపేట సబ్ జైలు వద్దకు తీసుకొచ్చారు. జైలులో ఆయనకు 2261 నంబరు కేటాయించారు. ఇదే సమయంలో జిల్లా జైళ్ల శాఖ ఉప అధికారి హుస్సేన్‌రెడ్డి ఈ జైల్‌ను సందర్శించారు.



పోసానిని రాజంపేట సబ్ జైల్‌లోకి తీసుకెళుతున్న పోలీస్ అధికారులు

న్యాయ పోరాటం చేస్తాం : పొన్నవోలు

పోసానికి రిమాండు విధించిన అనంతరం కోర్టు నుంచి బయటికి వచ్చిన పొన్నవోలు మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అన్నివేళలా అందుబాటులో ఉంటామని చెప్పారు. అక్రమ కేసులపై న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యకర్తలు ధైర్యంగా ఉండాలన్నారు. ఆయన వెంట మాజీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర నేత జల్లా సుదర్శన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

బెయిల్ కోసం దరఖాస్తు

పోసాని కృష్ణ మురళీకి బెయిల్ కోసం రైల్వేకోడూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయవాది నాజ్జాల మధు పిటిషన్ దాఖలు చేశారు. ఈ క్రమంలో సోమవారం వాదనలు వినిపించనున్నారు. రైల్వేకోడూరు రూరల్ సీఐ వెంకటేశ్వర్లు, ఓబులవారిపల్లి ఎస్‌ఐ మహేష్‌లు పోసాని విచారణ నిమిత్తం కస్టడీ కోసం కోర్టులో పిటిషన్ వేశారు. ఇదిలా ఉండగా పోసాని కృష్ణ మురళి ఆరోగ్యం క్షీణించిందని ఆయన స్నేహితులు లింగంగుట్ల సల్మాన్‌రాజ్, షేక్ నాగూర్ బాషా ఆందోళన వ్యక్తం చేశారు. రాజంపేట సబ్ జైల్‌లో శుక్రవారం ములాఖత్ సమయంలో వారు పోసానిని కలిశారు. అనంతరం సబ్ జైల్ వద్ద మీడియాతో మాట్లాడుతూ గంటల కొద్దీ ప్రయాణం చేయటం వల్ల పోసాని అనారోగ్యానికి గురైనట్లు తెలిపారు. రెండు రోజులుగా విశ్రాంతి లేకపోవడంతో ఆరోగ్యం మరింత క్షీణించిందన్నారు. పోసాని కడుపు నొప్పి, విరేచనాలతో బాధ పడుతున్నారని తెలిపారు. తాము టాబ్లెట్లు ఇవ్వబోగా.. తమ డాక్టర్ ఉన్నారని జైలర్ అభ్యంతరం తెలిపారన్నారు.

పోసానిపై 111 సెక్షన్ తొలగింపు

రాష్ట్ర వ్యాప్తంగా పోసానిపై అక్రమంగా 15కు పైగా కేసులు బనాయించారని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పాటూరు భరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పోసాని మీద 111, ఆర్/డబ్ల్యూ3(5) ఆఫ్ బీఎన్ఎస్, 196, 35(2), ఐటీ 67 యాక్ట్–2023 ప్రకారం అక్రమ కేసులు బనాయించారని చెప్పారు. ఈ రిమాండ్ అక్రమమని, దీనికి ఈ సెక్షన్‌లు ఏ మాత్రం వర్తించవని కోర్టు దృష్టికి తీసుకెళ్లగా.. సుదీర్ఘ వాదనల అనంతరం కోర్టు డిఫెన్స్ వాదనలతో ఏకీభవించి 111 బీఎన్ఎస్ అనేది తీవ్రమైన సెక్షన్ అని భావించి, అది ఈ కేసులో వర్తించదని తొలగించిందని తెలిపారు. 111 సెక్షన్ మినహా మిగిలిన సెక్షన్‌లు అన్నీ బెయిలబుల్ అఫెన్స్ మాత్రమేనన్నారు. ఈ కేసులే కాకుండా ఇంకా చాలా కేసులు ఉండటం వల్ల కోర్టు రిమాండ్ విధించిందన్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- ఈ నెల 20 వరకు నిర్వహణ
- ఉదయం 9 గంటలకే ప్రారంభం
- ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదు
- ఇంటర్ విద్యా మండలి స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. తొలిరోజు ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష ఉదయం 9 గంటలకు ప్రారంభం కానుంది. మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే ఈ పరీక్షలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని ఇంటర్ విద్యా మండలి స్పష్టం చేసింది. సోమవారం (మార్చి 3వ తేదీ) నుంచి ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు ప్రారంభమవుతాయి. మార్చి 20 వరకు జరిగే ఈ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 1,535 సెంటర్లను అధికారులు ఏర్పాటు చేశారు. ఈ విద్యా సంవత్సరంలో 10,58,893 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. వీరిలో మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 5,00,963 మంది, ఒకేషనల్‌కు 44,581 మంది ఉన్నారు. రెండో ఏడాది విద్యార్థులు జనరల్ 4,71,021 మంది, ఒకేషనల్‌కు 42,328 మంది ఉన్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అనేక చర్యలు తీసుకున్నట్లు పరీక్షల విభాగం కంట్రోలర్ (సీవోఈ) సుబ్బారావు తెలిపారు. అన్ని సెంటర్లు, పరీక్ష గదుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేశామని, సెంటర్ సూపరింటెండెంట్లకు బోర్డు నుంచే ప్రత్యేక ఫోన్ సిమ్ కార్డులను ఇచ్చామని చెప్పారు. ప్రశ్నపత్రాలు ట్యాంపరింగ్, పేపర్ లీకేజీలను అరికట్టేందుకు క్యూ ఆర్ కోడ్, వాటర్ మార్కులో కోడ్ నంబర్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు.

రాజకీయాల నుంచి తప్పుకుని ఆశ్రమం పెట్టుకోండి

గతంలో టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రధాని మోదీని దూషించారు

- మరి ఆయనను ఎందుకు అరెస్ట్ చేయలేదు?
- సీఎం చంద్రబాబుపై ఐఏఎస్ మాజీ అధికారి పీవీఎస్ శర్మ మండిపాటు

సాక్షి, న్యూఢిల్లీ: సీఎం చంద్రబాబు తీరుపై ఐఏఎస్ మాజీ అధికారి పీవీఎస్ శర్మ శుక్రవారం సామాజిక మాధ్యమం ‘ఎక్స్’లో మండిపడ్డారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు సహజమని పేర్కొన్నారు. సినీ నటుడు పోసాని కృష్ణమురళీని అరెస్ట్ చేయడం దుర్మార్గమని..ఆయన అరెస్టును తాను వ్యతిరేకిస్తున్నానని తెలిపారు. చిన్న కారణాలతో అరెస్టులు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం సరైన పద్ధతి కాదన్నారు. గతంలో ప్రధాని మోదీపై టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణ చేసిన అనుచిత వ్యాఖ్యలను గుర్తుచేస్తూ..మరి బాలకృష్ణను ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. ఇదే కొలమానంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, అతని అనుచరులను కూడా అరెస్ట్ చేయాల్సి ఉంటుందన్నారు. దేశంలోని ప్రతి రాజకీయ నాయకుడిని ప్రత్యర్థి పార్టీల నేతలు, ప్రజలు విమర్శిస్తారని, మహాత్మా గాంధీ, నెహ్రూ, వల్లభాయ్ పటేల్ వంటివారూ విమర్శలను ఎదుర్కొన్నారని, వాళ్లతో పోల్చితే మంత్రి నారా లోకేశ్, డిప్యూటీ సీఎంల స్థాయి ఏమిటి? అని నిలదీశారు. ‘విమర్శలను తీసుకోకపోతే రాజకీయాల నుంచి తప్పుకొని ఆశ్రమం ప్రారంభించి అందులో ఉండండి’ అని చంద్రబాబుకు హితవు పలికారు.


డిస్కంలకు ‘కేంద్ర పథకాల’ భరోసా!

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్

సాక్షి,అమరావతి: కేంద్ర పథకాలు– పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ సమర్థ వినియోగం వల్ల డిస్కంలపై అప్పుల భారం తగ్గుతోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. డిస్కంలను బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై కేంద్ర ఇంధన శాఖ ముంబై వేదికగా నిర్వహించిన సమావేశంలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ శుక్రవారం వర్చువల్‌గా పాల్గొన్నారు. కేంద్ర విద్యుత్ శాఖ సహాయ మంత్రి శ్రీపాద్ ఎస్సో నాయక్, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో సహా మరో నాలుగు రాష్ట్రాల విద్యుత్ శాఖ మంత్రులు సమావేశానికి హాజరయ్యారు. కేంద్రం ఇస్తున్న గ్రాంట్ ను పెంచాలని ఈ సందర్భంగా కేంద్రానికి మంత్రి గొట్టిపాటి విజ్ఞప్తి చేశారు.

రక్షణ రంగంలో భవిష్యత్ లీడర్ భారత్

- యువతలో పరిశోధనలపై ఆసక్తి పెరుగుతోంది
- ‘సాక్షి’తో డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ డాక్టర్ జి.సతీశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రక్షణ రంగ ఉత్పత్తుల తయారీలో భారత్ మరో పదేళ్లలో ప్రపంచంలోనే నంబర్ వన్‌గా నిలుస్తుందని, ఈ రంగంలో భవిష్యత్తు లీడర్‌గా ఎదుగుతుందని డీఆర్‌డీఓ మాజీ చైర్మన్, ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ జి.సతీశ్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. యువత, విద్యార్థులను శాస్త్ర, సాంకేతిక పరిశోధనల వైపు మళ్లించాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం నేపథ్యంలో శుక్రవారం గచ్చిబౌలి స్టేడియంలో ‘విజ్ఞాన్ వైభవ్ 2025’కార్యక్రమం ప్రారంభమైన సందర్భంగా డాక్టర్ సతీశ్‌రెడ్డి ‘సాక్షి’తో వివిధ అంశాలపై మాట్లాడారు.. ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే.. ‘రక్షణ రంగ ఉత్పత్తుల తయారీలో మన దేశం ఇప్పటికే ఎంతో వృద్ధి సాధించింది. మరో పదేళ్లలో భారత్ రక్షణ రంగ ఉత్పత్తుల తయారీలో ప్రపంచంలోనే మేటిగా మారుతుంది. భవిష్యత్ లీడర్ భారతే అని ధీమాగా చెప్పగలను. అందుకు తగిన అన్ని సామర్థ్యాలు మనకు ఉన్నాయి. రక్షణ రంగ ఉత్పత్తుల తయారీలో మనం స్వయం సమృద్ధి సాధించడంతోపాటు ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి రావాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటికే ఆ దిశగా మనం వేగంగా వెళుతున్నాం. ప్రస్తుతం భారత్ 70 శాతం వరకు అనుకున్న లక్ష్యాలను చేరుకోగలిగింది. అతి త్వరలోనే మనం ఉన్నత శిఖరాలకు చేరుకుంటాం. గతంలో ఎక్కువ మంది యువత ఐటీ రంగానికే ప్రాధాన్యం ఇచ్చేవారు. కానీ ఇప్పుడు అదే స్థాయిలో ఇంజనీరింగ్ విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక పరిశోధన రంగాల పట్ల ఆసక్తి పెరుగుతోంది. విజ్ఞాన్ వైభవ్ వంటి కార్యక్రమాలు యువతలో మరింత ప్రేరణ కలిగిస్తాయి. అవి భవిష్యత్తులో వారు సైన్స్ పట్ల మరింత ఆకర్షితులు అయ్యేలా చేస్తాయి. శాస్త్ర సాంకేతిక రంగంలో భారతీయ యువతను ప్రపంచ నాయకత్వం వహించేలా శక్తివంతులను చేయాలన్నదే మా లక్ష్యం. హైదరాబాద్‌లో ఇప్పటికే అనేక రక్షణ రంగ పరిశోధన కేంద్రాలు, ఉత్పత్తి సంస్థలు ఉన్నాయి. సైన్స్ అండ్ టెక్నాలజీ రంగం ఎప్పటికీ విస్తరిస్తూనే ఉంటుంది. హైదరాబాద్‌లో భవిష్యత్తులోనూ మరిన్ని రక్షణ రంగ సంస్థలు వచ్చే అవకాశం ఉంది’.

‘పొదుపు’ మహిళలకు ‘సున్నా’మే

సున్నావడ్డీ పథకం అమలుకు రూ.నాలుగైదు వేల కోట్లు అవసరం

కానీ, తాజా బడ్జెట్ ప్రతిపాదనల్లో కేవలం రూ.100 కోట్లే కేటాయింపు

సాక్షి, అమరావతి: మహిళా పొదుపు సంఘాల సున్నా వడ్డీ పథకాన్ని టీడీపీ కూటమి ప్రభుత్వం మళ్లీ నిర్వీర్యం చేసే దిశగానే అడుగులు వేస్తోంది. ఎన్నికల హామీ ప్రకారం.. ఈ పథకం అమలుకు ఏటా రూ.నాలుగైదు వేల కోట్ల వరకు నిధులు కావాల్సి ఉంటే.. శుక్రవారం నాటి బడ్జెట్‌లో కేవలం రూ.100 కోట్లు మాత్రమే కేటాయించి వారి ఆశలు, ఆకాంక్షలపై నీళ్లు జల్లింది. నిజానికి.. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించిన ‘పొదుపు’ మహిళలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లపాటు అమలైన సున్నా వడ్డీ పథకానికి చంద్రబాబు ప్రభుత్వం రాగానే బ్రేకులు పడ్డాయి. ఇప్పటికే రాష్ట్రంలోని దాదాపు కోటి మందికి పైగా ‘పొదుపు’ మహిళలు తాము 2023 ఏప్రిల్ – 2024 మార్చి మధ్య ఏడాదిపాటు ప్రతినెలా అసలుతో కలిపి చెల్లించిన వడ్డీ డబ్బులను ‘సున్నా వడ్డీ’ పథకం కింద ప్రభుత్వం తిరిగి ఎప్పుడు చెల్లిస్తుందా అని వేయికళ్లతో నిరీక్షిస్తున్నారు.



నిజానికి.. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా కొనసాగిన ఐదేళ్ల కాలంలో ఏప్రిల్ నెలలోనే చెల్లించే విధానాన్ని ప్రవేశపెట్టింది. కానీ, 2023–24 ఆర్థిక సంవత్సరం ముగియక ముందే 2024 మార్చి మధ్యలోనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడం.. ఎన్నికల అనంతరం చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటుకావడం జరిగిపోయింది. ఇప్పుడు మరో ఆర్థిక సంవత్సరం పూర్తవుతున్నా ప్రస్తుత సర్కారు సున్నావడ్డీ పథకం ఊసే ఎత్తడంలేదు. మరోవైపు.. 2024–25 ఆర్థిక సంవత్సరంలోనూ సకాలంలో రుణ వాయిదాలను చెల్లించిన మహిళలకు ఈ ఏడాది మార్చి ఆఖరు తర్వాత సున్నా వడ్డీ పథకం కింద మరో రూ.నాలుగైదు వేల కోట్లు వారికి చెల్లించాల్సి ఉంది. కానీ, శుక్రవారం నాటి బడ్జెట్‌లో కేవలం రూ.100 కోట్లే కేటాయించడం చూస్తుంటే ‘పొదుపు’ మహిళలకు చంద్రబాబు సర్కారు ఇస్తున్న ప్రాధాన్యత స్పష్టమవుతోంది.

2014–19 మధ్య కూడా ఇంతే..


ఐక రాష్ట్ర విభజనకు ముందు నుంచి అమలులో ఉన్న పొదుపు సంఘాల సున్నా వడ్డీ పథకాన్ని 2014–19లో కూడా నాటి సీఎం చంద్రబాబు పూర్తిగా నీరుగార్చారు. అప్పట్లో ఐదేళ్లకుగాను కేవలం రెండేళ్ల నాలుగు నెలల కాలానికి సంబంధించిన సున్నావడ్డీ డబ్బులను మాత్రమే చెల్లించారు. 2016 ఆగస్టు తర్వాత కాలానికి మొండిచెయ్యి చూపించారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.



బుల్లితెర నటుల సందడి

లబ్బీపేట(విజయవాడతూర్పు): బుల్లితెర నటి వర్షిణి, బిగ్‌బాస్ ఫేం ఫేహ్ రాజ్‌లు శుక్రవారం బెజవాడలో సందడి చేశారు. ఎంజీ రోడ్డులో విమెన్ వేర్ స్టోర్‌ను వారు ప్రారంభించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 529.90 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 7,033 క్యూసెక్కులు విడుదలవుతోంది.

కృష్ణా వర్సిటీ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా ఉష



కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ ఉష నియమితులయ్యారు. ఆమె శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

న్యూస్‌రీల్

అంకితభావంతో సేవలు చేస్తే గుర్తింపు



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఉద్యోగులు అంకితభావంతో అందించే సేవలే గుర్తింపు తెస్తాయని ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. నగరంలో డీఎంహెచ్‌ఓ కార్యాలయంలోని గణాంక విభాగంలో పనిచేస్తూ శుక్రవారం పదవీ విరమణ చేసిన కొక్కిర నాగమణిని కార్యాలయ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనేది ప్రతి ఉద్యోగికి జరిగే సాధారణ ప్రక్రియ అని, వారి అంకిత భావం, ప్రవర్తన ముఖ్యమైనవన్నారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ వై.శరత్ బాబు, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఇందుమతి, ఎన్‌హెచ్‌ఎం, డీపీఎం డాక్టర్ నవీన్, బూచవరం, వెలగలేరు, కొండపల్లి, లింగాలుపాడులో పని చేసే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత అందరికీ అవసరం



కంకిపాడు: ఆర్థిక అక్షరాస్యత అందరికీ అవసరమని కృష్ణా జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సి.రవీంద్రరెడ్డి అన్నారు. ఆర్‌బీఐ సారథ్యంలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు -2025 పురస్కరించుకుని గొడవర్రు జెడ్పీ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులకు బ్యాంకింగ్ వ్యవస్థ-పొదుపు అంశంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన టి.శారద, డి.ఉషాదేవి, కె.శ్రీదేవికి బహుమతులు అందించారు. రవీంద్ర రెడ్డి మాట్లాడుతూ మహిళలు పొదుపుపై అవగాహన పెంచుకోవాలన్నారు. దీంతో ఆర్థిక వృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. బ్యాంకింగ్ సేవలు వినియోగించుకుని ఆర్థిక వృద్ధి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం, ఆర్థిక అక్షరాస్యత కేంద్ర కౌన్సిలర్ సునీల్ పాల్గొన్నారు.

వంశీని మానసికంగా వేధిస్తున్నారు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని మానసికంగా ఇబ్బంది పెట్టాలని ప్రయత్నిస్తున్నారని ఆయన సతీమణి పంకజశ్రీ అన్నారు. వంశీకి ఆస్తమా ఉంది. ఫిట్స్‌లా వస్తుంది. కోర్టుకు వచ్చిన సమయంలోనూ నీరసంగా ఉన్నారని తెలిపారు. అక్రమ కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న వంశీని ఆమె ములాఖత్ అయ్యారు. అనంతరం పంకజ శ్రీ మీడియాతో మాట్లాడుతూ వంశీ ఎత్తుగా ఉంటారని 6/4 రూమ్‌లో ఉండటం కష్టంగా ఉందన్నారు. కనీసం కూర్చోవటానికి ఒక చైర్ కూడా ఇవ్వటం లేదన్నారు. ఒంటరిగా కాకుండా సెల్‌లో ఎవరినైనా పెడితే తోడు ఉంటుందన్నారు. కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. వంశీపై కేసులన్నీ కక్ష సాధింపులో భాగంగానే పెట్టారన్నారు. యర్రగొండపాలెం ఎమ్మెల్యే చంద్రశేఖర్ మాట్లాడుతూ వంశీ అనారోగ్యంతో బాధపడుతున్నారని, ఆయనకు పార్టీగా అండగా ఉంటుందన్నారు.

పశువులకు సకాలంలో టీకాలు వేయాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పశువులకు అవసరమైన టీకాలను సకాలంలో అందించి, పూర్తిస్థాయిలో వ్యాధులను అరికట్టేందుకు కృషిచేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ.. పశుసంవర్ధక శాఖ అధికారులతో కలిసి గాలికుంటు వ్యాధి, బ్రుసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ మార్చి 1 శనివారం నుంచి 30వ తేదీ వరకు పశువులకు గాలికుంటువ్యాధి, బ్రుసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాలుగు నెలల వయసు దాటిన పశువులకు గాలికుంటువ్యాధి నిరోధక టీకాలు, 4-8 నెలల వయసున్న పెయ్యదూడలకు బ్రుసెల్లోసిస్ నిరోధక టీకాలు పశుసంవర్ధక శాఖ సిబ్బంది ఉచితంగా రైతు వద్దే వేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎం.హనుమంత రావు తదితరులు పాల్గొన్నారు.

నయవంచన

బడ్జెట్‌లో ఏ వర్గానికీ మేలు లేదు

- సూపర్‌సిక్స్‌పై నీలినీడలు
- అంకెల గారడీ, అరకొర నిధులు
- రైతులు, మహిళలు, యువతలో అసహనం
- బుడమేరు ఆధునికీకరణ ఊసే లేదు
- నీటి పారుదల ప్రాజెక్టులకు నిధులు అరకొర
- ఫిషింగ్ హార్బర్‌కు కేటాయింపుల్లేవు



వరదల వేళ బుడమేరు ఉధృతి(ఫైల్)

సాక్షి ప్రతినిధి, విజయవాడ: రాష్ట్ర బడ్జెట్ సామాన్యుడిని నయవంచనకు గురిచేసింది. శాసన సభలో శుక్రవారం ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలను తీవ్రంగా నిరాశ పరిచింది. అంకెల గారడీ, అరకొర నిధులతో మసిపూసి మారేడు కాయ చేసినట్లు బడ్జెట్ ఉందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. సూపర్‌సిక్స్ హామీలకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు అరకొరగానే ఉన్నాయి. ప్రధానంగా రైతులు, యువత, మహిళల్లో అసహనం వ్యక్తమవుతోంది. నీటిపారుదల ప్రాజెక్టులకు అరకొరగానే నిధులు కేటాయించారు. అమరావతి నిర్మాణానికి అప్పు రూపంలో నిధులు తెచ్చారు తప్ప, బడ్జెట్‌లో ప్రత్యేకంగా కేటాయింపులు లేవని పెదవి విరుస్తున్నారు. మెట్రో రైలు, అవుటర్ రింగ్ రోడ్డు వంటి వాటికి నామ మాత్రంగా కూడా నిధులు కేటాయించలేదన్న భావన వ్యక్తమవుతోంది. వైద్యరంగాన్ని సైతం విస్మరించారు.

బుడమేరు ఆధునికీకరణకు నిధులు సున్నా

గత ఏడాది సెప్టెంబరులో వచ్చిన బుడమేరు వరదలకు బెజవాడలో సగం భాగం నీట మునిగింది. సీఎం చంద్రబాబు విజయవాడ.. బుడమేరు వరద ముంపు బారిన పడకుండా చర్యలు తీసుకొంటున్నట్లు ప్రకటించారు. బుడమేరును ఆధునికీకరిస్తామని, ఆక్రమణలను పూర్తిగా తొలగిస్తామని చెప్పారు. దానికనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో 'బుడమేరు'కు నిధులు కేటాయించకపోవడం గమనార్హం. బుడమేరు ప్రభావిత ప్రాంతాల ప్రజలు ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నీటిపారుదలకు నామమాత్రంగా నిధులు

ఉమ్మడి కృష్ణా జిల్లాలో నీటి పారుదల రంగానికి బడ్జెట్‌లో నామ మాత్రంగా నిధులు కేటాయించారు. 2026 జూన్ నాటికి చింతలపూడి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టులు పూర్తి చేస్తామని గొప్పలు చెప్పారు. మైలవరం, తిరువూరు, నూజివీడులో 2.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటితోపాటు, తాగు నీరు అందించే అతి ముఖ్యమైన ప్రాజెక్టు. ఈ పనులు పూర్తయ్యేందుకు రూ.4 వేల కోట్లకు పైగా నిధులు అవసరం. ప్రస్తుతం రూ.30 కోట్ల నిధులు కేటాయించి ఎలా ప్రాజెక్టును పూర్తి చేస్తారోనని నీటిపారుదల రంగ నిపుణులు పెదవి విరుస్తున్నారు.

కృష్ణా డెల్టాకు కేవలం రూ.400 కోట్ల నిధులను మాత్రమే కేటాయించారు. పులిచింతలకు రూ.16.37 కోట్లు ఇచ్చారు. పోర్టుకు అరకొరగానే నిధులు కేటాయించి, ప్రభుత్వం చిన్నచూపు చూసిందనే భావన వ్యక్తమవుతోంది. మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్‌కు నిధులు కేటాయించలేదు. గన్నవరం ఎయిర్‌పోర్టుకు రూ.29.88 కోట్లను కేటాయించారు. విజయవాడ కార్పొరేషన్‌కు కేవలం రూ.115.11 కోట్లను మాత్రమే నిధులు విదిల్చారు.

మహిళల నిట్టూర్పు

కూటమి అధికారంలోకి వస్తే 18-59 ఏళ్లలోపు ఉన్న ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని ఊదరగొట్టారు. బడ్జెట్‌లో దీని ఊసే లేదు. ఎన్టీఆర్ జిల్లాలో 8,30,958 మంది, కృష్ణా జిల్లాలో 7,39, 202 మంది అర్హులైన మహిళలు ఉన్నారు. వీరంతా బాబు మాట నమ్మి నిండా మునిగామని నిట్టూరుస్తున్నారు.



బందరులో పోర్టు నిర్మాణ పనులు(ఫైల్)

నో ష్యూరిటీ

బాబు ఇచ్చిన పలు హామీలకు బడ్జెట్‌లో ష్యూరిటీ ఇవ్వలేదు. దీంతో సూపర్ సిక్స్ హామీలపై నీలి నీడలు కమ్ముకున్నాయి.

అన్నదాతకు అరకొరగా నిధులు

ఉమ్మడి కృష్ణాజిల్లాలో రైతులకు ఏడాదికి రూ.20వేల చొప్పున అన్నదాత సుఖీభవ పథకం కింద ఇస్తామని ప్రకటించారు. బడ్జెట్‌లో మాత్రం అరకొరగానే నిధులు కేటాయించడంతో రైతులు పెదవి విరుస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో 1,41,726 మంది రైతులు, కృష్ణా జిల్లాలో 2.70 లక్షల మంది ఎదురుచూస్తున్నారు. దీంతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలకు అంతంత మాత్రంగానే కేటాయింపులున్నాయి.

అరకొరగా తల్లికి వందనం

ఎన్నికల హామీల్లో స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15వేల చొప్పున తల్లికి వందనం కింద ఇస్తామని చెప్పారు. బడ్జెట్‌లో దీనికి అరకొరగా కేటాయించారు. ఎన్టీఆర్ జిల్లాలో 3.35 లక్షల మంది, కృష్ణా జిల్లాలో 2.42 మంది తల్లులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



ఫిషింగ్ హార్బర్ పనులు(ఫైల్)

నిరుద్యోగ భృతి నిల్

ఎన్నికల వేళ కూటమి తాము అధికారం చేపట్టగానే వెంటనే ఉద్యోగాలు కల్పిస్తామని, లేదా నిరుద్యోగ భృతికింద నెలకు రూ.3 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతికి బడ్జెట్‌లో కేటాయింపులు ఇవ్వలేదు. ఎన్టీఆర్ జిల్లాలో 6,09,032 కుటుంబాలు, కృష్ణా జిల్లాలో 8 లక్షల కుటుంబాలకు తీవ్ర నిరాశే మిగిల్చింది.

ఉచిత బస్సు రాలేదు

ఎన్నికల మేనిఫెస్టోలో టీడీపీ కూటమి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అంటూ హామీ ఇచ్చినా బడ్జెట్‌లో దీని ఊసే లేదు. ఎన్టీఆర్ జిల్లాలో 9.70లక్షల మంది, కృష్ణా జిల్లాలో 9 లక్షల మంది మహిళలు ఉన్నారు. వీరంతా ఉచిత బస్సు కోసం ఎదురు చూస్తున్నారు. బాబు ఇచ్చిన హామీలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంతో ప్రజలు అన్ని వర్గాల ప్రజల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

వచ్చే ఏడాదైనా భరోసా ఇస్తారా



అన్నదాత సుఖీభవ పేరుతో ఏడాదికి రైతుకు రూ.20వేలు ఇస్తామంటూ ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ ఏడాది ఖరీఫ్, రబీ సాగుకు పథకం అమలు చేయలేదు. ఈ బడ్జెట్ చూస్తే వచ్చే ఏడాది కూడా అమలయ్యేలా కనిపించడంలేదు. వరదలతో వరి పంట, రేటు లేక మిర్చి, టామాటా పంటలు సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి. మా ఇబ్బందులను తొలగించడానికి చర్యలు తీసుకోవాలి.

– చెరుకూరి శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకుడు, కవులూరు

పీఆర్సీ అమలుకు కేటాయింపులేవి



రాష్ట్ర బడ్జెట్‌లో పీఆర్సీ, ఐఆర్ అమలు కోసం నిధుల కేటాయింపులపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడం దురదృష్టకరం. 12వ పీఆర్సీ 20 నెలలు ఆలస్యమైనా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం బాధాకరం. సీపీఎస్, జీపీఎస్ కంటే మెరుగైన పెన్షన్ విధానాన్ని తీసుకువస్తామని ఇచ్చిన హామీపై ప్రభుత్వం బడ్జెట్‌లో ఎటువంటి ప్రకటన చేయకపోవడం సరికాదు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి. సిబ్బంది ఇబ్బందులను వెంటనే తెలుసుకోవాలి. ఆర్థిక ఇబ్బందులను తొలగించాలి.

-రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి దేవరపల్లి విద్యాసాగర్

కాపులకు ప్రాధాన్యం దక్కలేదు



బడ్జెట్‌లో కాపులకు సరైన ప్రాధాన్యం దక్కలేదు. కాపుల సంక్షేమానికి కేటాయింపులు ఏమీ కనిపించలేదు.. దీంతో కాపుల్లో నిరుత్సాహం కలిగింది. కాపులతో పాటు, బీసీలు, ఇతర వర్గాల సంక్షేమాన్ని సైతం విస్మరించారు.

– యర్రంశెట్టి అంజిబాబు, రాష్ట్ర అధ్యక్షుడు ప్రజాకాపునాడు సంక్షేమ సంఘం

'ఇంటర్' పరీక్షలకు సన్నద్ధం

- నేటి నుంచి పరీక్షలు
- ఎన్టీఆర్ జిల్లాలో రాయనున్న 77,987 మంది విద్యార్థులు
- జిల్లాలో 103 కేంద్రాలు



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జిల్లాలో ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల సందడి ప్రారంభమైంది. మార్చి 1 శనివారం నుంచి 20వ తేదీ వరకు థియరీ పరీక్షలు జరగనున్నాయి. పరీక్ష కేంద్రంలోని ప్రతి గదిలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 77,987 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో..

ఎన్టీఆర్ జిల్లాలో సుమారు 80,272 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు అధికారులు వివరిస్తున్నారు. ఒకేషనల్ కోర్సులవిద్యార్థులు 2285 మంది ఉన్నారు. పరీక్షలకు హాజరవుతున్న వారిలో మొదటి ఏడాది విద్యార్థులు 40,008 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 37,979 మంది ఉన్నట్లు అధికారులు వివరిస్తున్నారు.

ముందస్తు చర్యలు

ఎన్టీఆర్ జిల్లాలో 103 పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్షలు కొనసాగుతాయి. ముఖ్యంగా పరీక్ష కేంద్రాల్లో సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. ప్రతి కేంద్రంలోనూ ఇబ్బందులు ఎదురుకాకుండా ఫర్నిచర్, తాగునీరు, వెలుతురు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లు

విద్యార్థులు హాల్‌టికెట్ల కోసం ఇబ్బందులు పడాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ప్రతి విద్యార్థి హాల్ టికెట్‌ను వెబ్‌సైట్‌లో ఉంచారు. దీని ద్వారా నేరుగా విద్యార్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ప్రిన్సిపాల్ సంతకం అవసరం లేదు. జిల్లాలో నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్లు పర్యవేక్షించనున్నాయి. రెండు సిట్టింగ్ స్క్వాడ్లను అధికారులు ఏర్పాటు చేశారు. పోలీసు శాఖ విస్తృత బందోబస్తు నిర్వహించనున్నారు.

ఇబ్బందుల్లేకుండా పరీక్షలు



ఇంటర్మీడియెట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. 13 జోన్లుగా విభజించాం. 27 స్టోరేజ్ పాయింట్లు ఏర్పాటు చేశాం. నాలుగు ఫ్లైయింగ్ స్క్వాడ్స్, రెండు సిట్టింగ్ స్క్వాడ్స్‌ను నియమించాం. ఇప్పటికే కలెక్టర్ అధ్యక్షతన ఆయా విభాగాల అధికారులు, పరీక్ష కేంద్రాల బాధ్యులతో సమావేశం జరిగింది. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– సీఎస్ఎస్ఎన్ రెడ్డి, జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి

కార్పొరేట్ శక్తులకు భూముల ధారాదత్తం

ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షుడు టాన్యా



మాట్లాడుతున్న టాన్యా

కృష్ణలంక(విజయవాడతూర్పు): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వ భూములను అప్పగించడమే వికసిత్ భారత్ అని అఖిల భారత రైతుకూలీ సంఘం(ఏఐకేఎంఎస్) జాతీయ అధ్యక్షుడు పి.టాన్యా విమర్శించారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గవర్నర్ పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు టి.ప్రకాష్ అధ్యక్షతన శుక్రవారం భూ సమస్యలపై రాష్ట్ర సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న టాన్యా మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు విధానాల ఫలితంగా, పాలకుల సంస్కరణల కారణంగా వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతోందని దుయ్యబట్టారు. అటవీ సంరక్షణ నియమాల పేరుతో, ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలను అడవుల నుంచి గెంటివేసే కుట్ర జరుగుతోందని, అమాయక ఆదివాసీలను కాల్చి చంపుతుందని విమర్శించారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వర రావు మాట్లాడుతూ రైతాంగం పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నల్లమడ రైతు సంఘం నాయకుడు కొల్లా రాజమోహన్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రిలయన్స్ కంపెనీకి ఐదు లక్షల ఎకరాల ప్రభుత్వ భూములు ఎలా కట్టబెడుతుందని ప్రశ్నించారు. సదస్సులో ఏఐకేఎంఎస్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.భాస్కర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యూ.గనిరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సత్యన్న, కె.దూలయ్య, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.

మురిపించిన ముక్కంటి..

- ఇంద్రకీలాద్రిపై పూర్ణాహుతి
- ముగిసిన శివరాత్రి మహోత్సవాలు



పూర్ణాహుతి చేస్తున్న అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విశేష పూజలందుకున్న ముక్కంటి భక్తజనాన్ని మురిపించాడు. ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న శివరాత్రి ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. దేవస్థాన యాగశాలలో పూర్ణాహుతి, ధాన్యకోట్నోత్సవం, వసంతోత్సవాలను ఆలయ అర్చకులు, వేద పండితులు శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు రంగావజ్ఝుల శ్రీనివాస శాస్త్రి పూర్ణాహుతి చేయించగా, ఈవో కె. రామచంద్రమోహన్ పాల్గొన్నారు. తొలుత యాగశాలలో మండపారాధనలు, కలశారాధనలు, మూలమంత్ర హవనం, హారతి, ధ్వజావరోహణం వంటి వైదిక కార్యక్రమాలను జరిపించారు. ధాన్యకోట్నోత్సవంలో ఆలయ ఈవో రామచంద్రమోహన్, స్థానాచార్యులు పాల్గొన్నారు.

వసంతోత్సవం

ఉత్సవాలను పురస్కరించుకుని యాగశాల వద్ద వసంతోత్సవాన్ని నిర్వహించారు. ఆది దంపతులైన శ్రీ గంగా పార్వతి(దుర్గ) సమేత మల్లేశ్వర స్వామి వార్లకు ఆలయ అర్చకులు గులామ్‌లను అద్ది వసంతోత్సవాన్ని ప్రారంభించారు. దుర్గాఘాట్‌లో దేవతామూర్తులతో అవభృథోత్సవాన్ని నిర్వహించారు. శనివారం నుంచి మూడు రోజుల పాటు ఆదిదంపతులకు పవళింపు సేవ చేస్తున్నట్లు ఆలయ వైదిక కమిటీ పేర్కొంది. శనివారం సాయంత్రం మల్లేశ్వర స్వామి వారికి పంచహారతుల అనంతరం ద్వాదశ ప్రదక్షిణలు జరుగుతాయని, రాత్రి పవళింపు సేవ జరుగుతుందని పేర్కొన్నారు. పవళింపు సేవతో ఉత్సవాలు పరిపూర్ణమవుతాయి.

పరిశ్రమలను ప్రోత్సహించాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

జయంతిపురం(జగ్గయ్యపేట): గ్రామాలలో ఏర్పాటు చేసే కర్మాగారాల యాజమాన్యాలు స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ పేర్కొన్నారు. గ్రామంలోని రామ్‌కో సిమెంట్స్ లిమిటెడ్ ఈస్ట్ బ్యాండ్ లైమ్ స్టోన్ మైన్ సున్నపు రాయి ఉత్పత్తికి సంబంధించి ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సున్నపురాయి ఉత్పత్తికి సంబంధించిన విషయాలలో ఏవైనా లోటుపాట్లుంటే ప్రజలు నిర్భయంగా సదస్సులో తెలపాలన్నారు. వీటి ఆధారంగానే కర్మాగారాలకు అనుమతులిస్తామన్నారు. రామ్‌కో కర్మాగారం ప్రెసిడెంట్ ఆశిష్‌కుమార్ శ్రీవత్సవ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పలు గ్రామాలను కర్మాగారం దత్తత తీసుకుని మౌలిక వసతులతో పాటు ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన సౌకర్యాలను కల్పిస్తోందని తెలిపారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోండి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ లక్ష్మీశ శుక్రవారం కలెక్టరేట్‌లో గ్రామీణ నీటి సరఫరా.. ఇతర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాలు, గ్రామాలు, మారుమూల పల్లెల్లో సైతం ప్రభుత్వ పరంగా, స్వచ్ఛంద సంస్థల సహకారంతో చలివేంద్రాలు ఏర్పాటు చేసేలా అధికారులు సమన్వయం చేసుకోవాలని చెప్పారు. తాగునీటి పైపులైన్ల మరమ్మతు ప్రాంతాలు గుర్తించి తక్షణమే పనులు పూర్తి చేయాలన్నారు. ఏప్రిల్, మే నెలల్లో నీటి ఎద్దడి తలెత్తే అవకాశాలు ఉంటాయని, అటువంటి కీలక సమయంలో అధికారులు ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. తాగునీరు పరంగా ఇబ్బందులు ఉంటే 0866-2575822, 91549 70454 నంబర్లలో సంప్రదించవచ్చని కలెక్టర్ సూచించారు

పెన్షన్లకు రూ. 98.20 కోట్లు విడుదల

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో మార్చి 1వ తేదీన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కింద 2,29,913 మంది పెన్షనర్లకు పంపిణీ చేయడానికి రూ. 98.20 కోట్లు విడుదల చేశామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ లక్ష్మీశ.. డీఆర్‌డీఏ పీడీ, ఆర్‌డీవోలు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీపై టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. శనివారం ఉదయం 7 గంటలకు పంపిణీ ప్రారంభించాలన్నారు. రెండో తేదీ ఆదివారం కావడంతో పెన్షన్ల పంపిణీ ప్రక్రియను మూడో తేదీ నాటికి 100 శాతం పూర్తిచేయాలన్నారు. లబ్ధిదారుల ఇళ్ల వద్ద నుంచి 300 మీటర్ల కంటే ఎక్కువ దూరంలో పెన్షన్ పంపిణీ చేయాల్సి వస్తే అందుకు తగిన కారణాన్ని మొబైల్ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎం, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, విజయవాడ ఆర్డీఓలు కావూరి చైతన్య, కె.మాధురి, కె.బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



బహుమతులు అందజేస్తున్న అతిథులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆప్‌కాస్ట్ మెంబర్ సెక్రటరీ శరత్ కుమార్ అన్నారు. జిల్లా విద్యాశాఖ, ఆప్‌కాస్ట్, సమగ్ర శిక్ష సంయుక్త ఆధ్వర్యాన జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా స్థాయి పోటీలను స్థానిక బిషప్ అజరయ్య స్కూల్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టర్ ప్రజెంటేషన్, క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం బహుమతి ప్రదానోత్సవం జరిగింది. శరత్‌కుమార్ మాట్లాడుతూ సమాజంలో ప్రజల అవసరాలు, అభివృద్ధికి అండగా నిలిచే ఆవిష్కరణలను తీసుకురావాలని ఆ దిశగా విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. డీఈవో సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు డాక్టర్ సీవీ రామన్ వంటి శాస్త్రవేత్తలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదానికి చోటు లేని యంత్రనగరి

- నిరుపయోగంగా మారిన 400 గజాల విలువైన స్థలం
- ఈ స్థలంలో పార్కు ఏర్పాటుచేయాలంటున్న కార్మికులు
- పట్టించుకోని ఐలా అధికారులు



జవహర్ ఆటోనగర్ ఏర్పాటుకు 1966లో అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ శంకుస్థాపన చేసిన స్థలం ఇదే...

ఆటోనగర్(విజయవాడతూర్పు): జవహర్ ఆటోనగర్ ఆసియా ఖండంలోనే అతి పెద్ద కార్మికవాడ. ఇక్కడ సుమారు 80 వేల మంది కార్మికులు నిత్యం పనిచేస్తుంటారు. పరిశ్రమలు, ఆటోమొబైల్ రంగంతో పాటు లారీ బాడీబిల్డింగ్ షెడ్‌లు కూడా ఉన్నాయి. ఈ యంత్రాల రణగొణధ్వనిలో ప్రకృతిని బ్యాలెన్స్ చేయడానికి కనీసం ఇక్కడ ఒక్క పార్కు కూడా లేకపోవడం శోచనీయం

మొదటిక్రాస్ ఒకటవ రోడ్డులో...

1966వ సంవత్సరంలో అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ మొదటి క్రాస్ 1వ వీధిలోని సుమారు 400 గజాల స్థలంలో కార్మికవాడకు శంకుస్థాపన చేశారు. నేడు ఈ స్థలం ఏపుగా పెరిగిన చెట్లతో అడవిని తలపిస్తోంది. విషసర్పాలకు నిలయంగా మారింది. ఈ ప్రాంతానికి వెళ్లాలంటే స్థానికులు సైతం భయపడుతున్నారు. అంతే కాకుండా ఈ ప్రాంతమంతా చుట్టూ వ్యర్థాలతో నిండి ఉంటుంది. ఇందిరాగాంధీ శంకుస్థాపన చేసిన శిలాఫలకం కింద భాగం అంతా మురుగునీరు చేరి దోమల ఉత్పత్తికి కారణం అవుతోంది. సంబంధిత ఐలా అధికారులు ఇటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం శోచనీయం.

పార్కును ఏర్పాటు చేయాలి..

ఈ ఖాళీ స్థలంలో చిన్నపార్కును నిర్మించాలని కార్మికులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్నారు. గతంలో పలు మార్లు ఐలా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గత కొన్నేళ్లుగా ఈ స్థలం ఖాళీగా ఉంటోంది. ఇంత ప్రముఖమైన కూడలి వద్ద ఉన్న ఈ స్థలాన్ని నిరుపయోగంగా ఉంచడం ఏమిటని అధికారులను కార్మికులు ప్రశ్నిస్తున్నారు. అంతే కాకుండా ఇక్కడ కింద షాపులు నిర్మించినా.. ఐలాకు ఆదాయం వస్తుందని, ఆ దిశగా చర్యలు తీసుకుంటే బాగుంటుందని సూచిస్తున్నారు.

ఈ స్థలం పక్కనే...

ఈ ఖాళీ స్థలం పక్కనే నవజీవన బాలవికాస కేంద్రం ఉంది. ఇందులో మహిళలకు టైలరింగ్ శిక్షణ ఇస్తున్నారు. ఇందులోకి మహిళలు రావాలంటే ఏపుగా ఉన్న చెట్లను చూసి భయాందోళన చెందుతున్నారు. అప్పడప్పుడు పాములు కూడా కనిపిస్తున్నాయని చెబుతున్నారు. ఐలా అధికారులు స్పందించి ఆ స్థలాన్ని పరిశుభ్రంగా ఉంచాల్సిన అవసరం ఉంది.

ఈ స్థలంపై కన్నేస్తున్న పెద్దలు?

గత కొన్ని సంవత్సరాల నుంచి ఖాళీగా ఉన్న ఈ స్థలంలో కొందరు పెద్దలు వేరే కట్టడాలు నిర్మించాలని యోచిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అంతేకాకుండా ఇక్కడ వివిధ సంఘాలకు చెందిన అసోసియేషన్ భవనాన్ని కూడా నిర్మించాలని చూస్తున్నారు. ప్రధాన కూడలి కావడంతో అందరి చూపు దీని మీదనే ఉంది. సంబంధిత ఉన్న తాధికారులు స్పందించి చెట్లను తొలగించి ఈ స్థలంలో పిల్లలకు ఆహ్లాదకరంగా ఉండే విధంగా పార్కును ఏర్పాటు చేయాలని కార్మికులు కోరుతున్నారు.

స్థలాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటా



ఇంతవరకు ఆ స్థలాన్ని పరిశీలించలేదు. పరిశీలించి అందులో ఉన్న చెట్లను తొలగిస్తాం. ఆ తర్వాత ఉన్నతాధికారుల సూచనమేరకు ముందుకు పోతాం.

– కె.బాజ్జీ, ఏపీఐఐసీ జోనల్ మేనేజరు, ఐలా ఇన్‌చార్జి కమిషనర్

పార్కు ఏర్పాటు చేయండి



ఆటోనగర్ ఏర్పాటుకుగాను అప్పటి ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ 1966 లో శంఖుస్థాపన చేశారు. నేటికీ ఈ స్థలం నిరుపయోగంగానే ఉంది. ప్రస్తుతం ఇందులో ఏపుగా చెట్లు పెరిగాయి. ఈ స్థలంలో పార్కు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– రాజనాల వేంకట రమణారావు, ఆటోమొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

క్లుప్తంగా

రిటైర్డ్ పోలీసులకు ఆత్మీయ వీడ్కోలు



విజయవాడస్పోర్ట్స్: విజయవాడ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రాంతాల్లో సుదీర్ఘ కాలం పాటు విధులు నిర్వహించి శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన ముగ్గురు పోలీసులకు ఎన్టీఆర్ జిల్లా అడ్మిన్ డీసీపీ కె.జి.వి.సరిత ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. ఏఎస్ఐలు ఎన్.ఎన్.నరసింహవర్మ, జి.నాగేశ్వరరావు, హోం గార్డ్ ఎం.విజయరాజులను పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి సునీత, ఏసీపీ డి. ప్రసాదరావు, వెల్ఫేర్ ఆర్ఐ శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సోమయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రాంతీయ గ్రాండ్ లాడ్జ్ సమావేశాలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): దక్షిణ భారత దేశ ప్రాంతీయ గ్రాండ్ లాడ్జ్ రెండు దశాబ్దాల తర్వాత విజయవాడలో నిర్వహిస్తున్నట్లు రీజనల్ గ్రాండ్ మాస్టర్ టీఎస్ మనోహర్ తెలిపారు. లబ్బీపేటలోని ఓ హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాంతీయ గ్రాండ్ లాడ్జ్ ఆఫ్ సదరన్ ఇండియా సమావేశానికి ఈ ఏడాది విజయవాడ నగరం ఆతిథ్యం ఇస్తున్నట్లు తెలిపారు. స్థానిక ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటర్‌లో మార్చి ఒకటి, రెండు తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించే ఈ సమావేశాల్లో దేశంలోని వేర్వేరు ప్రాంతాల నుంచి 1200 మంది ప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు. దేశంలో ప్రత్యేక పిల్లల కోసం పాఠశాలలకు సహాయం చేయడం, అంధత్వ నివారణ, వెనుకబడిన పిల్లలకు విద్య అందించడం వంటి మూడు ప్రధాన రంగాలను స్వచ్ఛంద ప్రాజెక్టులుగా గుర్తించి సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అనారోగ్యాల బారిన పడకుండా చూసుకోవచ్చునని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. ఆమె శుక్రవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. అందులో భాగంగా నున్న ఒకటవ సచివాలయం పరిధిలో క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పలు ఇళ్ల ఆవరణల్లో అపరిశుభ్రమైన వాతావరణం ఉండటాన్ని గమనించారు. ఈ సందర్భంగా వారితో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూడాలని సూచించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న ఎన్‌సీడీ–సీడీ సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా సర్వేలో ప్రగతి సాధించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పలువురు ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు సిద్ధార్థ ఫౌండేషన్ ఉపకార వేతనాల పంపిణీ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో శనివారం సాయంత్రం 5.30 గంటలకు తమ ఫౌండేషన్ 26వ వార్షిక ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సిద్ధార్థ ఫౌండేషన్ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖా మంత్రి కొల్లు రవీంద్ర ముఖ్యఅతిథిగా ఈ కార్యక్రమానికి హాజరై విద్యార్థులకు ఉపకార వేతనాలను పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపే ప్రాంతాలివే

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యుత్ లైన్‌ల మరమ్మతుల నేపథ్యంలో మొగల్రాజపురం సెక్షన్ బృందావన్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకూ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వహణ అధికారి పి.రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా ఎంజీ రోడ్డులోని సుందరం మోటార్స్ ఏరియా, డీవీ మానర్ హోటల్, టిక్కిల్‌రోడ్డు, కృష్ణనగర్, కామినేని వారి వీధి ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

కొత్త వాహన చట్టంలో భారీ జరిమానాలు

వివరాలు తెలిపిన ఎన్టీఆర్ జిల్లా సీపీ రాజశేఖరబాబు



విజయవాడస్పోర్ట్స్: ప్రభుత్వం తాజాగా సవరించిన మోటారు వాహన నూతన చట్టం ప్రకారం చట్టాన్ని ఉల్లంఘించిన వాహన చోదకులకు భారీ జరిమానాలు విధిస్తామని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హైకోర్టు ఉత్తర్వులు, సవరించిన జీవో 21 ప్రకారం మార్చి ఒకటో తేదీ శనివారం నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి వస్తాయని వెల్లడించారు. తాజా చట్ట సవరణ ప్రకారం ఉల్లంఘనపై ట్రాఫిక్ పోలీసులు జరిమానాలు విధిస్తారని వివరించారు.

జరిమానాలు ఇలా:

- హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే రైడర్‌కు రూ. 1000 వెనుక కూర్చున్న వ్యక్తికి రూ.1000
- బీమా సర్టిఫికెట్ లేకుండా వాహనం నడిపితే మొదటి సారి రూ.2,000, రెండోసారి రూ. 4,000
- లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ. 5000
- పొల్యూషన్ సర్టిఫికెట్ లేకుండా వాహనం నడిపితే రూ. 1,500
- వాహనం డ్రైవ్ చేసేటప్పుడు చేతిలో సెల్ ఫోన్ ఉంటే మొదటిసారి రూ.1500, రెండోసారి రూ.10,000
- యూనిఫాం లేకుండా ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు నడిపితే మొదటిసారి రూ.150, రెండోసారి రూ.300
- సీట్ బెల్టు ధరించకుండా కార్లు నడిపితే రైడర్ రూ.1000, సహ ప్రయాణికుడికి రూ. 1000
- వాహనాల రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, రిజిస్ట్రేషన్ రెన్యువల్ చేయకుండా నడిపిత మొదటిసారి రూ. 2000, రెండోసారి రూ. 5000
- అతి వేగంగా వాహనం నడిపితే రూ. 1000
- ట్రిపుల్ రైడింగ్ చేస్తే రూ. 1000
- రేసింగ్ చేస్తే మొదటిసారి రూ. 5000, రెండోసారి రూ. 10,000

వెటర్నరీ విద్యార్థులకు స్టైఫండ్ పెంచాలి

ఏపీ రైతు, కౌలు రైతు సంఘాల డిమాండ్



కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రైతు, కౌలు రైతు, యువజన సంఘాల ప్రతినిధులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వెటర్నరీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ సమయంలో ఇచ్చే స్టైఫండ్ జనరల్ మెడిసిన్ విద్యార్థులతో సమానంగా పెంచాలని ఏపీ రైతు, కౌలురైతు, ఏఐవైఎఫ్ డిమాండ్ చేశాయి. ఈ మేరకు శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశాయి. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి విద్యార్థుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి కృషి చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 1500 పశువైద్య పోస్టులు, వెటర్నరీ కాలేజీల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆయా సంఘాలు డిమాండ్ చేశాయి. కలెక్టరేట్ వద్ద ఏపీ కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి జమలయ్య మాట్లాడుతూ పై డిమాండ్లపై శ్రీ వెంకటేశ్వర పశువైద్య విద్యాలయ అనుబంధ కాలేజీలు అయిన తిరుపతి, ప్రొద్దుటూరు, గన్నవరం, గరివిడి వెటర్నరీ కళాశాలల విద్యార్థులు ఫిబ్రవరి 3వ తేదీ నుంచి క్లాసు లు బహిష్కరించి దీక్ష చేస్తున్నారన్నారు. విద్యార్థుల సమస్యలను మంత్రులు అచ్చెన్నాయుడు, నారా లోకేష్, యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌ల దృష్టికి ఇప్పటికే తీసుకెళ్లామన్నారు. విద్యార్థుల ప్రతినిధులతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్నీడు యల్లమందరావు, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు బుడ్డి రమేష్, ఉపాధ్యక్షుడు పెయ్యల వెంకటేశ్వరరావు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి లంక గోవిందరాజులు, శీరం రవికుమార్, సింగంశెట్టి మోహన్ ప్రసాద్, గాడి అజయ్ కుమార్, జి.షైనీ, షేక్ నజీన్ భాను, నరేష్, కళ్యాణ్ ,స్వప్న, మేరీ, డి.రమేష్, మమత తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ నగర క్రీడోత్సవ్ ప్రారంభం



ఉత్కంఠగా జరుగుతున్న పురుషుల వాలీబాల్ పోటీ

విజయవాడస్పోర్ట్స్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) ఖేలో భారత్ నగర క్రీడోత్సవ్–2025 పోటీలు పీబీ సిద్ధార్థ కళాశాల మైదానంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. పురుషులకు వాలీబాల్, కబడ్డీ, మహిళలకు కబడ్డీ, బ్యాడ్మింటన్(డబుల్స్), షాట్ పుట్, 100 మీటర్ల రన్నింగ్ క్రీడాంశాలలో మూడు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటగోపి తెలిపారు. పీబీ సిద్ధార్థ, మహిళా సిద్ధార్థ, వీఆర్ సిద్ధార్థ, పీవీపీ సిద్ధార్థ, ఎస్ఆర్ ఆర్ సీవీఆర్, నలంద డిగ్రీ, పొట్టి శ్రీరాములు, కేబీఎన్, సిద్ధార్థ హోటల్ మేనేజ్ మెంట్, ఎస్ఆర్‌కె, లయోలా కళాశాలల జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయని తెలిపారు. ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు దుర్గారావు, కార్యకర్తలు చరణ్, అఖిల్, వసీం ,మురళి, ఏబీవీపీ జాతీయ మాజీ కార్యదర్శి సురేష్ ఈ పోటీలను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. నిపుణులైన న్యాయ నిర్ణేతల సమక్షంలో అత్యంత పారదర్శకంగా పోటీలను నిర్వహిస్తున్నామన్నారు.పోటీలను ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) అనిమిని రవినాయుడు లాంఛనంగా ప్రారంభించారు.

డాక్టర్ తారకప్రసాద్ సేవలు ఎనలేనివి



డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్‌ని సత్కరిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ జ్యోతి తదితరులు

లబ్బీపేట(విజయవాడ తూర్పు): ఎనస్తీషియా నిపుణుడిగా, అడ్మినిస్ట్రేటర్‌గా డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్ అందించిన సేవలు ఎనలేనివని ఈఎస్ఐ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జ్యోతి అన్నారు. గుణదలలోని ఈఎస్ఐ ఆస్పత్రిలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓగా పనిచేస్తూ డాక్టర్ తారకప్రసాద్ శుక్రవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయనను ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ సూపరింటెండెంట్, ఆర్థోపెడిక్ నిపుణులు డాక్టర్ జాన్సన్, డాక్టర్ పద్మ, డాక్టర్ వర్మ పాల్గొన్నారు.

శ్రీచైతన్యలో ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శనలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీచైతన్య ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ స్కూల్‌లో శుక్రవారం సైన్స్ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలో పలువురు విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రాజెక్టులు విశేషంగా ఆకట్టుకున్నాయి. తొలుత ప్రదర్శనను స్టెల్లా కళాశాల ప్రొఫెసర్ డి.శాంతకుమారి ప్రారంభించారు. పాఠశాల రీజినల్ ఇన్‌చార్జి రావి పద్మ, శ్రీ చైతన్య సంస్థల విజయవాడ జోన్ ఏజీఎం మద్దినేని మురళీకృష్ణ, స్కూల్ ప్రిన్సిపాల్ కొల్లి సునీత, అకడమిక్ డీన్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు అందచేశారు.

పెరటి తోటల పెంపకంపై అవగాహన

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): నగరాల్లో నివాసం ఉండే వారు వారి ఇంటి పరిసరాల్లో, భవనాల పై భాగంలో ఉన్న ఖాళీ స్థలాల్లో ఆకుకూరలు, కూరగాయల మొక్కలను పెంచి వాటిని ఆహారంగా తీసుకోవచ్చునని రైతు సాధికార సంస్థ రీజనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ కె.అరుణ చెప్పారు. జనశిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో పెరటితోటల పెంపకం–ఆవశ్యకతపై అవగాహన సదస్సు వాంబే కాలనీలో శుక్రవారం జరిగింది. అరుణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఇంటి ముందు కొద్దిపాటి ఖాళీ స్థలం లోనే వివిధ కూరగాయలు, ఆకుకూరల మొక్కలన పెంచి వాటిని ఆహారంగా తీసుకోవడం ద్వారా కొంతమేరకు ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. స్త్రీ శిశు సంక్షేమశాఖ ఉమ్మడి కృష్ణాజిల్లా (రిటైర్డ్) ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ కె.సుహాసిని మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో సాధ్యం కాకపోతే డాబాలపైన కూడా మొక్కలను పెంచుకోవచ్చునని అన్నారు. వన్ ఎర్త్ వన్ లైఫ్ ఆర్గనైజేషన్ ఫౌండర్ ఈ.లీల,జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ, తరుణీ తరంగాలు సభ్యులు పాల్గొన్నారు.

ఇంధన సంరక్షణపై ముగిసిన ప్రచారం

లబ్బీపేట(విజయవాడ తూర్పు): ఇంధన సంరక్షణ ఆవశ్యకతను ప్రచార కార్యక్రమాల్లో ప్రజలకు వివరించినట్లు గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా విజయవాడ డెప్యూటీ జనరల్ మేనేజర్ కేఎస్ తివారీ అన్నారు. పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో 'సాక్ష్యం' పేరుతో నిర్వహించిన వార్షిక ప్రధాన ఇంధన సంరక్షణ ప్రచారం కార్యక్రమం ముగిసింది. 15 రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమ ముగింపు వేడుకలు శుక్రవారం ఎంజీ రోడ్డులోని ఓ హోటల్‌లో నిర్వహించారు.కార్యక్రమంలో ఇండస్ట్రీకి చెందిన రాష్ట్ర స్థాయి సమన్వయకర్త వి. వేణుమాధవ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సైక్లోథాన్, వాక్‌థాన్, సీఎస్‌జీ ఆటో, కార్ ర్యాలీ నిర్వహించి, గృహిణులు, పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఇంధన పొదుపు చిత్రాలపై అవగాహన కలిగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీపీసీఎల్ డివిజనల్ ఎల్‌పీజీ సేల్స్ హెడ్ (సిటీ) వేణుగోపాల్, విద్యార్థులు, ఆయిల్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



శరణమా.. రణమేనా?

జెలెన్‌స్కీకి ట్రంప్ అల్టిమేటం
- మాతో ఒప్పందానికి రావాల్సిందే
- లేదంటే పూర్తిగా తప్పుకుంటాం
- మీకు మరో అవకాశమే లేదు
- ప్రపంచయుద్ధం వైపు నెడుతున్నారు
- రష్యాతో రాజీకి రావాల్సిందే
- జెలెన్‌స్కీకి అధ్యక్షుని స్పష్టీకరణ
- ఉద్రిక్తంగా సాగిన అధ్యక్షుల భేటీ
- మీడియా ముందే అరుపులు
- అధ్యక్ష స్థాయి భేటీలో ఎన్నడూ కనీవినీ ఎరగని దృశ్యాలు
- సంయుక్త మీడియా భేటీ రద్దు
- వైట్‌హౌస్ వీడి వెళ్లిపోవచ్చు
- జెలెన్‌స్కీని ఉద్దేశించి ట్రంప్

వాషింగ్టన్: ఇటు ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ, అటు అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్. దేశాధినేతలం అన్న విషయం కూడా మర్చిపోయి మీడియా సాక్షిగా వాగ్వాదానికి దిగారు. నువ్వెంత అంటే నువ్వెంత అనుకున్నారు. ఒకరినొకరు దుయ్యబట్టుకున్నారు. అచ్చం వీధి బాగోతాన్ని తలపించేలా పాత విషయాలన్నీ తిరగదోడుతూ, పరస్పరం దెప్పిపొడుచుకుంటూ రెచ్చిపోయారు. అంతర్జాతీయ స్థాయిలో ఎన్నడూ కనీవినీ ఎరగని ఈ దృశ్యాలకు వైట్‌హౌస్‌లోని ఓవల్ ఆఫీసు వేదికైంది. ఉక్రెయిన్‌లోని అపార ఖనిజ నిక్షేపాల్లో అమెరికాకు 50 శాతం వాటా ఇవ్వాలని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ డిమాండ్ చేయడం, బదులుగా రష్యా నుంచి తమ దేశానికి కచ్చితమైన రక్షణ హామీలు కావాలని జెలెన్‌స్కీ కోరడం తెలిసిందే. వాటిపై స్పష్టమైన ఒప్పందాల నిమిత్తం అగ్రరాజ్యం చేరిన ఆయన శుక్రవారం వైట్‌హౌస్‌లో ట్రంప్‌తో 45 నిమిషాల పాటు భేటీ అయ్యారు. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో తదితరులు పాల్గొన్న ఈ భేటీకి మీడియాను అనుమతించడమే గాక ప్రత్యక్ష ప్రసారం కూడా చేయడం విశేషం. భేటీ చాలాసేపటిదాకా ప్రశాంతంగానే సాగినా చివర్లో పూర్తిగా అదుపు తప్పింది. నేతలిద్దరి మాటల యుద్ధంతో రచ్చ రచ్చగా మారింది. చివరికి ఎటూ తేలకుండానే ముగిసింది. భేటీ అనంతరం జరగాల్సిన ట్రంప్, జెలెన్‌స్కీ సంయుక్త మీడియా భేటీ కూడా రద్దయింది! అంతేగాక, 'జెలెన్‌స్కీ వైట్‌హౌస్ వీడి వెళ్లిపోవచ్చు' అంటూ మీడియా సమక్షంలో ట్రంప్ వ్యాఖ్యలు చేశారు. శాంతి ఒప్పందానికి సిద్ధపడితేనే తిరిగి తమతో చర్చలకు రావాలని సూచించారు. దాంతో ఎన్నో ఆశల నడుమ జెలెన్‌స్కీ చేపట్టిన అమెరికా యాత్ర ఆశించిన ఫలితం రాబట్టకపోగా వికటించినట్టు కనిపిస్తోంది.

అలా మొదలైంది...

రష్యా–ఉక్రెయిన్ వివాదం విషయమై దశాబ్ద కాలంగా అమెరికా వ్యవహరిస్తున్న తీరును ఆక్షేపిస్తున్నట్టుగా జెలెన్‌స్కీ మాట్లాడటంతో పరిస్థితి వేడెక్కింది. అమెరికా మీడియా అంతా చూస్తుండగా అంత అమర్యాదకరంగా మాట్లాడటం సరికాదంటూ వాన్స్ జోక్యం చేసుకున్నా ఆయన వెనక్కు తగ్గలేదు. తమతో కుదుర్చుకున్న ఒప్పందాలన్నింటినీ రష్యా 2014 నుంచీ తుంగలో తొక్కుతూ వస్తున్నా అమెరికా సరైన రీతిలో జోక్యం చేసుకోలేదంటూ ఆక్షేపించారు. అధ్యక్షులు బరాక్ ఒబామా, ట్రంప్, బైడెన్ ఎవరూ తమకు చేయాల్సినంతగా సాయం చేయలేదని ఆరోపించారు. ఇప్పటికైనా ఖనిజ ఒప్పందానికి ప్రతిగా ఉక్రెయిన్ రక్షణకు అమెరికా స్పష్టమైన హామీ ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. ఆ క్రమంలో, ''యుద్ధంలో అంతులేని నష్టాన్ని చవిచూడాల్సి వస్తే ఎలా ఉంటుందో అమెరికాకు తెలియదు. బహుశా ముున్ముందు తెలిసొస్తుందేమో!'' అన్న జెలెన్‌స్కీ వ్యాఖ్యలతో పరిస్థితి మరింత అదుపు తప్పింది. ట్రంప్ ఒక్కసారిగా తీవ్ర అసహనానికి లోనయ్యారు. జెలెన్‌స్కీపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ''అలాంటి పరిస్థితి మాకెప్పుడూ రాదు. ఎప్పటికీ తిరుగులేని శక్తిగానే ఉంటాం'' అంటూ ఆగ్రహంగా బదులిచ్చారు. ''ఉక్రెయిన్‌కు ఇన్నేళ్లుగా అన్నివిధాలా ఆదుకుంటూ వస్తున్నాం. ఈ యుద్ధంలో ఇప్పటికే 350 బిలియన్ డాలర్ల మేర సాయుధ, ఆర్థిక సాయం అందించాం. లేదంటే రష్యాతో యుద్ధం కొనసాగించడం మీ తరమయ్యేదే కాదు. పోరు రెండే వారాల్లో ముగిసిపోయేది'' అంటూ దుయ్యబట్టారు. అయినా జెలెన్‌స్కీకి మాత్రం కనీస కృతజ్ఞత కూడా లేదంటూ విరుచుకుపడ్డారు. మీడియా ముందే తనతో గొడవకు దిగుతూ అమర్యాదకరంగా ప్రవర్తిస్తున్నారంటూ విమర్శించారు. ''అమెరికా దన్ను లేనిదే మీరెందుకూ కొరగారు! మాకు షరతులు విధించే, మమ్మల్ని డిమాండ్ చేసే పరిస్థితిలో అసలే లేరు. అది గుర్తుంచుకోండి'' అంటూ వేలు చూపిస్తూ మరీ జెలెన్‌స్కీని కటువుగా హెచ్చరించారు. ''మీరు లక్షలాది ప్రాణాలను పణంగా పెడుతున్నారు. మూడో ప్రపంచ యుద్ధాన్ని తెచ్చిపెట్టేలా ప్రమాదకర జూదం ఆడుతున్నారు'' అంటూ జెలెన్‌స్కీని ఆక్షేపించారు. మధ్యలో పదేపదే ఆయన భుజంపై కొట్టి మరీ ఆగ్రహం వెలిగక్కారు. రష్యాతో ఏ విషయంలోనూ రాజీ పడేదే లేదన్న జెలెన్‌స్కీ వ్యాఖ్యలను కూడా ట్రంప్ తీవ్రంగా ఖండించారు. ''పుతిన్ ఒక ఉగ్రవాది. యుద్ధాల్లోనూ నిబంధనలుంటాయి. వాటన్నింటినీ కాలరాసిన పుతిన్ వంటి హంతకునితో ఎలాంటి రాజీ ఉండబోదు'' అని జెలెన్‌స్కీ అన్నారు. అలా కుదరదని, యుద్ధానికి తెర దించాలంటే రష్యాతో చాలా విషయాల్లో రాజీ పడాల్సిందేనని ట్రంప్ కుండబద్దలు కొట్టారు. ''ఇలాగైతే మాతో వ్యాపారం కష్టమే. అమెరికాతో ఖనిజ వనరుల ఒప్పందానికి అంగీకరిస్తారా, సరేసరి. లేదంటే మీకూ మాకూ రాంరాం'' అంటూ తేల్చిపడేశారు. వాగ్వాదం పొడవునా నేతలిరువురూ పదేపదే వాగ్బాణాలు విసురుకున్నారు. కనీసం ఇప్పటికైనా అమెరికా చేస్తున్న దానికి కృతజ్ఞతలు చెప్పండంటూ వాన్స్ కల్పించుకోగా ట్రంప్ వారించారు. ''పర్లేదు. ఈ డ్రామా నాకూ సరదాగానే ఉంది. జరుగుతున్నదేమిటో అమెరికా ప్రజలందరూ చూడాలి'' అన్నారు.


శుక్రవారం ఓవల్ ఆఫీసు భేటీలో జెలెన్‌స్కీకి వేలు చూపిస్తూ ఆగ్రహంతో మాట్లాడుతున్న ట్రంప్

సాయానికి హామీ ఇవ్వలేం: ట్రంప్

జెలెన్‌స్కీతో భేటీకి ముందు ట్రంప్ మీడియాతో మాట్లాడారు. ఉక్రెయిన్‌తో సహజ వనరుల ఒప్పందంపై ఆయన, తాను కాసేపట్లో సంతకాలు చేస్తామని ప్రకటించారు. యుద్ధం వీలైనంత త్వరగా ముగియాలన్నదే తన ఉద్దేశమన్నారు. అయితే, ''ఉక్రెయిన్‌కు అమెరికా సైనిక సాయం కొనసాగుతుంది. కాకపోతే ఈ విషయంలో మానుంచి మరీ ఎక్కువగా ఆశించకూడదు'' అని స్పష్టం చేశారు. యుద్ధాన్ని ముగించేందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కృతనిశ్చయంతో ఉన్నారంటూ మరోసారి ప్రశంసించారు.


గాయపడిన వారిని తరలిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది

ఉత్తరాఖండ్‌లో భారీ హిమపాతం
బీఆర్ఓ క్యాంపుపై విరిగిపడిన మంచు చరియలు

32 మందిని రక్షించిన అధికారులు | మరో 25 మంది ఆచూకీ కోసం గాలింపు చర్యలు

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లో భారీ హిమపాతం బెంబేలెత్తిస్తోంది. మంచు చరియలు విరిగిపడుతున్నాయి. చమోలీ జిల్లాలో మనా–బద్రీనాథ్ మార్గంలోని బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్(బీఆర్ఓ) క్యాంపుపై శుక్రవారం ఉదయం హఠాత్తుగా మంచు చరియలు విరిగిపడ్డాయి. రాష్ట్ర రాజధాని డెహ్రాడూన్ నుంచి 300 కిలోమీటర్ల దూరంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. క్యాంపులోని 57 మంది కార్మికులు మంచు చరియల కింద చిక్కుకుపోగా, 32 మందిని రక్షించామని మరో 25 మంది ఆచూకీ తెలియాల్సి ఉందని జిల్లా మేజిస్ట్రేట్ సందీప్ తివారీ చెప్పారు. వీరంతా రోడ్లపై మంచును తొలగించేందుకు వచ్చారని పేర్కొన్నారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది రంగంలోకి దిగారు. తీవ్రంగా గాయపడినవారిని మనా గ్రామంలోని ఐటీబీపీ క్యాంప్‌నకు తరలించి చికిత్స అందించారు. నలుగురు బాధితుల పరిస్థితి విషమంగా ఉంది. కార్మికుల్లో ఎక్కువ మంది జార్ఖండ్‌కు చెందినవారేనని సమాచారం. హిమపాతంతోపాటు భారీగా వర్షం కురుస్తుండడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని అధికారులు తెలిపారు. మంచు చరియలు మరోసారి విరిగిపడే అవకాశం ఉండడంతో సహాయక చర్యలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు చెప్పారు. పరిస్థితి సానుకూలంగా మారిన తర్వాత మిగతా వారి కోసం గాలింపు ప్రారంభిస్తామని తెలిపారు. మనా గ్రామం బద్రీనాథ్ నుంచి 3 కిలోమీటర్ల దూరంలో ఇండియా–టిబెట్ సరిహద్దుకు అత్యంత సమీపంలో సముద్ర మట్టానికి 3,200 మీటర్ల ఎగువన ఉంది. సరిహద్దులో ఇదే చిట్టచివరి గ్రామం. సాధారణంగా ఇక్కడి బీఆర్ఓ క్యాంపును ప్రతిఏటా చలికాలంలో బద్రీనాథ్‌కు తరలిస్తుంటారు. ఈసారి భారీ హిమపాతం వల్ల అది సాధ్యం కాలేదు. నర్, నారాయణ్ అనే రెండు పర్వతాల పాదాల చెంత బద్రీనాథ్ ధామ్ కొలువై ఉంది. ఈ రెండు పర్వతాల మధ్యనుంచి అలకనంద నది ప్రవహిస్తోంది. నర్ పర్వతం వద్ద తాజా ప్రమాదం జరిగింది.

ఉత్తరాఖండ్ ప్రమాదంపై రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందించారు. మంచు ఫలకాల కింద చిక్కుకున్న కార్మికులను రక్షించడానికి అందుబాటులో ఉన్న వనరులతో ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలిపారు. రాజ్‌నాథ్ సింగ్ ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామీతోపాటు ఫోన్‌లో మాట్లాడారు. పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం గురించి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరా తీశారు. కార్మికులందరినీ రక్షించాలని, అవసరమైన సాయం అందిస్తామని చెప్పారు. సహాయక చర్యలను సీఎం పుష్కర్‌సింగ్ ధామీ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. కార్మికులంతా ప్రాణాలతో బయటపడాలని బద్రీవిశాల్‌ను ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు. చమోలీ, ఉత్తరకాశీ, రుద్రప్రయాగ, పితోర్‌గఢ్ జిల్లాల్లో సముద్ర మట్టానికి 2,400 మీటర్ల ఎగువన ఉన్న ప్రాంతాల్లో భారీగా హిమపాతం కురవడంతోపాటు మంచు చరియలు విరిగిపడే ప్రమాదం ఉందని డిఫెన్స్ జియోఇన్ఫర్మాటిక్స్ రీసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్(డీజీఆర్ఈ) గురువారం సాయంత్రం హెచ్చరికలు జారీ చేసింది.


కార్మికులను బయటికి తీసుకొచ్చే ప్రయత్నంలో సైనికులు


ఒక కార్మికున్ని సురక్షితంగా బయటికి తీసుకొస్తున్న సిబ్బంది

పాకిస్తాన్‌లో మత సదస్సులో ఆత్మాహుతి దాడి

మత పెద్ద సహా ఐదుగురి మృతి.. 20 మందికి గాయాలు

పెషావర్: వాయవ్య పాకిస్తాన్‌లోని ఖైబర్ పఖ్తూంక్వా ప్రావిన్స్‌లో పవిత్ర రంజాన్ మాసం ప్రారంభానికి ముందు ఘోరం జరిగింది. నౌషెరా జిల్లా అకోరా ఖట్టక్ పట్టణంలో మతపరమైన సదస్సులో ఆత్మాహుతి దాడి చోటుచేసుకోవడంతో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 20 మంది గాయపడ్డారు. శుక్రవారం సదస్సులో జుమ్మా ప్రార్థనలు జరుగుతుండగా ఓ దుండగుడు తనను తాను పేల్చేసుకున్నాడు. ఈ ఘటనలో జమీయత్ ఉలేమా ఇస్లామ్ (జేయూఐ) అధినేత, మదర్సా–ఇ–హకానియా మసీదు నిర్వాహకుడు హమీదుల్ హక్ హక్కానీతోపాటు మరో నలుగురు అక్కడికక్కడే మృతిచెందారు. హక్కానీ లక్ష్యంగానే ఈ దాడి జరిగినట్లు భావిస్తున్నామని స్థానిక ఐజీ జుల్ఫీకర్ హమీద్ చెప్పారు. 1968లో జన్మించిన హక్కానీ తన తండ్రి మౌలానా సమీ ఉల్ హక్ మరణం తర్వాత జేయూఐ అధినేతగా బాధ్యతలు చేపట్టారు. మతపెద్దగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ప్రాణాపాయం ఉండడంతో పోలీసులు ఆయనకు ఆరుగురు సెక్యూరిటీ గార్డులతో రక్షణ కల్పిస్తున్నారు. అయినప్పటికీ ఆత్మాహుతి దాడిలో హక్కానీ మరణించడం స్థానికంగా సంచలనం సృష్టించింది. ఆత్మాహుతి దాడికి ఎవరు కారకులన్నది ఇంకా తెలియరాలేదు. పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

బీజేపీ దళిత వ్యతిరేకి

షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్‌లో ఖాళీలను భర్తీ చేయాలి: రాహుల్ గాంధీ డిమాండ్

న్యూఢిల్లీ: షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్‌లో కీలకమైన పోస్టులు ఖాళీగా ఉండడం పట్ల కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ అసంతృప్తి వ్యక్తంచేశారు. దళితుల హక్కులు, ప్రయోజనాలను కాపాడే బాధ్యత కలిగిన కమిషన్‌లో ఖాళీలను భర్తీ చేయకపోవడం ఏమిటని కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. రెండు కీలక పోస్టులు ఏడాది కాలంగా ఖాళీగా ఉంటున్నప్పటికీ పట్టించుకోవడం లేదంటే అధికార బీజేపీ దళిత వ్యతిరేక వైఖరిని అర్థం చేసుకోవచ్చని అన్నారు. దళితుల సంక్షేమం పట్ల నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నించారు. ఈ మేరకు రాహుల్ శుక్రవారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ రాజ్యాంగబద్ధమైన సంస్థ అని గుర్తుచేశారు. కమిషన్‌ను ఉద్దేశపూర్వకంగా బలహీనపర్చడం రాజ్యాంగంపై, దళితుల సామాజిక హక్కులపై ప్రత్యక్షంగా దాడి చేయడమే అవుతుందని తేల్చిచెప్పారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇకనైనా మేల్కొనాలని, కమిషన్‌లో ఖాళీలను సాధ్యమైనంత త్వరగా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కమిషన్ అచేతనంగా మిగిలిపోతే దళితులు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలని రాహుల్ ఆవేదన వ్యక్తంచేశారు. వారి ఫిర్యాదులపై ఎవరు స్పందించారని ప్రశ్నించారు. షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్‌లో ప్రస్తుతం చైర్మన్, ఒక మెంబర్ పోస్టు ఖాళీగా ఉన్నాయి.

పట్టాలెక్కనున్న ఎఫ్‌టీయూ

ఈ ఏడాది ఆఖరు నాటికి ఒప్పందం కుదుర్చుకోవాల్సిందే

ప్రధాని మోదీ, ఈయూ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లెయెన్ నిర్ణయం


వాండర్ లెయెన్‌తో ప్రధాని మోదీ చర్చలు

న్యూఢిల్లీ: భారత్–యూరోపియన్ యూనియన్(ఈయూ) మధ్య చాలాఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న స్వేచ్ఛా వాణిజ్యం ఒప్పందం(ఎఫ్‌టీయూ) త్వరలో పట్టాలెక్కే దిశగా అడుగు ముందుకు పడింది. చరిత్రాత్మకంగా భావిస్తున్న ఈ ఒప్పందాన్ని ఈ ఏడాది ఆఖరు నాటికి కుదుర్చుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లెయెన్ నిర్ణయించారు. ఈ మేరకు ఒక డెడ్‌లైన్ విధించుకున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విదేశీ ఉత్పత్తులపై సుంకాలు విధిస్తుండడంతో వివిధ దేశాల ఆర్థిక వ్యవస్థలకు నష్టం వాటిల్లుతోంది. ఈ నేపథ్యంలో భారత్, ఈయూ దేశాలకు ఎంతగానో ప్రయోజనం చేకూర్చే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని వీలైనంత త్వరగా కుదుర్చుకోవాలని మోదీ, ఉర్సులా ఒక అంగీకారానికి వచ్చారు. వారిద్దరూ శుక్రవారం ఢిల్లీలో సమావేశమయ్యారు. నిజానికి ఇండియా, ఈయూ మధ్య ఈ ఒప్పందం కోసం గత 17 ఏళ్లుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇరుపక్షాల మధ్య జరుగుతున్న సంప్రదింపులు ఒక కొలిక్కి రావడం లేదు. 2013లో సంప్రదింపులు నిలిచిపోయాయి. 2022 జూన్‌లో పునఃప్రారంభమయ్యాయి. కానీ, ఆశించిన విధంగా ముందుకు సాగడం లేదు. కొన్ని అంశాలపై ఈయూ గట్టిగా పట్టుబడుతుండగా, ఇండియా సమ్మతించడం లేదు. కార్లు, వైన్, వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలు రద్దు చేయాలని ఈయూ కోరుతుండగా, భారత ప్రభుత్వం తిరస్కరిస్తోంది. మోదీ, ఉర్సులా భేటీ కావడంతో ఇక ప్రతిష్టంభన తొలగిపోయే సూచనలు కనిపిస్తున్నాయి.

కలసికట్టుగా పనిచేద్దాం

భారత్, ఈయూ మధ్య సంబంధాలపై మోదీ, ఉర్సులా విస్తృతంగా చర్చించారు. ఇరుపక్షాల మధ్య రక్షణ సహకారాన్ని మరింత పెంపొందించుకోవాలని నిర్ణయించారు. ప్రధానంగా ఇండో–పసిఫిక్ ప్రాంతంలో ఉమ్మడి ప్రయోజనాలు కాపాడుకొనేలా కలసికట్టుగా పనిచేయాలని తీర్మానించారు. ఇండియాతో రక్షణ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవాలన్నదే తమ ఉద్దేశమని ఉర్సులా పేర్కొన్నారు. ఇండియా–ఈయూ భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి ఒక కచ్చితమైన రోడ్‌మ్యాప్ రూపొందించుకోవాలని నిర్ణయించినట్లు మోదీ వెల్లడించారు. తదుపరి ఇండియా–ఈయూ శిఖరాగ్ర సదస్సు నాటికి రోడ్‌మ్యాప్ సిద్ధమవుతుందని అన్నారు. ఈ సదస్సు వచ్చే ఏడాది భారత్‌లో జరగనుంది. మరోవైపు భేటీ తర్వాత మోదీ, ఉర్సులా ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. భారత్, ఈయూ మధ్య వ్యాపారం వాణిజ్యం, టెక్నాలజీ, పెట్టుబడులు, నవీన ఆవిష్కరణలు, గ్రీన్ ఎనర్జీ, భద్రత, నైపుణ్యాభివృద్ధి, రవాణా వంటి కీలక రంగాల్లో పరస్పర సహకారాన్ని, ఇరుపక్షాల మధ్య ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చడమే లక్ష్యంగా ఒక ప్రణాళిక సిద్ధం చేయబోతున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థుల మరణాలు దురదృష్టకరం: సుప్రీం

న్యూఢిల్లీ: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీలు), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎంల)లో విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడటం అత్యంత దురదృష్టకరమని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఇటువంటి ఘటనల నివారణకు బలమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరముందని నొక్కిచెప్పింది. ఐఐటీలు, ఐఐఎంల్లో గడిచిన 14 నెలల్లో 18 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడినట్లు సీనియర్ లాయర్ ఇందిరా జైసింగ్ తెలపడంతో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం పైవిధంగా వ్యాఖ్యానించింది. ఈ అంశానికి న్యాయపరమైన ముగింపు ఇస్తామని పేర్కొంది. హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ పీహెచ్‌డీ స్కాలర్ రోహిత్ వేముల 2017లో, మహారాష్ట్రలోని టీఎస్ టోపీవాలా మెడికల్ కాలేజీ విద్యార్థిని పాయల్ తాడ్వి 2019లో బలవన్మరణం చెందారు. తమ విద్యాసంస్థల్లో కులపరమైన వివక్షను భరించలేకే ప్రాణాలు తీసుకున్నారంటూ వీరి తల్లులు సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఇటువంటి ఘటనల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే, కోర్టు ఆదేశాలున్నా విద్యార్థుల ఆత్మహత్యల ఘటనల వివరాలను ఇచ్చేందుకు విద్యాసంస్థలు ససేమిరా అంటున్నాయని లాయర్ జైసింగ్ శుక్రవారం ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు.

ముంబై తీరంలో మత్స్యకారుల పడవకు మంటలు

18 మంది జాలర్లను కాపాడిన పోలీసులు

ముంబై: మత్స్యకారుల పడవకు మంటలు అంటుకోవడంతో వెంటనే రంగంలోకి దిగిన తీర రక్షక దళం(ఐసీజీ), పోలీసులు కలిసి 18 మందిని కాపాడారు. శుక్రవారం వేకువజామున మహారాష్ట్రలోని రాయిగఢ్ జిల్లా అలీబాగ్‌కు సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అలీ బాగ్‌లోని అక్షి తీరానికి ఏడు నాటికల్ మైళ్ల దూరంలో ఉండగా రాకేశ్ గన్ అనే వ్యక్తికి చెందిన ట్రాలర్ బోట్‌కు ఉదయం 4 గంటల సమయంలో మంటలు అంటుకున్నాయి. జాలర్లు పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే పోలీసులు నేవీ, ఐసీజీతో కలిసి ఘటనాస్థలికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. ట్రాలర్‌లోని 18 మంది జాలర్లను రక్షించి, తీరానికి సురక్షితంగా చేర్చారు. ఇంజిన్ నుంచి లీకైన ఆయిల్ సైలెన్సర్‌లోకి చేరడంతో మంటలు చెలరేగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సాఖర్ గ్రామానికి చెందిన రాకేశ్ గన్, అతడి ఇద్దరు సోదరులు గత 14 రోజులుగా చేపల వేట కోసం సముద్రంలోనే ఉన్నట్లు తెలిపారు. గ్రామానికి తిరిగొస్తుండగా ప్రమాదం జరిగిందన్నారు. మంటల్లో కాలిన గాయాలైన 14 మందిని ఆస్పత్రిలో చేర్పామన్నారు.


మంటలను ఆర్పుతున్న ఐసీజీ సిబ్బంది

డ్రగ్ లార్డ్ క్వింటెరో అమెరికాకు తరలింపు

- మరో 28 మంది నేరగాళ్లు సైతం
- ట్రంప్ టారిఫ్ ఒత్తిళ్లకు దిగొచ్చిన మెక్సికో

మెక్సికో సిటీ: డ్రగ్స్ ముఠాలపై ఉక్కుపాదం మోపాలన్న ట్రంప్ యంత్రాంగం ఒత్తిళ్లు మెక్సికో ప్రభుత్వంపై పనిచేశాయి. యూఎస్ డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీ(డీఈఏ) అధికారి హత్య కేసులో ఆరోపణలున్న కరడుగట్టిన డ్రగ్స్ ముఠా నాయకుడు రఫేల్ కారో క్వింటెరో సహా 29 మంది మాఫియా ముఖ్యులను మెక్సికో ప్రభుత్వం అమెరికాకు అప్పగించింది. మాదక ద్రవ్యాల మాఫియా ముఖ్యులను తమకు అప్పగించకుంటే మంగళవారం నుంచి అన్ని రకాల మెక్సికో దిగుమతులపై 25 శాతం సుంకాలను విధించక తప్పదన్న ట్రంప్ ప్రభుత్వం హెచ్చరికలతో మెక్సికో ప్రభుత్వ యంత్రాంగం మునుపెన్నడూ లేని విధంగా సహకరించేందుకు ముందుకు రావడం గమనార్హం. మెక్సికోలోని వేర్వేరు జైళ్లలో ఉన్న డ్రగ్ మాఫియా పెద్దతలలను గురువారం రాజధాని మెక్సికో సిటీలో విమానాలకు ఎక్కించారు. మొత్తం 29 మందిని అమెరికా వ్యాప్తంగా ఉన్న ఎనిమిది నగరాల్లోని జైళ్లకు తరలించారు. వీరిలో అమెరికా ప్రభుత్వం ఇటీవల విదేశీ ఉగ్రవాద సంస్థలుగా ప్రకటించిన ఆరు గ్రూపులకు గాను ఐదు గ్రూపులకు చెందిన వారున్నారు. కారో క్వింటెరోతోపాటు సినలోలా కార్టెల్‌లోని రెండు గ్రూపులకు చెందిన ముఖ్యులు, 2022లో నార్త్ కరోలినాలో పోలీసు అధికారి హత్య కేసులో నిందితుడొకరు ఇందులో ఉన్నారని మెక్సికో అధికారులు వెల్లడించారు. డ్రగ్స్ అక్రమ రవాణా, హత్య తదితర నేరారోపణల కింద వీరిపై విచారణ జరపనున్నామని అమెరికా అటార్నీ జనరల్ పమేలా బోండి చెప్పారు. మెక్సికో విదేశీ వ్యవహారాల కార్యదర్శి జువాన్, ఇతర ఉన్నతాధికారులు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో తదితరులతో సమావేశమైన సమయంలోనే ఈ అప్పగింతలు చోటుచేసుకోవడం విశేషం. డ్రగ్స్ ముఠాలపై ఉక్కుపాదం మోపడం, అక్రమ వలసదారులను నిలువరించడం, ప్రమాదకరమైన డ్రగ్ ఫెంటానిల్ ఉత్పత్తిని నిలిపివేయడం వంటివి మానుకోకుంటే టారిఫ్‌లు తప్పవని, సానుకూలంగా స్పందించిన పక్షంలో టారిఫ్‌ల అమలును వాయిదా వేస్తామని గతంలో ట్రంప్ హెచ్చరికలు చేశారు. దీంతో, ఇటీవలి కాలంలో వలసలు, ఫెంటానిల్ ఉత్పత్తిలో తగ్గుదల నమోదైంది. కాగా, మెక్సికో డ్రగ్స్ హంతక ముఠాలను అప్పగించే విషయంలో ఇంత సానుకూలంగా స్పందించడాన్ని చారిత్రక ఘటనగా డీఈఏ మాజీ చీఫ్ మైక్ విజిల్ అభివర్ణించడం గమనార్హం.


రఫేల్ కారో క్వింటెరో

124 ఏళ్లలో కెల్లా అత్యంత వేడి ఫిబ్రవరి

ఈసారి ఎండలు అప్పుడే దంచికొడుతున్నాయి. ఎండాకాలం ఇంకా మొదలైనా కాకుండానే ఠారెత్తిస్తున్నాయి. ఆ క్రమంలో గత 124 ఏళ్లలో అత్యంత వేడిమి ఫిబ్రవరిగా గత మాసం కొత్త రికార్డు సృష్టించింది. గత నెలలో సగటున 22 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. 1901 తర్వాత ఫిబ్రవరిలో ఈ స్థాయి సగటు నమోదవడం ఇదే తొలిసారి. అంతేకాదు, చరిత్రలోనే తొలిసారిగా ఈ ఫిబ్రవరిలో దేశవ్యాప్తంగా సగటు ఉష్ణోగ్రతలు ఏకంగా 15 డిగ్రీల పై చిలుకు నమోదై సరికొత్త రికార్డు నెలకొల్పాయి. అంతేగాక సగటు గరిష్ట ఉష్ణోగ్రత విషయంలో 2023 ఫిబ్రవరి నెలకొల్పిన రికార్డును కూడా గత నెల దాదాపుగా అధిగమించినంత పని చేసింది! దీనిపై పర్యావరణవేత్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పర్యావరణ మార్పుల తాలూకు విపరిణామాలకు ఈ ఉష్ణ ధోరణులు తాజా నిదర్శనమని వారు చెబుతున్నారు. ''సాధారణంగా ఎల్ నినో, లేదంటే లా నినా వంటి పరిస్థితులున్నప్పుడు ఉష్ణోగ్రతల్లో తీవ్రస్థాయిలో హెచ్చుతగ్గులు పరిపాటి. కానీ కొద్ది నెలలుగా అతి బలహీన లా నినా పరిస్థితి నెలకొని ఉంది. అది ఉష్ణోగ్రతలను ప్రభావితం చేయగల స్థాయిలో లేదు. అయినా ఫిబ్రవరిలో ఎండలు మంటెత్తిపోవడం మంచి పరిణామమైతే కాదు'' అని సైంటిస్టులు చెబుతున్నారు. గత 20 ఏళ్లు వరుసగా చరిత్రలోనే అత్యంత వేడిమి దశాబ్దాలుగా రికార్డులు సృష్టించిన వైనాన్ని వారు గుర్తు చేస్తున్నారు. అకస్మాత్తుగా వరుణుడు కరుణిస్తే తప్ప వచ్చే మూడు నెలలు ప్రచండమైన ఎండలు తప్పవని జోస్యం చెబుతున్నారు. **- సాక్షి, నేషనల్ డెస్క్**

అధికార భాష ఆంగ్లం

ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేయనున్న ట్రంప్

వాషింగ్టన్: అగ్రరాజ్యంలో మెజార్టీ ప్రజలు మాట్లాడే భాష ఆంగ్లం. ప్రభుత్వ, ప్రభుత్వేతర వ్యవహారాల్లో ఉపయోగించే భాష ఆంగ్లమే. దేశంలో ఇతర భాషలు సైతం మాట్లాడేవాళ్లు కూడా ఉన్నారు. అమెరికా చరిత్రలో ఇప్పటివరకు దేశవ్యాప్తంగా ఏ భాషకూ అధికార భాష హోదా లేదు. ఇంగ్లిష్‌కు ఇప్పుడు ఆ హోదా కల్పించాలని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంకల్పించారు. ఇంగ్లిష్‌ను దేశమంతటా అధికార భాషగా గుర్తిస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై ట్రంప్ సంతకం చేయబోతున్నట్లు వైట్‌హౌస్ వర్గాలు తెలియజేశాయి. అయితే, ఎప్పుడు సంతకం చేస్తారన్నది బయటపెట్టలేదు. అమెరికాలో కొన్ని రాష్ట్రాలు ఇప్పటికే ఆంగ్లాన్ని అధికార భాషగా గుర్తించాయి.

సాక్షి ఫ్యామిలీ
IV
విజయవాడ
శనివారం ॥ 1-3-2025

విమెన్స్ హిస్టరీ మంత్

'మార్చి నెల' అనే మాట మదిలోకి రాగానే ఉత్సాహం అంబరాన్ని అంటడమే కాదు...
ఘనమైన గత చరిత్ర వర్తమానంలోకి వచ్చి ఉత్తేజితం చేస్తుంది.
మార్చి నెల అంటే పోరాటాల నెల. పోరాట ఫలితాల నెల.
మహిళా సాధికారతను సగర్వంగా చాటి చెప్పే నెల.
అందుకే మార్చి నెల 'విమెన్స్ హిస్టరీ మంత్'గా ప్రసిద్ధి పొందింది.

• అంతర్జాతీయ మహిళా దినోత్సవం / ప్రత్యేక కథనాలు (మార్చి 1-8)

• సమాజానికి ఉక్కు కవచం

ఆ 'సగమే' అసలు బలం



శరీరంలో ఐరన్ లేమి స్త్రీలను బాధిస్తూ ఉంటుంది. గర్భధారణ, ప్రసవ సమయాలలో ఎంతో కీలకమైన ఐరన్ కోసం స్త్రీలు ఆహారం, మందుల మీద ఆధారపడుతుంటారు. 'ప్రపంచ ఆరోగ్య సంస్థ' అంచనా ప్రకారం నేడు ప్రపంచ వ్యాప్తంగా 15 నుంచి 49 ఏళ్ల మధ్య ఉన్న స్త్రీలు 50 కోట్ల మంది ఐరన్ డెఫిషియెన్సీతో బాధ పడుతున్నారు.

కాని వీరు తమ స్వభావంలో ఉక్కుగుణాన్ని మాత్రం ఎన్నడూ వదులుకోరు. వీరు మాత్రమే కాదు ప్రతి స్త్రీ తన జీవనంలో, పరిస్థితులను ఎదుర్కొనడంలో ఉక్కు మహిళే. ఆ మహిళ తెలుగు నాట మారుమూల పల్లెలో ఉండొచ్చు. ప్రపంచంలో వేరే మూలన మరో గూడెంలో ఉండొచ్చు. మహిళా దినోత్సవం 'స్థానికం'గా నిర్వహించే తంతు కాదు. ఇది అంతర్జాతీయ వేడుక. ప్రపంచ మహిళలను ఏకం కావాలని కోరే సందేశ సందర్భం. 1910లో కోపెన్‌హెగెన్‌లో 17 దేశాల నుంచి వచ్చిన 99 మంది మహిళలు 'శ్రామిక మహిళల హక్కుల దినోత్సవం' కోసం పిలుపు ఇచ్చినప్పుడు అది అంతర్జాతీయ మహిళా దినోత్సవం కావాలనే కోరుకున్నారు. కారణం భూమ్మీద ఏ మూలన ఉన్న స్త్రీ అయినా స్థూలంగా ఎదుర్కొనే సమస్యలు ఒకటేనని భావించడం. అందరూ కలిసి సమస్యల పై పోరాడాలని కోరుకోవడం.

ఇన్నేళ్లు గడిచినా రూపంలో, సారంలో స్త్రీలు అనేక సవాళ్లను ఎదుర్కొంటూనే ఉన్నారు. యుద్ధాలు వస్తే వారు తమ ఇంటిని, భర్తను, సంతానాన్ని కోల్పోతున్నారు. ప్రభుత్వాలు అభివృద్ధి పేరుతో చేసే తవ్వకాలు, కట్టే పెను కట్టడాలు, ప్రకటించే సుందరీకరణాలు మొదటగా స్త్రీలు శ్రమపడి అల్లిన గూళ్లనే ధ్వంసం చేస్తున్నాయి. చట్టపరమైన అనుమతి కలిగిన వ్యసనాలు... మద్యపానం, ధూమపానం పురుషుల ఆరోగ్యాన్ని దెబ్బ తీసి స్త్రీల మీద పెను ఒత్తిడి పెడుతున్నాయి.

తాజాగా ఆన్‌లైన్ ట్రేడింగ్ అడిక్షన్ లక్షల కొద్ది అప్పును కుటుంబం మీద కుమ్మరించేలా చేస్తోంది. కడుపున పుట్టిన సంతానం పాలిట డ్రగ్స్, గంజాయి పెను పడగలు విప్పి ఉన్నాయి. స్త్రీ తన చేతులతో ఒండి పెట్టాల్సిన ఆహారం కలుషితాలను కలిగి బతుక్కు ఏమాత్రం గ్యారంటీ ఇవ్వలేకపోతోంది. నిత్యావసర ఖర్చులను స్త్రీయే అజమాయిషీ చేసి ఎంత పొదుపు చేయాలనుకున్నా అనారోగ్య ఖర్చు, చదువు ఖర్చు స్త్రీల ప్రధాన కార్యక్షేత్రమైన 'ఇంటిని' పూర్తిగా సంక్షోభంలో పడేస్తున్నాయి.

దేశం సరిహద్దులోని సైన్యం, కేంద్ర, రాష్ట్రాలలో ప్రభుత్వ యంత్రాంగం వల్ల మాత్రమే నడుస్తోంది అనుకుంటే పొరపాటు. వీటన్నింటి మధ్య ఉక్కుగుణాన్ని వదుల్చుకోని స్త్రీలే దేశాన్ని నడుపుతున్నారు.

అయినప్పటికీ వీరి స్థయిర్యాన్ని దెబ్బ తీయడానికి తగిన పీడనలను ఈ సమాజం వదులుతూనే ఉంది. లైంగిక వేధింపులు, సామూహిక అత్యాచారాలు, యాసిడ్ దాడులు, ప్రేమకు 'నో' చెప్తే హత్యలు, ఉద్యోగ ఉపాధి రంగాల్లో జీతభత్యాల వివక్ష, చట్ట సభల్లో ఇంకా దొరకని వాటా, గృహ హింస, వరకట్నం, తీరికే ఇవ్వని ఇంటి చాకిరి, పిల్లల పెంపకం, ఆడపిల్ల జననానికి అననుకూలత... ఇవన్నీ ప్రపంచవ్యాప్త స్త్రీలతో పాటు భారతీయ మహిళలకు మూగదెబ్బలుగా మారుతున్నాయి.

నిజానికి ఇప్పుడు వారి బాధ్యత ఇంకా పెరిగింది. స్త్రీలు ముందుకు వస్తే తప్ప సరికాని సమస్యలు పెరుగుతున్నాయి. పురుషులు తెస్తున్న దేశాల మధ్య యుద్ధం, పర్యావరణ విధ్వంసం, పౌర హక్కుల విఘాతం, న్యాయ వివక్ష, మత విద్వేషం, తప్పుడు వాట్సప్ సమాచారాల పంపిణీ, బలహీనులపై బెదిరింపు... ఇవన్నీ మొదట ఎవరో మనకు తెలియని స్త్రీ ఇంటికే హాని కలిగించవచ్చుగాని కాలక్రమంలో అవి ప్రతి ఇంటికీ చేరుతాయి.

స్త్రీలు తాము నివసించే ఇంటి లోపలి, బయటి ఆవరణాలను ప్రజాస్వామ్య స్వభావంతో ఉంచడానికి... సుహృద్భావన పెంచడానికి... పిల్లలకు అందరూ కలిసి ఆడే ఆటస్థలాలు ఇవ్వడానికి... సంపద కాస్తయినా దిగువ వర్గాలకు అందేలా చూడటానికి... విద్య, వైద్యంలో అతి డబ్బు ప్రమేయాన్ని నిరోధించడానికి.... ఆచార వ్యవహారాలు గుదిబండలుగా మారకుండా, రాజ్యాంగస్ఫూర్తిని రక్షించుకోవడానికి మరింత ఆలోచన, చైతన్యం కలిగించుకోవాలి. మరింత ఉక్కుగుణం సముపార్జించుకోవాలి.

ప్రతి స్త్రీకి తను, తన కుటుంబం, తన సమాజం, తన దేశం, తన ప్రపంచం... ఇవన్నీ ముఖ్యం. దుర్మార్గం అనేది కేవలం ఇతరుల పాలిట జరిగితే ఊరుకోగలిగేది కాదు. దుర్మార్గం అందరూ ఖండించదగ్గది. పురుష సమాజం తన దుర్మార్గాలకు అడ్డెవరు నిలుస్తారులే అనుకుంటే జవాబు స్త్రీల నుంచే వస్తుంది.

స్త్రీలకు ఇంటిని చక్కదిద్దుకోవడమే కాదు... పరిస్థితులను చక్కదిద్దడం కూడా తెలుసు.

ఉక్కు మహిళలకు స్వాగతం.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా నేటి నుంచి సాక్షి ఫ్యామిలీలో వారం రోజుల పాటు విశిష్ట కథనాలను అందించనున్నాం.

'సమ' దారిలో 'సగం' దూరం

లక్ష్యం కూడా విత్తనంలాంటిదే. విత్తే ముందు దాని విలువ అంతగా తెలియకపోవచ్చు. 'అది ఎప్పుడు మొలకెత్తాలి? ఎప్పుడు చెట్టు కావాలి?' అనే నిరాశ కూడా ఎదురు కావచ్చు. అయితే విత్తనం ఎప్పుడూ ఫలాన్ని వాగ్దానం చేస్తుంది. విత్తనంలాగే లక్ష్యం కూడా ఫలితాన్ని వాగ్దానం చేస్తుంది. ఈ నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి 'విమెన్స్ ఈక్వాలిటీ 2030' లక్ష్యం ఎంతో ఆశను రేకెత్తించడంతో పాటు ఎప్పటికప్పుడూ చర్చనీయాంశంగా ఉంటూ వస్తుంది. లక్ష్యాన్ని చేరుకునే ముందు సవాళ్లు, సమస్యలపై అవగాహన ఉండాలి. విమెన్ అండ్ యూనైటెడ్ నేషన్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్ అండ్ సోషల్ అఫైర్ రిపోర్ట్ జెండర్ ఈక్వాలిటీకి ఎదురవుతున్న సమస్యలను ప్రస్తావించింది.



నాయకత్వంలో మహిళల కొరత

పార్లమెంటరీ సీట్లలో 27 శాతం, స్థానిక సీట్లలో 36 శాతం, మేనేజ్‌మెంట్ పదవుల్లో 28 శాతం మహిళలు మాత్రమే ఉండడంతో సమగ్ర విధాన రూపకల్పనకు ఆటంకం కలుగుతోంది. భిన్న అభిప్రాయాల కొరత కనిపిస్తోంది.

పేదరికం

2030 నాటికి 34 కోట్ల మంది మహిళలు, బాలికలు తీవ్ర పేదరికంలో మగ్గిపోతారని అంచనా. ప్రపంచ మహిళా జనాభాలో 8 శాతం మంది రోజుకు 2.15 డాలర్ల కంటే తక్కువ సంపాదనతో జీవిస్తున్నారు.

పని ప్రాంతంలో వివక్ష-అసమానతలు

పురుషులలో 91 శాతం మందితో పోల్చితే మహిళల్లో 61 శాతం మంది మాత్రమే శ్రామిక శక్తి (లేబర్ ఫోర్స్)లో ఉన్నారు. ఇది ఆర్థిక వృద్ధి, సామాజిక పురోగతి రెండిటినీ ప్రభావితం చేస్తుంది. పురుషులతో పోలిస్తే శ్రమ ద్వారా మహిళలు తక్కువ ఆదాయాన్ని పొందుతున్నారు.

అసమతుల్యత

పనిచేసే వయసులో ఉన్న సుమారు 2.4 బిలియన్‌ల మహిళలకు సమాన ఆర్థిక అవకాశాలు లభించడం లేదు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 2.4 బిలియన్‌ల మహిళలకు పురుషులతో సమానమైన ఆర్థిక హక్కులు లేవు.

వేతనం లేని సంరక్షణ(అన్‌పేయిడ్ కేర్ వర్క్)లో మహిళలు, పురుషులు గడిపే సమయం మధ్య అంతరం కొద్దిగా తగ్గుతుంది. కానీ 2050 నాటికి ప్రపంచవ్యాప్తంగా మహిళలు పురుషుల కంటే 9.5 శాతం ఎక్కువ సమయం(రోజుకు 2.3 గంటలు) వేతనం లేని సంరక్షణ పనిలో గడుపుతారు. ఈ నిరంతర అంతరం విద్య, ఉపాధి, ఇతర అవకాశాలలో మహిళల భాగస్వామ్యాన్ని పరిమితం చేస్తుంది.

సామాజిక కట్టుబాట్లు - సాంస్కృతిక ఆచారాలు

ప్రపంచవ్యాప్తంగా ప్రతి అయిదుగురు యువతులలో ఒకరికి పద్దెనిమిది ఏళ్లు నిండక ముందే పెళ్లి జరుగుతుంది.

విద్య-ఆరోగ్యం

2030 నాటికి 110 మిలియన్‌ల మంది బాలికలు, యువతులు స్కూల్‌కు దూరంగా ఉంటారని అంచనా.

ఆహార అభద్రత

2030 నాటికి దాదాపు 24 శాతం మంది మహిళలు, బాలికలు తీవ్రమైన ఆహార అభద్రతను ఎదుర్కోనున్నారని అంచనా.

హింస

ప్రతి సంవత్సరం 245 మిలియన్‌ల మంది మహిళలు, బాలికలు భర్త, సన్నిహితుల ద్వారా శారీరక, లైంగిక హింసకు గురవుతున్నారు. వృద్ధ పురుషులతో పోల్చితే వృద్ధ మహిళలు ఎదుర్కొంటున్న పేదరికం, హింస ఎక్కువ.

నిదుల కొరత

లింగ సమానత్వం గురించి అవగాహన కలిగించే కార్యక్రమాల నిర్వహణకు తగినంత నిధులు లేవు. కేవలం నాలుగు శాతం మాత్రమే లింగ సమానత్వం, మహిళా సాధికారతకు సంబంధించిన కార్యక్రమాలపై కేటాయిస్తున్నారు. 2030 నాటికి లింగ సమానత్వాన్ని సాధించడానికి అవసరమైన అదనపు పెట్టుబడి సంవత్సరానికి 360 బిలియన్ డాలర్లుగా అంచనా వేశారు.

అమలు చేయని చట్టాలు

కనీసం 28 దేశాలలో వివాహం, విడాకులకు సంబంధించి మహిళలకు సమాన హక్కులు కల్పించే చట్టాలు లేవు. 67 దేశాలలో మహిళలపై ప్రత్యక్ష, పరోక్ష వివక్షను నిషేధించే చట్టాలు లేవు. లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడానికి చట్టాలు ఉన్న చోట సమర్థవంతమైన అమలు సవాలుగా ఉంది.

.......'సవాళ్లు, సమస్యల సంగతి సరే, ఇప్పటి వరకు మనం ఏర్పర్చుకున్న లక్ష్యాల వల్ల ఏ మేరకు పురోగతి సాధించాం?' అనే ప్రశ్న వేసుకుంటే జవాబు కొంత ఆశాజనకంగా ఉంటుంది. అంతర్జాతీయ నియమాల (ఇంటర్నేషనల్ కమిట్‌మెంట్స్) వల్ల కొన్ని రంగాలలో మెరుగుదల కనిపిస్తుంది. బాల్య వివాహాలు కొంత మేరకు తగ్గిపోయాయి. ఇది చిన్న ఆశా రేఖ మాత్రమే.

'కోవిడ్‌లాంటి విపత్తుల వల్ల 2030 లక్ష్యం మనుపటి కంటే మరింత దూరంలో ఉంది' అనే మాట వినబడుతుంది.

2030 లక్ష్యాలకు సంబంధించి చాలా రంగాల్లో పురోగతి మందకొడిగా సాగుతుందని, బాల్యవివాహాలు పూర్తిగా కనిపించకుండా చేయడానికి, చట్టపరమైన రక్షణ (లీగల్ ప్రొటెక్షన్)లో అంతరాలను పూడ్చడానికి, వివక్ష పూరిత చట్టాలను తొలగించడానికి, పని ప్రాంతంలో అధికారం, నాయకత్వ స్థానాల్లో మహిళలకు సమాన ప్రాతినిధ్యం కల్పించడానికి, పార్లమెంట్‌లో సమాన ప్రాతినిధ్యం సాధించడానికి పట్టే కాలం... సుదీర్ఘ కాలం అంటున్నారు.

'2030 లక్ష్యాలను చేరుకోవడానికి సమిష్టి కృషి, నిధుల పెంపుదల అవసరం. ఈ ప్రయాణంలో ప్రతి అడుగు కీలకమైనదే' అంటుంది యూఎన్ రిపోర్ట్.


జెండర్ ఈక్వాలిటీ స్ట్రాటజీ 2022-2025

'జెండర్ ఈక్వాలిటీ స్ట్రాటజీ 2022-2025' పేరుతో ఐక్యరాజ్యసమితి రూపొందించిన కార్యాచరణ ప్రణాళికలో ది గ్లోబల్ కాంటెక్స్-క్రైసిస్ అండ్ ఆపర్చునిటీ, వాట్ వుయ్ హ్యావ్ లెర్న్‌డ్, అవర్ పార్ట్‌నర్‌షిప్స్, డైరెక్షన్స్ ఆఫ్ చేంజ్, అవర్ ప్రయార్టీస్, త్రీ ఎనేబ్లర్స్, ఇన్‌స్టిట్యూషనల్ ట్రాన్స్‌ఫర్మేషన్... అనే అధ్యాయాలు ఉన్నాయి.

'మనం ముఖ్యంగా రెండు విషయాల గురించి ఆలోచించాలి. లింగ సమానత్వం దిశగా పురోగతి ఎందుకు నెమ్మదిగా, చెల్లాచెదురుగా ఉంది. దీనికి పరిష్కార మార్గాలు ఏమిటి? అయితే ఎంత జటిలమైన సవాలు అయినా కొత్త అవకాశాలను అందిస్తుంది. కొత్త వ్యూహాలు రూపొందించుకునేలా చేస్తుంది' అంటూ కార్యాచరణ ప్రణాళికకు ముందు మాట రాశాడు యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(యుఎన్ డిపి) అడ్మినిస్ట్రేటర్ అచిమ్ స్టెయినర్.

సాక్షి సినిమా


డబుల్ ధమాకా



• శ్రీవిష్ణు

వైవిధ్యమైన పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నారు హీరో శ్రీవిష్ణు. ఫిబ్రవరి 29న తన పుట్టినరోజుని పురస్కరించుకుని డబుల్ ధమాకా ఇచ్చారాయన. శ్రీవిష్ణు హీరోగా నటిస్తున్న రెండు సినిమాల అప్‌డేట్స్ ఇచ్చారు మేకర్స్. హుస్సేన్ షా కిరణ్ దర్శకత్వంలో శ్రీవిష్ణు హీరోగా నటించిన చిత్రానికి 'మృత్యుంజయ్' టైటిల్ ఖరారు చేశారు. 'సామజవరగమన' చిత్రం తర్వాత శ్రీవిష్ణు, రెబా జాన్ జంటగా నటించిన చిత్రమిది. రమ్య గుణ్ణం సమర్పణలో లైట్ బాక్స్ మీడియా, పిక్చర్ పర్‌ఫెక్ట్ ఎంటర్‌టైన్‌మెంట్‌పై సందీప్ గుణ్ణం, వినయ్ చిలకపాటి నిర్మించారు. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సినిమా టైటిల్ టీజర్‌ను శుక్రవారం విడుదల చేశారు. **ఒంగోలు నేపథ్యంలో...** శ్రీవిష్ణు హీరోగా నూతన దర్శకుడు యదునాథ్ మారుతీ రావు దర్శకత్వంలో కొత్త సినిమాని ప్రకటించారు మేకర్స్. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుమంత్ నాయుడు జి. నిర్మించనున్నారు. 'ఒంగోలు పట్టణం నేపథ్యంలో ఈ చిత్ర కథ సాగుతుంది. శ్రీవిష్ణు హిలేరియస్ క్యారెక్టర్‌లో కనిపిస్తారు' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సమర్పణ: హేమ-షాలిని, సహ నిర్మాతలు: సుబ్రమణ్యం నాయుడు జి, రామాచారి ఎం.

ధైర్యం.. నిజాయితీ




• అనురాగ్ కశ్యప్

అడివి శేష్ హీరోగా నటిస్తున్న ద్విభాషా (తెలుగు, హిందీ) చిత్రం 'డెకాయిట్'. 'ఒక ప్రేమ కథ' అనేది ఉపశీర్షిక. మృణాల్ ఠాకూర్ హీరోయిన్. షనీల్ డియో దర్శకత్వంలో అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియా యార్లగడ్డ నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. నెక్స్ట్ షెడ్యూల్‌ను మహారాష్ట్రలో ప్లాన్ చేశారు మేకర్స్. తాజాగా ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు అనురాగ్ కశ్యప్ భాగం అయ్యారని, ఇందులో ఆయన ఇన్‌స్పెక్టర్ స్వామి పాత్రలో నటిస్తున్నట్లు వెల్లడించి, ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ''తెలుగులో నా తొలి సినిమా 'డెకాయిట్'. ధైర్యం, చమత్కారం, నిజాయితీలతో కూడుకున్నది స్వామి క్యారెక్టర్'' అని 'ఎక్స్'లో పేర్కొన్నారు అనురాగ్ కశ్యప్. ఈ సినిమాకు సహ నిర్మాత: సునీల్ నారంగ్.



• కియారా అద్వానీ

గొప్ప బహుమతి



• సిద్ధార్థ్ మల్హోత్రా

బాలీవుడ్ హీరోయిన్ కియారా అద్వానీ, హీరో సిద్ధార్థ్ మల్హోత్రా దంపతులు శుభవార్త చెప్పారు. త్వరలో తాము తల్లిదండ్రులు కాబోతున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు తన భర్త సిద్ధార్థ్‌తో కలిసి బేబీ సాక్స్‌ను చేతిలో పట్టుకున్న ఫొటోని సోషల్ మీడియాలో షేర్ చేసి, 'మా జీవితాల్లో గొప్ప బహుమతి.. త్వరలోనే రాబోతోంది' అని వెల్లడించారు కియారా. విష్ణు వర్ధన్ దర్శకత్వం వహించిన 'షేర్షా'(2021) సినిమాలో తొలిసారి కలిసి నటించారు సిద్ధార్థ్ - కియారా. ఆ మూవీ షూటింగ్‌లో వీరి మధ్య ఏర్పడిన స్నేహం ఆ తర్వాత ప్రేమగా మారడంతో 2023 ఫిబ్రవరి 7న వివాహం చేసుకున్నారు. తల్లిదండ్రులు కాబోతున్న కియారా అద్వానీ, సిద్ధార్థ్ మల్హోత్రాలకు సమంత, రాశీఖన్నా, అతియా శెట్టి వంటి పలువురు సినీ సెలబ్రిటీలతో పాటు అభిమానులు శుభాకాంక్షలు చెప్పారు. ఇదిలా ఉంటే.. తెలుగులో మహేశ్ బాబుతో 'భరత్ అనే నేను', రామ్‌చరణ్‌తో 'వినయ విధేయ రామ, గేమ్ ఛేంజర్' సినిమాల్లో నటించారు కియారా అద్వానీ.

ఆట మళ్లీ ఆరంభం



• రామ్‌చరణ్

రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సాన దర్శకత్వంలో 'పెద్ది' (ప్రచారంలో ఉన్న టైటిల్) అనే సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ మల్టీ స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ మూవీలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, వృద్ధి సినిమాస్ పతాకాలపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో విభిన్న రకాల స్పోర్ట్స్ (క్రికెట్, కుస్తీ..) ప్రస్తావన ఉంటుందని తెలిసింది. ఇటీవల హైదరాబాద్‌లో ఈ సినిమా చిత్రీకరణ జరిగింది. ఆ తర్వాత రామ్‌చరణ్ అండ్ కో షూటింగ్ నుంచి చిన్న బ్రేక్ తీసుకున్నారు. ఈ బ్రేక్‌లో తన నెక్స్ట్ మూవీ స్క్రిప్ట్ విషయాలను చర్చించేందుకు దర్శకుడు సుకుమార్‌తో కలిసి రామ్‌చరణ్ దుబాయ్ వెళ్లారని తెలిసింది. కాగా 'పెద్ది' సినిమా షూటింగ్‌ను తిరిగి ఈ వారంలో ప్రారంభించాలని చిత్రయూనిట్ సన్నాహాలు చేస్తోంది. ఈ కొత్త షెడ్యూల్ చిత్రీకరణలో రామ్‌చరణ్‌తో పాటుగా కన్నడ నటుడు శివరాజ్‌కుమార్ కూడా పాల్గొంటారు. జగపతిబాబు, దివ్యేందు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. కాగా ఈ నెల 27న రామ్‌చరణ్ బర్త్ డే. ఈ సందర్భంగా ఈ చిత్రం టీజర్ విడుదలయ్యే అవకాశం ఉందని ఫిల్మ్‌నగర్ సమాచారం. 'పెద్ది' సినిమాని ఈ ఏడాదే రిలీజ్ చేయాలనుకుంటున్నారు మేకర్స్.

అగాథియా నిరుత్సాహపరచదు - జీవా



• జీవా

"**అగాథియా**" వైవిధ్యమైన చిత్రం. హారర్ అంశాలతో పాటు తల్లి సెంటిమెంట్, దేశభక్తి వంటి అంశాలు కూడా ఉంటాయి. ప్రేక్షకులు సరికొత్త అనుభూతిని పొందుతారు. వారిని మా సినిమా నిరుత్సాహపరచదు'' అని జీవా తెలిపారు. ప్రముఖ పాటల రచయిత పా.విజయ్ కథ అందించి, దర్శకత్వం వహించిన చిత్రం 'అగాథియా'. జీవా, రాశీఖన్నా జంటగా, అర్జున్ సర్జా ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'అగాథియా'. వేల్స్ ఫిలిం ఇంటర్నేషనల్ పతాకంపై ఐసరి కె.గణేష్, అనీష్ అర్జున్ దేవ్ నిర్మించిన ఈ మూవీ తమిళ, తెలుగు, హిందీ భాషల్లో ఫిబ్రవరి 28న విడుదలైంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో జీవా విలేకరులతో మాట్లాడుతూ-''మూడేళ్ల ప్రయాణం 'అగాథియా'. ఎంతో కష్టపడి భారీ బడ్జెట్‌తో ఈ సినిమా తీశాం. నా పాత్రతో పాటు అర్జున్ సర్, రాశీఖన్నా, ఎడ్వర్డ్ సోన్నెన్‌బ్లిక్... ఇలా అందరి పాత్రలను విజయ్‌గారు అద్భుతంగా తెరపై ఆవిష్కరించారు. కంప్యూటర్ గ్రాఫిక్స్ కోసం చాలా రోజులు పట్టింది. యువన్ శంకర్ రాజా గారితో నా మూడో సినిమా ఇది. ఈ చిత్రం కోసం అద్భుతమైన మ్యూజిక్, నేపథ్య సంగీతం ఇచ్చారాయన. దీపక్ కుమార్ పాడి విజువల్స్ సినిమాకి ప్లస్. 'రంగం' సినిమా నుంచి నన్ను ఎంతో ఆదరిస్తున్న తెలుగు వారికి థ్యాంక్స్. నేను నటించిన స్ట్రైట్ తెలుగు చిత్రం 'యాత్ర 2'కి నటుడిగా మంచి పేరొచ్చింది. తెలుగులో నేరుగా మరో సినిమా చేయాలని నాకూ ఉంది. రచయితలు, దర్శకులు నా కోసం కథ సిద్ధం చేస్తే నేను రెడీ. ప్రస్తుతానికి నా దృష్టి సినిమాలపైనే ఉంది. రాజకీయాల ఆలోచన లేదు'' అని తెలిపారు.



ఈ మర్రి సుస్వరాల ఝరి

ఈ మర్రి సాలూరి స్వరమేళవింపునకు వేదికయ్యింది. గాన గంధర్వుడు ఘంటసాల గాత్రానికి తన ఊడల సవ్వడితో శృతి కలిపింది. గానకోకిల సుశీలమ్మ పాట విని పరవశించింది. విజయనగర సంగీత కళాశాల వైభవోపేతంగా వెలుగొందిన దశలో ఎందరో ఉద్దండులకు తన చల్లని నీడలో ఆశ్రయమిచ్చిన ఈ మర్రి చెట్టు ప్రస్తుతం ఆలనాపాలనాలేక ఇలా తయారైంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



గోధూళి వేళాయె.. గోపయ్య రాడాయె

సాయం సంధ్య వేళ పశ్చిమాన అరుణ కాంతులు వెదజల్లుతూ సూర్యుడు అస్తమిస్తున్నాడు. చీకట్లు క్రమంగా ఒక్కో ప్రాంతాన్ని ఆక్రమించుకుంటున్నాయి. గోవులు కొట్టాలకు, పక్షులు గూళ్లకు చేరుకునేందుకు తొందరపడుతున్నాయి. నిత్యం పల్లెల్లో కనిపించే ఈ దృశ్యాలు శుక్రవారం సాయంత్రం విశాఖ శివారులో మేత కోసం వచ్చిన ఆవులు ఇంటిముఖం పడుతున్న సుందర దృశ్యం సాక్షి కెమెరాకు చిక్కింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



కన్నా నిదురించరా..

పొట్టకూటి కోసం ప్రాంతం కాని ప్రాంతానికి వచ్చిన వలసజీవులు తమ పిల్లల్ని ఇలా చెట్టుకు ఊయల కట్టి నిద్ర పుచ్చి గృహోపకరణాల అమ్మకంలో నిమగ్నమయ్యారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

పోక్సో కేసులో 15న విచారణకు హాజరుకండి

కర్ణాటక మాజీ సీఎం యడియూరప్పకు కోర్టు ఆదేశం

శివాజీనగర: పోక్సో కేసులో కర్ణాటక మాజీ సీఎం బీఎస్ యడియూరప్పకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. గురువారం పుట్టినరోజును జరుపుకున్న ఉన్న మాజీ సీఎంకు పోక్సో కేసులో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు-1 నుంచి సమన్లు జారీ అయ్యాయి. మార్చి 15న నేరుగా విచారణకు హాజరవ్వాలని కోర్టు ఆదేశించింది. ఇదే కేసులో హైకోర్టులో కేసు రద్దు చేయాలని యడియూరప్ప సమర్పించిన పిటిషన్ విచారణ సమయంలో..పాత కాగ్నిజెన్స్ రద్దు చేసిన హైకోర్టు, కొత్తగా కాగ్నిజెన్స్ తీసుకోవచ్చని ఆదేశించింది. అంతేకాకుండా ముందస్తు బెయిల్‌ను కొనసాగించింది. ప్రస్తుతం సీఐడీ సమర్పించిన చార్జిషీట్‌పై కోర్టులో విచారణ ప్రారంభమైంది.

యడ్డిపై అవినీతి కేసు విచారణ మార్చి 6కు వాయిదా

యడియూరప్పపై నమోదైన అవినీతి ఆరోపణల కేసులో విచారణ శుక్రవారం సుప్రీంకోర్టులో జరిగింది. అవినీతి నియంత్రణ చట్టం కింద తనపై నమోదైన కేసుల్లో స్టే ఇవ్వాలని కోరుతూ యడియూరప్ప పిటిషన్ సమర్పించారు. దీనిపై న్యాయమూర్తులు జస్టిస్ పార్థీవాలా, జస్టిస్ మనోజ్ సిన్హాల నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టి వాద, ప్రతివాదనలను తరువాత మార్చి 6కు తదుపరి విచారణను వాయిదా వేసింది.

టీడీపీ నేతల లాటరీ గుట్టు రట్టు

- లాటరీ డెన్‌పై పోలీసుల దాడి
- పన్నెండుమంది పట్టివేత
- నగదు, సెల్‌ఫోన్లు సీజ్

పలమనేరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చిత్తూరు జిల్లా పలమనేరు మళ్లీ అక్రమ వ్యాపారాల డెన్‌లకు నిలయంగా మారిందనే విమర్శలున్నాయి. ఈ క్రమంలో ఇక్కడ సాగే లాటరీ వ్యాపారాలను ఓ యువనేత లీడ్ చేస్తూ పేదల జీవితాలను రోడ్డుపాలు చేస్తున్నాడంటూ గతనెల సాక్షిలో కథనం వెలువడింది. దీనిపై పోలీసు నిఘా విభాగాలు కన్ను పెట్టాయి. ఈ నేపథ్యంలో పలమనేరు పట్టణంలోని మదనపల్లి రోడ్డు గుండుబావి సమీపంలో లాటరీ ఆఫీస్‌నే నిర్వహిస్తున్న నిందితులను శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన వారిలో 20వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి లోకనాథ ఆచారితోపాటు అతని తండ్రి సుబ్రమణ్యం ఆచారి, సోదరుడు యుగంధరాచారి, నారాయణస్వామి, శశిధర్, షంషీర్, శివకుమార్, మహ్మద్‌వాజిద్‌తోపాటు గంగవరానికి చెందిన మరో నలుగురిని అరెస్ట్ చేసి.. వీరినుంచి రూ.8,500 , సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాకు తమిళనాడు, కేరళ తదితర అంతర్రాష్ట్ర లాటరీ నిర్వాహకులతో సంబంధాలున్నట్లు విమర్శలున్నాయి. కాగా టీడీపీ నేతల ప్రమేయం ఉన్నందున ఈ విషయాన్ని పోలీసులు ధ్రువీకరించడం లేదనే వాదన వినిపిస్తోంది.

తొక్కిసలాట ఘటనపై కొనసాగుతున్న న్యాయ విచారణ

తిరుపతి అర్బన్: తిరుమలలోని వైకుంఠ ద్వారదర్శన టోకెన్ల జారీ సందర్భంగా తిరుపతి నగరంలోని బైరాగిపట్టెడలో ఉన్న పద్మావతి పార్క్‌లో ఈ ఏడాది జనవరి 8న జరిగిన తొక్కిసలాట ఘటనపై న్యాయ విచారణ కొనసాగుతోంది. తొక్కిసలాటలో 6 గురు మృతి చెందగా, మరో 44 మంది గాయపడిన విషయం విదితమే. శుక్రవారం విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎం .సత్యనారాయణమూర్తి విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముగ్గురు భక్తులను విచారణ చేశారు. తిరుపతి నెహ్రూవీధికి చెందిన ఓ భక్తుడు ఇంటినుంచే తన మొబైల్ ద్వారా వర్చువల్ విధానంలో హాజరయ్యారు. అలాగే విశాఖపట్నంలోని గోపాలపట్నంకు చెందిన మరో మహిళా భక్తురాలు స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి హాజరయ్యారు. కర్ణాటక రాష్ట్రంలోని బళ్ళారికి చెందిన మరో భక్తుడు మొబైల్ ద్వారా వర్చువల్ విధానంలో విచారణకు హాజరయ్యారు. ఘటనకు సంబంధించి ఇప్పటి వరకు 35 మందిని విచారణ చేశారు. మిగిలిన వారిని దశల వారీగా విచారణ చేయనున్నారు. ప్రమాద బాధితుల విచారణ తర్వాత సిబ్బందిని విచారిస్తారని తెలుస్తోంది.



వారెవ్వా... వాస్తు శిల్పి!

జాబ్ మార్కెట్‌లో భారీగా పెరుగుతున్న డిమాండ్

సాంకేతిక పరిజ్ఞానం, మార్కెట్ అవసరాల్లో వచ్చిన మార్పులకు ప్రతిబింబం

మనం ఒక పురాతన దేవాలయానికి వెళతాం. ఆ దేవాలయం అద్భుత నిర్మాణం గురించి చర్చించుకుంటాం. ఆధునిక ప్రపంచంలో ఒక నగరానికి వెళతాం. అక్కడి ఆకర్షణీయమైన భవనాల గురించి మాట్లాడుకుంటాం. మన ఆఫీసులో ఏర్పాటు చేసిన వసతుల గురించి గర్వంగా చెప్పుకుంటాం. అప్పుడూ.. ఇప్పుడూ.. ఎప్పుడూ... ఈ ఆకర్షణీయమైన నిర్మాణ రూపకల్పలో కీలక వ్యక్తి.. అప్పటి వాస్తు శిల్పి... ఇప్పటి ఆర్కిటెక్ట్. ఆధునిక సమాజంలో ఆర్కిటెక్ట్ డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. చాలా బిజీ ప్లేస్‌లో ఉన్న ఒక చిన్న స్థలంలో సైతం అద్భుత, ఆకర్షణీయమైన వాణిజ్య నిర్మాణ రూపకల్పన వారి ప్రత్యేకం. తక్కువ చోటైనా... అన్ని సదుపాయాలతో చక్కటి ఇంటి నిర్మాణానికి డిజైన్ వేయడం వారి ప్రతిభ. మన కలలను నిజం చేయగల సామర్థ్యం వారి సొంతం. ఇవే అంశాలు వారిని ఇప్పుడు ప్రత్యేక స్థానంలో నిలబెడుతున్నాయి. జాబ్ మార్కెట్ డిమాండ్ విషయంలో ఇంజనీర్లను కాదని వారిని అగ్ర స్థానాన నిలబెడుతోంది.

– సాక్షి, ఏపీ సెంట్రల్ డెస్క్

ఆర్కిటెక్ట్‌లు ఇప్పుడు దేశంలో అత్యధిక డిమాండ్ ఉన్న నిపుణులుగా మారారు. ప్రపంచంలో నంబర్ వన్ జాబ్ సైట్, గ్లోబల్ జాబ్ మ్యాచింగ్, హైరింగ్ ప్లాట్‌ఫామ్– ఇండీడ్ 'బెస్ట్ జాబ్స్ ఫర్ 2025 ఇన్ ఇండియా' పేరుతో విడుదల చేసిన నివేదిక ఇదే విషయాన్ని చెబుతోంది. పలు రంగాలను పరిశీలిస్తే, ఉపాధి అవకాశాల పెరుగుదల రేటు ఆర్కిటెక్ట్ విభాగంలో ఏకంగా 81 శాతంగా ఉందంటే ప్రస్తుత సమాజంలో వారి ప్రాధాన్యత అర్థం అవుతుంది. నివేదిక ప్రకారం వారి సగటు వార్షిక వేతనం రూ.14,95,353. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, డేటా సైంటిస్టులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) నిపుణులకు ఉన్న డిమాండ్‌తో పోల్చితే భారత్ కార్పొరేట్ రంగంలో ఆర్కిటెక్ట్‌ల డిమాండ్ అధికంగా ఉన్నట్లు గణాంకాలు పేర్కొంటున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం, మార్కెట్ అవసరాల్లో వచ్చిన మార్పులకు ఇది ప్రతిబింబం.

ప్రత్యేకత ఎందుకు?

ఆర్కిటెక్ట్ లను ఇంజనీర్లతో పోల్చి కొందరు వారిని తక్కువగా అర్థం చేసుకుంటారు. కానీ వాస్తవానికి ఇంజనీర్లతోపాటు ఆర్కిటెక్ట్‌లు కూడా ఒక భవనాన్ని రూపుదిద్దడానికి ఎంతో అవసరం. అందమైన, బలమైన, సుస్థిరమైన భవనాల రూపకల్పనలో ఇంజనీర్‌తో పాటు ఆర్కిటెక్ట్ పాత్ర కూడా ఎంతో కీలకం. ఆర్కిటెక్ట్స్ భవనాన్ని కేవలం నిర్మాణం కోణంలోనే కాకుండా, దానిని అందంగా, వినియోగదారులకు అనువుగా డిజైన్ చేస్తారు. వారు ఫంక్షనాలిటీ అలాగే ఎస్తెటిక్‌ని సమతుల్యం చేస్తారు. ఇంజనీర్ పటిష్ట నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తే, ఆర్కిటెక్ట్ అందమైన, వినియోగదారులకు అనువైన ప్రదేశాలను సృష్టిస్తారు. కస్టమర్ అవసరాలు, ఆర్థిక పరిమితులు, పర్యావరణ అంశాలు, నగర విస్తరణ– ఇవన్నీ దృష్టిలో ఉంచుకుని డిజైన్ చేస్తారు. ఆర్కిటెక్ట్స్ కొత్త, విభిన్నమైన డిజైన్ ఆలోచనలను ప్రతిపాదిస్తారు. ఇంజనీర్లు వాటిని సాధ్యమయ్యేలా చేస్తారు. ఇంకా చెప్పాలంటే ఆర్కిటెక్ట్స్ సృజనాత్మకతను జోడించి వినూత్నమైన భవనాలు రూపొందిస్తారు. ఇంజనీర్లు వాటిని ప్రాక్టికల్‌గా మార్చుతారు.

ఆధునికతతో అగ్రస్థానం

ఉద్యోగ నియామకాలు, జీతం పోకడలు, వృద్ధి అవకాశాలు, వేగవంతమైన పట్టణీకరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, స్థిర, ఆకర్షణీయ మైన నిర్మాణాలు, ప్రాధాన్యతలు ఇలా ఎన్నో అంశాలు ఆర్కిటెక్ట్‌ను జాబ్ మార్కెట్ డిమాండ్‌లో అగ్రభాగాన నిలబెట్టింది. మెట్రోల విస్తరణ, స్మార్ట్ నగరాల రూపకల్పన, పర్యావరణ సానుకూలతలు అలాగే పర్యావరణానికి అనుకూలమైన ఇంధన సమర్థ వినియోగ కార్యాలయాల నిర్మాణాలు వంటి ఎన్నో అంశాలను పరిగణనలోకి తీసుకుని భారత్ కార్పొరేట్ కార్యాలయ స్థలాలలో పెట్టుబడి పెడతాయి, ఆర్కిటెక్ట్‌లు ఈ పరివర్తనకు కేంద్రంగా ఉండడం గమనార్హం.

కీలక పాత్ర

కస్టమర్ అవసరాలను అర్థం చేసుకుని, వారి అభిరుచులకు అనుగుణంగా డిజైన్ చేయడం వీరి ప్రత్యేకత. నియమాలు, భద్రతా ప్రమాణాలు పాటించడం, ప్రభుత్వం, మున్సిపల్ కార్పొరేషన్‌ల అనుమతుల కోసం సమర్పించాల్సిన ప్లాన్లు సిద్ధం చేయడం, సంపదను, వనరులను సమర్థవంతంగా వినియోగించడం, భవనం నిర్మాణాన్ని, తక్కువ ఖర్చుతో, ఎక్కువ ప్రయోజనం కలిగేలా ప్లానింగ్ చేయడం, ప్రాజెక్ట్‌ను విజయవంతంగా పూర్తి చేయడానికి అన్ని విభాగాలతో సమన్వయం, ఆధునిక సమాజంలో గ్రీన్ బిల్డింగ్స్, ఎనర్జీ–ఎఫిషియెంట్ డిజైన్‌ల రూపకల్పన.. ఇలా చెప్పుకుంటూ పోతే ఆధునిక నిర్మాణ రంగంలో వారి పాత్ర అపారం.

డిమాండ్ ఎక్కడ?

- వ్యక్తిగత ఇళ్ల నిర్మాణం
- అపార్ట్‌మెంట్‌లు, షాపింగ్ మాల్స్, ఆఫీస్ బిల్డింగ్‌లు
- రోడ్లు, బ్రిడ్జీలు, గవర్నమెంట్ భవనాల వంటి ప్రభుత్వ ప్రాజెక్టులు
- మల్టీనేషనల్ కంపెనీల క్యాంపస్ డిజైన్‌లు
- మ్యూజియం, హోటల్స్, ఎయిర్‌పోర్ట్, స్టేడియం, దేవాలయాల వంటి ప్రత్యేక భవనాల డిజైన్

జాబ్ మార్కెట్‌లో డిమాండ్ పెరుగుదల ఇలా..
(2022-23తో పోల్చి 2023-24లో..)

ర్యాంక్	రంగం	డిమాండ్ స్పీడ్ (శాతం)	సగటు వార్షిక వేతనం (రూ.లలో)
1	ఆర్కిటెక్ట్	81	14,95,353
2	సీనియర్ జావా డెవలపర్	58	15,45,724
3	ఆపరేషన్స్ మేనేజర్	58	8,16,006
4	టెక్నికల్ లీడ్	53	16,88,632
5	డేటా ఇంజనీర్	48	16,02,858
6	ఎస్‌ఏపీ కన్సల్టెంట్	44	14,08,031
7	ప్రాజెక్ట్ మేనేజర్	43	9,60,581
8	డేటా విశ్లేషణ	41	8,51,054
9	సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్	35	13,58,750
10	సైట్ రిలయబిలిటీ ఇంజనీర్	33	16,63,881
11	సాఫ్ట్‌వేర్ టెస్ట్ ఇంజనీర్	32	8,94,342
12	యూజర్ ఎక్స్‌పీరియన్స్ డిజైనర్	26	9,32,764
13	టెక్నికల్ కన్సల్టెంట్	17	12,65,865
14	సాఫ్ట్‌వేర్ ఆర్కిటెక్ట్	17	24,20,495
15	డేటా సైంటిస్ట్	13	13,78,390


ఆధారం: ఇండీడ్

ఇంజనీర్లు భవనానికి ప్రాణం పోసే గుండె లాంటి వారు అయితే, ఆర్కిటెక్ట్ ఆ భవనానికి జీవం పోసే ఆత్మ. ఆర్కిటెక్ట్ లేకపోతే భవనాలు కేవలం 'నిర్మాణాలు'గానే ఉంటాయి. అందమైన, ఆకర్షణీయమైన వినియోగదారులకు అనుకూలమైన, చిరస్థాయిగా నిలిచే నిర్మాణాలను రూపొందించేది ఆర్కిటెక్ట్‌లే!

ఆర్కిటెక్ట్ కావాలంటే?

భారతదేశంలో ఆర్కిటెక్ట్‌గా పనిచేయాలంటే బ్యాచులర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (బీ.ఆర్క్) అనే 5 సంవత్సరాల కోర్సు పూర్తి చేయాలి. దీనికి నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్ (నాటా) లేదా జేఈఈ పేపర్ 2 ద్వారా అర్హత పొందాలి.

భూగర్భంలో జల రాశులు అపారం



2024లో దేశంలో భూగర్భ జలాలుగా మారిన వర్షపు నీరు 12,656.20 టీఎంసీలు

రాష్ట్రంలో 787.30 టీఎంసీల భూగర్భ జలాలు

దేశవ్యాప్తంగా నగటున 60% భూగర్భ జలాల వినియోగం

రాష్ట్రంలో భూగర్భ జలాల్ని వాడుకున్నది 29.83 శాతమే

కేంద్ర భూగర్భ జల మండలి నివేదికలో వెల్లడి

సాక్షి, అమరావతి: నైరుతి, ఈశాన్య రుతు పవనాల ప్రభావం వల్ల గత ఏడాది సమృద్ధిగా కురిసిన వర్షపు నీటిని భూమి తన గర్భంలో జలరాశులుగా మార్చుకుంది. దీంతో దేశవ్యాప్తంగా భూగర్భ జలాలు అపారంగా పెరిగాయి. దేశంలో 2024లో 12,656.20 టీఎంసీల (446.9 బిలియన్ క్యూబిక్ మీటర్లు) మేర భూగర్భ జలాలు పెరిగినట్లు కేంద్ర భూగర్భ జల మండలి (సీజీడబ్ల్యూబీ) అంచనా వేసింది. దేశవ్యాప్తంగా 2024లో భూగర్భ జలాల పరిస్థితిని అధ్యయనం చేసిన సీజీడబ్ల్యూబీ ఇటీవల కేంద్ర జల్ శక్తి శాఖకు నివేదిక ఇచ్చింది. ఆ నివేదిక ప్రకారం.. దేశంలోని భూగర్భ జలాల్లో 11,503.30 టీఎంసీలను ఉపయోగించుకునే అవకాశం ఉండగా.. అందులో 60 శాతం వినియోగించుకున్నట్లు లెక్కగట్టింది. రాష్ట్రంలో 2024లో 787.30 టీఎంసీల మేర భూగర్భ జలాలు పెరిగితే.. అందులో 223.17 టీఎంసీలను (29.83 శాతం) మాత్రమే వాడుకున్నట్లు అంచనా వేసింది.

దేశంలో 2024లో భూగర్భ జలాల పరిస్థితి..

- భూగర్భ జలాలుగా మారిన వర్షపునీరు 12,656.20 టీఎంసీలు
- వినియోగించుకోదగ్గ జలాలు 11,503.30 టీఎంసీలు
- ఏడాదిలో ఉపయోగించిన భూగర్భ జలాలు 6,956.52 టీఎంసీలు

మొత్తం మండలాలు/ బ్లాక్‌లు/తాలూకాలు	భారీగా జలాలున్నవి (సురక్షితమైనవి)	బాగా తక్కువవున్నవి (సమస్యాత్మకం)	భారీగా తోడేసినవి	ఉప్పునీటిగా మారినవి
6,746	4,951	206	751	127

నివేదికలోని మరికొన్ని ప్రధానాంశాలు


- దేశంలో తొలిసారిగా 1980లో భూగర్భ జలాలపై అధ్యయనం జరిగింది. ఆ తరువాత 1995, 2004, 2009, 2011, 2013, 2017, 2020లలో సీజీడబ్ల్యూబీ అధ్యయనం చేసింది. 2022 నుంచి ఏటా ఈ అధ్యయనం చేస్తోంది.
- దేశంలో కురిసే వర్షం వల్ల వచ్చే నీటిలో 61 శాతం భూమిలోకి ఇంకి, భూగర్భ జలాలుగా మారుతున్నాయి.
- భూగర్భ జలాల వినియోగం 2023తో పోల్చితే 2024లో పెరిగింది. 2023లో 6,834.75 టీఎంసీలను తోడివేయగా.. 2024లో 6,956.52 టీఎంసీలను వినియోగించుకున్నారు.
- దేశంలో భూగర్భ జలాలను పంజాబ్, రాజస్థాన్, ఢిల్లీ, హర్యానా, డయ్యూ డామన్, గుజరాత్‌లలో భారీ ఎత్తున తోడేసి ఉపయోగించుకుంటున్నారు.
- 2023తో పోల్చితే 2024లో భూగర్భ జలాల పరిమాణం కాస్త తగ్గింది. 2023లో భూగర్భ జలాల పరిమాణం 12,717.95 టీఎంసీలు ఉంటే.. 2024లో 12,656.20 టీఎంసీలకు తగ్గింది.

రాష్ట్రంలో 2024లో భూగర్భ జలాల పరిస్థితి..

- భూగర్భ జలాలుగా మారిన వర్షపు నీరు: 787.30 టీఎంసీలు
- ఇందులో వినియోగించుకోదగ్గ జలాలు: 747.94 టీఎంసీలు
- ఏడాదిలో ఉపయోగించిన భూగర్భ జలాలు 223.17

రాష్ట్ర వ్యాప్తంగా భూగర్భ జలాల పరిస్థితి ఇదీ..

- మొత్తం మండలాలు 679 (12 అర్బన్ మండలాలతో కలిపి)
- భారీగా జలాలున్నవి (సురక్షితమైనవి) 591
- కొంత మేర తక్కువవున్నవి (కొంత సమస్యాత్మకం) 38
- బాగా తక్కువవున్నవి (సమస్యాత్మకం): 2
- భారీగా తోడేసినవి 9
- ఉప్పు నీటిగా మారినవి 39



1990 ప్రాంతంలో యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రం



2014కు ముందు..



ప్రస్తుతం కృష్ణశిల, బంగారు విమాన గోపురంతో యాదగిరి క్షేత్రం

కీకారణ్యం నుంచి.. దివ్యక్షేత్రంగా..

యాదగిరిగుట్ట: తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రం దినదినాభివృద్ధి చెందుతోంది. 1895కు ముందు యాదగిరికొండపైకి వెళ్లేందుకు సరైన రోడ్డుమార్గం కూడా ఉండేది కాదు. ఈ ప్రాంతమంతా దట్టమైన అడవి విస్తరించి ఉండేది. 1920లో ఆలయంలో శ్రీస్వామి వారికి పూజలు మొదలయ్యాయి. ఆ తర్వాత భక్తులు కొండపైకి వెళ్లేందుకు గుట్టల మధ్య నుంచి ఘాట్‌రోడ్డు వేశారు. 1955లో తొలిసారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఆ సమయంలో ఘాట్ రోడ్డుతో పాటు మెట్ల మార్గాన్ని మెరుగుపరచడంతో పాటు కొండపైన భక్తుల కోసం తాగునీటి వసతి కల్పించారు. 1990 నుంచి 2013 వరకు ఆలయం మరింత పురోగతి చెందింది. కంకరతో ఉన్న ఘాట్ రోడ్డును బీటీగా మార్చారు. కొండపైన భక్తుల కోసం కాటేజీలు, దుకాణాలు ఏర్పాటు చేశారు. కీకారణ్యం కొండల నుంచి ఇప్పుడు బంగారు వర్ణంలో మెరిసే క్షేత్రంగా యాదగిరిగుట్ట అభివృద్ధి చెందింది.

దోపిడీ ఆగదిక్కడ!

కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానంలో గదుల కొరత

దేవస్థానం గదులు 95 మాత్రమే

ప్రైవేట్ అద్దె గదుల యజమానుల దోపిడీ

రోజుకు రూ.3 వేల నుంచి రూ.6 వేలు వసూలు

పట్టని పోలీసులు, రెవెన్యూ అధికారులు



కొమురవెల్లిలో ప్రైవేటు గదులు కిరాయికి ఇవ్వబడును అంటూ బోర్డులు



దేరాలు వేసుకుని బోనాలు వండుతున్న భక్తులు

సాక్షి, సిద్దిపేట: తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో సిద్దిపేట జిల్లా కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం ఒకటి. శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనానికి సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వస్తారు. కానీ వ్యయప్రయాసలకోర్చి వచ్చే భక్తులకు వసతి సమస్య తప్పడం లేదు. కొమురవెల్లి జాతరలో భక్తుల తాకిడికి సరిపడినట్టు దేవస్థానం గదులు లేక పోవడంతో.. ప్రైవేట్ అద్దె గదులను ఆశ్రయిస్తున్నారు. జాతర జరిగే ప్రతి ఆది, బుధవారాల్లో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. దీంతో ప్రైవేట్ అద్దె గదుల యజమానులు భక్తుల నుంచి దోచుకుంటున్నారు. సామాన్యులు అంత చెల్లించలేక.. చెట్ల కిందే ఉంటూ ఇబ్బందిపడుతున్నారు.

డిమాండ్ బట్టీ దోపిడీ

గది విస్తీర్ణాన్ని బట్టి కొమురవెల్లి జాతరలో భక్తుల నుంచి డబ్బు వసూలు చేస్తున్నారు. ఒక్కొక్క గదికి.. రోజుకు సుమారు రూ.3 వేల నుంచి రూ.6 వేల వరకు వసూలు చేస్తున్నారు. వీరికి అడ్డూఅదుపూ లేకపోవడంతో డిమాండ్ బట్టి కిరాయికి ఇస్తున్నారు. ప్రైవేట్ గదుల నిర్వాహకులు ఏజెంట్లను ఏర్పాటు చేసుకున్నారు. భక్తులు రాగానే.. తమ దగ్గర అన్ని సౌకర్యాలతో గదులు ఉన్నాయంటూ ఊదరగొడతారు. దేవస్థానం గదుల్లేక భక్తులు.. తప్పని పరిస్థితుల్లో ప్రైవేట్ గదులు అద్దెకు తీసుకుని వసతి పొందుతున్నారు. ఇదే అదనుగా అద్దె గదుల యజమానులు భక్తులను దోచుకుంటున్నారు. కొందరు భక్తులు చెట్ల కిందే బోనం వండి, పట్నంవేసి మల్లన్నకు మొక్కులు చెల్లిస్తున్నారు. ఎండకు ఎండుతూ.. వర్షానికి తడుస్తున్నారు. దేవాలయ ప్రాంగణంలో వసతి కోసం కాటేజీలు లేక పోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందిపడుతున్నారు.

95 గదులే వినియోగం

భక్తుల సహకారంతో ఆలయం ఆధ్వర్యంలో 140 కాటేజీలను నిర్మించగా.. అందులో 25 పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. ఇరవై గదులను ఆలయ అవసరాలకు వినియోగిస్తున్నారు. దీంతో 95 గదులు భక్తులకు అందుబాటులో ఉన్నాయి. ఆ గదులు తొలుత ప్రాధాన్యత దాతలకు ఇస్తున్నారు. దీంతో సాధారణ భక్తులకు లభించడం కష్టంగా మారుతోంది. కొమురవెల్లిలో 50 కాటేజీల నిర్మాణ పనులు ఆరేళ్లుగా సాగుతూనే ఉన్నాయి. పంచాయతీరాజ్ అధికారులు పట్టించుకోకపోవడంతో.. సంబంధిత కాంట్రాక్టర్ నత్తనడకన పనులు చేస్తున్నాడు. ఇప్పటికైనా ఆలయ అధికారులు, రెవెన్యూ, పోలీసులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకుని ప్రైవేట్ గదుల అద్దెలను నియంత్రించాలని, మరిన్ని కాటేజీల నిర్మాణానికి ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని భక్తులు కోరుతున్నారు.

అద్దె భరించలేక డేరాల్లో ఉన్నాం



ఏటా కొమురవెల్లి జాతరకు మా కుటుంబమంతా వస్తాం. గుడి ఆధ్వర్యంలో గదులు లేవు. దీంతో బయట ప్రైవేట్ గదులకు రోజుకు రూ.3 వేలు అన్నారు. తెచ్చుకున్న డబ్బులో సగం కంటే ఎక్కువ అద్దెకే ఖర్చవుతుందని.. మేము వచ్చిన వాహనం దగ్గరే డేరా వేసుకుని ఉన్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆలయం ఆధ్వర్యంలో గదులను నిర్మించాలి.

– కొండుభా, నాందేడ్

నెలరోజుల్లో 50 గదులు సిద్ధం



బండ గుట్టపై నిర్మిస్తున్న 50 గదుల నిర్మాణం పూర్తి కావొచ్చింది. నెల రోజుల్లో అందుబాటులోకి తీసుకొస్తాం. దాతల సహకారంతో 100 గదులను నిర్మించాలని నిర్ణయించాం. పలువురు దాతలు ముందుకు వచ్చారు.

– రామాంజనేయులు, ఈవో

విద్యార్థులను పస్తులుంచడమే ప్రజాపాలనా!

- హాస్టల్ పిల్లలకు అన్నం పెట్టకుండా పస్తులు ఉంచారు
- ఎక్స్‌లో మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: పండుగపూట విద్యార్థులను పస్తులుంచడమే ప్రజాపాలనా.. అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. విద్యార్థులకు కనీసం తిండి పెట్టలేని దుస్థితిలో రేవంత్ ప్రజా ప్రభుత్వం ఉందని శుక్రవారం 'ఎక్స్'వేదికగా ఆయన ఆరోపించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొడనాగులలోని ఎస్టీ బాలుర హాస్టల్లో శివరాత్రి పండుగ రోజు 200 మంది విద్యార్థులు ఆకలితో ఇబ్బంది పడ్డారన్నారు. 'అన్నం వండలేదు గుడిలో తినండి'అని బల్మూరు మండలం కొండనాగుల ఎస్టీ బాలుర హాస్టల్ సిబ్బంది విద్యార్థులకు చెప్పడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం గుడిబండ శివాలయంలో చేసే అన్నదానానికి వెళ్లి తినాలని, రాత్రి భోజనం వీరం రామాజీపల్లిలోని గంగమ్మ దేవాలయంలో అన్నదానానికి వెళ్లి తినాలని హాస్టల్ సిబ్బంది చెప్పడం ఏమిటని నిలదీశారు. పండుగ పూట విద్యార్థులకు భోజనం పెట్టకుండా, కిలోమీటర్లకొద్దీ నడుచుకుంటూ వెళ్లి తినమని చెప్పడం సరికాదంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారని కేటీఆర్ తెలిపారు. టన్నెల్ ప్రమాదం.. అంటూ మంత్రులు హెలికాప్టర్ యాత్రలు చేస్తూ చేపలకూర విందులు చేసుకుంటున్నారని ఆయన ధ్వజమెత్తారు.

ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టుకు టీబీఎం టెక్నాలజీ అనువైనది కాదు

బీజేపీ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్‌ఎల్‌బీసీ) ప్రాజెక్టుకు టీబీఎం (టన్నెల్ బోరింగ్ మెషీన్) టెక్నాలజీ అనువైనది కాదని చెప్పినా వినకుండా మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దీన్ని బలవంతంగా చేపట్టారని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆరోపించారు. ప్రాజెక్టు పేరుతో మంత్రులు ధనం కొల్లగొట్టాలని చూస్తున్నారన్నారు. ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్ట్ జాప్యం, అంచనాల పెంపుదల, దీన్ని కొనసాగిస్తున్న తీరు, కూలిన ఘటనపై న్యాయవిచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రాజెక్టుకు సంబంధించి కొన్నేళ్లుగా తట్టెడు మట్టి తీయలేదని, అలాంటిది ప్రాజెక్ట్ వ్యయాన్ని రూ.4,630 కోట్లకు పెంచారని తెలిపారు. ఇప్పుడు మళ్లీ పాత సంస్థతో పనులు ప్రారంభించగా.. ఇది మొదలుపెట్టిన నాలుగు రోజుల్లోనే దుర్ఘటన జరిగిందని చెప్పారు. ఇప్పుడు ఓపెన్ కెనాల్ తరహాలో ప్రాజెక్టు చేపడతామంటున్నారని, ప్రాజెక్టు వెనుక కోట్ల రూపాయల చేతులు మారినందున విచారణ జరిపించాల్సిన అవసరముందని తెలిపారు. బీఆర్‌ఎస్ రాజకీయ హత్యలకు పాల్పడుతోందని ప్రభాకర్ తీవ్ర ఆరోపణలు చేశారు. గతంలో లాయర్ వామనరావు హత్య, ఈ మధ్యే రాజలింగమూర్తి హత్య, సంబంధిత కేసు వాదిస్తున్న ఓ అడ్వొకేట్ హత్య కూడా జరిగిందన్నారు. ఈ హత్యలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని ప్రభాకర్ డిమాండ్ చేశారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి రీపోలింగ్ నిర్వహించండి

బీఎస్ఎఫ్ ఏపీ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: ఉభయ తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి రీపోలింగ్ నిర్వహించాలని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ (బీఎస్ఎఫ్) ఏపీ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్ కేంద్ర ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు. ఎన్డీఏ (టీడీపీ) కూటమి అభ్యర్థికి గట్టి పోటీ ఇస్తాననే ఉద్దేశంతో అధికార పార్టీకి చెందిన నాయకులతో ఎన్నికల అధికారులు కుమ్మక్కై తన నామినేషన్‌ను రిజెక్ట్ చేసి పోటీలో లేకుండా చేశారని ఆరోపించారు. శుక్రవారం ఢిల్లీలో శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడారు. తనకు జరిగిన అన్యాయంపై రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కలిసి గత నెల 12న ఫిర్యాదు చేశానని.. అయితే అక్కడ న్యాయం జరగకపోవడంతో 25న కేంద్ర ఎన్నికల సంఘానికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్‌తోపాటు మిగిలిన అధికారులపై విచారణ జరిపించి తన నామినేషన్‌ను పునరుద్ధరించి ఆమోదించాలని, రీ పోలింగ్ నిర్వహించాలని కోరారు.

సొరంగ ప్రమాదంపై రాజకీయం సరికాదు

శాసన మండలి చైర్మన్ గుత్తా హితవు

సాక్షి, హైదరాబాద్: ఎస్‌ఎల్‌బీసీ సొరంగ ప్రమాదంపై రాజకీయాలు చేయడం సరికాదని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి హితవు పలికారు. ఆయన శుక్రవారం శాసనమండలి ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, ఏజెన్సీలు నిర్విరామంగా సహాయక చర్యల్లో నిమగ్నమైన తరుణంలో రాజకీయాలు చేయడం మంచిది కాదన్నారు. 2009, 2010 వరదల సమయంలో కూడా సొరంగం మునిగిపోయిందని ఆయన గుర్తు చేశారు. హరీశ్‌రావు నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు పలుమార్లు సమీక్షలు జరిగాయని, అదే సీఎంగా కేసీఆర్ నీటిపారుదల శాఖను పర్యవేక్షించినప్పుడు సమీక్షలు నిలిచిపోయాయని వ్యాఖ్యానించారు. అనుభవం ఉన్న హరీశ్‌రావు సైతం సొరంగ ప్రమాదంపై రాజకీయాలు చేయడం సరికాదన్నారు. సొరంగ నిర్మాణం ఆచరణీయం కాదని కేటీఆర్ వ్యాఖ్యానించడాన్ని గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆక్షేపించారు. అలాంటప్పుడు బీఆర్‌ఎస్ హయాంలో రూ.3,600 కోట్లు ఎందుకు ఖర్చు చేశారని ప్రశ్నించారు. ఈ ఘటనలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమేమీ లేదని, పూర్తిస్థాయిలో సహాయక చర్యలు చేపట్టిందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం కాళేశ్వరంపై పెట్టిన శ్రద్ధ.. ఎస్‌ఎల్‌బీసీపై 25 శాతం పెట్టినా సొరంగం ఎప్పుడో పూర్తయ్యేదని అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో కృష్ణా ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయని ఆయన విమర్శించారు.

గడువులోగా పనులు చేయకపోతే చర్యలు

'మెటీరియల్ కాంపోనెంట్' పనులపై పంచాయతీరాజ్ శాఖ హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: క్షేత్రస్థాయిలో గ్రామీణ ఉపాధి హామీ పథకం 'మెటీరియల్ కాంపోనెంట్' పనులు పూర్తిచేయకుండా గడువు తీరిపోయే (లాప్స్)లా చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ.. జిల్లా అధికారులను, సంబంధిత కాంట్రాక్టర్లను హెచ్చరించింది. మార్చి 31లోగా ఈ పథకం కింద రాష్ట్రానికి రూ.700 కోట్లకు ఇచ్చిన 'మెటీరియల్ కాంపోనెంట్' పనులు పూర్తిచేయాలని ఆదేశించింది. ఈ పనుల పూర్తికి సంబంధించి గడువు ముంచుకొస్తున్న నేపథ్యంలో వీలైనంత త్వరగా జిల్లాల వారీగా కేటాయించిన పనులను పూర్తిచేయాలని సూచించింది. పనులు పూర్తిచేయాలంటూ ప్రతీవారం సమీక్ష నిర్వహించినా కూడా వివిధ జిల్లాల్లో తగిన పురోగతి లేకపోవడం పట్ల పీఆర్‌ఆర్‌డీ అధికారులు అసంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం. పనులకు మంజూరునిచ్చి గ్రౌండింగ్ జరిగినా...అవి పూర్తికాకపోవడం పట్ల జిల్లా అధికారులపై పీఆర్ ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కాగా, కొన్నిచోట్ల గత ఏడాదికి సంబంధించి మెటీరియల్ కాంపోనెంట్ డబ్బులు రాకపోవడంతో ఈ ఏడాది పనులు పూర్తిచేసేందుకు కొందరు కాంట్రాక్టర్లు పెద్దగా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. మార్చి 31లోగా పూర్తిచేసిన పనులకు ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ (ఎఫ్‌టీవో)లు ఇవ్వకపోతే ఇక ఆ నిధులు విడుదలయ్యే అవకాశాలు లేకపోవడంతో పనులు త్వరితంగా పూర్తి చేసేలా అధికారులు ఒత్తిడి తెస్తున్నారు. ఈ పథకం కింద అనుమతించిన పనులకు త్వరిత వేతనం (క్విక్ వేజ్), మెటీరియల్ నిష్పత్తి సుమారు 60:40. అంటే దీని అర్థం వేతనాల కోసం ఖర్చు చేసే ప్రతి 60 రూపాయలకు, 40 రూపాయలు సామగ్రి కోసం ఖర్చు చేయవచ్చు. అదే మెటీరియల్ కాంపోనెంట్. వీటికింద పంచాయతీ, స్కూల్ భవనాలు, షెల్టర్లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పనులు చేపడతారు. ఈ పనుల్లో భాగంగా మన రాష్ట్రంలో అంగన్‌వాడీ భవనాల నిర్మాణం, గేదెలు, మేకలు, పౌల్ట్రీ షెల్టర్లు, ఆహారధాన్యాల గోడౌన్లు, విలేజీ పంచాయతీ సర్వీస్ సెంటర్లు, మరుగుదొడ్లు, సోక్‌పిట్ల నిర్మాణం వంటివి చేపడుతున్నారు.

ఎంఎస్‌ఎంఈలతోనే ఆర్థిక పురోగతి

పరిశ్రమల శాఖ సంచాలకుడు మల్సూర్

సాక్షి, హైదరాబాద్: దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతిలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పాత్ర అత్యంత కీలకమని పరిశ్రమల శాఖ సంచాలకుడు జి.మల్సూర్ అన్నారు. ప్లాజా హోటల్‌లో శుక్రవారం జరిగిన 'ఎస్‌ఎంఈ ఐపీవో- ప్రామిసింగ్ అవెన్యూ ఆఫ్ ఫండ్ రైజింగ్' అంశంపై జరిగిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. ఎంఎస్‌ఎంఈల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆరు రకాల ప్రోత్సాహకాలను అందిస్తోందన్నారు. ఎంఎస్‌ఎంఈలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా ఈ ప్రోత్సాహకాల అమలు జరుగుతోందని, సంబంధిత జిల్లా అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) సీనియర్ వైస్ ప్రెసిడెంట్ హరీశ్ అహూజా మాట్లాడుతూ.. ఎస్‌ఎంఈల కోసం నిర్దేశించిన ఎన్‌ఎస్‌ఈ ఎమర్జ్ ప్లాట్‌ఫామ్‌కు సంబంధించిన అంశాలను వివరించారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ అదనపు సంచాలకుడు రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'కవ్వాల్'లో కుహూ కుహూలు

రాష్ట్రంలో తొలిసారిగా మంచిర్యాలలో 'బర్డ్ ఫెస్టివల్'

- పక్షులపై అవగాహన నుంచి శబ్దాల రికార్డింగ్ వరకు..
- హాజరుకానున్న దేశంలోని ప్రముఖ పక్షుల నిపుణులు



వెంకట్రావుపేట్ చెరువులో కన్పించిన నార్తన్‌పిన్‌టెల్ పక్షులు



చెరువులో కనిపించిన గడ్వాల్ పక్షి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: 'కవ్వాల్ బర్డ్ ఫెస్టివల్' పేరుతో మంచిర్యాల జిల్లా అటవీ అధికారులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. గత కొన్నేళ్లుగా 'బర్డ్ వాక్'లో భాగంగా అడవుల్లో ఔత్సాహికులకు పక్షులను ప్రత్యక్షంగా చూసే అవకాశం కల్పిస్తున్నారు. వీటికి కొనసాగింపుగా శని, ఆదివారాల్లో ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు. ఈ రెండు రోజుల కార్యక్రమంలో స్థానిక పక్షులపై అవగాహన కల్పిస్తూ దేశంలో ఉన్న జాతులు, వలసలు, ఆవాసాలు, అనుకూలతలు, ముప్పు వంటివన్నీ ఈ వేదికగా చర్చించనున్నారు. దేశంలో ప్రముఖ పక్షుల నిపుణులు, పరిశోధకులు, శాస్త్రవేత్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరుకానున్నారు. డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా, ఐఐఎస్ఈఆర్ (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్) తిరుపతి, సిటిజన్ ఫర్ బర్డ్స్, బర్డ్ జియోగ్రఫీ గోదావరి తీరం, పక్షుల వలసలపై అధ్యయనం, వాతావరణం మార్పులు, వన్యప్రాణుల సంరక్షణ తదితర రంగాల నిపుణులు పాల్గొంటున్నారు. మొదట జిల్లా కలెక్టరేట్‌లో ఆయా రంగాల ప్రముఖులతో ప్రసంగాలు, చర్చలు జరుగుతాయి. ఎంపిక చేసిన వారితో ఉదయం నుంచి సాయంత్రం వరకు మంచిర్యాల సమీపం గాంధారి ఖిల్లా, జన్నారం, లక్సెట్టిపేట మండలం వెంకట్రావుపేట్ చెరువు వద్ద బర్డ్‌వాక్, పక్షులను ప్రత్యక్షంగా చూస్తూ, శబ్దాల రికార్డింగ్, స్థానిక విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఔత్సాహికులకు అవగాహన కల్పించనున్నారు.

అందరికీ తెలియజేయాలనే..



పక్షుల జీవనాన్ని నిశితంగా గమనిస్తే మనం ఏ సీజన్‌లో ఉన్నామో తెలిసిపోతుంది. ఈ పరిశీలన అందరిలో కలగాలనే తొలిసారిగా బర్డ్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నాం. స్థానిక, వలస పక్షులు, ప్రకృతి మార్పులు, జీవ వైవిధ్యంపై విద్యార్థులు, టీచర్లు, స్వచ్ఛంద సంస్థలు, ఔత్సాహికులకు అవగాహన కల్పిస్తే భవిష్యత్తులో మరింత అధ్యయనానికి వీలు కలుగుతుంది.

– శివ్ ఆశిష్ సింగ్, జిల్లా అటవీ అధికారి, మంచిర్యాల



బొగత జలపాతం (ఫైల్)



బొగత జలపాతం ప్రస్తుతం..



నీరు లేని స్నానాల కొలను


కళ తప్పిన బొగత

జలధారలతో కళకళలాడుతూ ఆహ్లాదాన్ని పంచే ములుగు జిల్లా వాజేడు మండలం బొగత జలపాతం కళ తప్పింది. వర్షాకాలంలో జలధారలతో ప్రమాద స్థాయి దాటి ప్రవహించిన ఈ జలపాతం.. ప్రస్తుతం చుక్క నీరు లేక వెలవెలబోతోంది. బొగత జలపాతానికి పర్యాటకులు వేసవిలో కూడా తరలి వస్తుంటారు. కానీ, కొలనులోనూ నీరు లేకపోవడంతో ప్రస్తుతం పూర్తిగా రావడం లేదు.

– వాజేడు

● మీకు తెలుసా?

స్కూల్ బెల్‌కూ ఉందో చరిత్ర





ట్రింగ్‌మంటూనో, గణగణమంటూనో కొట్టే స్కూల్ బెల్ వినగానే పిల్లల్లో హుషారు మొదలవుతుంది. లాంగ్ బెల్ కొడితే ఎంచక్కా ఇంటికి వెళ్లిపోవచ్చన్న ఉత్సాహం వారిలో ఉరకలెత్తుతుంది. అయితే స్కూల్ బెల్‌కీ ఓ చరిత్ర ఉందన్న విషయం తెలుసా?

ప్రాచీన చైనాలో మొదటిసారి గంటను వాడినట్లు చరిత్రకారులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా బౌద్ధారామాల్లో గంటలను వాడి సమయాన్ని తెలిపేవారట. ఆ తర్వాత అనేక దేశాల్లో గంటల తయారీ, వాడకం మొదలైంది. 8వ శతాబ్దం నాటికి గంటల్ని రాగి, ఇత్తడి లోహాలతో తయారు చేయడం మొదలుపెట్టారు. దీని వల్ల శబ్దం గట్టిగా, దూరంగా ఉన్నవారికి సైతం వినిపించేది. అయితే ఇవన్నీ కాలాన్ని తెలపడానికే తప్ప స్కూల్ కోసం వాడినవి కాదు. 1908లో ఇండియానాలోని గ్యారీ ప్రాంతంలో స్కూళ్లకు సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న విలియం విర్ట్ మొదటిసారి స్కూల్ బెల్‌ను ప్రవేశపెట్టారు. పీరియడ్ మొదలయ్యే ముందు, పీరియడ్ అయిపోయాక గంట కొట్టడం ద్వారా ఉపాధ్యాయులు తరగతులకు వెళ్లే ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఇంటికి వెళ్లేందుకు ఇదే సిగ్నల్‌గా మారింది.

మొదట్లో స్కూళ్లలో గంటను వాడగా ఆ తర్వాత కాలంలో విద్యుత్తు బెల్స్ వచ్చాయి. దీంతో ఎక్కువ శ్రమ లేకుండా టైం ప్రకారం బెల్ మోగించడం సులువైంది. కొన్నిచోట్ల ట్రింగ్‌మనే బెల్ శబ్దం కాకుండా చక్కటి సంగీతాన్ని వినిపిస్తుంటారు. 2010లో స్కాట్‌లాండ్‌లో మ్యాకీ అకాడమీ స్కూల్ బెల్ కొట్టే పద్ధతికి స్వస్తి పలికింది. విద్యార్థులే సమయానికి తగ్గట్టు క్లాసులకు వెళ్లాలని తెలిపింది. ఇది మంచి ఫలితాలు ఇవ్వడంతో యూకేలోని అనేక స్కూళ్లు ఈ విధానాన్ని పాటించాయి. చూశారుగా! ఇదీ స్కూల్ బెల్ వెనకాల ఉన్న చరిత్ర.

అదిగో పిల్లల స్వర్గం

● వండర్ వరల్డ్



పిల్లలూ! స్వర్గమంటే అందంగా ఉంటుందని, అక్కడందరూ ఆనందంగా ఉంటారని మీరు వింటుంటారు కదా! అది ఎక్కడుంటుందో ఎవరికీ తెలియదు. అయితే భూమ్మీద పిల్లల కోసం ఏర్పాటు చేసిన స్వర్గం ఎక్కడుందో తెలుసా? డెన్మార్క్ దేశంలో. అవును! ఇక్కడున్న 'లెగోల్యాండ్'ని 'పిల్లల స్వర్గం' అని పిలుస్తారు. దీని గురించి తెలుసుకుందామా?

లెగోల్యాండ్ అనేది ఒక అమ్యూజ్‌మెంట్ పార్క్. అంటే కుటుంబమంతా కలిసి అక్కడికి వెళ్లి, ఆడిపాడి సరదాగా గడపొచ్చు. అక్కడ పిల్లల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు ఉంటాయి. వారు ఇష్టమొచ్చినంతసేపు ఆడుకోవడానికి ఎన్నెన్నో వస్తువులు బొమ్మలు ఉంటాయి. ఇక్కడికి ఒక్కసారి వచ్చిన చిన్నారులు మళ్లీ మళ్లీ రావాలి కోరుకుంటారు. అందుకే దీన్ని 'పిల్లల స్వర్గం' అని అంటుంటారు.

1968 జూన్ 7న మొదటిసారి లెగోల్యాండ్ ప్రారంభించారు. బ్రిటిష్ కంపెనీ దీన్ని నడుపుతోంది. మొదట డెన్మార్క్‌లో మొదలైన ఈ పార్క్ ఆ తర్వాత జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా, మలేషియా, దుబాయ్, ఇటలీ వంటి 11 ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. ఏర్పాటు చేసిన ప్రతిచోటా దీనికి విశేషమైన ఆదరణ రావడంతో మరో 4 చోట్ల వీటిని ప్రారంభించాలని అనుకుంటున్నారు. రెండేళ్ల నుంచి 12 ఏళ్ల వయసున్న పిల్లలు తమ తల్లిదండ్రులతో కలిసి ఇక్కడికి రావొచ్చు. ఈ పార్క్‌లో ఆర్కిటిక్ బేస్‌క్యాంప్, ఆర్కిటిక్ ఐస్ బ్రేకర్స్, అట్లాంటిస్ సీ లైఫ్, బెన్నీస్ ప్లే షిప్, కోల్స్ రాక్ క్లైంబ్, డ్రాగన్ బండి, డుప్లో ఎక్స్‌ప్రెస్, ఫైర్ బ్రిగేడ్, మాస్టర్స్ ఆఫ్ ఫ్లైట్, ఫ్లయింగ్ ఈగల్.. ఇలా లెక్కకు మిక్కిలి ఆటలు ఉంటాయి. ఎవరికి నచ్చిన అంశాన్ని వారు ఎంచుకోవచ్చు. కొన్నింటికి తప్పకుండా తల్లిదండ్రులు పిల్లలకు తోడుగా ఉండాలని నిబంధన.

కేవలం ఆటపాటలే కాకుండా వర్క్‌షాప్‌లు, సినిమా థియేటర్, గ్యాలరీ వంటివి ఇక్కడ ఉన్నాయి. దీనివల్ల పిల్లల్లో మానసిక ఎదుగదల పెంపొందుతుంది. డెన్మార్క్‌లోని లెగోల్యాండ్‌కి ఏటా 1.6 మిలియన్ల సందర్శకులు వస్తుంటారు. ప్రపంచంలో అత్యధిక మంది సందర్శించే అమ్యూజ్‌మెంట్ పార్కుల్లో ఇదీ ఒకటి. ముఖ్యంగా ఆదివారాలు, సెలవు రోజుల్లో పిల్లలు భారీగా తరలివచ్చి ఆనందిస్తుంటారు. భలే బాగుంది కదా ఈ పిల్లల స్వర్గం.





జీనియస్

14 ఏళ్ల మానవ కాలిక్యులేటర్



ఆర్యన్

పందొమ్మిదో ఎక్కం చెప్పమంటే తల గీరుకునే పిల్లలు ఉంటారు. చిన్న చిన్న కూడికలకు కాలిక్యులేటర్ వైపు చూసే వారూ ఉంటారు. ఇక పెద్ద లెక్కలంటే కాలిక్యులేటర్ కావాల్సిందే. కాని ఆర్యన్ నితిన్‌కు అది అక్కర్లేదు. ఎందుకంటే అతడే ఒక కాలిక్యులేటర్. అతని వయసు 14 ఏళ్లు. ఎంత పెద్ద నెంబర్లతో లెక్కలు ఇచ్చినా సరే అవలీలగా చేసేస్తాడు.

ఆర్యన్‌ది మహారాష్ట్ర. ఆరేళ్ల వయసు నుంచే మనసులో లెక్కలు వేయడం, సమాధానాలు కనుక్కోవడం చేసేవాడు. అతని ఉత్సాహం చూసి తల్లిదండ్రులు ప్రోత్సహించారు. ఆర్యన్ రోజూ ఐదారు గంటలపాటు కష్టమైన లెక్కలు సాధన చేసేవాడు. ఎవరు ఎంత పెద్ద లెక్క చెప్పినా మనసులోనే చేసి, టక్కున సమాధానం చెప్పేవాడు. దీంతో అతని ప్రతిభ గురించి అందరికీ తెలిసింది. 2021లో 'మైండ్ స్పోర్ట్ ఒలింపియాడ్ మెంటల్ కాలిక్యులేషన్' వరల్డ్ ఛాంపియన్‌షిప్ సాధించి, ఆ ఘనత పొందిన అతి చిన్న వయస్కుడిగా నిలిచాడు. 2022లో జర్మనీలో జరిగిన మెంటల్ కాలిక్యులేషన్ వరల్డ్ కప్‌లో పాల్గొని మొదటి స్థానంలో నిలిచాడు. అంత చిన్నవయసులో ఆ ఘనత సాధించిన వ్యక్తిగా నిలిచిపోయాడు. దీంతో గ్లోబల్ మెంటల్ కాలిక్యులేటర్స్ అసోసియేషన్(జీఎంసీఏ)లో అతణ్ని ఫౌండింగ్ బోర్డు సభ్యుడిగా చేర్చుకున్నారు. ఆ తర్వాత అనేక ప్రపంచ వేదికలపై తన సత్తా చాటాడు.

గిన్నిస్ ప్రపంచ రికార్డు సాధించాలన్న ఆకాంక్షతో దుబాయ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఒకటి, రెండు కాదు.. ఒకేరోజు ఆరు ప్రపంచ రికార్డులను అతను సాధించాడు. 30.9 సెకండ్లలో 100 నాలుగు అంకెల నెంబర్లను కలిపి సమాధానం చెప్పడం, ఒక నిమిషం 9.68 సెకండ్లలో 200 నాలుగు అంకెల నెంబర్లను కలిపి సమాధానం చెప్పడం, 18.71 సెకండ్లలో 50 ఐదు అంకెల నెంబర్లను కలిపి సమాధానం చెప్పడం.. ఇలా అతను చేసిన మేథోవిన్యాసాలు చూసి గిన్నిస్ ప్రతినిధులు ఆశ్చర్యపోయారు. 2024లో మరోసారి మెంటల్ కాలిక్యులేషన్ వరల్డ్ కప్‌లో మొదటిస్థానంలో నిలిచాడు. క్రమం తప్పకుండా రోజూ సాధన చేస్తే ఎలాంటి కష్టమైన విషయమైనా మన సాధించగలమని, మొదలుపెట్టిన పనిని పూర్తి చేసే వదలకూడదని అంటున్నాడు ఆర్యన్.



● మహనీయులు


ఆనందీ గోపాల్ జోషి

మన దేశానికి తొలి డాక్టరమ్మ

పిల్లలూ! డాక్టర్ చదువు చదవడం కష్టం. ఎక్కువ మందికి సీటు రాదు. ఇప్పుడే ఇలా ఉంటే పాత రోజుల్లో ఎలా ఉండేది? అసలు డాక్టర్ చదవడం ఆడవాళ్లు చేయకూడదని అనేవారట. ఈ రూల్‌ను ఒక మహిళ బ్రేక్ చేసింది. మన దేశ మొదటి మహిళా డాక్టర్‌గా చరిత్ర సృష్టించింది. ఆమె పేరు ఆనందీ గోపాల్ జోషి. ఆమె 1865 మార్చి 31న అప్పటి బొంబాయి ప్రాంతంలోని కల్యాణ్‌లో జన్మించారు. ఆమె అసలు పేరు 'యమున'. గోపాల్‌రావ్ జోషీతో పెళ్లయ్యాక ఆమె పేరు 'ఆనందీ గోపాల్ జోషీ'గా మార్చుకున్నారు.

14 ఏళ్ల వయసులో ఆనందీగోపాల్‌కు ఓ బాబు పుట్టాడు. అయితే అనారోగ్యం కారణంగా కేవలం 10 రోజుల్లోనే మరణించాడు. దీంతో ఆమె చాలా ఆవేదన చెందింది. తనకే వైద్యం వస్తే కొడుకును బతికించుకునేదాన్ని కదా అనుకుంది. అలా వైద్యురాలు కావాలన్న ఆలోచన ఆమెలో మొదలైంది. మహిళలకు వైద్యసేవలందించేందుకు మహిళా వైద్యుల అవసరం ఎంతో ఉందని, ముఖ్యంగా భారతదేశంలోని స్త్రీల ఆరోగ్య సమస్యలు తీరాలంటే మహిళా వైద్యులు పెరగాలని ఆమె భావించింది.

థియొడిసియా కార్పెంటర్ అనే అమెరికన్ సాయంతో ఆమె అమెరికాలో చదివే అవకాశం పొందింది. ఓడ మార్గంలో 1883లో అమెరికా వెళ్లింది. 18 ఏళ్ల వయసులో వైద్యవిద్య చదవడం ప్రారంభించింది. ఆమె ఉత్సాహం, పట్టుదల చూసి అక్కడి ప్రొఫెసర్లు ఆశ్చర్యపోయేవారు. అయితే ఆ దేశ వాతావరణం ఆమెకు సరిపడక క్షయవ్యాధి ఇబ్బందిపెట్టింది. అయినా ఏమాత్రం అధైర్యపడక, విజయవంతంగా ఎండీ కోర్సు పూర్తి చేసి 1886లో భారతదేశానికి తిరిగి వచ్చింది. కొల్హాపూర్ సంస్థానంలోని అల్బర్ట్ ఎడ్వర్డ్ ఆసుపత్రిలోని స్త్రీల వార్డుకు ఆమెను ఇన్‌ఛార్జిగా నియమించారు. 1887లో ఆమెకు మరోసారి క్షయ వ్యాధి వచ్చింది. దీనివల్ల బలహీనంగా మారిపోయింది. అమెరికా నుంచి మందులు తెచ్చి వాడినా ఆరోగ్యం కుదుటపడలేదు. దీంతో ఫిబ్రవరి 26న 21 ఏళ్ల వయసులోనే కన్నుమూసింది.

దేశంలో తొలి మహిళా వైద్యురాలిగా, విదేశాలకు వెళ్లి వైద్యవిద్య చదువుకున్న తొలి భారతీయ మహిళగా నేటికీ ఆమె గురించి గొప్పగా చెప్పుకుంటారు. ఎన్ని కష్టాలు వచ్చినా అనుకున్నది సాధించిన ఆమె పట్టుదలను గుర్తించి మీరూ స్ఫూర్తి పొందాలి.

● కథ

కష్టే ఫలి

ఒక గ్రామంలో రామయ్య అనే రైతు ఉండేవాడు. అతనికి ఉన్న ఏకైక ఆస్తి చిన్న పొలమూ, ఒక ఎద్దూ మాత్రమే. ప్రతీ ఏడూ అతను కష్టపడి పంట వేసినా, ఆదాయం తక్కువే. ఒకసారి కురిసిన వర్షాల వల్ల అతని పొలం పూర్తిగా నాశనమైంది. అప్పుల బారిన పడిన రామయ్యకు ఇక తన ఎద్దును అమ్ముకోవడం తప్ప మరో మార్గం లేకుండా పోయింది. గ్రామస్థులు కూడా 'ఇక నువ్వు సేద్యం చేయలేవు. నీ పొలం పాడైంది. నువ్వు బతకాలంటే ఎద్దును అమ్ముకోవాల్సిందే. లేదంటే దానికి గడ్డి దండగ' అని అన్నారు.




అయితే రామయ్య నిరాశపడలేదు. ఇంత కాలం సేద్యంలో తనకు సాయంగా ఉన్న ఎద్దును అమ్ముకోలేదు. అతడు తన కష్టాల నుంచి బయటపడాలనుకున్నాడు. కొత్త ఆలోచన చేశాడు. ఎద్దును అమ్మకుండా కూలి మాట్లాడుకుని తన ఎద్దుతో గ్రామంలోని ఇతర రైతుల పొలాలను దున్నడం ప్రారంభించాడు. కష్టపడి పని చేయడంతో కొద్దికాలంలోనే అతనికి మంచి ఆదాయం రావడం మొదలైంది. అతని ఆలోచన చూసి అందరూ ఆశ్చర్యపోయారు. కొంతకాలానికి అతను కొత్త ఎద్దులు కొని పెద్ద వ్యవసాయాన్ని తిరిగి మొదలెట్టాడు.

పాఠం:

ప్రతీ సమస్య వెనుక ఒక కొత్త అవకాశం ఉంటుంది. దాన్ని గుర్తించగలిగితే, జీవితం మారిపోతుంది!

● మన సినిమా

ది వైల్డ్ రోబోట్ ఎ ఫ్రెండ్లీ రోబో



కిడ్స్... మీకు సూపర్ ఇంటెలిజెంట్ రోబో దొరికితే ఏం చేస్తారు? మీరేం చేస్తారో కాని ఈ సినిమాలోని మనుషులు, జంతువులు మాత్రం అలాంటి రోబోతో ఫ్రెండ్ షిప్ చేస్తారు. నమ్మడం లేదా? అయితే మిగతాది చదివేయండి. ఓ సూపర్ ఇంటెల్లిజెంట్ రోబో ఒక షిప్ నుంచి పొరపాటున ఒక దీవిలోని అడవిలో పడిపోతుంది. ఆ రోబో పేరు రోజ్. ఆ అడవి చాలా దట్టంగా ఉండి బోలెడన్ని క్రూరమృగాలతో నిండి ఉంటుంది. రోజ్ ఏమో మెషీన్. అక్కడున్నవేమో భయంకర జంతవులు. ఇంకెలా ఉంటుందో ఆలోచించండి. ఇంతలో రోజ్ ముందు ఓ చిన్న ఎగ్ షెల్ నుండి ఓ బర్డ్ బయటకు వస్తుంది. ఆ బర్డ్‌ని రక్షించే టైంలో బర్డ్ మదర్ చనిపోతుంది. కాని ఆ బర్డ్‌ని రోజ్ ఫ్లింక్ అనే ఫాక్స్ నుండి కాపాడుతుంది. రోజ్ ఆ బర్డ్‌కి బ్రైట్ బిల్ అని పేరు పెడుతుంది. రోజ్ బ్రైట్ బిల్, ఫ్లింక్ అలాగే ఆ ఫారెస్ట్‌లో ఉన్న యానిమల్స్ అన్నిటితోనూ మాట్లాడడానికి తనను తాను అప్ గ్రేడ్ చేసుకుని వాటి లాంగ్వేజస్‌తో కాన్ఫిగర్ చేసుకుంటుంది. ఇక అప్పటి నుండి రోజ్ బ్రైట్ బిల్‌ని చక్కగా పెంచుతుంది. బ్రైట్ బిల్ బాగా ఎగరడానికి కోచింగ్ ఇస్తూ ఉంటుంది. కాని ఓ టైంలో బ్రైట్ బిల్‌కి తన మదర్ చనిపోవడానికి గల కారణం రోజ్ అని తెలుస్తుంది. అప్పుడు బ్రైట్ బిల్ రోజ్‌తో ఏమంటుంది, రోజ్ ఎలా ఫీలవుతుంది. ఇవన్నీ విషయాలు మీకు తెలియాలంటే 'ది వైల్డ్ రోబోట్' మూవీ చూడాల్సిందే. రోబో రోజ్ చేసే స్టంట్స్ సూపర్‌గా ఉంటాయి. మస్ట్ వాచ్ మూవీ కిడ్స్.

- ఇంటూరు హరికృష్ణ

బిజినెస్ రీల్

రెండు వారాల కనిష్టానికి పసిడి

- న్యూఢిల్లీ మార్కెట్లో రూ. 500 డౌన్; రూ. 87,700కు చేరిక
- రూ. 96,400కి వెండి



న్యూఢిల్లీ: ఆభరణాల వ్యాపారుల నుంచి కొనుగోళ్లు తగ్గడం, ఇన్వెస్టర్లు అమ్మకాలకు దిగడంతో బంగారం ధరలు రెండు వారాల కనిష్ఠ స్థాయికి తగ్గాయి. న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో పది గ్రాముల రేటు రూ. 500 తగ్గి రూ. 87,700కి చేరినట్లు ఆలిండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. 99.5 శాతం స్వచ్ఛత గల పసిడి ధర రూ. 87,300కి పరిమితమైంది. ఈ ఏడాది ఇప్పటివరకు బంగారం ధర దాదాపు రూ. 8,310 మేర (సుమారు 10.5%) పెరిగింది. జనవరి 1న 10 గ్రాముల రేటు రూ. 79,390గా ఉండగా తాజాగా 87,700 స్థాయిలో ఉంది. మరోవైపు, వెండి కూడా వరుసగా మూడో రోజు నష్టపోయింది. కేజీ ధర రూ. 2,100 మేర క్షీణించి రెండు వారాల కనిష్ఠమైన రూ. 96,400కి దిగి వచ్చింది.

పీఎఫ్ డిపాజిట్లపై వడ్డీ రేటు యథాతథం

2024-25కి 8.25 శాతం కొనసాగించాలని సెంట్రల్ బోర్డు నిర్ణయం



న్యూఢిల్లీ: క్రితం ఆర్థిక సంవత్సరం తరహాలోనే 2024-25లో కూడా ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్) డిపాజిట్లపై వడ్డీ రేటును యథాతథంగా 8.25 శాతంగా కొనసాగించాలని ఈపీఎఫ్‌వో నిర్ణయించింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ ఈ మేరకు సిఫార్సు చేసినట్లు కార్మిక శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. దీన్ని ప్రభుత్వం అధికారికంగా నోటిఫై చేసిన తర్వాత సబ్‌స్క్రయిబర్స్ ఖాతాల్లోకి ఈపీఎఫ్‌వో వడ్డీని జమ చేస్తుందని వివరించింది. చాలా మటుకు ఇతర ఫిక్స్‌డ్ ఇన్‌కం సాధనాలతో పోలిస్తే ఈపీఎఫ్ స్థిరమైన, అధిక రాబడులను అందిస్తోందని పేర్కొంది. దీనితో ఏడు కోట్ల మంది పైగా చందాదారులకు ప్రయోజనం చేకూర్చనుంది. 2023-24లో 8.15 శాతంగా ఉన్న వార్షిక వడ్డీరేటును 2024 ఫిబ్రవరిలో 8.25 శాతానికి పెంచారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

1-3-2025	
విశాఖ	482-00
చిత్తూరు	493-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	480-00
విజయవాడ	485-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	445-00
వరంగల్	447-00
రిటైల్ ధర	5.05

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SHRIRAMFIN	619	2.01
HDFCBANK	1,730.15	1.73
COALINDIA	368.5	1.28
TRENT	4,838.65	0.69
HINDALCO	634	0.32

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INDUSINDBK	972.3	-7.11
TECHM	1,485.95	-6.44
WIPRO	278.5	-5.43
BHARTIARTL	1,569.10	-4.93
M&M	2,595.00	-4.82

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	5,485
ఎన్‌ఎస్‌ఈ	1,53,464
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	1,85,885
ఎఫ్ఐఐ	- 11,639
డీఐఐ	+ 12,309

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	69.72 (రాత్రి 11.30కు)	$ 70.35 (క్రితం ముగింపు)
బ్రెంట్	72.76 (రాత్రి 11.30కు)	$ 73.57 (క్రితం ముగింపు)

సెబీ చైర్మన్‌గా తుహిన్ పాండే

- ఆర్థిక శాఖ కార్యదర్శికి తాజా బాధ్యతలు
- ముగిసిన మాధవీ పురీ బచ్ పదవీ కాలం

న్యూఢిల్లీ: ఆర్థిక శాఖ కార్యదర్శి తుహిన్ కాంత పాండే క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి కొత్త చైర్మన్‌గా ఎంపికయ్యారు. పెట్టుబడులు, ప్రజా ఆస్తుల నిర్వహణ శాఖ(దీపమ్) కార్యదర్శిగా దీర్ఘకాలంపాటు పనిచేసిన పాండే సెబీకి 11వ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. తొలిసారి ప్రయివేట్ రంగంనుంచి ఎంపికైన ప్రస్తుత చైర్‌పర్సన్ మాధవీ పురీ బచ్ మూడేళ్ల పదవీ కాలం శుక్రవారం(ఫిబ్రవరి 28)తో ముగియడంతో 59 ఏళ్ల పాండేకు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. ఒడిషా కేడర్ 1987 బ్యాచ్ ఐఏఎస్ ఆఫీసర్ పాండేకు కేబినెట్ అపాయిట్‌మెంట్ల కమిటీ ఆమోదముద్ర వేసింది. తొలుత మూడేళ్లపాటు సెబీ చైర్మన్‌గా పాండే పనిచేయనున్నారు. కాగా.. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల(ఎఫ్‌పీఐలు) భారీ అమ్మకాల కారణంగా దేశీ స్టాక్ మార్కెట్లు పతన బాట(బేర్ ట్రెండ్)లో సాగుతున్న నేపథ్యంలో పాండే సెబీకి సారథ్యం వహించనుండటం గమనార్హం! ఆర్థిక శాఖలో అత్యంత సీనియర్ పాండే రెవెన్యూ శాఖలోనూ కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆర్థిక శాఖలోని దీపమ్ కార్యదర్శిగా పాండే పీఎస్‌యూలలో ప్రభుత్వ ఈక్విటీల నిర్వహణతోపాటు.. డీపీఈని సైతం నడిపిస్తున్నారు. రెవెన్యూ కార్యదర్శి సంజయ్



మల్హోత్రా ఆర్‌బీఐ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టడంతో జనవరిలో పాండే అదనపు బాధ్యతలను స్వీకరించిన విషయం విదితమే.

కీలక పాత్రలు

మధ్యతరగతికి భారీస్థాయిలో ఆదాయ పన్ను ఉపశమనాన్ని కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్ నిర్మాణంలో పాండే కీలక పాత్ర పోషించారు. 1961 పన్ను చట్టాన్ని సవరిస్తూ తీసుకువచ్చిన కొత్త ఆదాయపన్ను బిల్లును రూపొందించడంలోనూ పాలుపంచుకున్నారు. దీపమ్‌కు పనిచేసిన ఐదేళ్ల(2019 అక్టోబర్- 2025 జనవరి 8) కాలంలో పాండే పీఎస్‌ఈ విధానాలను అమలు చేస్తూ సీపీఎస్‌ఈలలో వాటా విక్రయాన్ని(డిజిన్వెస్ట్‌మెంట్) ముందుకు తీసుకువెళ్లారు. విమానయాన దిగ్గజం ఎయిరిండియా ప్రయివేటైజేషన్, ఎల్ఐసీ లిస్టింగ్‌లోనూ సహకారమందించారు. 2021 అక్టోబర్8న రూ. 18,000 కోట్ల బిడ్‌తో ఎయిరిండియాను టాటా గ్రూప్ గెలుచుకుంది. 2022 మే నెలలో పీఎస్‌యూ దిగ్గజం ఎల్ఐసీ స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యింది. ప్రస్తుతం ప్రాసెస్‌లో ఉన్న ఐడీబీఐ బ్యాంక్ ప్రయివేటైజేషన్‌నూ పర్యవేక్షించారు.

బ్యాక్‌గ్రౌండ్..

పాండే పంజాబ్ యూనివర్శిటీ(చండీగఢ్) నుంచి ఎకనమిక్స్‌లో ఎంఏ చేశారు. బర్మింగ్‌హామ్ యూనివర్శిటీ(యూకే)లో ఎంబీఏ పూర్తి చేశారు. ఒడిషా ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వాలలో వివిధ స్థాయిలలో పనిచేశారు. కెరీర్ తొలినాళ్లలో ఆరోగ్యం, సాధారణ పాలన, వాణిజ్య పన్నులు, రవాణ, ఫైనాన్స్ శాఖలకు పాలనాధికారిగా వ్యవహరించారు. ఒడిషా రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్‌కు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా, ఒడిషా చిన్నతరహా పరిశ్రమల కార్పొరేషన్ ఎండీగా బాధ్యతలు నిర్వర్తించారు. కేంద్ర ప్రభుత్వంలో ప్లానింగ్ కమిషన్(నితి ఆయోగ్), కేబినెట్ సెక్రటేరియట్ సంయుక్త కార్యదర్శిగా, వాణిజ్య శాఖ డిప్యూటీ సెక్రటరీగా విధులు నిర్వహించారు.

రోజుకు రూ.99,835 కోట్లు

- లావాదేవీల సంఖ్య 60 కోట్లకు
- యూపీఐ.. సరికొత్త రికార్డులు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ఆధారిత డిజిటల్ చెల్లింపులు ఎప్పటికప్పుడు దూసుకెళ్తున్నాయి. లావాదేవీల విలువ, పరిమాణం విషయంలో 2025 ఫిబ్రవరి 1 సరికొత్త రికార్డు సృష్టించింది. ఏకంగా రూ.99,835 కోట్ల విలువైన లావాదేవీలు నమోదయ్యాయి. లావాదేవీల సంఖ్య 60 కోట్లు దాటింది. యూపీఐ వ్యవస్థలో ఇదే రికార్డు. గత రికార్డులు చూస్తే లావాదేవీల విలువ 2025 జనవరి 2న అత్యధికంగా రూ.94,429 కోట్లు, లావాదేవీల సంఖ్య జనవరి 10న 57.8 కోట్లు నమోదైంది. ఫిబ్రవరి 1-25 మధ్య రూ.19,60,263 కోట్ల విలువైన 1439.8 కోట్ల లావాదేవీలు జరిగాయి.

లావాదేవీలు 'తక్కువేం' కాదు..

2023-24లో యూపీఐ లావాదేవీల విలువ రూ.200 లక్షల కోట్లు దాటింది. లావాదేవీల సంఖ్య 13,100 కోట్ల పైచిలుకు ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జనవరి మధ్య వ్యక్తుల నుంచి వర్తకులకు జరిగిన లావాదేవీల వాటా 62.35 శాతం. వ్యక్తుల మధ్య జరిగినవి 37.75 శాతం ఉన్నాయి. వ్యక్తుల నుంచి వర్తకుల మధ్య జరిగిన



యూపీఐ జోరు ఇదీ..

నెల	విలువ (రూ. కోట్లలో)	లావాదేవీల సంఖ్య (కోట్లలో)
2025 జనవరి	23,48,037	1,699
2024 డిసెంబర్	23,24,700	1,673
2024 జనవరి	18,41,084	1,220

లావాదేవీల్లో రూ.500 లోపు విలువ చేసేవి ఏకంగా 86 శాతం నమోదయ్యాయి. ఇక మొత్తం రిటైల్ చెల్లింపుల్లో యూపీఐ వాటా 80 శాతానికి చేరిందని ఆర్థిక శాఖ ప్రకటించింది. 2025 జనవరి నాటికి 641 బ్యాంకులు, 80కిపైగా యాప్స్ యూపీఐ సేవలు అందించాయి.

ఫోన్‌పే అగ్రస్థానంలో..

యూపీఐ విభాగంలో ఫోన్‌పే తొలి స్థానంలో దూసుకుపోతోంది. 2025 జనవరిలో రూ.11,91,304 కోట్ల విలువైన 810 కోట్ల లావాదేవీలను సాధించింది. గూగుల్‌పే రూ.8,26,845 కోట్ల విలువైన 618 కోట్ల లావాదేవీలతో రెండవ స్థానంలో కొనసాగుతోంది. రూ.1,26,313 కోట్ల విలువైన 115 కోట్ల లావాదేవీలతో పేటీఎం మూడవ స్థానంలో నిలిచింది. లావాదేవీల విలువ పరంగా క్రెడ్, ఐసీఐసీఐ బ్యాంక్ యాప్స్, నవీ, గ్రో, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ యాప్స్, అమెజాన్ పే, భీమ్ యాప్స్ తర్వాతి స్థానాల్లో పోటీపడుతున్నాయి.

జనవరిలో ఇలా..

2025 జనవరిలో నమోదైన రూ.23,48,037 కోట్లలో వ్యక్తుల మధ్య జరిగిన లావాదేవీలు 73 శాతం. వ్యక్తుల నుంచి వర్తకులకు జరిగినవి 27 శాతం. విలువ పరంగా వ్యక్తుల నుంచి వ్యక్తులకు రూ.2,000లకుపైగా విలువ చేసే లావాదేవీల వాటా 87 శాతం ఉంది. రూ.501-2,000 మధ్య 10%, రూ.500 లోపు 3% నమోదయ్యాయి. వ్యక్తుల నుంచి వర్తకులకు రూ.2,000పైగా విలువ చేసే లావాదేవీలు 67 శాతం, రూ.501-2,000 మధ్య 17 శాతం, రూ.500 లోపు 16 శాతం ఉన్నాయి. ఇక లావాదేవీల సంఖ్య పరంగా వ్యక్తుల నుంచి వర్తకులకు 62 శాతం, వ్యక్తుల మధ్య 38 శాతం నమోదయ్యాయి. వ్యక్తుల నుంచి వర్తకుల మధ్య రూ.500 లోపు విలువ చేసే లావాదేవీల వాటా ఏకంగా 86 శాతం ఉంది. రూ.501-2,000 మధ్య 10 శాతం, రూ.2,000పైన 4 శాతం ఉన్నాయి.

మెరుగుపడిన మౌలికం

జనవరిలో 4.6 శాతానికి పెరిగిన ఉత్పత్తి



న్యూఢిల్లీ: మౌలిక రంగం ఈ ఏడాది జనవరి నెలలో బలమైన పనితీరు చూపించింది. ఎనిమిది మౌలిక రంగాల ఉత్పత్తి జనవరిలో 4.6 శాతంగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే నెలలో ఇది 4.2 శాతంగా ఉంది. కాకపోతే 2024 డిసెంబర్ నెలలో నమోదైన 4.8 శాతంతో పోల్చితే పనితీరు కాస్త నిదానించినట్టు కనిపిస్తోంది.

- ముడి చమురు, సహజ వాయువు ఉత్పత్తి క్రితం ఏడాది జనవరి నెల గణాంకాలతో పోల్చి చూస్తే తగ్గింది. బొగ్గు ఉత్తత్తి 4.6 శాతానికి పడిపోయింది. 2024 జనవరిలో ఇది 3.7 శాతంగా ఉంది. స్టీల్ ఉత్పత్తి వార్షికంగా చూస్తే 9.2 శాతం నుంచి 3.7 శాతానికి క్షీణించింది. విద్యుదుత్పత్తి 1.3 శాతంగా నమోదైంది. 2024 జనవరి నెలకు ఇది 5.7 శాతంగా ఉంది. రిఫైనరీ ఉత్పత్తి 8.3 శాతం, ఎరువుల ఉత్పత్తి 3 శాతం, సిమెంట్ ఉత్పత్తి 14.5 శాతానికి పుంజుకున్నది.
- ఈ ఏడాది 10 నెలల కాలంలో (2024 ఏప్రిల్-2025 జనవరి) 8మౌలిక రంగాల ఉత్పత్తి క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న 7.8% నుంచి 4.4 శాతానికి క్షీణించింది.

స్కైప్‌కి మైక్రోసాఫ్ట్ గుడ్‌బై



న్యూయార్క్: వీడియో కాలింగ్‌కు పర్యాయ పదంగా మారిన స్కైప్ యాప్‌ను మైక్రోసాఫ్ట్ మూసివేస్తోంది.. స్కైప్ వినియోగదారులను ఇక కొత్త యాప్ టీమ్స్‌కి మళ్లించనున్నట్లు కంపెనీ తెలిపింది. 2025 మే నెల నుంచి స్కైప్ యాప్ వినియోగదారులకు అందుబాటులో ఉండదు.. స్కైప్‌నకు బదులుగా టీమ్స్ ద్వారా వీడియో కాలింగ్ సేవలు అందుబాటులో ఉంటాయని వెల్లడించింది.

డీమ్యాట్ నామినీలకు దన్ను

సెబీ మార్గదర్శకాలలో సవరణలు



న్యూఢిల్లీ: డీమ్యాట్ ఖాతాలు, మ్యూచువల్ ఫండ్ పోర్ట్‌ఫోలియోలకు నామినీలను పేర్కొనే విషయంలో నిబంధనలను క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ సవరించింది. ఆస్తుల బదిలీ, నామినీ సులభతర ఎంపికకు వీలుగా మార్గదర్శకాలను సవరిస్తూ తాజాగా సర్క్యులర్ జారీ చేసింది. వెరసి సెక్యూరిటీల మార్కెట్లలో నామినేషన్ సౌకర్యంపై అవసరమైన స్పష్టతను కల్పించింది. ఒక వ్యక్తి లేదా సంయుక్త ఖాతాదారులలో ఒకరు మరణిస్తే ఆస్తుల బదిలీని అదనపు కేవైసీ అవసరంలేకుండా రెండవ వ్యక్తికి బదిలీ చేసేందుకు దారి ఏర్పాటు చేసింది. ముందస్తుగానే కేవైసీ ఇచ్చి ఉంటే వీటి అవసరం ఉండదు. ఖాతాదారులలో జీవించి ఉన్న వ్యక్తి ఏ సమయంలోనైనా కాంటాక్టు వివరాలు, నామినీ మార్పు వంటివి చేపట్టవచ్చు. ఈ బాటలో ఫిజికల్‌గా ఖాతా నిర్వహించేలేని వ్యక్తులు, ఎన్‌ఆర్ఐలకు సంబంధించి సైతం మార్పులు ప్రవేశపెట్టింది. తాజా సవరణలు 2025 మార్చి1 నుంచి మూడు దశలలో అమలుకానున్నాయి. సవరించిన మరి కొన్ని నిబంధనలు జూన్1 నుంచి, పూర్తి నిబంధనలు సెప్టెంబర్ 1నుంచి వర్తించనున్నాయి.

పని వేళలు కాదు.. నాణ్యత ముఖ్యం..

రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ చైర్మన్ ఆకాశ్ అంబానీ వ్యాఖ్య



ముంబై: ఆఫీసులో ఎన్ని గంటలు పని చేశామన్నది కాదు.. ప్రతి రోజు ఎంత నాణ్యమైన పని చేశామనేదే తనకు ముఖ్యమని రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ చైర్మన్ ఆకాశ్ అంబానీ వ్యాఖ్యానించారు. తనకు పని, కుటుంబం రెండూ ప్రాధాన్యతాంశాలేనని ముంబై టెక్ వీక్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన చెప్పారు. ప్రతి ఒక్కరు జీవితంలో తమ తమ ప్రాధాన్యతలను గుర్తెరిగి వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. వారానికి 90 గంటల వరకు పని చేయాలంటూ కొందరు, 50 గంటలలోపు చాలంటూ మరికొందరు కార్పొరేట్లు అభిప్రాయపడుతున్న నేపథ్యంలో ఆకాశ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విషయంలో మార్గనిర్దేశం చేసేందుకు తమ కంపెనీ 1,000 మంది డేటా సైంటిస్టులు, పరిశోధకులు, ఇంజినీర్ల బృందాన్ని ఏర్పాటు చేసుకుందని అంబానీ చెప్పారు. జామ్‌నగర్‌లో 1 గిగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అలాగే, గ్రాఫిక్ ప్రాసెసింగ్ యూనిట్లను (జీపీయూ) సరీగ్గాసుగా అందించే అవకాశాలను కూడా పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

ప్రైవేటు ఆసుపత్రులు రూ.11,500 కోట్ల పెట్టుబడి

- తోడవనున్న 4,000 పడకలు
- క్రిసిల్ రేటింగ్స్ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: ప్రైవేటు రంగంలో ఉన్న ఆసుపత్రులు వచ్చే ఆర్థిక సంవత్సరంలో 4,000 పడకలను జోడించనున్నాయి. ఇందుకు సుమారు రూ.11,500 కోట్లు పెట్టుబడి పెట్టాలని యోచిస్తున్నాయని క్రిసిల్ రేటింగ్స్ తెలిపింది. గత ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ.64,000 కోట్ల ఆదాయం నమోదు చేసిన 91 ప్రైవేట్ ఆసుపత్రులను విశ్లేషించినట్టు వెల్లడించింది. 'ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ సంస్థలు దాదాపు 6,000 బెడ్స్‌ను జోడించాయి. ఈ రెండు ఆర్థిక సంవత్సరాల్లో జోడిస్తున్న పడకలు 2020-2024 మధ్య తోడైన వాటికి సమానంగా ఉంటుంది. ఆక్యుపెన్సీ 65-70 శాతం గరిష్ఠ స్థాయికి చేరుకోవడం, నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ కోసం నిరంతర డిమాండ్.. వెరశి ప్రైవేట్ ఆసుపత్రులు ప్రస్తుత, వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.25,000 కోట్లు పెట్టుబడి పెడుతున్నాయి. గత నాలుగు ఆర్థిక సంవత్సరాలలో సగటు వార్షిక పెట్టుబడి కంటే ఇది దాదాపు 80 శాతం అధికం' అని నివేదిక తెలిపింది.

అంతర్గత వనరుల ద్వారా..

మూలధన వ్యయంలో దాదాపు నాలుగింట మూడు వంతులు అంతర్గత వనరుల ద్వారా ఆసుపత్రులు సమకూరుస్తున్నాయి. అంతేకాకుండా మెరుగైన రాబడుల కారణంగా 2022 ఆర్థిక సంవత్సరం నుండి ప్రైవేట్ ఈక్విటీ, ఈక్విటీ మార్కెట్ల నుండి గణనీయంగా రూ.55,000-60,000 కోట్ల పెట్టుబడిని ఆకర్షించాయి. కొత్త పడకలలో సగం నూతన ఆసుపత్రుల ఏర్పాటు ద్వారా సమకూరనున్నాయి. కొత్త ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలలో గణనీయ పెట్టుబడికి ఇది నిదర్శనం. ఇప్పటికే ఉన్న ఆసుపత్రుల అభివృద్ధి కారణంగా దాదాపు 40 శాతం పడకలు తోడు కానున్నాయి. ప్రస్తుత సౌకర్యాలను ఆధునీకరించడం, మెరుగుపర్చడంపై సంస్థలు దృష్టి సారిస్తాయి. నిర్మాణంలో ఉన్న, చిన్న, మధ్య తరహా ఆసుపత్రులను పెద్ద కంపెనీలు స్వాధీనం చేసుకోవడం ద్వారా మిగిలిన 10 శాతం పడకలు జతకానున్నాయని క్రిసిల్ రేటింగ్స్ వెల్లడించింది.

బలమైన పనితీరు..

వైద్య రంగం ఆదాయంలో ప్రైవేట్ ఆసుపత్రుల వాటా 63 శాతం. 2020-2024 ఆర్థిక సంవత్సరాల్లో ప్రైవేట్ ఆసుపత్రులు ఆదాయంలో 18 శాతం సగటు వార్షిక వృద్ధి రేటును, 18 శాతం ఆరోగ్యకర నిర్వహణ లాభాలను సాధించాయి. ఇది బలమైన నగదు ప్రవాహాన్ని నిర్ధారిస్తుంది. అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాలతో పోలిస్తే భారతదేశంలో ఆసుపత్రుల బలమైన పనితీరు, తలసరి పడకల సామర్థ్యం తక్కువగా ఉండటంతో ప్రైవేట్ ఈక్విటీ, ఐపీవోల ద్వారా గణనీయంగా పెట్టుబడులు పెరిగాయి. ఇది బ్యాలెన్స్ షీట్లను బలోపేతం చేసింది. ఆసుపత్రులు వాటి క్రెడిట్ ప్రొఫైల్స్‌ను భౌతికంగా ప్రభావితం చేయకుండా ప్రతిష్ఠాత్మకంగా పడకల జోడింపును కొనసాగించడానికి వీలు కల్పించిందని నివేదిక వివరించింది.

ఏటా 7.8 శాతం వృద్ధి అవసరం

- వచ్చే 22 ఏళ్ల పాటు కొనసాగాలి
- సంస్కరణలు, ఉపాధి కల్పన చేపట్టాలి
- అప్పుడే 2047 నాటికి అధిక ఆదాయ దేశం
- భారత్‌పై ప్రపంచబ్యాంక్ నివేదిక

న్యూఢిల్లీ: భారత్ అధిక ఆదాయ దేశంగా 2047 నాటికి (అభివృద్ధి చెందిన దేశం) అవతరించాలంటే ఏటా 7.8 శాతం సగటు వృద్ధిని, వచ్చే 22 ఏళ్ల పాటు సాధించాల్సి ఉంటుందని ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది. ఇందుకు గాను ఆర్థిక రంగ, భూమి, కార్మిక మార్కెట్‌కు సంబంధించి సంస్కరణలు చేపట్టాల్సి ఉంటుందని విశ్లేషించింది. ఈ మేరకు ఒక నివేదికను విడుదల చేసింది. భారత్ 2000 నుంచి 2024 మధ్య కాలంలో వృద్ధిని సగటున 6.3 శాతానికి వేగవంతం చేసుకుందంటూ.. గత విజయాలు భవిష్యత్తు లక్ష్యాలకు మద్దతుగా నిలుస్తాయని పేర్కొంది. "2047 నాటికి అధిక ఆదాయ దేశంగా అవతరించాలన్న ప్రతిష్ఠాత్మక లక్ష్యం ఎప్పటి మాదిరే సాధారణ పనితీరుతో సాధ్యపడదు. తలసరి ఆదాయం ప్రస్తుత స్థాయి నుంచి ఎనిమిది రెట్లు వృద్ధి చెందాలి. అందుకోసం వృద్ధి మరింత వేగాన్ని అందుకుని, వచ్చే రెండు దశాబ్దాల పాటు స్థిరంగా కొనసాగాలి. అలాగే, ప్రస్తుతం అమలు చేస్తున్న చర్యలు సరిపోవు. సంస్కరణలను మరింత విస్తరించడంతోపాటు, వేగవంతం చేయాలి. అప్పుడే 2047 నాటికి అధిక ఆదాయ దేశంగా భారత్ మారుతుంది"అని ప్రపంచబ్యాంక్ నివేదిక సూచించింది. విధానపరమైన చర్యలు, పెట్టుబడులు పెంచడం, నిర్మాణాత్మక పరివర్తనతోపాటు మరిన్ని ఉపాధి అవకాశాల కల్పనపై భారత్ దృష్టి సారించాలని పేర్కొంది.



చిలీ, కొరియా, పోలండ్ నిదర్శనాలు..

"చిలీ, కొరియా, పోలండ్ అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థతో మరింతగా అనుసంధానం కావడం ద్వారా మధ్యస్థ ఆదాయం నుంచి అధిక ఆదాయ దేశాలుగా విజయవంతంగా మారాయి. వాటి నుంచి ఈ విషయంలో పాఠాలు నేర్వాలి" అని ప్రపంచబ్యాంక్ భారత్ డైరెక్టర్ ఆగస్టే టానో కొమే పేర్కొన్నారు. 2000 నుంచి భారత ఆర్థిక వ్యవస్థ నాలుగు రెట్లు పెరిగిందని, జీడీపీలో తలసరి ఆదాయం సైతం మూడు రెట్లు అధికమైనట్టు ప్రపంచబ్యాంక్ నివేదిక గుర్తు చేసింది. ఇందుకు మిగిలిన ప్రపంచంతో పోల్చితే భారత్ వేగంగా వృద్ధి చెందినట్టు తెలిపింది. ఇది కఠిన పేదరికం గణనీయంగా తగ్గేందుకు, సేవలు, మౌలిక సదుపాయాల విస్తరణకు దోహదం చేసినట్టు వివరించింది. గత విజయాల మాదిరే భారత్ తన సంస్కరణలను వేగవంతం చేసి, భవిష్యత్తులో మరింత అధిక వృద్ధిని సాధించాల్సి ఉంటుందని కొమే పేర్కొన్నారు. అధిక యువ జనాభా సౌలభ్యం నేపథ్యంలో మెరుగైన ఉపాధి అవకాశాలకు అనువైన పరిస్థితులు కల్పించడం, కార్మిక శక్తిలో మహిళల ప్రాతినిధ్యాన్ని 35.6 శాతం నుంచి 2047 నాటికి 50 శాతానికి పెంచడం అవసరమని ఈ నివేదికకు సహ రచయితగా వ్యవహరించిన ఎమిలీయా స్కాక్, రంగీత్ ఘోష్ అభిప్రాయపడ్డారు. "మౌలిక వసతులు మెరుగుపడాలి. ఆధునిక టెక్నాలజీలను అందిపుచ్చుకోవాలి. కార్మిక మార్కెట్ నిబంధనలను క్రమబద్ధీకరించాలి. నిబంధనల భారాన్ని తగ్గించాలి. ఇలా చేయడం వల్ల ఉత్పాదకతతోపాటు పోటీతత్వం పెరిగేందుకు దోహదం చేస్తుంది. ఈ చర్యలతో భారత్ థాయిలాండ్, వియత్నాం, చైనాతో సమానంగా అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలో భారత్ తన భాగస్వామ్యాన్ని పెంచుకుంటుంది"అని ప్రపంచబ్యాంక్ నివేదిక సూచించింది.

74.5 శాతానికి ద్రవ్యలోటు

10 నెలల్లో రూ.11,69,542 కోట్లు



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ద్రవ్యలోటు జనవరి చివరికి రూ.11,69,542 కోట్లకు చేరుకుంది. పూర్తి ఆర్థిక సంవత్సరం (2024-25) ద్రవ్యలోటు అంచనాల్లో (రూ.15.69 లక్షల కోట్లు) ఇది 74.5 శాతం కావడం గమనార్హం. కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ (సీజీఏ) ఈ మేరకు గణాంకాలు విడుదల చేసింది. ప్రభుత్వ వ్యయాలు-ఆదాయాల మధ్యలో అంతరమే ద్రవ్యలోటు. క్రితం ఆర్థిక సంవత్సరం తొలి పది నెలల్లో ద్రవ్యలోటు 63.6 శాతంగానే ఉంది. మొత్తం ఆదాయం 2024 ఏప్రిల్ నుంచి 2025 జనవరి వరకు రూ.24 లక్షల కోట్లుగా (పన్నుల ఆదాయం రూ.19.03 లక్షల కోట్లు) ఉంది. 2024-25 సవరించిన అంచనాల ప్రకారం మొత్తం అంచనాల్లో ఇది 76.3 శాతానికి సమానం. మొత్తం వ్యయాలు రూ.35.7 లక్షల కోట్లుగా ఉన్నాయి. పూర్తి ఆర్థిక సంవత్సరం అంచనాల్లో ఇది 75.7 శాతానికి సమానం. ఇటీవలి బడ్జెట్‌లో 2024-25 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు 4.8 శాతంగా, 2025-26 సంవత్సరంలో 4.4 శాతంగా ఉంటుందని ఆర్థిక మంత్రి సీతారామన్ ప్రకటించడం తెలిసిందే. జనవరి చివరికి రూ.10,74,179 కోట్లను రాష్ట్రాలకు పన్నుల వాటా కింద కేంద్రం బదిలీ చేసింది. క్రితం ఆర్థిక సంవత్సరం తొలి 10 నెలల కాలంతో పోల్చి చూస్తే రూ.2,53,929 కోట్లు అధిక ఆదాయం రాష్ట్రాలకు సమకూరింది.


డెరివేటివ్స్‌తో హెడ్జింగ్‌కు ఓకే

బీమా సంస్థలకు ఐఆర్‌డీఏ గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ: పోర్ట్‌ఫోలియోలకు హెడ్జింగ్‌గా డెరివేటివ్స్‌ను వినియోగించుకునేందుకు బీమా కంపెనీలను వీలు చిక్కింది. బీమా నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏ ఇందుకు తాజాగా అనుమతించింది. బీమా రంగ సంస్థల వినతులమేరకు ఈక్విటీ డెరివేటివ్స్ ద్వారా హెడ్జింగ్‌కు తెరతీసేందుకు మార్గదర్శకాలు జారీ చేసింది. వెరసి ఆటుపోట్లను చవిచూస్తున్న క్యాపిటల్ మార్కెట్‌లో రిస్కులను తగ్గించుకునేందుకు వీలు కల్పించింది. ప్రస్తుత హెచ్చుతగ్గుల క్యాపిటల్ మార్కెట్లలో హెడ్జింగ్ చేపట్టడం ద్వారా ఈక్విటీ పోర్ట్‌ఫోలియోల రిస్కులను తగ్గించుకునేందుకు బీమా కంపెనీలకు దారి ఏర్పడింది. తద్వారా ఈక్విటీ పెట్టుబడులను సంరక్షించుకునేందుకు ఐఆర్‌డీఏ మద్దతిస్తోంది. బీమా కంపెనీలు ఫార్వార్డ్ రేట్ అగ్రిమెంట్స్, ఇంటరెస్ట్ రేట్ స్వాప్స్, ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఇంటరెస్ట్ ఫ్యూచర్స్ ద్వారా రుపీ ఇంటరెస్ట్ రేట్ డెరివేటివ్స్‌లో లావాదేవీలు చేపట్టేందుకు ప్రస్తుత నిబంధనలు అనుమతిస్తున్నాయి.



ఆటలకు ఆస్తులతో పనేంటి?


పీవీ సింధుతో తండ్రి రమణ (ఫైల్)

- క్రీడలు మంచి అవకాశాలు అందిస్తాయి
- భారత వాలీబాల్ మాజీ ప్లేయర్ పీవీ రమణ

న్యూఢిల్లీ: క్రీడల్లో తమ పిల్లలను ప్రోత్సహించే ముందు మధ్య తరగతి వర్గాల వారు తీవ్రంగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని... ఆర్థికపరంగా మంచి స్థాయిలో ఉన్నవారి పిల్లలే ఆటల వైపు రావాలంటూ భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ చేసిన వ్యాఖ్యలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు గోపీచంద్ మాటలతో ఏకీభవిస్తుండగా, మరికొందరు వాటిని తప్పు పడుతున్నారు. ఈ నేపథ్యంలో భారత మాజీ వాలీబాల్ క్రీడాకారుడు, స్టార్ షట్లర్ పీవీ సింధు తండ్రి పీవీ రమణ దీనిపై స్పందించారు. ఆటగాడిగా ఎదిగేందుకు ధనవంతులు కావడం ముఖ్యం కాదని... ప్రతిభ ఉంటే దూసుకుపోవచ్చని అభిప్రాయపడ్డారు. తానూ దిగువ స్థాయి నుంచే వచ్చి ఆటగాడిగా ఎదిగానని... సింధును క్రీడల వైపు మళ్లించినప్పుడు కూడా తన వద్ద పెద్దగా డబ్బేమీ లేదని ఆయన స్వీయానుభవాన్ని పంచుకున్నారు. 'నాకు మూడేళ్ల వయసు ఉన్నప్పుడు నాన్న చనిపోయారు. 10 మంది సంతానంలో నేను అందరికంటే చిన్నవాడిని. కానీ అన్నలు, అక్కలు నాకు ఎంతో అండగా నిలిచి జాతీయ స్థాయిలో వాలీబాల్ ఆడేందుకు సహకరించారు. ఆట కారణంగానే నాకు రైల్వేస్‌లో ఉద్యోగం వచ్చింది. మీరు దిగువ మధ్య తరగతి లేదా మధ్య తరగతికి చెందినా... ఆటల్లో మంచి ప్రదర్శన కనబరిస్తే ఎన్నో అవకాశాలు వస్తాయి. చిన్నారులు అన్ని రకాలుగా ఎదిగేందుకు కూడా క్రీడలు ఉపయోగపడతాయి' అని రమణ వివరించారు. 1986 ఆసియా క్రీడల్లో కాంస్య పతకం గెలిచిన భారత జట్టులో రమణ సభ్యుడిగా ఉన్నారు. తన పెద్ద కూతురు చదువులో చురుగ్గా ఉందని ఆమెను డాక్టర్ అయ్యేలా ప్రోత్సహించానని, సింధుకు బ్యాడ్మింటన్‌లో ఎంతో ప్రతిభ ఉందనే విషయం ఆరంభంలో గుర్తించామని ఆయన అన్నారు. 'ప్రతిభ ఎక్కడో ఒక చోట వెలుగులోకి వస్తుంది. దానిని ఎవరూ దాచి ఉంచలేరు. తల్లిదండ్రులు తగిన రీతిలో మార్గనిర్దేశనం చేయాలి. ఒక క్రీడాకారుడు మరొకరిని క్రీడల్లోకి రావద్దంటూ హెచ్చరించడం సరైంది కాదని నా అభిప్రాయం' అని గోపీచంద్ వ్యాఖ్యలను రమణ వ్యతిరేకించారు. తనకు రైల్వేలో ఉద్యోగం ఉండటం వల్లే సింధు కెరీర్‌ను ముందుకు తీసుకెళ్లగలిగానని ఆయన గుర్తు చేసుకున్నారు. 'క్రీడల ద్వారా ఉద్యోగం తెచ్చుకోవడం మధ్యతరగతి వారి దృష్టిలో పెద్ద ఘనత. అలాంటి ఎన్నో అవకాశాలు ఉన్నాయి. రైల్వేలోనే వేలాది మంది క్రీడాకారులు ఉద్యోగాలు చేస్తున్నారు. స్పోర్ట్స్ కోటాలో ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో పెద్ద చదువులు చదివే అవకాశం కూడా లభిస్తుంది. కోచ్‌లు ఈ విషయంలో వారికి సరైన దారి చూపిస్తే చాలు' అని రమణ పేర్కొన్నారు. ఇటీవల ఒక యువ షట్లర్‌కు ఆదాయపు పన్ను శాఖలో ఉద్యోగం లభించే విధంగా తాను తగిన విధంగా మార్గనిర్దేశనం చేసినట్లు రమణ వెల్లడించారు. డబ్బున్న వారే ఆటల్లోకి రావాలంటూ సూచించడం సరైంది కాదని ఆయన అన్నారు. సింధు కెరీర్ ఆరంభంలో తాము రైలు ప్రయాణాలు చేస్తే కొందరు విమానాల్లో వచ్చేవారని... ఇప్పుడు సింధు ఏ స్థాయికి చేరుకుందో చూడాలని రమణ వ్యాఖ్యానించారు.

సినెర్ నామినేషన్ ఉపసంహరణ

'లారెస్' అవార్డు రేసు నుంచి అవుట్

లండన్: ప్రపంచ నంబర్‌వన్, ఇటలీ టెన్నిస్ స్టార్ యానిక్ సినెర్ ఈ ఏడాది ప్రతిష్టాత్మక 'లారెస్' అవార్డుకు దూరమయ్యాడు. ఇటీవల అతనిపై మూడు నెలల నిషేధం విధించడంతో 'స్పోర్ట్స్ ఆస్కార్'గా ప్రఖ్యాతిగాంచిన ఈ అవార్డు బరిలో లేకుండా పోయాడు. లారెస్ ప్రపంచ క్రీడా అకాడమీ (ఎల్‌డబ్ల్యూఎస్‌ఏ) అతని నామినేషన్‌ను ఉపసంహరించింది. దీంతో సినెర్ రేసులో లేడు. ఈ విషయాన్ని ఎల్‌డబ్ల్యూఎస్‌ఏ చైర్మన్ సీన్ ఫిట్జ్‌ప్యాట్రిక్ ధ్రువీకరించారు. ఇటలీ సూపర్‌స్టార్ సినెర్‌పై ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) విధించిన నిషేధం అమలవుతుండటంతో అవార్డు బరి నుంచి అతని పేరును తప్పించినట్లు తెలిపారు. 'డోపింగ్ ఉదంతం దరిమిలా నిషేధంపై 'వాడా'తో పాటు టెన్నిస్ వర్గాలతో చర్చించాం. నిషేధంలో ఉన్న ఆటగాడు విశ్వఖ్యాతిగాంచిన అవార్డు బరిలో ఉండటం సమంజసం కాదనే నిర్ణయానికి వచ్చాం. దీంతో సినెర్ నామినేషన్‌ను ఉపసంహరించాలని నిర్ణయించాం. దీనిపై సినెర్, అతని బృందానికి సమాచారమిచ్చాం' అని ఫిట్జ్‌ప్యాట్రిక్ వెల్లడించారు. 23 ఏళ్ల సినెర్ గతేడాది మార్చిలోనే నిషేధిత ఉత్ప్రేరకాలు తీసుకున్నట్లు తేలినా... అంతర్జాతీయ టెన్నిస్ ఇంటిగ్రిటీ ఏజెన్సీ (ఐటీఐఏ) మాత్రం చూసీచూడనట్లుగా వ్యవహరించింది. 'కావాలని తీసుకోలేదు. మర్దన తైలం, లేదంటే ఇతరత్రా మందుల ద్వారా అది తన శరీరంలోకి ప్రవేశించి ఉండొచ్చనే' యానిక్ స్వీయ వాంగ్మూలాన్ని ఐటీఐఏ పరిగణించి తదుపరి చర్యలు తీసుకోలేదు. దీన్ని యావత్ క్రీడావర్గాలు తప్పుబట్టాయి. ఐటీఐఏ పక్షపాత వైఖరిని గర్హించాయి. సెర్బియా దిగ్గజం జొకోవిచ్ సహా పలువురు టెన్నిస్ స్టార్లు... ఒక్కొక్కరికి ఒక్కోరకంగా ని'బంధనాలు' అంటూ బాహాటంగానే దుమ్మెత్తి పోశారు. 'వాడా' సైతం అతని రెండు శాంపిల్స్ (నమూనాలు) పాజిటివ్ అని తేలాయి కాబట్టి కనీసం ఏడాదైనా నిషేధం విధించాలని స్పోర్ట్స్ ఆర్బిట్రేషన్ కోర్టుకు అప్పీల్ చేసింది. చివరకు సినెర్-ఐటీఐఏ-వాడాల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం ఫిబ్రవరి 15న మూడు నెలలు సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. తాజా నిషేధం విధించినప్పటికీ ఈ సీజన్‌లో అతని గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల వేటకి ఏ ఇబ్బంది లేకపోయింది. సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో టైటిల్ నిలబెట్టుకున్న సినెర్... నిషేధం ముగిశాక తదుపరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫ్రెంచ్ ఓపెన్ (మే 25 నుంచి)లో పోటీపడతాడు.



ఫైనల్లో అనిరుధ్ జోడీ


అనిరుధ్

బెంగళూరు: హైదరాబాద్ టెన్నిస్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్... బెంగళూరు ఓపెన్ ఏటీపీ చాలెంజర్-125 టోర్నీలో డబుల్స్ టైటిల్ పోరుకు అర్హత సాధించాడు. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో టాప్ సీడ్ అనిరుధ్ (భారత్)-రే హో (చైనీస్ తైపీ) ద్వయం 6-4, 2-6, 10-8తో 'సూపర్ టైబ్రేక్'లో సాకేత్ మైనేని-రామ్‌కుమార్ రామనాథన్ (భారత్) జంటపై గెలుపొందింది. 72 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రెండు జోడీలు చెరో సెట్ సొంతం చేసుకున్నాయి. నిర్ణాయక సూపర్ టైబ్రేక్‌లో అనిరుధ్-రే హో ద్వయం కీలకదశలో పాయింట్లు గెలిచి విజయాన్ని ఖరారు చేసుకుంది. నేడు జరిగే ఫైనల్లో బ్లేక్ బేల్డన్-మాథ్యూ రోమియోస్ (ఆస్ట్రేలియా) జోడీతో అనిరుధ్-రే హో జంట తలపడుతుంది. రెండో సెమీఫైనల్లో బ్లేక్ బేల్డన్-మాథ్యూ రోమియోస్ 6-3, 7-6 (8/6)తో సిద్ధాంత్-పరీక్షిత్ (భారత్)లపై నెగ్గారు.

నేటి నుంచి జాతీయ మహిళల హాకీ టోర్నీ



బరిలో 28 జట్లు • మార్చి 12న ఫైనల్

పంచ్‌కులా: సీనియర్ మహిళల జాతీయ హాకీ చాంపియన్‌షిప్‌ను కొత్త ఫార్మాట్‌లో నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. నేటి నుంచి ఈ నెల 12 వరకు హరియాణాలోని పంచ్‌కులాలో ఈ మెగా టోర్నీ జరుగనుంది. మొత్తం 28 జట్లు బరిలోకి దిగుతున్నాయి. ఈ సీజన్‌లో ఈ 28 జట్లు ఎ, బి, సి గ్రూపుల్లో తలపడతాయి. ఈ తాజా ప్రదర్శనే ప్రామాణికంగా తదుపరి సీజన్ గ్రూపుల్లో జట్లు మారతాయి. అంటే రంజీ క్రికెట్ తరహాలో రాష్ట్ర హాకీ జట్లు మూడు గ్రూపులుగా విభజించి నిర్వహిస్తారు. తద్వారా ఉత్తమ, మధ్యమ, అధమ స్థాయి జట్ల మధ్య పోటీలు జరుగుతాయి. సిలో చిన్న జట్లు మెరుగైన ప్రదర్శన కనబరిస్తే మధ్యమ స్థాయి 'బి'కి... తర్వాత ఉత్తమ స్థాయి 'ఎ'కి ఆయా జట్లకు ప్రమోషన్ లభిస్తుంది. తద్వారా బలమైన జట్టుతో బలహీనమైన జట్టు పోటీపడదు. సమఉజ్జీల మధ్యే సమరం జరగడం వల్ల పోటీ వాతావరణం క్రమంగా పెరిగి ఆయా జట్లు పురోగతి సాధిస్తాయని 'హాకీ ఇండియా' భావిస్తోంది. ఈసారి తెలుగు రాష్ట్రాల జట్లకు 'ఎ' డివిజన్‌లో పోటీపడే అవకాశం లభించలేదు. తెలంగాణ 'బి' డివిజన్‌లోని పూల్ 'ఎ'లో ఉన్న ఉత్తరప్రదేశ్, అస్సాం, రాజస్తాన్, బిహార్‌లతో తలపడుతుంది. 'సి' డివిజన్‌లోని పూల్ 'బి'లో ఉన్న ఆంధ్రప్రదేశ్... పుదుచ్చేరి, అరుణాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్‌లతో పోటీ పడుతుంది.

'ఎ' డివిజన్‌లో...

పూల్ 'ఎ': హరియాణా, ఒడిశా, కర్ణాటక; **పూల్ 'బి':** మహారాష్ట్ర, మణిపూర్, పంజాబ్; **పూల్ 'సి':** జార్ఖండ్, మిజోరం, తమిళనాడు; **పూల్ 'డి':** మధ్య ప్రదేశ్, బెంగాల్, ఉత్తరప్రదేశ్.

'బి' డివిజన్‌లో...

పూల్ 'ఎ': తెలంగాణ, ఉత్తరప్రదేశ్, అస్సాం, రాజస్తాన్, బిహార్; **పూల్ 'బి':** ఢిల్లీ, ఛత్తీస్‌గఢ్, చండీగఢ్, హిమాచల్‌ప్రదేశ్.

'సి' డివిజన్‌లో...

పూల్ 'ఎ': కేరళ, దాద్రా నాగర్ హవేలి, డామన్ అండ్ డియూ, గుజరాత్; **పూల్ 'బి':** ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరి, అరుణాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్.

హ్యాట్సాఫ్ హర్ష్


హర్ష్ దూబే


సచిన్ బేబీ

ఒకే రంజీ సీజన్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా రికార్డు

- విదర్భకు 37 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం
- కేరళ తొలి ఇన్నింగ్స్‌లో 342 ఆలౌట్
- కెప్టెన్ సచిన్ బేబీ సెంచరీ మిస్

నాగ్‌పూర్: యువ స్పిన్నర్ హర్ష్ దూబే రంజీ ట్రోఫీ చరిత్రలో ఒకే సీజన్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా కొత్త రికార్డు నెలకొల్పాడు. ఫలితంగా కేరళతో జరుగుతున్న దేశవాళీ ప్రతిష్టాత్మక క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్లో విదర్భ జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. తాజా సీజన్‌లో 22 ఏళ్ల ఈ లెఫ్టార్మ్ స్పిన్నర్ 69 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. 2018-19 సీజన్‌లో బిహార్ బౌలర్ అశుతోష్ అమన్ 68 వికెట్లు పడగొట్టగా... హర్ష్ ఆ రికార్డును బద్దలు కొట్టాడు. ఓవర్‌నైట్ స్కోరు 131/3తో శుక్రవారం మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన కేరళ చివరకు 125 ఓవర్లలో 342 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ సచిన్ బేబీ (235 బంతుల్లో 98; 10 ఫోర్లు) త్రుటిలో సెంచరీ చేజార్చుకోగా... ఆదిత్య సర్వతే (185 బంతుల్లో 79; 10 ఫోర్లు) హాఫ్‌సెంచరీతో రాణించాడు. మొహమ్మద్ అజహరుద్దీన్ (34), జలజ్ సక్సేనా (28), సల్మాన్ నిజార్ (21) క్రీజులో నిలదొక్కుకుంటున్న దశలో పెవిలియన్ చేరుకోవడం కేరళను దెబ్బ తీసింది. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో 379 పరుగులు చేసిన విదర్భ జట్టుకు 37 పరుగుల కీలక తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. విదర్భ బౌలర్లలో హర్ష్ దూబే, దర్శన్ నల్కండే, పార్థ్ రేఖడే తలా 3 వికెట్లు పడగొట్టారు. రోజంతా సంయమనంతో బ్యాటింగ్ చేసిన కేరళ జట్టు ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ స్కోరును మాత్రం అందుకోలేకపోయింది. మరో రెండు రోజుల ఆట మిగిలి ఉన్న ఈ మ్యాచ్ 'డ్రా'గా ముగిస్తే మాత్రం తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ఆధారంగా విదర్భ జట్టు మూడోసారి రంజీ చాంపియన్‌గా నిలుస్తుంది.

కెప్టెన్ పోరాడినా...

బ్యాటింగ్‌కు క్లిష్టతరంగా మారిన పిచ్‌పై కేరళ తుది వరకు పోరాడింది. గత రెండు మ్యాచ్‌ల్లో అసాధారణ పరిస్థితుల నుంచి కోలుకొని స్వల్ప తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కించుకోవడం ద్వారానే ఫైనల్లో అడుగు పెట్టిన కేరళ జట్టు... విదర్భతో అదే మ్యాజిక్ కొనసాగించలేకపోయింది. ఆదిత్య సర్వతే క్రితం రోజు స్కోరుకు 13 పరుగులు మాత్రమే జత చేసి వెనుదిరిగాడు. దీంతో ఇన్నింగ్స్‌ను నడిపించే బాధ్యత సారథి సచిన్ బేబీ తీసుకున్నాడు. ఆదిత్యతో కలిసి నాలుగో వికెట్‌కు 63 పరుగులు జోడించిన సచిన్... ఐదో వికెట్‌కు సల్మాన్ నిజార్‌తో కలిసి 49 పరుగులు... ఆరో వికెట్‌కు అజహరుద్దీన్‌తో 59 పరుగులు... ఏడో వికెట్‌కు జలజ్ సక్సేనాతో 46 పరుగులు జోడించాడు. అయితే వీరెవరూ మంచి ఆరంభాలను భారీ స్కోర్లుగా మలచలేకపోయారు. నాకౌట్ మ్యాచ్‌ల్లో అసమాన ప్రతిభ కనబర్చిన నిజార్, అజారుద్దీన్ ఎక్కువసేపు నిలవలేకపోవడంతో సచిన్‌కు సరైన సహకారం దక్కలేదు. విదర్భ బౌలర్లు పట్టువదలకుండా వరుస విరామాల్లో వికెట్లు పడగొట్టడంతో కేరళ జట్టు... తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కోల్పోయింది.

స్కోరు వివరాలు

విదర్భ తొలి ఇన్నింగ్స్: 379; కేరళ తొలి ఇన్నింగ్స్: అక్షయ్ చంద్రన్ (బి) దర్శన్ 14; రోహన్ (బి) దర్శన్ 0; ఆదిత్య సర్వతే (సి) దానిశ్ (బి) హర్ష్ దూబే 79; అహ్మద్ ఇమ్రాన్ (సి) (సబ్) అమన్ (బి) యశ్ ఠాకూర్ 37; సచిన్ బేబీ (సి) కరుణ్ నాయర్ (బి) పార్థ్ 98; సల్మాన్ నిజార్ (ఎల్బీడబ్ల్యూ) (బి) హర్ష్ దూబే 21; అజహరుద్దీన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) దర్శన్ 34; జలజ్ సక్సేనా (బి) పార్థ్ 28; ఏడెన్ టామ్ (బి) పార్థ్ 10; నిధీశ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) హర్ష్ దూబే 1; బాసిల్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు: 20; **మొత్తం (125 ఓవర్లలో ఆలౌట్) 342. వికెట్ల పతనం:** 1-1, 2-14, 3-107, 4-170, 5-219, 6-278, 7-324, 8-337, 9-338, 10-342. **బౌలింగ్:** దర్శన్ నల్కండే 13-2-52-3; యశ్ ఠాకూర్ 17-1-83-1; నచికేత్ 12-3-41-0; హర్ష్ దూబే 44-11-88-3; పార్థ్ రేఖడే 30-7-65-3; అక్షయ్ కర్నెవార్ 9-5-11-0.


> రికార్డు గురించి ఆలోచించలేదు. జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం అందివ్వడమే లక్ష్యంగా బౌలింగ్ చేశా. ఈ క్రమంలో సీజన్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా ఘనత సాధించడం ఆనందంగా ఉంది. సీజన్ ఆరంభం నుంచి మంచి ప్రదర్శన చేస్తున్నాం. చివరి మ్యాచ్‌లో అదే జోరు కనబర్చాలని ముందే అనుకున్నాం. జట్టును మంచి స్థితిలో నిలిపేందుకు ఎన్ని ఓవర్లయినా బౌలింగ్ చేయాలనుకున్నా. దిగ్గజ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ సలహాలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. బౌలింగ్, బ్యాటింగ్‌లో అశ్విన్ చెప్పిన అంశాలపై సాధన చేశా. వాటి ఫలితం కనిపించింది. ముఖ్యంగా అశ్విన్ బౌలింగ్ కంటే బ్యాటింగ్‌లోనే ఎక్కువ సలహాలు ఇచ్చాడు. సహజ శైలిలోనే బౌలింగ్ చేశాను. రికార్డు సాధించడం కోసం కొత్తగా ఏమీ ప్రయత్నించలేదు. కేరళ సారథి సచిన్ బేబీ వికెట్ పడటంతోనే మ్యాచ్ మలుపు తిరిగింది. సచిన్ బేబీ అవుట్ కావడంతోనే విదర్భ జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కింది. -హర్ష్ దూబే, విదర్భ బౌలర్

చెస్ దిగ్గజం బోరిస్ స్పాస్కీ కన్నుమూత


1972 ప్రపంచ చాంపియన్‌షిప్ మ్యాచ్‌లో బాబీ ఫిషర్‌తో బోరిస్ స్పాస్కీ (ఎడమ)

మూడేళ్ల పాటు వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన రష్యా ప్లేయర్

మాస్కో: అంతర్జాతీయ చెస్ అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకడిగా గుర్తింపు తెచ్చుకున్న బోరిస్ స్పాస్కీ (88) మంగళవారం కన్నుమూశారు. రష్యాకు చెందిన ఈ మాజీ ప్రపంచ చాంపియన్ మరణించిన విషయాన్ని 'ఫిడే' ప్రకటించింది. ప్రపంచ చెస్‌ను సోవియట్ యూనియన్ శాసిస్తున్న కాలంలో వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన వారిలో స్పాస్కీ కూడా ఒకడు. 1969-1972 మధ్య అతను పదో వరల్డ్ చాంపియన్‌గా శిఖరాన నిలిచాడు. అయితే డిఫెండింగ్ చాంపియన్‌గా స్పాస్కీ బరిలోకి దిగిన 1972 వరల్డ్ చాంపియన్ పోరాటానికి ప్రపంచ చెస్‌లో ప్రత్యేక స్థానం ఉంది. సోవియట్ యూనియన్, అమెరికా మధ్య తీవ్ర వైరంతో ప్రచ్ఛన్న యుద్ధం కొనసాగుతున్న ఆ కాలంలో స్పాస్కీతో అమెరికాకు చెందిన బాబీ ఫిషర్ చాలెంజర్‌గా తలపడ్డాడు. దాంతో ఈ సమరం అందరి దృష్టినీ ఆకర్షించింది. ఆ సమయంలో దీనికి 'మ్యాచ్ ఆఫ్ ద సెంచరీ'గా గుర్తింపు వచ్చింది. సోవియట్ యూనియన్ వర్సెస్ అమెరికాగా మారిపోయిన ఈ 21 గేమ్‌ల పోరులో చివరకు 8.5-12.5 పాయింట్ల తేడాతో ఫిషర్ చేతిలో ఓడి స్పాస్కీ వరల్డ్ టైటిల్‌ను కోల్పోయాడు. నాలుగేళ్ల తర్వాత ఫ్రాన్స్‌కు వెళ్లి స్థిరపడిన స్పాస్కీ ఆ తర్వాత 21 ఏళ్ల పాటు ఆ దేశం తరఫున పోటీల్లో పాల్గొన్నా చెప్పుకోదగ్గ ప్రభావం చూపలేకపోయాడు. 2013లో అతను తిరిగి స్వదేశానికి వచ్చేసి చివరి వరకు మాస్కోలోనే ఉండిపోయాడు. స్పాస్కీతో సమరంతో 1972లో జగజ్జేతగా నిలిచిన బాబీ ఫిషర్ 2008లోనే మరణించాడు.





జహాన్-ఇ-ఖుస్రూ వార్షిక సూఫీ సంగీత ఉత్సవం శుక్రవారం ఢిల్లీలోని సుందర్ నర్సరీలో నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ ప్రదర్శనకు ఉంచిన వస్తువుల వివరాలను తెలుసుకుంటున్న ప్రధాని మోదీ



గుజరాత్‌లోని రాన్ ఆఫ్ కచ్‌ను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె అక్కడి తెల్లని ఎడారి ప్రాంతంలో ఇలా కలియ తిరిగారు

మా ఎమ్మెల్యేల సస్పెన్షన్ ప్రజాస్వామ్యానికి విఘాతం

అసెంబ్లీ స్పీకర్‌కు ప్రతిపక్ష నేత ఆతిశీ లేఖ

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ నుంచి ఆప్‌కు చెందిన 21 మంది శాసనసభ్యుల సస్పెన్షన్ వ్యవహారం రాజకీయ దుమారం రేపుతోంది. తమ పార్టీ ఎమ్మెల్యేల సస్పెన్షన్ ప్రజల తీర్పును అవమానించడమే కాకుండా, ప్రజాస్వామ్యానికే విఘాతంగా అభివర్ణిస్తూ ప్రతిపక్ష నేత ఆతిశీ శుక్రవారం స్పీకర్ విజేందర్ గుప్తాకు లేఖ రాశారు. అయితే, గతంలో సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగిన సందర్భాలు, పార్లమెంటరీ నిబంధనలను ఉదహరిస్తూ తన చర్యను సమర్థించుకున్నారు. ఫిబ్రవరి 25న అసెంబ్లీలో లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ప్రసంగం సమయంలో ఆప్ సభ్యులు అంతరాయం కలిగించారు. సీఎం కార్యాలయంలో ఉన్న భగత్ సింగ్, అంబేడ్కర్ చిత్రపటాలను తొలగించడంపై బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్లకార్డులతో నిరసనకు దిగారు. దీంతో, మెజారిటీ ఓటుతో ఆప్‌కు చెందిన 21 మంది శాసనసభ్యులను మూడు రోజుల పాటు స్పీకర్ విజేందర్ గుప్తా సస్పెండ్ చేశారు. గురువారం ఆప్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ ప్రాంగణంలో ధర్నా చేపట్టేందుకు రాగా గేటు వద్దే భద్రతా సిబ్బంది వారిని అడ్డుకున్నారు. ఈ చర్యను ఆప్ తీవ్రంగా ఖండించింది. బీజేపీ ప్రభుత్వ ధోరణి నియంతృత్వాన్ని కూడా మించిపోయిందని ఆతిశీ ధ్వజమెత్తారు. ఈ పరిణామాలపై ఆమె శుక్రవారం స్పీకర్‌కు లేఖ రాశారు. అసెంబ్లీలో జై భీమ్ అని నినదించినందుకు తమ ఎమ్మెల్యేలను అన్యాయంగా టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు. లెఫ్టినెంట్ గవర్నర్ ప్రసంగం సమయంలో మోదీ, మోదీ అంటూ నినాదాలు చేసిన బీజేపీ సభ్యులపై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదెందుకని అంటూ ప్రశ్నించారు.



శుక్రవారం అసెంబ్లీ గేటు వద్దే తన కారును అడ్డుకున్న పోలీసులతో మాట్లాడుతున్న ప్రతిపక్ష నేత ఆతిశీ

ఆరోపణలు నిరాధారాలు: విజేందర్ గుప్తా

ఆతిశీ ఆరోపణలపై స్పీకర్ విజేందర్ గుప్తా స్పందించారు. ఆప్ ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటు సరైందేనని సమర్థించుకున్నారు. సస్పెన్షన్‌కు గురైన సభ్యుడు సభలోకి మాత్రమే కాదు, సభా ప్రాంగణంలోకి సైతం అడుగుపెట్టే హక్కు లేదని అసెంబ్లీ రూల్ -277 స్పష్టం చేస్తోందన్నారు. సభా కార్యకలాపాలతోపాటు, సభా కమిటీ సమావేశాల్లోనూ అతడు పాల్గొనరాదన్నారు. ఫిబ్రవరి 24వ తేదీన అసెంబ్లీలో లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ప్రసంగం కూడా ప్రారంభించక మునుపే ఆప్ సభ్యులు నినాదాలతో ఆయనకు అడ్డుతగిలారని స్పీకర్ విమర్శించారు. ఐదో షెడ్యూల్‌లోని నియమావళి ప్రకారం..ఎల్జీ ప్రసంగానికి అంతరాయం కలిగించడమంటే ఆ పదవిని అగౌరవపర్చడం, సభను ధిక్కరించడమేనని స్పీకర్ పేర్కొన్నారు. అనుచితంగా ప్రవర్తిస్తే భవిష్యత్తులోనూ ఇటువంటి చర్యలే ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఎమ్మెల్యేల సస్పెన్షన్ నిర్ణయం ఏకపక్షం కాదు, పార్లమెంటరీ నిబంధనలను అనుసరించే తీసుకున్న నిర్ణయమని విజేందర్ గుప్తా వివరించారు. ఈ విషయంలో ప్రతిపక్ష నేత ఆతిశీ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. సభ మర్యాదను, ముఖ్యంగా ఎల్జీ ప్రసంగం సమయంలో కాపాడటం తన విద్యుక్త ధర్మమని వివరించారు. కాగా, ఆతిశీ శుక్రవారం తన కారులో అసెంబ్లీ ఆవరణలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించగా పోలీసులు గేటు వద్దే అడ్డుకున్నారు. కొద్దిసేపు వాగ్వాదం అనంతరం ఆమె వెళ్లిపోయారు.

భారత విద్యార్థిని కుటుంబానికి అమెరికా వీసా

ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోమాలో ఉన్న నీలం

ముంబై: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అమెరికా ఆసుపత్రిలో కోమాలో ఉన్న మహారాష్ట్రలోని సతారా జిల్లాకు చెందిన నీలం షిండే కుటుంబానికి అత్యవసర వీసా లభించింది. ఆమెను చూసేందుకు నీలం తండ్రి, ఆమె సోదరునికి అమెరికా వెళ్లేందుకు వీసాలు మంజూరు చేశారు. అమెరికాలో చదువుతున్న నీలం షిండే.. ఫిబ్రవరి 14న ప్రమాదానికి గురైంది. ఆమె తల, చేతులు, కాళ్లు, ఛాతికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే శస్త్ర చికిత్స చేశారు. ప్రస్తుతం నీలం కోమాలో ఉంది. ప్రమాదం జరిగిన రెండు రోజుల తరువాత ఆమె రూమ్‌మేట్ షిండే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా వీలైనంత త్వరగా అమెరికా రావాలని ఆస్పత్రి యాజమాన్యం కుటుంబ సభ్యులకు మెయిల్ పంపింది. కుటుంబ సభ్యులు వీసాకోసం ప్రయత్నించగా పలుమార్లు అధికారులు పలుమార్లు తిరస్కరించారు. దీంతో కుటుంబం ప్రభుత్వాన్ని సంప్రదించింది. సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సహా, కేంద్రం చొరవతో నీలం తండ్రి, సోదరుడికి వీసాలు మంజూరయ్యాయి. కొద్ది రోజుల క్రితమే నీలం షిండే తల్లి కూడా చనిపోయింది.

ఈషా ఫౌండేషన్‌కు సుప్రీంలో ఊరట

న్యూఢిల్లీ: ఆధ్యాత్మిక గురువు జగ్గీ వాసుదేవ్ ఆధ్వర్యంలోని ఈషా ఫౌండేషన్‌కు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. కోయంబత్తూర్‌లోని కొండప్రాంతంలో ఏర్పాటైన ఈ ఫౌండేషన్ భవన నిర్మాణాల్లో పర్యావరణ నిబంధనలను పాటించ లేదంటూ తమిళనాడు కాలుష్య నియంత్రణ మండలి ఇచ్చిన నోటీసులను రద్దు చేస్తూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సమర్థించింది. ఈ ఆదేశాల్లో తాము జోక్యం చేసుకోబోమని తెలిపింది. నిబంధనలకు అనుగుణంగా లేవనే కారణంగా నిర్మాణాలను కూలగొట్టడంపై మాత్రమే తాము అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామంది. ఈ కేసులో ప్రత్యేక అంశాలున్నందున ఈ ఆదేశాలిస్తున్నామే తప్ప, అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరించుకోవడానికి ఇది సాకు కారాదని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం శుక్రవారం పేర్కొంది. ముమ్ముందు చేపట్టే నిర్మాణాలు పర్యావరణ నిబంధనలకు లోబడే ఉండాలని స్పష్టం చేసింది. ఈ కేంద్రాన్ని విస్తరించిన పక్షంలో నిబంధనల మేరకు ఉన్నాయా అనేది తనిఖీ చేసేందుకు అధికారులకు అధికారం ఉంటుందని కూడా తెలిపింది.

లక్ష్మీ బాయి విగ్రహం ఏర్పాటుపై పిటిషన్ కొట్టివేసిన ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ: ఢిల్లీలోని సదర్ బజార్ ప్రాంతంలో ఉన్న షాహీ ఈద్గా పార్కులో మహారాణి లక్ష్మీ బాయి విగ్రహం ఏర్పాటుపై స్పష్టమైన ఆదేశాలివ్వాలంటూ దాఖలైన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు శుక్రవారం కొట్టివేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీకే ఉపాధ్యాయ్, జస్టిస్ తుషార్ రావు గేదెల ధర్మాసనం..2024 అక్టోబర్ 7వ తేదీన కోర్టు ఏకసభ్య ధర్మాసనం వెలువరించిన ఆదేశాలను ఆ సందర్భాన్ని బట్టి అర్థం చేసుకోవాలే తప్ప, ప్రత్యేకంగా ఎటువంటి వివరణ అవసరం లేదని స్పష్టం చేసింది. బదులుగా, విగ్రహం ఏర్పాటుపై ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ(డీడీఏ) జారీ చేసిన నోటీసుపై తగు న్యాయపరమైన పరిష్కారాన్ని కోరవచ్చునంటూ షాహీ ఈద్గా మేనేజింగ్ కమిటీకి సూచించింది. స్వాతంత్ర్య సమరయోధురాలు లక్ష్మీబాయి విగ్రహం ఏర్పాటును ఆపాలంటూ వక్ఫ్‌బోర్డు వేసిన పిటిషన్‌ను గతంలో ఏకసభ్య ధర్మాసనం తోసిపుచ్చింది. దీంతో, మైదానంలో ఒక పక్కగా లక్ష్మీబాయి విగ్రహాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. దీని కారణంగా మైదానంలో ప్రార్థనలు నిర్వహించుకునే వారి హక్కులకు ఎలాంటి ఆటంకం కలగడం లేదని కూడా ప్రభుత్వ న్యాయవాది శుక్రవారం పేర్కొన్నారు.

ఆ ఇద్దరినీ మళ్లీ విధుల్లోకి తీసుకోండి: సుప్రీం

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరు మహిళా న్యాయాధికారుల తొలగింపు ఉత్తర్వులను సుప్రీంకోర్టు రద్దు చేసింది. వీరిని తొలగిస్తూ తీసుకున్న చర్య 'ఏకపక్షం, చట్టవిరుద్ధం'అని అభివర్ణించింది. 2023లో తొలగించిన ఈ అధికారిణులను 15 రోజుల్లోగా తిరిగి విధుల్లోకి తీసుకోవాలంటూ జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పు భారత న్యాయవ్యవస్థలో మహిళల సమస్యను కూడా చర్చిస్తుందని పేర్కొంది. ఇద్దరు మహిళా న్యాయాధికారులను విధుల నుంచి తొలగిస్తూ మధ్యప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు గతేడాది డిసెంబర్ 17న తీర్పును రిజర్వు చేసింది. పనితీరు సంతృప్తికరంగా లేదనే ఆరోపణలపై మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఆరుగురు మహిళా సివిల్ జడ్జీలను విధుల నుంచి తొలగించిన వ్యవహారంపై 2023 నవంబర్‌లో సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలో తిరిగి విచారణ జరిపిన మధ్యప్రదేశ్ హైకోర్టు 2024 ఆగస్టు ఒకటిన నలుగురు జడ్జీలను కొన్ని నిబంధనలను లోబడి తిరిగి నియమిస్తూ ఆదేశాలిచ్చింది. ఇద్దరిని మాత్రం వదిలేసింది. ఆ ఇద్దరికీ తాజాగా న్యాయం దొరికినట్లయింది.

సన్యాసిగా మారిన వ్యక్తి ఆర్‌బీఐ బాండ్ల బదిలీకి బాంబే హైకోర్టు నో

ముంబై: ప్రాపంచిక జీవితాన్ని వదిలేసి జైన సన్యాసం స్వీకరించిన వ్యక్తి పేరుతో ఉన్న ఆర్‌బీఐ బాండ్లను తమకు బదిలీ చేయాలంటూ అతడి భార్య, తల్లి వేసిన రిట్ పిటిషన్‌ను బాంబే హైకోర్టు కొట్టివేసింది. ప్రాపంచిక జీవితాన్ని త్యజించడమంటే మరణంతో సమానమని, అతడి ఆస్తులకు తామే వారసులమవుతామన్న వారి వాదనలను తోసిపుచ్చింది. మనోజ్ జవెర్‌చంద్ దెధియా అతడి కుమార్తె, కుమారుడు జైన సన్యాసం స్వీకరించి, సాధువులుగా మారారు. పేర్లను సైతం మార్చుకున్నారు. అయితే, 2022 నవంబర్‌లో మనోజ్ సన్యాసం తీసుకోకమునుపు, తన పేరుతో ఉన్న ఆర్‌బీఐ బాండ్లను ట్రాన్స్‌ఫర్ చేసే విషయంలో హెచ్‌డీఎఫ్‌సీ అధికారులను సంప్రదించారని పిటిషనర్ల లాయర్ హితేశ్ సోలంకి కోర్టుకు తెలిపారు. తమ నిబంధనల ప్రకారం సన్యాసమంటే మరణంతో సమానం కాదని వారు ఆయన వినతిని తిరస్కరించారన్నారు. స్పందించిన ధర్మాసనం.. కేవలం సన్యాసం స్వీకరించిన ఫొటోలు, ఆహ్వాన పత్రికలుంటే చాలదని, అందుకు అనుగుణమైన క్రతువులు జరిపినట్లు ఆధారాలు చూపాల్సి ఉందంది. ఈ వ్యవహారంపై సివిల్ కోర్టును ఆశ్రయించాలని సూచిస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది.

రూ.7 వేల లక్షల కోట్ల కుబేరుడు.. 90 నిమిషాలే

ఖాతాలో 280 డాలర్లకు బదులు 81 ట్రిలియన్ డాలర్లు జమ

- అమెరికాలో గతేడాది సిటీ బ్యాంకు సిబ్బంది తప్పిదం
- పొరపాటును గుర్తించి సొమ్మును వెనక్కి రప్పించిన అధికారులు

వాషింగ్టన్: కేవలం 280 డాలర్లు (రూ.24,478) జమ చేయాల్సిన బ్యాంకు ఖాతాలో ఏకంగా 81 ట్రిలియన్ డాలర్లు(రూ.7,081,00000,0000000) జమ చేస్తే? సదరు ఖాతాదారుడు క్షణాల్లో కుబేరుడైపోతాడు. చిన్న చిన్న దేశాలనే కొనేసే స్థోమత వచ్చేస్తుంది. సాక్షాత్తూ కుబేరుడికే అప్పులు ఇచ్చేసినా ఆశ్చర్యం లేదు. కానీ, ఇక్కడ ఆ ఖాతాదారుడికి అంత భాగ్యం దక్కలేదు. అతడి కుబేరుడి హోదా 90 నిమిషాల్లోనే మటుమాయమైపోయింది. అమెరికాలో సిటీగ్రూప్ ఇన్‌కార్పొరేషన్‌కు చెందిన సిటీ బ్యాంకు సిబ్బంది గత ఏడాది ఏప్రిల్‌లో ఒక కస్టమర్ బ్యాంకు ఖాతాల్లో 280 డాలర్లకు బదులు ఆన్‌లైన్‌లో పొరపాటున 81 ట్రిలియన్ డాలర్లు జమచేశారు. ఇదంతా ఇద్దరు ఉద్యోగుల నిర్వాకం. తాము చేసిన తప్పును వారు గుర్తించలేకపోయారు. కానీ, మరో ఉద్యోగి 90 నిమిషాల్లో గుర్తించాడు. వెంటనే బ్యాంకు అధికారులకు అప్రమత్తం చేయడంతో సదరు లావాదేవీ 'రివర్స్'అయిపోయింది. బ్యాంకు సొమ్ము భద్రంగా తిరిగి వచ్చేసింది. ఖాతాల్లో ఎక్కువ సొమ్మును జమ చేయడం లాంటి పొరపాట్లను బ్యాంకింగ్ పరిభాషలో 'నియర్ మిస్'అంటారట! భారీ మొత్తంలో సొమ్ము ఒక ఖాతా నుంచి మరో ఖాతాకు ఆన్‌లైన్‌లో బదిలీ అయితే హెచ్చరించే డిటెక్టివ్ కంట్రోల్ వ్యవస్థ బ్యాంకుల్లో ఉంటుంది. సిటీ బ్యాంకులో జరిగిన రూ.7,081 లక్షల కోట్ల లావాదేవీని ఈ వ్యవస్థ కనిపెట్టినట్లు సదరు బ్యాంకు ప్రతినిధి వెల్లడించారు. ఈ ఘటన వల్ల తమ బ్యాంక్‌కు గానీ, ఖాతాదారులకు గానీ ఎలాంటి నష్టం వాటిల్లలేదని చెప్పారు. సిటీ బ్యాంక్‌లో 2024లో 10 'నియర్ మిస్' ఘటనలు చోటుచేసుకున్నాయి. ఒక బిలియన్ డాలర్ల(రూ.8,740 కోట్లు) సొమ్ము పొరపాటున ఖాతాల్లోకి వెళ్లిపోయింది. 2023లో అయితే 13 నియర్ మిస్ ఘటనలు జరిగాయి.

సీబీఎస్ఈ బోర్డు పరీక్షల్లో ఇంగ్లిష్, హిందీ తప్పనిసరా?

న్యూఢిల్లీ: 2025-26 విద్యాసంవత్సరం నుంచి 10వ తరగతి బోర్డు పరీక్షను ఏడాదిలో రెండు పర్యాయాలు నిర్వహిస్తామంటూ సీబీఎస్ఈ ఇటీవల వెలువరించిన ముసాయిదా తీర్మానం లాంగ్వేజీ ప్రశ్నాపత్రాలకు సంబంధించిన పలు అనుమానాలకు తావిస్తోంది. పదో తరగతి ముసాయిదా ప్రకారం..సబ్జెక్టు గ్రూపులో ఇంగ్లిష్ ఒకటో లాంగ్వేజీ కాగా, హిందీ రెండో లాంగ్వేజీగా ఉంది. అన్ని ఇతర ప్రాంతీయ, విదేశీ భాషలు కలిపి 'రీజినల్, ఫారిన్ లాంగ్వేజెస్ గ్రూప్'లో ఉన్నాయి. ఇంగ్లిష్, హిందీలకు పరీక్ష రోజులు కూడా వేటికవే వేర్వేరుగా ఉన్నాయి. ఇతర భాషలన్నిటికీ కలిపి ఒకే ఒక్క పరీక్ష రోజుంది. పంజాబీని ముసాయిదాలో విస్మరించారంటూ పంజాబ్ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఈ విషయం వెలుగు చూసింది. దీనిపై సీబీఎస్ఈ స్పందిస్తూ.. ముసాయిదాలో పేర్కొన్న సబ్జెక్టులు కేవలం సూచనప్రాయంగా ఇచ్చినవనీ, తుది విధానం కాదంటూ వివరణ ఇచ్చింది. అయితే, ముసాయిదాలో పేర్కొన్న విధంగానే అన్ని సబ్జెక్టులు, లాంగ్వేజెస్ యథా ప్రకారం అమలవుతాయంటూ సీబీఎస్ఈ రెండు రోజుల క్రితం ప్రకటించడం గమనార్హం. దీంతోపాటు, లాంగ్వేజ్ 1గా ఇంగ్లిష్‌ను, లాంగ్వేజ్ 2గా హిందీని పేర్కొన్న ముసాయిదా ఇతర అన్ని భాషలను ఆప్షనల్‌గా ఎందుకు చూపించిందో స్పష్టంగా లేదు.

కశ్మీర్‌లో శాంతి సహజం కాదు, కృత్రిమం: సీఎం ఒమర్

న్యూఢిల్లీ: ఆర్టికల్ 370 రద్దు అనంతరం కశ్మీర్‌లో కేంద్రం చెబుతున్న సాధారణ పరిస్థితులు బలవంతంగా ఏర్పడినవే తప్ప సహజమైనవి కావని సీఎం ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. తమ కేంద్ర పాలిత ప్రాంతంలో పరిస్థితులు సాధారణంగా లేవనే విషయం శ్రీనగర్‌లోని జమా మసీదును షబ్-ఇ-బరాత్ సమయంలో మూసివేయడాన్ని బట్టే అర్థం చేసుకోవచ్చని ఆయన వ్యాఖ్యానించారు. 'ప్రస్తుతం నెలకొన్న ప్రశాంత వాతావరణం భయం వల్ల ఏర్పడిందే. ఇది కేవలం స్వల్పకాలం మాత్రమే ఉంటుంది. అదే సహజంగా ఏర్పడే సాధారణ పరిస్థితులు దీర్ఘకాలం కొనసాగేందుకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఉన్నది సహజ ప్రశాంతత అని భద్రతా బలగాలు గానీ, ప్రజలు గానీ విశ్వసించడం లేదు'అని ఒమర్ తెలిపారు. సహజమైన సాధారణ పరిస్థితులున్నప్పుడు జమా మసీదును తెరిచినా శాంతి భద్రతలకు భంగం కలగదని చెప్పారు. ప్రస్తుతం ఉన్నది కృత్రిమమైన ప్రశాంతత కాబట్టే శాంతిభద్రతలకు భంగం కలుగుతుందని కేంద్రం జమా మసీదును తెరవడం లేదని ఆయన పేర్కొన్నారు.

బస్సులో రేప్ ఘటన నిందితుడి అరెస్ట్

ముంబై: పుణే నగరంలోని స్వర్‌గేట్ టెర్మినస్ వద్ద నాలుగు రోజుల క్రితం ప్రభుత్వ రవాణా సంస్థకు చెందిన బస్సులో మహిళపై అత్యాచారానికి తెగించిన వ్యక్తిని పోలీసులు ఎట్టకేలకు పట్టుకున్నారు. షిరూర్ తహశీల్‌లోని సొంతూరులో పంటపొలాల్లో దాక్కున్న నిందితుడు దత్తాత్రేయ్ రాందాస్ గడె(37)ని పోలీసులు గురువారం అర్ధరాత్రి అరెస్ట్ చేశారని హోం శాఖను కూడా చూస్తున్న సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ శుక్రవారం చెప్పారు. పలు క్రిమినల్ కేసులను ఎదుర్కొంటున్న గడె రేప్ ఘటన అనంతరం ఆత్మహత్యకు యత్నించాడని చెప్పారు.

75 గంటల ముమ్మర వేట..

అత్యంత రద్దీగా ఉండే స్వర్‌గేట్ బస్ స్టాండ్ వద్ద బస్సులో అఘాయిత్యానికి పాల్పడిన వ్యక్తిని పట్టుకునేందుకు ప్రభుత్వం 13 పోలీసు బృందాలను ఏర్పాటు చేసింది. నిందితుడు గడె జాడ తెలియకుండా ఉండేందుకుగాను ముందు జాగ్రత్తగా తన సెల్‌ఫోన్‌ను స్విచ్చాఫ్ చేసుకున్నాడు. దీంతో, పోలీసు యంత్రాంగం అతడి కదలికలను సీసీ ఫుటేజీతో కనిపెట్టే పనిలో పడింది. ఆధారాలను బట్టి అతడి సొంతూరు గునాత్ వెళ్లి వాకబు చేశారు. ఓ ఇంటికి వెళ్లి నీరు, ఆహారం అడిగినట్లు తేలింది. ఆ ఇంటి యజమాని ఇచ్చిన వివరాలు నిందితుడిని పోలి ఉండటంతో పోలీసులకు గట్టి ఆధారం దొరికినట్లయింది. గ్రామస్తుల సాయం కోరారు. డ్రోన్లు, పోలీసు జాగిలాలను రంగంలోకి దించారు. సుమారు 500 మంది పోలీసులు, 400 మంది గ్రామస్తులు వెంటరాగా గ్రామ పరిసరాలను అణువణువూ శోధించారు. చివరికి గురువారం అర్ధరాత్రి 1.10 గంటల సమయంలో గునాత్ గ్రామ పంట పొలాల్లో నక్కిన అతడిని పట్టుకున్నారు. దీంతో, 75 గంటల అన్వేషణకు తెరపడిందని పోలీసులు జాయింట్ పోలీస్ కమిషనర్ అమితేశ్ కుమార్ తెలిపారు. అతడు చేయి రక్తనాళాలను కోసుకున్నట్లు గుర్తించామని, ఆత్మహత్యకు యత్నించినట్లుగా భావిస్తున్నామన్నారు.

ఉక్రెయిన్ భద్రత మా బాధ్యత కాదు

బ్రిటన్ అభ్యర్థనను తోసిపుచ్చిన ట్రంప్

వాషింగ్టన్: ఉక్రెయిన్‌కు అమెరికా సైనిక మద్దతు ఇవ్వాలంటూ యూకే ప్రధాని కెయిర్ స్టార్మర్ చేసిన అభ్యర్థనను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తోసిపుచ్చారు. బదులుగా ఖనిజాల ఒప్పందాన్ని ఆయన ముందుకు తెచ్చారు. అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా వైట్ హౌస్‌లో గురువారం ట్రంప్‌తో స్టార్మర్ భేటీ అయ్యారు. చర్చల్లో ఉక్రెయిన్ ప్రధానాంశంగా నిలిచింది. ట్రంప్ వల్లే ఉక్రెయిన్‌లో శాంతి సాధ్యమవుతుందని, శాంతి చర్చల్లో ఉక్రెయిన్‌తోపాటు యూరప్ దేశాలను కూడా భాగస్వాములను చేయాలని స్టార్మర్ కోరారు. యూఎస్ భద్రతా హామీ లేకుండా ఉక్రెయిన్‌లో దీర్ఘకాలిక శాంతి ఉండబోదన్నారు. అయితే స్టార్మర్ వాదనను ట్రంప్ తోసిపుచ్చారు. ఆర్థిక ఒప్పందాలకు సానుకూలమే గానీ భద్రతకు హామీ ఇవ్వలేమని చెప్పారు. రష్యాతో హడావుడిగా కుదిరే శాంతి ఒప్పందం యూరప్‌లో మరింత అస్థిరతకు దారితీస్తుందన్న ఈయూ ఆందోళనను స్టార్మర్ వెలిబుచ్చారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను విశ్వసించగలరా అని అడగ్గా.. సోవియట్ యూనియన్‌తో చర్చలపై అమెరికా మాజీ అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్ చెప్పిన అభిప్రాయాన్ని ట్రంప్ పునరుద్ఘాటించారు. 'ఒకసారి నమ్మి చూడండి' అని సమాధానమిచ్చారు. ఒప్పందం తర్వాత పుతిన్ మళ్లీ దాడి చేస్తారని అనుకోవడం లేదన్నారు. అలాంటి సుస్థిర ఒప్పందం దిశగా చర్చలు సాగుతున్నాయని ట్రంప్ స్పష్టం చేశారు.



స్టార్మర్‌తో ట్రంప్

సంస్థ సమాచారాన్ని లీక్ చేశారని 20 మంది ఉద్యోగులపై మెటా వేటు

మరికొంతమందిని తొలగిస్తామని హెచ్చరిక

శాన్ ఫ్రాన్సిస్కో: సున్నితమైన కంపెనీ సమాచారాన్ని లీక్ చేశారనే ఆరోపణపై సోషల్ మీడియా దిగ్గజం మెటా 20 మంది ఉద్యోగులను తొలగించింది. సంస్థ భవిష్యత్ ఉత్పత్తులు, అంతర్గత సమావేశాలకు సంబంధించిన సమాచారాన్ని బహిర్గతం చేశారని తేలడంతో ఈ నిర్ణయం తీసుకుంది. తొలగించాల్సిన వారు ఇంకా ఉన్నారని, మరింత దర్యాప్తు తరువాత వారినీ తొలగిస్తామని తెలిపింది. వారు ఏ ఉద్దేశంతో చేసినా లీక్ కార్పొరేట్ మార్గదర్శకాలను ఉల్లంఘించడమేనని, దీన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని నొక్కి చెప్పింది. 'ఉద్యోగులు కంపెనీలో చేరినప్పుడే మేం వారికి చెబుతాం. సంస్థ అంతర్గత సమాచారాన్ని లీక్ చేయడం మా విధానాలకు విరుద్ధం'అని మెటా ప్రతినిధి డేవ్ ఆర్నాల్డ్ చెప్పారు. సీఈఓ మార్క్ జుకర్ బర్గ్ అంతర్గత సమావేశాల వివరాలతో సహా ఇటీవలి నెలల్లో కంపెనీకి సంబంధించిన సమాచారం అంతా లీకయ్యింది. సమావేశాల ఆధారంగా ఇటీవల వరుస కథనాలు వచ్చాయి. క్యాపిటల్ భవనంపై దాడిని ప్రోత్సహించినందుకు ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను 2021 జనవరిలో మెటా ఫేస్‌బుక్ నుంచి తొలగించింది. దీంతో ట్రంప్ జీవితఖైదు విధిస్తానంటూ మెటా సీఈఓ జుకర్‌బర్గ్‌ను బెదిరించారు. ఈ నేపథ్యంలో ట్రంప్ గెలుపొందిన తరువాత జుకర్‌బర్గ్ ఆయనను కలిశారు. ప్రమాణ స్వీకారనిధికి విరాళం కూడా ఇచ్చారు.

ప్రొబేషనరీ ఉద్యోగుల సామూహిక తొలగింపు చట్టవిరుద్ధం

శాన్‌ఫ్రాన్సిస్కో ఫెడరల్ కోర్టు స్పష్టీకరణ

శాన్‌ఫ్రాన్సిస్కో: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దూకుడుగా తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలకు న్యాయస్థానాల్లో ఎదురుదెబ్బ తగులుతోంది. ప్రొబేషనరీ ఉద్యోగులను సామూహికంగా తొలగించడం చట్టవిరుద్ధమని శాన్‌ఫ్రాన్సిస్కో ఫెడరల్ కోర్టు తేల్చిచెప్పింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ప్రొబేషనరీ ఉద్యోగులకు భారీ ఊరట దక్కింది. ట్రంప్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఐదు కార్మిక సంఘాలు, మరో ఐదు స్వచ్ఛంద సంస్థలు కోర్టును ఆశ్రయించాయి. ఉద్యోగులపై సామూహికంగా వేటు వేయకుండా ఆదేశాలివ్వాలని కోరుతూ వ్యాజ్యం దాఖలు చేశాయి. దీనిపై శాన్‌ఫ్రాన్సిస్కో కోర్టు న్యాయమూర్తి విలియమ్ అల్సప్ విచారణ చేపట్టారు. ప్రొబేషనరీ దశలో ఉన్న ఉద్యోగులను హఠాత్తుగా విధుల నుంచి తొలగించడం సరైంది కాదని పేర్కొన్నారు. చట్టం అందుకు అనుమతించదని వెల్లడించారు. ఉద్యోగులపై వేటు వేయకుండా చర్యలు తీసుకొనేలా సంబంధిత ప్రభుత్వ సంస్థలకు తగిన సూచనలు జారీ చేయాలని ఆఫీసు ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్‌ను ఆదేశించారు. రక్షణ శాఖకు సైతం ఇదే నియమం వర్తిస్తుందని స్పష్టంచేశారు. అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత వివిధ ప్రభుత్వ శాఖల్లో ఇప్పటికే వేలాది మంది ప్రొబేషనరీ ఉద్యోగులను తొలగించడం గమనార్హం. తమను విధుల్లో చేర్చుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ట్రంప్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి ప్రయత్నిస్తున్నారు. శాన్‌ఫ్రాన్సిస్కో కోర్టు తీర్పు పట్ల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏడాది కంటే తక్కువ కాలం నుంచి పని చేస్తున్నవారిని ప్రొబేషనరీ ఉద్యోగులుగా పరిగణిస్తారు. అమెరికాలో వీరు 2 లక్షల మందికిపైగా ఉంటారని అంచనా.

అంతర్జాతీయ ఆవాసం!

అవును. ఈ బుల్లి ఇల్లు నిజంగానే రెండు దేశాల పరిధిలో విస్తరించింది! ఈ గమ్మత్తైన ఇల్లు ఈశాన్య రాష్ట్రమైన నాగాలాండ్‌లోని లోంగ్వా గ్రామంలో ఉంది. ఇది కాస్త భారత్‌లో, మిగతా భాగం మయన్మార్ పరిధిలో ఉంటుంది! భారత్, మయన్మార్ సరిహద్దు సరిగ్గా ఈ గ్రామం నడుమగా పోవడమే దీనికి కారణం. ప్రధాన ద్వారానికి ఆ పక్క సగంపై నాగాలాండ్ (భారత్), ఈ పక్క సగంపై సగాయింగ్ (మయన్మార్) అని రాసి ఉంటుంది కూడా. ఇంటి బయట ఠీవిగా నుంచున్నది దాని యజమాని టోనెయ్ ఫ్వాంగ్. అన్నట్టూ, ఆయన స్థానిక కోన్యాక్ నాగా గిరిజన తెగ నాయకుడు కూడా. ఆరకంగా చూస్తే ఆయన నివాసం లోంగ్వా గ్రామం మొత్తానికీ రాజప్రాసాదం వంటిదన్నమాట. ఈ ఇంటికి 100 ఏళ్లపై చిలుకు చరిత్ర ఉంది. అంతర్జాతీయ సరిహద్దు మాత్రం 1971లో పుట్టుకొచ్చింది. ఫ్వాంగ్ ఇంటిని రెండు దేశాలకూ చెందేలా విడదీసింది. ''అంతర్జాతీయ సరిహద్దు 50 ఏళ్ల కింద పుట్టుకొచ్చింది. మా ఇల్లు అంతకు 50 ఏళ్ల ముందునుంచే ఉంది. సరిహద్దు భూభాగాన్ని విభజిస్తుందేమో గానీ ఇది మా పూర్వీకుల ఆవాసం. ఇందులో ఉండేందుకు మాకు ఎలాంటి ఇబ్బందీ ఎదురవడం లేదు'' అంటారు ఫ్వాంగ్. ఈ ఊళ్లోని వాళ్లంతా భారతీయులే. అందరికీ ఓటు హక్కు కూడా ఉంది. అయినా వారికి మయన్మార్ నుంచి పలు సంక్షేమ పథకాలు అందుతుండటం విశేషం! ఈ ఊళ్లో రెండు దేశాల సైన్యాలూ గస్తీ కాస్తుంటాయి. అంతే కాదు. ఈ ప్రాంతంలో భారత్, మయన్మార్ ప్రజలు వీసా తదితరాలేవీ అవసరం లేదు.



రెండు దేశాల మధ్య ఉన్న ఇల్లు. (ఇన్‌సెట్) పూర్తి చిత్రం

మలి కాకతీయులు ఎవరి సామంతులు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

తొలి కాకతీయులు

తొలి కాకతీయులు (కాకతీయ వంశంలోని ఆదిపురుషులు) రాష్ట్రకూటుల సేనానులుగా తెలంగాణకు వచ్చారని పీవీ పరబ్రహ్మశాస్త్రి నిరూపించారు. వీరు తమ పేరు చివరన రాష్ట్రకూట నామాన్ని (గుండియ రాష్ట్రకూట, ఎర్రయ రాష్ట్రకూట) ధరించేవారు. రాష్ట్రకూటుల రాజ చిహ్నమైన 'గరుడ'(గరుడబేతయ)ను తమ పతాకాలపై ఉంచుకునేవారు. రాష్ట్రకూటుల ఆస్థాన మతమైన జైనాన్ని అవలంభించడం, వారి వృష్ణి వంశాన్నే తమ వంశంగా చెప్పుకోవడం లాంటి కారణాల వల్ల కాకతీయులు రాష్ట్రకూట వంశస్థులేనని స్పష్టమవుతోంది. స్థానిక (తెలంగాణ) బోయ, పుళింద జాతులవారు జైనమతం ద్వారా సాంఘికోన్నతి సాధించి రాష్ట్రకూటుల వద్ద సైనికోద్యోగులుగా చేరి క్రమంగా సామంతులయ్యారనే అభిప్రాయమూ ఉంది. ఈ వంశానికి ఆద్యుడైన వెన్నరాజు (క్రీ.శ.750-768) రాష్ట్రకూట సేనాని, సామంతుడు. ఆదిలాబాద్ పశ్చిమప్రాంతం, బాసర, ముథోల్, కుబేరు(కుబీర్), భైంసా(మహిషా) ప్రాంతాలు ఇతని రాజ్యంలో ఉండేవి. ఇతడి తర్వాత మొదటి గుండరాజు (క్రీ.శ.768-824), రెండో గుండరాజు (క్రీ.శ.824 - 870), మూడో గుండరాజు (క్రీ.శ.870 - 895) రాష్ట్రకూటుల సేనానులుగా, సామంతులుగా పనిచేశారు. వీరి కాలం తదితర విషయాల్లో చరిత్రకారుల్లో భిన్నాభిప్రాయాలున్నాయి.

ఎర్రయరాజు (895-940)

ఈ వంశంలో మొదటి నలుగురి తర్వాత ఎర్రయరాజు (క్రీ.శ.895-940) కూడా రాష్ట్రకూటుల సేనానిగా కురవాడి సీమను పాలించాడు. వేంగి చాళుక్యులకు లోబడి ముదిగొండ చాళుక్యులు పాలించిన నేటి ఖమ్మం, వరంగల్ జిల్లాలోని కొరవి ప్రాంతమే కురవాడి సీమ. ముదిగొండ చాళుక్యులను తరిమేసి రాష్ట్రకూటులు ఎర్రయరాజును ఈ ప్రాంతానికి సామంతుడిగా నియమించారు. అయితే క్రీ.శ.934లో ముదిగొండ చాళుక్యులు ఆ ప్రాంతాన్ని తిరిగి ఆక్రమించారు. ఎర్రయ కొడుకు బేతియకు పెద్ద ప్రాధాన్యం లేదు. తర్వాత బేతియ కొడుకు నాలుగో గుండరాజు(క్రీ.శ.955-990) రాష్ట్రకూటుల సేనానిగా నియమితుడై కొరవిసీమను తిరిగి ఆక్రమించాడు. తూర్పు చాళుక్యులైన రెండో అమ్మరాజు, దానార్ణవుడి మధ్య కుటుంబ కలహాలు తలెత్తాయి. నాలుగో గుండరాజు దానార్ణవుడి పక్షం వహించి కొరవిసీమను పొందాడు.

క్రీ.శ.973లో కల్యాణీ చాళుక్య రెండో తైలపుడు రాష్ట్రకూట రాజ్యాన్ని ఆక్రమించాడు. దీంతో తైలపుణ్ని ఆశ్రయించిన ముదిగొండ చాళుక్య బొట్టు బేతరాజు.. విరియాల ఎర్రసేనాని ద్వారా తిరిగి కొరవిసీమను పొందగలిగాడు. దీంతో కాకతీయులు గడ్డు పరిస్థితుల్ని ఎదుర్కొన్నారు. కానీ తన భార్య విరియాల కామసాని వినతి మేరకు ఎర్రసేనాని కల్యాణీ చాళుక్య చక్రవర్తిని ఒప్పించి మొదటి బేతరాజు(క్రీ.శ.992-1052)ను అనుమకొండ విషయపాలకుడిగా నియమించాడు. కామసాని మొదటి బేతరాజు (గరుడ బేతరాజు) మేనత్త, గుండరాజు సోదరి.

మొదటి ప్రోలరాజు

బేతరాజు కల్యాణీ చాళుక్య సామంతుడిగా స్థిరపడ్డాడు. ఇతడి రాజ్యం కొరివిసీమ సరిహద్దు నుంచి కరీంనగర్ మండలంలో ఉన్న శనిగరం వరకు వ్యాపించింది. బేతరాజు తర్వాత అతడి కొడుకు మొదటి ప్రోలరాజు (క్రీ.శ.1052-1076) రాజ్యానికొచ్చాడు. ఇతడు వేములవాడ చాళుక్యరాజు భద్రగుణ్ణి (మూడో బద్దెగుడు) ఓడించి సబ్బిసాయర మండలం(కరీంనగర్ ప్రాంతం)లోని కొన్ని ప్రాంతాలను జయించాడు. అనుమకొండ విషయాన్ని మొదటి బేతరాజు తొలుత పొందినప్పటికీ శాశ్వత మాన్యంగా పొందింది మాత్రం ప్రోలరాజే. ప్రోలుడు చిత్రకూటలో అరాచకత్వాన్ని అణచివేయడం, బద్దెగుణ్ని జయించడం, కొంకణంపై విజయం సాధించడం వల్ల అతడి శౌర్యప్రతాపాలకు గుర్తింపుగా చక్రవర్తి అనుమకొండను శాశ్వతమాన్యంగా ఇచ్చాడు.

రెండో బేతరాజు

ఒకటో సోమేశ్వరుడు క్రీ.శ.1068లో మరణించాడు. తర్వాత చక్రవర్తిగా వచ్చిన రెండో సోమేశ్వరుణ్ని తొలగించి అధికారంలోకి రావాలని ఆరో విక్రమాదిత్యుడు వీలైనంత మంది మాండలికులను తనవైపు తిప్పుకునే ప్రయత్నం చేశాడు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ప్రోలుడు, అతడి కుమారుడు రెండో బేతరాజు.. ఆరో విక్రమాదిత్యుడికి అండగా నిలిచారు. అది ప్రోలుడి తర్వాత రాజైన రెండో బేతరాజు (క్రీ.శ.1076-1108)కు ఉపయోగపడింది. పారమార జగద్దేవుడు స్వాతంత్ర్యం ప్రకటించుకోవడమూ దీనికి దోహదం చేసింది. జగద్దేవుడి నుంచి సబ్బి సహస్రం మొత్తాన్ని విక్రమాదిత్యుడు బేతరాజుకు ఇచ్చినట్లు పద్మాక్షి ఆలయ శాసనం ద్వారా తెలుస్తోంది. శనిగరం ప్రాంతంతోపాటు సబ్బి సహస్రం కాకతీయ రాజ్యంలో చేరాయి. ముదిగొండ చాళుక్యుల రాజ్యంలోని కొన్ని భాగాలు కూడా ఇతడి రాజ్యంలో చేరాయి. ఇతడు అనుమకొండలో బేతేశ్వరాలయాన్ని, తన తండ్రి పేరుతో ప్రోలేశ్వరాలయాన్ని నిర్మించాడు.



రెండో ప్రోలరాజు

బేతరాజు తర్వాత ఇతడి పెద్ద కొడుకు దుర్గరాజు (క్రీ.శ.1108-క్రీ.శ.1116) రాజయ్యాడు. పదవీచ్యుతుడైన కొలనుపాక రాజు జగద్దేవుని ప్రోత్సాహంతో పాలవాస పాలకుడు మేడరాజు స్వాతంత్ర్యం పొందడానికి ప్రయత్నించాడు. ఈ సమయంలో పారమార జగద్దేవుని స్థానంలో కుమార సోమేశ్వరుడు(క్రీ.శ.1108-1125) కొలనుపాక రాజప్రతినిధిగా నియమితుడయ్యాడు. ఈ తిరుగుబాట్లను అణచడానికి కుమార సోమేశ్వరుడికి అండగా నిలిచిన రెండో ప్రోలరాజు(క్రీ.శ.1116-1157) జగద్దేవుడిని పారదోలి సోదరుడు దుర్గరాజును పదవీచ్యుతుణ్ని చేసి సింహాసనం అధిష్ఠించాడు. చాళుక్య చక్రవర్తుల నుంచి స్వాతంత్ర్యం పొందడానికి ప్రయత్నించిన సామంతులందరితో యుద్ధం చేసి ఓడించాడు. ఈ రకంగా తెలంగాణ మొత్తాన్ని జయించి కల్యాణీ చాళుక్య ప్రతాపచక్రవర్తి రెండో జగద్దేకమల్లుడు (క్రీ.శ.1138-1150)కి విధేయుడిగా ఉన్నాడు.

రెండో ప్రోలరాజు విజయాలు

కొలనుపాక రాజప్రతినిధిగా నియమితుడైన కుమార సోమేశ్వరుడు తన తండ్రి విక్రమాదిత్యుడి అనంతరం క్రీ.శ.1126లో మూడో సోమేశ్వరుడిగా రాజ్యానికొచ్చాడు. అంతకుముందు నుంచే కందూరునాడును పాలిస్తున్న యువరాజు కుమార తైలపుడు (క్రీ.శ.1110-1137) తన సోదరుడు మూడో సోమేశ్వరుడికి వ్యతిరేకంగా దక్షిణ తెలంగాణలో స్వాతంత్ర్యం పొందడానికి ప్రయత్నాలు మొదలుపెట్టాడు. ఈ ప్రయత్నంలోనే మూడో సోమేశ్వరుడికి అనుకూలుడైన కందూరి చోడ మొదటి గోకర్ణుడిని చంపించి కందూరునాడును శ్రీదేవి తొండయ, గోవింద దండేశులకు పంచి సామంతులుగా చేసుకున్నాడు. దీంతో మొదటి గోకర్ణుడి కుమారుడు రెండో ఉదయచోడుడు మూడో సోమేశ్వరుణ్ని ఆశ్రయించాడు. సోమేశ్వరుడి ఆదేశంతో రెండో ప్రోలుడు శ్రీదేవి తొండయ, గోవింద దండేశులను ఓడించి ఉదయచోడుడికి(క్రీ.శ.1131-36) పట్టం కట్టాడు. ఈ రకంగా దక్షిణ తెలంగాణ మీద ప్రోలుడు ఆధిక్యం సాధించాడు. తన అనుయాయుల ఓటమిని జీర్ణించుకోలేని తైలపుడు కాకతీయుల ఉత్తర సరిహద్దులో ఉన్న పాలవాస రాజైన మేడరాజును, అతడి తమ్ముడు గుండరాజును ప్రేరేపించాడు. అప్పటికే వీరు చాళుక్య చక్రవర్తుల పట్ల అవిధేయులుగా ఉన్నారు. రెండో జగద్దేకమల్లుడి(క్రీ.శ.1138-1150) పక్షాన నిలబడి ప్రోలరాజు గుండనను సంహరించాడు. గుండన కుటుంబానికి చెందిన ఏడో రాజును పారదోలాడు. ఈ విజయంతో ప్రోలరాజు ఉత్తర తెలంగాణ మీద ఆధిక్యత సాధించాడు. చక్రవర్తి పక్షాన కుమార తైలపుడిని ఓడించాడు. ఈ విజయోత్సాహంతో కృష్ణానది దాటి శ్రీశైలంలో విజయస్తంభం నాటించాడు. తెలంగాణపై ఆధిక్యం సాధించాక తీరాంధ్రను జయించే ప్రయత్నంలో మరణించాడు. ఓరుగల్లు కోట నిర్మాణాన్ని ఇతడే ప్రారంభించాడు. నతవాడి దుర్గరాజు సోదరి ముప్పమాంబ ప్రోలరాజు భార్య. వీరి కుమారులు.. రుద్రదేవుడు, మహాదేవుడు, హరిహరుడు, గణపతి, రేపొల్ల దుర్గరాజు. తండ్రి మరణానంతరం పెద్దకుమారుడైన రుద్రదేవుడు(క్రీ.శ.1158-క్రీ.శ.1195) రాజ్యానికొచ్చాడు.

మూడు సామంత రాజ్యాలు

కాకతీయ రాజ్య పరిసరాల్లో మూడు సామంత రాజ్యాలు ఉండేవి. తూర్పున ముదిగొండ చాళుక్యులు, వాయవ్యంగా కరీంనగర్ జిల్లాలో పొలవాస నాయకులు, దక్షిణాన కందూరు చోడులు ఉండేవారు. అనుమకొండ విషయానికి పశ్చిమాన ఉన్న ప్రాంతం రాజు ప్రత్యక్ష ఆధీనంలో ఉండేది. అనుమకొండకు నైరుతి దిశగా కొలనుపాక కేంద్రంగా రాజప్రతినిధులు ఈ ప్రాంతాన్ని పాలించేవారు. ప్రోలరాజు వీరిపై ఆధిక్యత సాధించిన సందర్భంలో రుద్రదేవుడు సింహాసనం అధిష్ఠించాడు.

రుద్రదేవుడు

తైలపుడు తన సోదరుడు జగదేక మల్లుని పదవీచ్యుణ్ని చేసి అధికారంలోకి వచ్చాడు. కాబట్టి పరబ్రహ్మ శాస్త్రి పేర్కొన్న తైలపుడు ఈ మూడో తైలపుడు కావడానికే ఎక్కువ అవకాశం ఉంది. పదవీభ్రష్టులైన కల్యాణి చాళుక్య రాజులు తమ పూర్వవైభవాన్ని తిరిగి సంతరించుకోలేరని నిర్ణయించుకున్న రుద్రదేవుడు క్రీ.శ.1162/3లో సార్వభౌమత్వాన్ని ప్రకటించుకున్నాడు. తెలంగాణలో తిరుగులేని ప్రభువుగా మారిన తర్వాత తీరాంధ్రపై దృష్టి పెట్టాడు.

వేయి స్తంభాల గుడి

రుద్రదేవుడు(క్రీ.శ.1158-క్రీ.శ.1195) తన తండ్రిని చంపిన వెలనాటి రాజుపై మొదట విజృంభించాడు. పల్నాటి యుద్ధంలో నలగామరాజుకు సహాయపడ్డాడు. ధాన్యకటకాన్ని స్వాధీనం చేసుకున్నాడు. దుర్జయులను ఓడించి త్రిపురాంతకాన్ని జయించాడు. క్రీ.శ.1186 నాటికి తీరాంధ్రను గెలిచాడు. ఈ రకంగా రుద్రదేవుడు కాకతీయ సామ్రాజ్యానికి గట్టి పునాదులు వేశాడు. ఈ విజయాల్లో సహాయం చేసిన రేచర్ల బేతిరెడ్డికి నల్లగొండ జిల్లాలోని ఆమనగల్లును, చెరకు రెడ్లకు జమ్ములూరును ఇచ్చాడు. ఇతడి రాజ్యం ఉత్తరాన గోదావరి, పశ్చిమాన బీదరు, దక్షిణాన శ్రీశైలం, తూర్పున సముద్రం వరకు విస్తరించిందని వేయి స్తంభాల గుడి శాసనం ద్వారా తెలుస్తోంది. రుద్రదేవుడు ఓరుగల్లు కోట నిర్మాణాన్ని కొంతమేర పూర్తిచేశాడు. రుద్రేశ్వర దేవాలయాన్ని కట్టించాడు. ఇదే వేయి స్తంభాల గుడి.

మహాదేవుడు

రుద్రదేవుడికి కుమారులు లేకపోవడం వల్ల తమ్ముడు మహాదేవుడు(క్రీ.శ.1195-1198) రాజ్యానికి వచ్చాడు. ఇతడు జైతుగి (క్రీ.శ.1192-1200) కాలంలో యాదవరాజ్యం మీద చేసిన యుద్ధంలో మరణించాడు. మహాదేవుని భార్య రాణి బయ్యాంబ. గణపతిదేవుడు, మైలాంబ, కుందమాంబ వీరి సంతానం. యాదవరాజులు గణపతిని బంధించారు. ఇదే అదనుగా ముదిగొండ చాళుక్యులు, వెలనాటి చోళులు, చోళరాజులు కాకతీయ సామ్రాజ్యాన్ని ఆక్రమించడానికి ప్రయత్నించారు. కానీ సామంతసేనానైన రేచర్ల రుద్రారెడ్డి(రుద్రసేనాని) మిగతా సేనానులు, సామంతులైన విరియాల, మాల్యాల సహాయంతో వీరిని ఓడించినట్లు పాలంపేట శాసనం ద్వారా తెలుస్తోంది. రుద్రసేనాని గణపతిదేవుడిని విడిపించి క్రీ.శ.1199లో కాకతీయ రాజ్య పట్టాభిషిక్తుడిని చేశాడు.

మాదిరి ప్రశ్నలు

1. కాకతీయ వంశానికి ఆద్యుడు?
   1) గణపతిదేవుడు 2) మొదటి గుండన
   3) వెన్నరాజు 4) మొదటి బేతరాజు
2. ఓరుగల్లు కోట నిర్మాణానికి పునాదులు వేసినవాడు?
   1) మొదటి ప్రోలరాజు
   2) రెండో ప్రోలరాజు
   3) గణపతిదేవుడు 4) రుద్రదేవుడు
3. నతవాడి దుర్గరాజు సోదరి ముప్పమాంబ ఎవరి భార్య?
   1) మొదటి ప్రోలరాజు
   2) గణపతిదేవుడు 3) మొదటి బేతరాజు
   4) రెండో ప్రోలరాజు
4. తొలి కాకతీయులు ఎవరికి సామంతులుగా ఉన్నారు?
   1) శాతవాహనులు 2) రాష్ట్రకూటులు
   3) బాదామి చాళుక్యులు 4) ఇక్ష్వాకులు
5. మలి కాకతీయులు ఎవరి సామంతులు?
   1) రాష్ట్రకూటులు
   2) కల్యాణి చాళుక్యులు
   3) బాదామి చాళుక్యులు
   4) కందూరి చాళుక్యులు
6. రుద్రదేవుడు ఏ కాలంనాటికి తీరాంధ్రను జయించాడు?
   1) క్రీ.శ. 1186 2) క్రీ.శ. 1180
   3) క్రీ.శ. 1176 4) క్రీ.శ. 1190
7. పల్నాటి యుద్ధంలో నలగామ రాజుకు సహాయపడ్డ కాకతీయ రాజు?
   1) గణపతిదేవుడు 2) ప్రతాపరుద్రుడు
   3) రుద్రదేవుడు 4) రెండోబేతరాజు
8. రుద్రదేవుడు యుద్ధాల్లో తనకు సహాయం చేసిన ఏ రాజును ఆమనగల్లు సామంతునిగా నియమించాడు?
   1) రేచర్ల నామిరెడ్డి 2) రేచర్ల చెవిరెడ్డి
   3) రేచర్ల లోకిరెడ్డి 4) రేచర్ల బేతిరెడ్డి
9. వేయి స్తంభాల గుడి (రుద్రేశ్వరాలయం) ని కట్టించినవారు?
   1) రుద్రదేవుడు 2) గణపతిదేవుడు
   3) రుద్రమదేవి 4) ప్రతాపరుద్రుడు

సమాధానాలు

1) 3 2) 2 3) 4 4) 2 5) 2
6) 1 7) 3 8) 4 9) 1

హిమనీనదాలుగా వేటిని పిలుస్తారు?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

భూగోళశాస్త్రం



ఉపరితలంపై ప్రవహించే నదులు, హిమనీ నదాలు, పవనాలు, వేలా తరంగాల లాంటి బాహ్య బలాల ప్రభావం వల్ల భూపటల శిలలు శైథిల్యమవడాన్నే 'క్రమక్షయం'గా వ్యవహరిస్తారు. ప్రస్తుతం భూగోళం కవోష్ణ యుగంలో ఉండటం వల్ల నదులు ప్రధాన క్రమక్షయ కారకాలు. ఎత్తైన పర్వతాలు, పీఠభూములు నదుల క్రమక్షయ ప్రక్రియ వల్ల క్రమంగా శిథిలమై వివిధ రకాల భూస్వరూపాలు రూపాంతరం చెందుతున్నాయి.

నదులు - క్రమక్షయం

నదులు శైథిల్య శిలా పదార్థాన్ని రవాణా చేసి లోతట్టు హరివాణాలు లేదా సముద్ర భూతలంపై నిక్షిప్తం చేస్తాయి. అందువల్ల వివిధ రకాల క్రమక్షయ, నిక్షేపణా భూ స్వరూపాలు ఏర్పడతాయి. గంగా-సింధు మైదానం, నైలు నదీ లోయ, మిసిసిప్పీ - మిస్సోరి మైదానం తదితరాలను ప్రపంచంలోని ప్రధాన నదీ హరివాణాలు, నదీ భూ దృశ్యాలకు (Fluvial landscape) ఉదాహరణగా పేర్కొనవచ్చు. నదులు క్రమక్షయ శక్తి వల్ల అవి ప్రవహించే లోయలను కోతకు గురి చేస్తాయి. ఈ కోత క్షితిజ లంబ దిశలో (అథో క్రమక్షయం) లేదా క్షితిజ సమాంతర దిశలో (పార్శ్వ క్రమక్షయం) ఉండవచ్చు. శైథిల్య శిలా పదార్థాన్ని నదులు తమతో పాటు ద్రావణం రూపంలో, చోదక రూపంలో లేదా తేలియాడటం ద్వారా రవాణా చేస్తాయి. నదీ భారం బాగా అధికమైనప్పుడు, నదీ వేగం క్షీణించినప్పుడు శిలా పదార్థం అనువైన ప్రదేశాల్లో నిక్షిప్తమవుతుంది. శిలా పదార్థాన్ని కణాల పరిమాణం ఆధారంగా వేరు చేసిన తర్వాతే నది నిక్షేపిస్తుంది. అందువల్ల నదీ హరివాణం ఎగువ భాగంలో స్థూల రేణువులతో కూడిన ఇసుక, మధ్య భాగంలో సిల్ట్, చివరగా నదీ ముఖద్వారాల వద్ద సూక్ష్మ రేణు నిర్మితమైన బంకమన్ను ఉంటుంది.

క్రమక్షయ దశలు

నదులు.. అవి ఆవిర్భవించిన ఎత్తైన పర్వతాలు, పీఠభూముల ప్రాంతాల్లో వేగంగా ప్రవహిస్తూ అధిక క్రమక్షయ శక్తి కలిగి ఉంటాయి. అందువల్ల ఈ ప్రాంతాల్లో నదులు కేవలం క్రమక్షయాన్ని.. ముఖ్యంగా అథో క్రమక్షయాన్ని మాత్రమే కలిగిస్తాయి. పర్వతాలు, పీఠభూముల ద్వారా మైదానాలను చేరిన తర్వాత నదుల క్రమక్షయ శక్తి బాగా క్షీణిస్తుంది. ఈ సమయంలో అవి పార్శ్వ క్రమక్షయం మాత్రమే చేస్తాయి. క్రమంగా ఇది స్వల్ప పరిమాణంలో నిక్షేపణ చేసే దశకు చేరుకుంటుంది. సముద్రాల్లో కలిసే దశలో నదులు అధిక నదీ భారం వల్ల పెద్ద మొత్తాల్లో నిక్షేపణ చేస్తాయి. క్రమక్షయం పూర్తిగా స్తంభించిపోతుంది.

భూ స్వరూపాలు

నదీ హరివాణంలో ఆవిర్భావ ప్రాంతం నుంచి నదీ ముఖ ద్వారం మధ్య అనేక రకాల భూ స్వరూపాలను గమనించవచ్చు. ఆవిర్భావ ప్రాంతాల్లో క్రమక్షయ భూ స్వరూపాలు, మధ్య భాగంలో క్రమక్షయ, నిక్షేపణా భూ స్వరూపాల మిశ్రమం, ముఖద్వారాల వద్ద నిక్షేపణ భూ స్వరూపాలు స్పష్టంగా కనిపిస్తాయి. నది ఎగువ భాగాల్లో కింద పేర్కొన్న క్రమక్షయ భూ స్వరూపాలు ఏర్పడతాయి.

- 'V' ఆకారపు లోయలు, గార్జ్‌లు, కానియన్‌లు
- నదీ గ్రహణం, ప్లంజ్ పూల్స్
- జలపాతాలు, రాపిడ్స్, కాస్కేడ్స్

క్షితిజ లంబదిశలో అథో క్రమక్షయం వల్ల నదుల్లో లోతైన 'V' ఆకారం సంతరించుకుంటుంది. కొన్ని సందర్భాల్లో ఇవి చాలా లోతుగా ఉండి నిటారు వాలులు ఏర్పడినప్పుడు గార్జ్‌లు, కానియన్లుగా పిలుస్తారు. ఉదాహరణకు హిమాలయ నదులు శివాలిక్ కొండలు దాటేటప్పుడు లోతైన గార్జ్‌ల ద్వారా ప్రవహిస్తాయి. బ్రహ్మపుత్రా నది భారతదేశంలోకి అరుణాచల్ ప్రదేశ్‌లోని 'సయాడియా' గార్జ్ నుంచి ప్రవేశిస్తుంది. యూఎస్‌ఏలోని కొలరాడో నది ప్రపంచ ప్రసిద్ధి చెందిన 'గ్రాండ్ కానియన్' నుంచి ప్రవహిస్తుంది.

ఎత్తైన పర్వత ప్రాంతాల్లో అనేక నదులు వేగంగా ప్రవహిస్తూ భారీ జలపాతాలను ఏర్పరుస్తాయి. సహ్యాద్రి కొండల్లోని శరావతి నది మన దేశంలోకెల్లా ఎత్తైన 'జోగ్' జలపాతాన్ని ఏర్పరుస్తుంది. నయాగరా, లివింగ్ స్టోన్, ఏంజల్ లాంటి ప్రపంచ ప్రసిద్ధ జలపాతాలు నదుల క్రమక్షయం వల్లే ఏర్పడ్డాయి. కావేరి నది ఎత్తైన కర్ణాటక పీఠభూమిని వదిలి తమిళనాడు పీఠభూమిని చేరేటప్పుడు శివసముద్రం, హోగెంకల్ జలపాతాలు ఏర్పడ్డాయి. ఆవిర్భావ ప్రాంతాల్లో వేగంగా ప్రవహించే నదులు సమాంతరంగా ప్రవహించే చిన్న నదులను క్రమంగా తమలో కలుపుకుంటాయి. ఈ ప్రక్రియనే 'నదీ గ్రహణం'గా పిలుస్తారు. భగీరథీ నది సమీపంలోని అలక్‌నందా నదిని కలుపుకోవడం ద్వారా గంగానది ఆవిర్భవిస్తుంది. సమాంతర నదులను వేరుచేసే ఎత్తైన ప్రాంతాన్ని వేగంగా ప్రవహించే నది శిథిలం చేయడంతో నదీ గ్రహణం సంభవిస్తుంది. ప్రవాహ దిశ మరలించిన చిన్న నది లోయ ఎండిపోతుంది.

గిరిపద మైదానాలు

నదులు పర్వతాలను వీడి మైదానాలను చేరినప్పుడు అకస్మాత్తుగా తమ గతిశక్తిని కోల్పోవడంతో పర్వతపాదాల వద్ద కొంత శిథిల శిలా పదార్థాన్ని నిక్షేపిస్తాయి. ఈ రకంగా ఏర్పడిన మైదానాలనే 'గిరిపద మైదానాలు' (Peidmont plains)గా పిలుస్తారు. శివాలిక్ కొండలు -గంగా మైదానానికి సంధి ప్రాంతంలో హిమాలయ నదీ నిక్షేపణం వల్ల ఏర్పడిన గిరిపద మైదానాన్ని భాబర్, టెరాయి మండలాలుగా విభజిస్తారు. భాబర్ మండలం గులకరాళ్లు, ఇసుకతో కూడి ఉంటుంది. అధిక సచ్ఛిద్రత వల్ల భాబర్ మండలంలో హిమాలయ నదుల నీరు ఇంకిపోయి లోయలు ఎండిపోతాయి. టెరాయి మండలంలో ఇంకిన నీరు పైకి ఉబికి వచ్చి చిత్తడి నేలలు ఏర్పడతాయి. టెరాయి మండలంలో దట్టమైన అరణ్యాలు విస్తరించి ఉన్నాయి.

మైదాన ప్రాంతాల్లో పార్శ్వ క్రమక్షయం వల్ల విశాలమైన 'U' ఆకారపు లోయల నుంచి నదులు ప్రవహిస్తాయి. కఠిన శిలా ప్రాంతాలను క్రమక్షయం చేసే శక్తి లేకపోవడంతో నదులు వంకలు తిరిగి ప్రవహిస్తాయి. ఈ నదీ మార్గాలను 'నది వక్రతలు'గా పిలుస్తారు. 'U' ఆకారపు లోయలతో కూడిన వక్రతల ద్వారా ప్రవహించేటప్పుడు అంతర్ వక్రతల తలాల వెంట శిలా పదార్థం నిక్షేపితమై ఇసుక దిబ్బలుగా ఏర్పడతాయి. ఈ ఇసుక దిబ్బలనే 'స్పర్స్' అంటారు. నదుల్లోకి వరదలు వస్తే లోయను వీడిన నది ఇరువైపులా ఉన్న లోతట్టు ప్రాంతాలను ముంచేస్తుంది. ఈ వరద నీటిలో ఉన్న శిలా పదార్థం నదీ లోయకు ఇరువైపులా నిక్షిప్తమవుతుంది. దీనివల్ల ఏర్పడే మైదానాలను 'వరద మైదానాలు' అంటారు. ఇవి చాలా సారవంతమైనవి. గంగా-సింధు-బ్రహ్మపుత్ర మైదానం అనేక వరద మైదానాలతో కూడి ఉంది. గంగా మైదానంలోని వరద మైదానాన్ని 'ఖాదర్', భంగర్ అనే రెండు భాగాలుగా విభజిస్తారు. వరద మైదానంలో నదీ లోయకు సమీపంలోని లోతట్టు ప్రాంతాన్ని ఖాదర్ మైదానంగా పిలుస్తారు. ఇది తరచుగా వరద ముంపునకు గురవడం వల్ల నవీన ఒండ్రుమట్టితో నిండి ఉంటుంది. వరద మైదానంలో లోయకు దూరంగా ఉన్న ఎత్తైన ప్రాంతాలను 'భంగర్ మైదానం'గా పిలుస్తారు. ఈ మండలం పురాతన ఒండ్రుమట్టితో నిండి ఉంటుంది. ఈ ప్రాంతంలో వరద ముంపు తక్కువ. వరద మైదానంలో అర్ధ చంద్రాకృతిలో ఉండే ఆక్స్‌బో సరస్సులు కూడా ఏర్పడతాయి. నదీ లోయలకు ఇరువైపులా ఒండ్రుమట్టి నిక్షేపణం వల్ల ఏర్పడే ఎత్తైన ఇసుకదిబ్బలను సహజ లెవీలుగా పిలుస్తారు. ఇవి వరద మైదానాన్ని భవిష్యత్‌లో సంభవించే వరదల నుంచి కాపాడతాయి. కొన్ని సందర్భాల్లో ఈ లెవీలు, ఉప నదుల సంగమాన్ని నిరోధిస్తాయి. ఉప నదులు సహజ లెవీలకు సమాంతరంగా ప్రవహించి చాలా దూరం తర్వాత ప్రధాన నదిలో కలుస్తాయి. ఈ రకమైన సంగమ ప్రాంతాలను 'యాజూ సంగమాలు'గా పిలుస్తారు.

నదీ ముఖద్వారాలు

నదులు.. సముద్రాల్లో కలిసే ప్రాంతాల (నదీ ముఖద్వారాలు) వద్ద ఒండ్రుమట్టిని లోయల్లోనే నిక్షేపించడంతో శాఖోపశాఖలుగా చీలిపోతాయి. ఈ శాఖల మధ్య ఒండ్రుమట్టి నిక్షేపణం వల్ల ఏర్పడే మైదానాలను 'డెల్టాలు' అంటారు. ఇవి చాలా సారవంతమైనవి. అనాదిగా డెల్టా ప్రాంతాల్లో సాంద్ర వ్యవసాయం అభివృద్ధి చెందింది. గోదావరి నది రాజమండ్రికి దిగువ మూడు ప్రధాన పాయలుగా చీలిపోతుంది. ఈ పాయల మధ్య గోదావరి డెల్టా ఏర్పడింది. గంగా-హుగ్లీ-బ్రహ్మపుత్ర డెల్టా పక్షిపాద ఆకారంలో ఉంటుంది. కృష్ణా డెల్టా డిజిటేట్ తరగతికి, గోదావరి డెల్టా లోబేట్ రకానికి చెందింది. నర్మద, తపతి నదులు వాటి ముఖద్వారాల వద్ద కాకుండా శైథిల్య శిలా పదార్థాన్ని సముద్ర భూతలంపై నిక్షేపిస్తాయి. అందువల్ల అవి డెల్టాలను ఏర్పరచవు. వీటి ముఖద్వారాలను 'ఎస్ట్యురీలు'గా పిలుస్తారు.

హిమనీనదాలతో క్రమక్షయం..

కదిలే హిమ భాగాలనే హిమనీనదాలుగా పిలుస్తారు. ఇవి వేగంగా ప్రవహించే పర్వతీయ (లోయ) లేదా నెమ్మదిగా కదిలే విశాలమైన ఖండాంతర హిమనీనదాల రూపంలో ఉండవచ్చు. హిమనీనదాలు ఉత్పాతనం, అపఘర్షణ లేదా ఫ్రాస్ట్ వెడ్జింగ్ ప్రక్రియల ద్వారా పటల శిలలను శైథిల్యం చేస్తాయి. గ్రీన్‌లాండ్, ఐస్‌లాండ్, అంటార్కిటికా లాంటి ధ్రువ ప్రాంతాలు, ఆల్ప్స్-హిమాలయాల లాంటి ఎత్తైన పర్వత శిఖరాల ప్రాంతాల్లో హిమనీనద క్రమక్షయం ఉంది. ఉత్తర అమెరికాలోని మహా సరస్సుల ప్రాంతం, ఐరోపా, సైబీరియా హిమనీనద భూదృశ్యాలకు మంచి ఉదాహరణలు. శైథిల్య శిలా పదార్థాన్ని హిమనీనదాలు పరిమాణాన్ని అనుసరించి వేరు చేయకుండా నిక్షేపిస్తాయి. అంటే ఈ నిక్షేపాల్లో స్థూల, సూక్ష్మ రేణువులు గుట్టగా ఉంటాయి. పర్వత వాలులపై ప్రవహించే హిమనీనదాలు లోతు తక్కువ ఉన్న విశాలమైన 'U' ఆకారపు లోయల ద్వారా ప్రవహిస్తాయి. వీటి క్రమక్షయ ప్రభావంతో పర్వత వాలుల వెంట పడక కుర్చీ ఆకారంలో ఉండే లోతైన గుంటలు ఏర్పడతాయి. వీటిని 'సర్క్' (Cirque) అంటారు. పర్వతం లేదా కొండ వివిధ వాలులపై వేర్వేరు హిమనీనదాలు ప్రవహిస్తూ సర్క్‌లను ఏర్పాటు చేస్తుంటాయి. వివిధ తలాలపై ఏర్పడిన సర్క్‌లు విశాలమై, క్రమంగా కొండను పదునైన అంచుతో కూడిన పిరమిడ్‌గా మారుస్తాయి. వీటిని ఏరేట్‌లు అంటారు. ఏరేట్‌లు మరింత క్రమక్షయం చెంది శృంగాకారంలోకి మారతాయి. వీటిని 'హార్న్'గా వ్యవహరిస్తారు. ఉదాహరణకు ఆల్ప్స్ పర్వతాల్లోని 'మాటర్ హార్న్' శృంగాలు మరింత హిమనీనద క్రమక్షయానికి లోనవడంతో కొండ దాదాపుగా అదృశ్యమై 'కనుమ'గా రూపాందుతుంది. హిమాలయాల్లోని కారంకోరం, షిప్కిలా, జోజిలా, బనిహాల్ కనుమలు ఈ కోవకు చెందినవే. ఖండ భాగాల్లో ప్రవహించే హిమనీనదాలు వాటి ప్రవాహ మార్గంలోని పెద్ద పెద్ద శిలలను క్రమక్షయం చేయడం వల్ల క్రాగ్ అండ్ టెయిల్, రోచే మౌంటేన్ లాంటి భూ స్వరూపాలు ఏర్పడతాయి. క్రాగ్ అండ్ టెయిల్‌లో కఠిన శిలా భాగం క్రమక్షయాన్ని నిరోధించడంతో నిట్రాలుగా ఏర్పడగా, మృదువైన శిలా భాగంలో తిన్నని వాలుగా ఏర్పడుతుంది. హిమనీ నది ప్రవాహ దిశలో శిలల తలాలపై అపఘర్షణ వల్ల అవి మృదువుగా తయారవుతాయి. పరాన్ముఖ దిశలో ఉత్పాతన వల్ల గరుకైన తలాలు ఏర్పడతాయి. ఈ రకంగా ఒకవైపు మృదు, ఇంకోవైపు గరుకైన తలాలతో కూడిన శిలలనే 'రోచేమౌంటేన్'గా పిలుస్తారు.

మొరైన్‌లు

హిమనీనదాలు శిలా పదార్థాన్ని తీసుకొచ్చి అనువైన ప్రాంతాల్లో నిక్షేపించడం వల్ల వివిధ రకాల భూ స్వరూపాలు ఏర్పడతాయి. రేఖీయంగా ఎత్తు తక్కువలో ఉండే దిబ్బల లాంటి హిమనీనద నిక్షేపాలను 'మొరైన్'లుగా పిలుస్తారు. ఇవి పొరలతో కాకుండా వివిధ పరిమాణాల రేణువులతో కూడి ఉంటాయి. కోడిగుడ్డు ఆకారంలో ఉండే నిక్షేపణా భూ స్వరూపాలను 'డ్రమ్లిన్లు' అంటారు. ఉత్తర ఐర్లాండ్ ప్రాంతంలో కొన్ని వేల సంఖ్యలో డ్రమ్లిన్‌లు వరుసగా అమరి ఉన్నాయి. ఈ ప్రాంతాన్ని 'ఎగ్ బాస్కెట్ కంట్రీ' అంటారు.

హిమనీనదాల అంత్య దశలో మంచు క్రమంగా కరిగి నీరుగా మారడం ప్రారంభమవుతుంది. అందువల్ల అంత్య దశలో హిమనీనదాల్లో మంచుతో పాటు నీరు కూడా ప్రవహిస్తుంది. దీంతో హిమనీనద క్రమక్షయానికి నదీ క్రమక్షయం కూడా తోడవుతుంది. నీటి ప్రక్రియ వల్ల హిమనీనదాల అంత్య దశలో రేఖీయంగా ఉండే పొడవైన దిబ్బల మాదిరిగా మెత్తని ఇసుక నిక్షిప్తమవుతుంది. ఈ ఇసుక దిబ్బలను 'ఎస్కర్లు'గా పిలుస్తారు. ఇవి కొన్ని కిలోమీటర్ల దూరం వ్యాపించి ఉంటాయి. ఇవి హిమనీనద లోయలకు సమాంతరంగా ఏర్పడతాయి. వీటిలో కేవలం సూక్ష్మ ఇసుక రేణువులు మాత్రమే ఉంటాయి.

ఎర్రాటిక్స్

తిన్నని వాలులతో కూడిన శంఖు ఆకారపు ఒండ్రుమట్టి దిబ్బలు కూడా హిమనీనద నిక్షేపణ వల్ల అంత్య దశలో ఏర్పడతాయి. వీటిని 'కేమ్స్'గా పిలుస్తారు. ఇవి సాధారణంగా హిమనీనద ముఖద్వారం వద్ద ఏర్పడతాయి. హిమనీనదాలు తమతో పాటు పెద్ద బండరాళ్లను చాలా దూరం తీసుకొచ్చి అంత్య దశలో నిక్షేపం చేస్తాయి. ఈ బండరాళ్లకు, స్థానిక శిలలకు పోలికలుండవు. వీటిని 'ఎర్రాటిక్స్' అంటారు. 'ఎర్రాటిక్స్' హిమనీనదాల ప్రయాణ దిశను సూచిస్తాయి. అంత్యదశలో మెత్తని గులకరాళ్లు, ఒండ్రుమట్టి నిక్షేపణం వల్ల ఏర్పడే సమతల మైదానాలను 'అవుట్ వాష్ మైదానాలు' అంటారు. వీటి ఏర్పాటులో నీరు కూడా ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఈ మైదానంలో హిమనీనదం అనేక చిన్న పాయలుగా చీలిపోతుంది. ఈ మైదానంలో ఉండే చిన్నచిన్న గుంటల లాంటి హరివాణాలను 'కెటిల్ రంధ్రాలు' అంటారు.

వినత్రీకరణ బ్యాక్టీరియా ఏది?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

బయాలజీ

మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో పోలియో వ్యాధి లక్షణం ఏది?
   1) తలనొప్పి 2) జలుబు
   3) ఒళ్లునొప్పులు 4) కండరాల పక్షవాతం
2. కింది వాటిలో వైరస్ ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులేవి?
   1) పోలియో, తట్టు
   2) గవదబిళ్లలు, జలుబు
   3) కలరా, టైఫాయిడ్ 4) 1, 2
3. పెన్సిలిన్ అనేది ఒక:
   1) సూక్ష్మ జీవి నాశకం 2) కీటక నాశకం
   3) బయోఫెర్టిలైజర్ 4) పైవేవీకాదు
4. మానవుడిలో ఆల్కహాల్ దేనిపై ప్రభావం చూపుతుంది?
   1) హృదయం 2) కండరాలు
   3) చర్మం 4) నాడీ మండలం
5. అయోడిన్ ఎక్కువ మొత్తంలో దేనిలో లభిస్తుంది?
   1) పాలు 2) మాంసం
   3) సముద్ర చేపలు 4) కూరగాయలు
6. సెల్యూలోజ్‌కు సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
   1) ఆహారానికి బరువునిస్తుంది
   2) ఖనిజ లవణం
   3) ఆహార నాళంలో ఆహారం సులువుగా కదలడానికి తోడ్పడుతుంది
   4) ఆహారంలో సెల్యూలోజ్ లేకపోతే పూర్తిగా జీర్ణం కాదు
7. ఆహార వాహికలోని కండరాలు..?
   1) నియంత్రిత కండరాలు
   2) అనియంత్రిత కండరాలు
   3) హృదయ కండరాలు
   4) నియంత్రిత - అనియంత్రిత కండరాలు
8. కింది వాటిలో ఇనుము, ఇతర ఖనిజ మూలకాలు అధికంగా కలిగి ఉండేవి ఏవి?
   1) పప్పు ధాన్యాలు 2) ఆకుకూరలు
   3) మాంసం 4) బంగాళాదుంప
9. శ్వాసక్రియ కింది వాటిలో దేని సమక్షంలో జరుగుతుంది?
   1) కాంతి 2) పత్రహరితం
   3) సరైన ఉష్ణోగ్రత 4) తేమ
10. మానవుడి దేహంలో ఉండే కేంద్రక రహిత సజీవకణాలు ఏవి?
    1) ఎర్ర రక్తకణాలు 2) తెల్ల రక్త కణాలు
    3) నాడీకణాలు 4) కండర కణాలు
11. ఊపిరితిత్తులకు ఆమ్లజని రహిత రక్తాన్ని తీసుకొని వెళ్లే రక్తనాళం?
    1) పుపుససిర 2) పుపుస ధమని
    3) పూర్వ మహాసిర 4) దైహిక ధమని
12. దేనిలో అడ్డంకి ఏర్పడినప్పుడు గుండెపోటు సంభవిస్తుంది?
    1) పుపుస ధమని
    2) హృదయ/కరోనరీ ధమని
    3) హృదయ సిర 4) పుపుస సిర
13. కింది వాటిలో సరికానిది ఏది?
    1) రక్తం గడ్డకట్టకుండా ప్లాస్మా సేకరించవచ్చు
    2) రక్తం గడ్డకట్టిన తరువాతే సీరమ్‌ను సేకరిస్తారు
    3) ప్లాస్మాలో ఉండే కొన్ని ప్రోటీన్లు సీరమ్‌లో ఉండవు
    4) ప్లాస్మా నీలం రంగులో ఉండే ద్రవం
14. రక్త వర్గాలకు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
    1) రక్త వర్గాలను మొదట గుర్తించిన శాస్త్రవేత్త - కార్ల్ లాండ్ స్టీనర్
    2) ఆర్‌బీసీలపై ఉండే ప్రతిజనకాలు ఎ, బి ఆధారంగా ఎ, బి, ఎబి, ఒ అనే నాలుగు రకాల వర్గాలను గుర్తించారు
    3) ప్రతిజనకాలు లేని రక్త వర్గం - 'ఒ', ప్రతిరక్షకాలు లేని వర్గం - 'ఎబి'
    4) పైవన్నీ సరైనవే
15. కింది వాటిలో కొంత మంది శిశువులు పుట్టిన వెంటనే మరణించడానికి కారణం ఏది?
    1) ఆర్‌హెచ్ కారకానికి ప్రతిరక్షకాలు ఏర్పడడం
    2) ఆర్‌హెచ్ కారకానికి ప్రతి జనకాలు ఏర్పడడం
    3) పైరెండూ 4) ఏదీకాదు
16. డయాలసిస్ యంత్రం ఒక:
    1) కృత్రిమ గుండె
    2) కృత్రిమ ఊపిరితిత్తులు
    3) కృత్రిమ కాలేయం
    4) కృత్రిమ మూత్రపిండం
17. శరీరంలో యూరియా ఏ భాగంలో ఉత్పత్తి అవుతుంది?
    1) మూత్రపిండాలు 2) ఊపిరితిత్తులు
    3) కాలేయం 4) పెద్దపేగు
18. హృదయ కండరం ఏ ప్రత్యేక లక్షణాన్ని కలిగి ఉంటుంది?
    1) గ్లానీ 2) లయ బద్ధత
    3) సార్కొలెమ్మా 4) ఆకారం
19. అరేఖిత (నునుపు) కండరాలు ఏ భాగంలో ఉంటాయి?
    1) మెడ 2) కాళ్లు-చేతులు
    3) జీర్ణాశయం-మూత్రాశయం 4) వేళ్లు
20. వరి నారు మొక్కలో 'తెలివి తక్కువ మొలక' (Foolish Seedling Disease) వ్యాధికి కారణమయ్యేది?
    1) వైరస్ 2) బ్యాక్టీరియా
    3) శైవలం 4) శిలీంధ్రం
21. ఆల్ఫా, బీటా-ఇంటర్ ఫెరాన్‌లను ఉత్పత్తి చేసేవి ఏవి?
    1) వైరల్ సాంక్రమిక కణాలు
    2) మైక్రోఫేజ్‌లు 3) వైరస్‌లు
    4) టి-కణాలు
22. పారిశ్రామికంగా ఇథనాల్‌ను ఉత్పత్తి చేయడానికి ఉపయోగించే పదార్థాలు?
    1) కార్న్‌స్టార్చ్, మొలాసిస్
    2) షుగర్ బీట్‌లు, దుంపలు
    3) ద్రాక్ష 4) పైవన్నీ
23. చమురు కాలుష్యాన్ని నివారించడానికి ఉపయోగించే బ్యాక్టీరియా?
    1) ట్రైకోమోనాస్ 2) సుడోమోనాస్
    3) రైనోసీరాస్ 4) జాంతోమోనాస్
24. కింది వాటిలో సరికాని జత?
    1) గ్లియోబ్లాస్టోమా - మెదడు
    2) ఏంజియోసార్కోమా - రక్తం
    3) లింపోమా - ప్లీహం
    4) ఎడినో సార్కోమా - గ్రంథి కణజాలం
25. ప్రకృతి వరణాన్ని ప్రయోగాత్మకంగా పరిశీలించిన వారెవరు?
    1) డార్విన్ 2) వీజ్‌మన్
    3) బెర్నార్డ్ కెటిల్‌వెల్ 4) సింప్సన్
26. మొక్కలతో సంశ్లేషణ చేయని విటమిన్?
    1) బి$_{12}$ 2) బి$_6$ 3) బి$_1$ 4) ఇ
27. కింది వాటిలో అత్యధిక జీవ వైవిధ్యాన్ని ప్రదర్శించే ఆవాసం ఏది?
    1) ఎడారులు 2) సమశీతోష్ణ అడవులు
    3) ఉష్ణమండల వర్షారణ్యాలు
    4) గడ్డి మైదానాలు
28. జీవ అనుఘటకాలు అంటే..?
    1) వినియోగదారులు మాత్రమే
    2) వినియోగదారులు, ఉత్పత్తిదారులు, విచ్ఛిత్తికారులు
    3) ఉత్పత్తి, వినియోగదారులు
    4) ఉత్పత్తి దారులు మాత్రమే
29. 'జీవుల నిర్మాణాత్మక, క్రియాత్మక ప్రమాణం -కణం' అని పేర్కొన్న శాస్త్రవేత్త?
    1) అరిస్టాటిల్ 2) రాబర్ట్ హుక్
    3) ష్లైడన్-ష్వాన్ 4) జార్జ్ మెండల్
30. కేంద్రక పూర్వ జీవుల కణంలో లోపించిన కణాంగాలు ఏవి?
    1) క్రోమోజోమ్స్ 2) మైటోకాండ్రియా
    3) ప్లాస్మామెంబ్రేన్ 4) రైబోజోమ్స్
31. 'అల్లం' మనం ఆహారంగా ఉపయోగించే భూగర్భకాండ రూపాంతరం. దీన్ని శాస్త్రీయంగా ఏమని పిలుస్తారు?
    1) రైజోమ్ 2) కందం
    3) దుంప 4) లశునం
32. జలగల పోషణ విధానం ఏది?
    1) హెర్బివోరస్ 2) ఇన్‌సెక్టివోరస్
    3) కార్నివోరస్ 4) సాంగ్వివోరస్
33. లివర్ సిర్రోసిస్‌కి కారణం?
    1) కొకైన్ 2) ఎల్ఎస్‌డీ
    3) ఆల్కహాల్ 4) మార్ఫిన్
34. జనటిక్ ఇంజనీరింగ్ ప్రయోగాల్లో చాలా ఎక్కువగా ఉపయోగించే రెండు బ్యాక్టీరియాలు?
    1) నైట్రసోమోనాస్, క్లెబ్సియెల్లా
    2) ఎశ్చరీషియా, అగ్రోబ్యాక్టీరియమ్
    3) నైట్రోబాక్టర్, అజటో బాక్టర్
    4) రైజోబియం, డిప్లోకోకస్
35. జతపరచండి.

శాస్త్రవేత్త	సిద్ధాంతం
i) డార్విన్	a) ఉపయుక్త- నిరుపయుక్త సూత్రం
ii) లామార్క్	b) జాతుల ఉత్పత్తి
iii) హ్యూగోడీవ్రీస్	c) జీవం ఆవిర్భావం
iv) ఎ.ఐ. ఒపారిన్	d) ఉత్పరివర్తన సిద్ధాంతం

    1) i-a, ii-b, iii-c, iv-d
    2) i-c, ii-a, iii-b, iv-d
    3) i-b, ii-a, iii-d, iv-c
    4) i-d, ii-c, iii-b, iv-a
36. కింది వాటిలో సరైంది?
    ఎ) అధిక కిరణజన్య సంయోగక్రియ సామర్థ్యం ఉండటం వల్ల క్లోరెల్లా శైవలాన్ని వ్యోమగాములు ఆక్సిజన్ కోసం అంతరిక్షానికి తీసుకెళతారు
    బి) శైవలాలన్నీ స్వయం పోషకాలే కానీ, సిపాల్యురాస్ పరాన్న జీవి శైవలం
    సి) కణజాల వర్ధనంలో పోషక యానకాన్ని అర్ధ-ఘనస్థితికి మార్చడానికి ఉపయోగించే అగార్-అగార్‌శైవలాల నుంచి సంగ్రహిస్తారు
    1) ఎ, సి 2) బి, సి
    3) ఎ, బి 4) ఎ, బి, సి
37. మిగతా జీవులతో పోల్చినప్పుడు మానవ మెదడులో ఏ భాగం బాగా అభివృద్ధి చెందింది?
    1) మెడుల్లా అబ్లాంగేటా
    2) అనుమస్తిష్కం 3) మస్తిష్కం
    4) దృష్టి లంబికలు
38. శ్వాసక్రియ, హృదయ స్పందన, పెరిస్టాలిక్ చలనం మెదడులో ఏ భాగం అధీనంలో ఉంటుంది?
    1) మెడుల్లా అబ్లాంగేటా
    2) మెడుల్లా అబ్లాంగేట, మస్తిష్కం
    3) మెడుల్లా అబ్లాంగేటా, అనుమస్తిష్కం
    4) అనుమస్తిష్కం
39. సాధారణంగా వార్షిక వలయాలను లెక్కించి వృక్షాల వయసు చెప్పవచ్చు. కానీ, కింది ఏ వృక్షాల్లో వార్షిక వలయాలు ఏర్పడకపోవడం వల్ల వయసు లెక్కించలేం?
    1) సమశీతోష్ణ ఆకురాల్చు అడవులు
    2) సమశీతోష్ణ సతత హరిత అడవులు
    3) ఉష్ణమండల ఆకురాల్చు అడవులు
    4) ఉష్ణమండల సతత హరిత అడవులు
40. అసురక్షిత లైంగిక సంపర్కం వల్ల సంక్రమించే వ్యాధులు ఏవి?
    1) సిఫిలిస్, గనేరియా 2) హెర్పిస్, ఎయిడ్స్
    3) వైజైనెటిస్, ట్రైకోమోనియాసిస్
    4) పైవన్నీ
41. కింది వాటిలో తెల్ల రక్త కణాలు కానివి?
    1) న్యూట్రోఫిల్ 2) బెసోఫిల్
    3) త్రాంబోసైట్ 4) ఇసినోఫిల్
42. వివృత రక్త ప్రసరణ వ్యవస్థ దేనిలో ఉంటుంది?
    1) చేప 2) బొద్దింక
    3) ఆక్టోపస్ 4) నాటిలస్
43. వినత్రీకరణ బ్యాక్టీరియా ఏది?
    1) రైజోబియం 2) అనబీనా
    3) నాస్టాక్ 4) సూడోమోనాస్
44. జతపరచండి.
    కల్చర్స్
    i) ఆర్బోరికల్చర్ ii) టిష్యూకల్చర్
    iii) పోమీకల్చర్ iv) ఒలెరికల్చర్
    వివిధ రకాల మొక్కల పెంపకం
    a) కూరగాయలు
    b) కలపనిచ్చే మొక్కలు
    d) ఉద్యానవన మొక్కలు
    c) ఫలాలిచ్చే మొక్కలు
    e) పరీక్ష నాళికలో మొక్కలు
    1) i-b, ii-e, iii-c, iv-a
    2) i-b, ii-e, iii-a, iv-c
    3) i-e, ii-b, iii-a, iv-c
    4) i-a, ii-b, iii-c, iv-d
45. గ్లూకోజ్‌ను ఏమని పిలుస్తారు?
    1) గ్రేప్ షుగర్ 2) ఫ్రూట్ షుగర్
    3) లెవ్యూలోజ్ 4) ఫ్రక్టోజ్
46. ద్వివార దంత విన్యాసం, థీకోడాంట్, విషమ దంతస్థితి సాధారణంగా ఏ జీవుల్లో ఉంటుంది?
    1) చేపలు 2) సరీసృపాలు
    3) ఉభయచరాలు 4) క్షీరదాలు
47. శరీర జీవ క్రియారేటును నియంత్రించే ముఖ్యమైన అంతస్రావ గ్రంథి ఏది?
    1) పీనియల్ గ్రంథి 2) థైరాయిడ్ గ్రంథి
    3) పిట్యూటరీ గ్రంథి 4) ఎడ్రినల్ గ్రంథి
48. ప్రోకారియేట్ జీవుల్లో ఉండే 70S రైబోసోమ్‌ల ఉపప్రమాణాలు?
    1) 40S - 40S 2) 60S - 40S
    3) 50S - 30S 4) 50S - 50S
49. అవయవదానం చేసే సమయంలో గ్రహీతకు ఇచ్చే సైక్లోస్పోరిన్ ఔషధాన్ని దేని నుంచి తయారు చేస్తారు?
    1) బ్యాక్టీరియా 2) ఫంగస్
    3) వైరస్ 4) మొక్కలు
50. కింది గృహ సంబంధ కాలుష్య కారణాల్లో ఎక్కువ రసాయన కాలుష్యాన్ని కలుగజేసేది ఏది?
    1) బొగ్గును మండించడం
    2) వంటగ్యాస్ మండించడం
    3) మస్కిటోకాయల్స్‌ను మండించడం
    4) రూమ్ స్ప్రేలు
51. ప్రపంచవ్యాప్తంగా ధ్వని కాలుష్యానికి అతి ముఖ్యమైన కారణం?
    1) సంగీత పరికరాలు
    2) రవాణా వ్యవస్థ
    3) చెరుకు, వస్త్రాలు, పేపర్ మిల్లులు
    4) నూనె శుద్ధి కర్మాగారాలు, థర్మల్ పవర్ ప్లాంట్స్
52. సిగరెట్ పొగలోని పాలిసైక్లిక్ ఆరోమాటిక్ హైడ్రోకార్బన్లు ఎలాంటి ప్రభావం చూపిస్తాయి?
    1) ఆక్సిజన్ రవాణాను తగ్గిస్తాయి
    2) రక్తపీడనం పెంచుతాయి
    3) కేన్సర్‌కు కారకమవుతాయి
    4) పిండం పెరుగుదల తగ్గిస్తాయి
53. 'వాతావరణ కాలుష్య సూచికలు' అని వేటిని పిలుస్తారు?
    1) లైకెన్లు, మాస్ మొక్కలు 2) డాఫ్నియా
    3) ఖైరోనోమస్ లార్వా 4) పైవన్నీ
54. ఆహారంగా ఉపయోగపడే మొక్కలోని భాగాలకు సంబంధించి కింది వాటిలో సరైన జత ఏది?
    ఎ) క్యారెట్ - భూగర్భకాండం
    బి) అల్లం - ఫలం సి) కాఫీ - పరిచ్ఛదం
    డి) శాఫ్రాన్ (కుంకుమ పువ్వు)- కీలాగ్రం
    1) ఎ, డి 2) ఎ, బి
    3) సి, డి 4) ఎ, బి, సి, డి
55. కింది వాటిలో సరికాని జత?

ఎముక పేరు	ఉండే భాగం
ఎ) హ్యూమరస్	- భుజాస్థి
బి) రేడియస్ అల్నా	- మోకాలు
సి) పాలింజెస్	- కపాలం
డి) ఫీమర్	- తొడ ఎముక

    1) ఎ, బి, సి, డి 2) ఎ, బి
    3) బి, డి 4) బి, సి
56. కింది వాటిలో సరైన జత ఏది?
    ఎ) పేలినాలజీ - పరాగ రేణువుల అధ్యయన శాస్త్రం
    బి) పేలియెంటాలజీ - శిలాజాల అధ్యయన శాస్త్రం
    సి) డెండ్రాలజీ - వృక్షాల అధ్యయన శాస్త్రం
    డి) డెండ్రోక్రోనాలజీ - వృక్షాల వయసు నిర్ధారించే శాస్త్రం
    1) ఎ, డి 2) బి, సి
    3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి

సమాధానాలు

1) 4	2) 4	3) 1	4) 4	5) 3
6) 2	7) 4	8) 2	9) 3	10) 1
11) 2	12) 2	13) 4	14) 4	15) 1
16) 4	17) 3	18) 2	19) 3	20) 4
21) 1	22) 4	23) 2	24) 4	25) 3
26) 1	27) 3	28) 2	29) 3	30) 2
31) 1	32) 4	33) 3	34) 2	35) 3
36) 4	37) 3	38) 1	39) 4	40) 4
41) 3	42) 2	43) 4	44) 1	45) 1
46) 4	47) 2	48) 3	49) 2	50) 1
51) 2	52) 3	53) 4	54) 3	55) 4
56) 4				

At least some pens are books

BANK EXAMS
REASONING


Model Questions

Directions (Q. No. 1-10): In each question below are given two statements followed by two conclusions numbered I and II. You have to take the given statements to be true even if they seem to be at variance with commonly known facts. Read the following statements and then decide which of the given conclusions logically follows from the given statements, disregarding commonly known facts.


Give answer
1) If only conclusion I follows.
2) If only conclusion II follows.
3) If either conclusion I or II follows.
4) If neither conclusion I nor II follows.
5) If both conclusions I and II follow.

1. **Statements:** No bird is a crow. Some crows are black.
   Conclusions:
   I) At least some birds are black.
   II) Some black which are crows are definitely not birds.
2. **Statements:** No pastry is a cake. No cake is tasty.
   Conclusions:
   I) All pastries are tasty.
   II) Some pastries being tasty is a possibility.
3. **Statements:** All towns are cities. Some cities are urban.
   Conclusions:
   I) At least some towns are urban.
   II) No town is urban.
4. **Statements:** All cars are black. All blacks are beautiful.
   Conclusions:
   I) All cars are beautiful.
   II) At least some beautiful things are black.
5. **Statements:** Some parrots are green. Some birds are parrots.
   Conclusions:
   I) At least some birds are green.
   II) All parrots being bird is a possibility.
6. **Statements:** Some cats are dogs. All dogs are foxes.
   Conclusions:
   I) At least some cats are foxes.
   II) All foxes being cats is a possibility.
7. **Statements:** All books are pens. No pen is a pencil.
   Conclusions:
   I) Some books being pencils is a possibility.
   II) At least some pens are books.
8. **Statements:** All students are teachers. All teachers are readers.
   Conclusions:
   I) All readers may be teachers.
   II) Some readers can never be teachers.
9. **Statements:** No cup is a plate. No plate is a coin.
   Conclusions:
   I) No cup is a coin.
   II) Some coins are cups.
10. **Statements:** Some boys are honest. Some intelligent are boys.
    Conclusions:
    I) All honest being intelligent is a possibility.
    II) All boys are not intelligent.
11. If 'R' denotes '–'; 'Q' denotes '×'; 'W' denotes '+'; and 'A' denotes '+', then
    42 W 7 R 8 A 6 Q 4 = ?
    1) –22 2) 22 3) 22
    4) 28 5) None of these
12. Mohan walked 30 metres towards South, took a left turn and walked 15 metres. He then took a right turn and walked 20 metres. He again took a right turn and walked 15 metres. How far is he from the starting point?
    1) 95 metres 2) 50 metres
    3) 70 metres
    4) Cannot be determined
    5) None of these
13. What should come next in the following letter series based on English alphabet?
    CEA IKG OQM ?
    1) STW 2) WUS 3) SWU
    4) UWS 5) None of these
14. The positions of how many digits in the number 59164823 will remain unchanged after the digits are rearranged in descending order within the number?
    1) None 2) One 3) Two
    4) Three 5) More than three
15. What should come next in the following letter series?
    P Q R S T A B C D E P Q R S A B C D E P Q R S A B C D P Q
    1) R 2) T 3) A
    4) B 5) None of these
16. In a certain code language, 'how can you go' is written as 'ja da ka pa', 'can you come here' is written as 'na ka sa ja' and 'come and go' is written as 'ra pa sa'. How is 'here' written in that code language?
    1) ja 2) na 3) pa
    4) Data inadequate
    5) None of these
17. How many such pairs of letters are there in the word TRIBUNAL each of which has as many letters between them in the word as in the English alphabet?
    1) None 2) One 3) Two
    4) Three 5) More than three
18. In a certain code DOWN is written as '5@9#' and NAME is written as '#6%3'. How is MODE written in that code?
    1) %653 2) %@63
    3) %5@3 4) %@53
    5) None of these
19. How many meaningful English words can be formed with the letters 'LGEU' using each letter only once in each word?
    1) None 2) One 3) Two
    4) Three 5) More than three
20. In a certain code THRIVES is written as SIUHRDU. How is SOULFUL written in that code?
    1) VPTKKTE 2) VPTKETK
    3) TPVKKTE 4) TNRKMVG
    5) None of these


Explanation

1. 2;



Only II follows.

2. 2; Possible Venn-diagram is



Thus only II follows.


3. 3; Possible Venn-diagrams are


Thus, either I or II follows.


4. 5;


Thus, both I and II follow.


5. 2; Possible Venn-diagram are


Or



Thus, only II follows.

6. 5; A possible venn-diagram is



Both I and II follow.

7. 2; A possible venn-diagram is



Only II follows.

8. 1; A possible venn-diagram is


Thus, only I follows.

9. 3;


Thus, either I or II follows.

10. 1; A possible Venn-diagram is


Thus, I follows.

11. 3; 42÷7–8+6×4 = 6–8+24 = 22
12. 2;
13. 4; Move six letters forward respectively.
14. 3; digits 4 and 2
    The number: 5 9 1 6 4 8 2 3
    In descending
    Order: 9 8 6 5 4 3 2 1
15. 1; PQRST/ABCDE/PQRS/ABCDE/PQRS /ABCD/PQR
16. 2; how can you go = ja da ka pa ... (i)
    can you come here = na ka sa ja ... (ii)
    come and go = ra pa sa ... (iii)
    From (i) and (ii), can you = ja ka .... (iv)
    From (ii) and (iii), come = sa ... (v)
    Using (iv) and (v) in (ii), we get here = na.
17. 5;
    T R I B U N A L
18. 4;
    D O W N A M E
    5 @ 9 # 6 % 3
    ∴ MODE ⇒ % @ 5 3
19. 2; GLUE
20. 1;